భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

*

ఆగస్టు 1979

సంపుటము : 56 సంచిక : 8

విడిపత్రిక వెల రూపాయిన్నర

సామాన్యుడికో కొత్తబాట

అతడు సామాన్యుడు.
బహుకృత వేషాల విశ్వరూప సందర్శనంలో ఎంతకీ అంతుచిక్కడు.
కోటి బురఖాలు తొడుక్కున్న మాన్యుడు.
అతడి జీవితం అనేక సమస్యల పుట్ట!
ఎటుచూసినా ఒక్కడుగా దర్శనమిచ్చే ఇతడి సమస్యలు తీర్చేదెట్లా?
1974-79 ఐదో ప్రణాళిక పై ఇతడు ప్రత్యేక హక్కుదారు.
ఇందులో రూ. **1500** కోట్ల మూలధనం కేటాయించారు.
ప్రణాళిక రూపురేఖలు ప్రగతికి కొత్తదారులని ప్రభుత్వం వారు గమనించారు.
అందుకే మధ్యంతర ప్రణాళికకు రూ. **3,966** కోట్లు మూలధనంగా కేటాయించారు.
వీటిలో హెచ్చు మొత్తాలు బలహీన వర్గాలకు ప్రత్యేకించారు.
ఆరోగ్య, వైద్య, విద్యా సౌకర్యాలు సరసరి; నూతన ఉద్యోగావకాశాలు, తదితర ప్రాథమిక సౌకర్యాలు రాశిలోను, వాసిలోను మెరుగు పరుస్తున్నారు.
షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, వెనుకబడిన తరగతులకు ప్రత్యేక కేటాయింపులు చేశారు.
రూ. **13** కోట్ల వ్యయంతో వస్తూత్పత్తి ప్రాతిపదికగా **15000** కు పైగా నిరుద్యోగులకు ఉపాధి సౌకర్యాలు కల్పించారు. వివిధ రంగాలలో వృత్తి శిక్షణా కేంద్రాలు తెరిచారు.
సామాన్యుణ్ణి ప్రణాళికల కొత్తబాటపై నడిపిస్తున్నారు.

సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదు

No. 55

విషయానుక్రమణిక

ఆగస్టు 1979

ప్రశ్నల కొండవళ్లు

నిఖిల్

1

మనుగడకోసమే మంది
మందికోసమే ప్రపంచం
ఎవరో ఒకరు జీసస్ క్రైస్తు
కొందరికోసం చస్తే
ఆ కొందరిలో అతను చచ్చాడనే
చైతన్యం లేకపోతే
'ఏసుప్రభువు' మరణం
సిలువ మేకులకే పరిమితం
ఈనాడు ప్రచారంకోసం
పనికొచ్చే సాధనం ఆ త్యాగం...?

2

జనం మనం
మనం 'మనమే' అనే త్యాగుల భోగుల
జీవితాలలో
ఎటుచూసినా ఉపన్యాసాలు
విన్యాసాల చక్కలగింతలు
చప్పట్ల నినాదాలు !
జనం 'అలగాజనం' గానే
వున్నచోటేవుంటే
ఎవరి ఉపన్యాసమైనా
ఇకెవరి మహోన్నత త్యాగమైనా
చరిత్రలో మిగిలి
విద్యార్థులు చదివి
పరీక్షలో కాపీకొట్టే
మరో చిన్న అధ్యాయం ... ?

3

త్యాగం కేవలం ఆదర్శమై
నిజాయితీ శుష్కసానుభూతిగా
ఎవడికి వాడే తన 'తుక్కు' పనిని
సమర్థించుకునే తెలివైన సాధనమై
నిస్వార్థమనేది విచిత్రవస్తువుగా
ఎక్కడికక్కడే
వున్న వ్యవస్థతో రాజీపడి
స్వార్థమై బుసలుకొట్టి
ఒంటరిగా తమ బాధలే
లోకం బాధలుగా బతికేసే
మధ్యతరగతి జీవిత వలయం ... ?

4

మనం ఆశిస్తున్న చైతన్యవాహిని
జనవాహినిని
కదలించే శక్తి లేక
మాట్లాడేవాడి ఆత్మసంతృప్తికై
వినేవాళ్ల నినాదాల ఉపరక్తికై
మిగిలి ఇలాగే నిలిచిపోతే
విప్లవాలు ఎన్నియుగాలకో...?

మంచు కరిగించు!

శ్రీ రామసూరి

ఆ ఊళ్లోకి
అడుగుపెట్టాలంటే
అదోలాంటి భయం —

చెట్ల గుండెలన్నీ
అదేపనిగా రొద పెడుతూ
పైకి ఎంత
ఆకుపచ్చగా కనిపించినా
గాలితో కూడబలుక్కుని
నా నెత్తిమీద
పడిపోతాయేమోనని -

నల్లగా మెరిసే
రోడ్లన్నీ
ఉన్నపళంగా బద్ధలై
లోపలికి లాగేస్తాయేమోనని —

స్పైడ్‌కాలవల్లో
ప్రవహించే మురికిలాంటి
పిరికితనం — ఈ
మనుషుల్లో ప్రవహించబట్టేకదా !

ఈ మనుషుల మీద
ఈ చెట్లమీద
ఈ ప్రకృతిమీద
చివరికి నా మీదా
నా ఆలోచనలమీదా
ఎందుకో తెలియని
అంతులేని అంతుబట్టని
మంచులాంటి భయం ! ! !

విరిసిన తురాయి నా ప్రేయసి

శ్రీ శశికాంత్ శాతకర్ణి

తురాయి మహోద్రగజ్వాలల్ని ఎగజిమ్ముతున్న
అగ్నిపర్వతంలావుంది
సింధూరాన్ని మేనలదికొన్న గణాచారిలావుంది
ఆకుపచ్చని జీవచైతన్యం పొత్తిళ్ళల్లో
అప్పుడే పుట్టిన నెత్తుటి నిసువులావుంది
తనకే తెలియని లోతుల లోతుల్లో
పగడాలను పూచే ఊర్మిమాలిని తిరగేసి
నిలబెట్టినట్టుగావుంది
తన తరుణారుణ కాంతిజ్వాలలతో
లోకం నరాలలో కొత్త ఉత్సాహాన్ని నింపేతురాయి
నభస్సును విడిచి వసుధపైకి వచ్చిన కిరణమాలి
తన గానానికి తానే పరవశించిపోయే
మహా గాయకునిలా ఊగిపోయే తురాయి
మింటి నెగసే పువ్వులమంటలతో ప్రతిరోజూ
నాకు కవితా పాఠాలు నేర్పే కరాళి
తురాయి రోదసిని వదిలి వసుమతిపై పొడిచిన వీనస్
సన్నగా సవితృకాంతి కవితల నాలపించే మహస్
అజరామర మృదుల మాధుర్యరోచిస్
తురాయిగా విరిసిన నా ప్రేయసి మనస్ !

తేజశ్శక్తి

ఉమ్మెత్తి

నిశ్శబ్ద నిద్రా
నిశార్ధంలో ...

నలువైపుల
మూసిన
తడికల తాటాకు పాకలో

నేలమీద
పడుకొని
పొర్లాడుతున్న
కురుచ నీడల్ని
పరిశీలిస్తూ

తానే
వాటిని
కాపాడుతున్నట్టు
ఒంటి నిట్టాడి

పొడుగు నీడ
నిలబడి గర్విస్తోంది —

నీ వెనుక
నేనున్నానని
చిరుదీపం
స్నేహంగా,
స్థిమితంగా తెలియజెప్తుతోంది —

ఐనా
వినడంలేదు — నిట్టాడి నీడ

ఆఖరకు
ఆరిపోయి
చూపింది — చిరుదీపం

అప్పుడనుభవమైంది
తేజశ్శక్తి !

టూ బ్లైట్స్

శ్రీ జయధర్ తిరుమలరావు

భూమ్యాకాశాలను
కౌగలించుకున్న కాంతిరేఖలు
నా కనుల కొలకుల్లో నర్తించినప్పుడు
అట్టడుగు నా నరాల మూలల కోణాల్లో
ఇంకా చీకటిరక్తం కదులుతునే ఉన్నది
నల్లని కనురెప్పల కనుగుడ్డులో
వెలుగు వెల్లువలు విరజిమ్మినా
వెలుగుసోకని గుండెచూరులోంచి

చీకటి స్రవిస్తూనే ఉన్నది
ఎందుకీ చీకటి నన్నిలా తన ఒడిలో దాచి
స్తన్యం అందిస్తున్నది ?
దాని పైట నాచుట్టూర బిగించిన
కౌగలింపులో వెలుగునుచూస్తే
నాకెలాగో ఉన్నది —
ఈ చీకటిరక్తం నాలోంచి తీసేయాలంటే
తప్పదు కొన్ని సూర్యగోళాల్ని మింగాలి !

డా. కొర్లపాటి శ్రీరామమూర్తి

శాతవాహనుల శాసనములు

ఇక శాతవాహనుల శాసనములు. ఇదొక ఉత్థాపిత సమస్య.

శాతవాహనులకు సంబంధించిన శాసనము లందు ప్రతిమా శాసనములు ఒకటి. అవి నానాఘాట్ గుహలోని వెనుక గోడమీద, ప్రస్తుతము ప్రధ్వంసమైన ప్రతిమల శిరస్సుల పైన చెక్కినవి. అవి ప్రతిమల అభిధలు. కనుక ప్రతిమా శాసనములని ప్రసిద్ధ వ్యవహారము. ఆ శాసనము లివి[1] :

ప్రాకృతము :-

'1. రాయా సిముక సాతవాహనో సిరిమాతో
2. దేవి నాయనికాయ రణోచ సిరి సాతకనినో
3. కుమారో భాయ ...
4. మహారఠి త్రనకయిరో
5. కుమారో హకుసిరి
6. కుమారో సాతవాహనో'

సంస్కృతచ్ఛాయ :-

'1. రాజా శిముక శాతవాహనః శ్రీమాన్
2. దేవీ నాగనికాయాః రాజ్ఞః చ శ్రీశాతకర్ణేః
3. కుమారః ... ...
4. మహారథీ త్రాణకార్యః
5. కుమారః శక్తిశ్రీః
6. కుమారః శాతవాహనః'

ఇందు సంస్కృతచ్ఛాయలు డాక్టర్ డి. సి. సర్కార్‌గారు పంతరించినవి. అందు కుమారో భాయ...' అను ప్రాకృత రూపమునకు సంస్కృతచ్ఛాయ లేదు అందుకు హేతువు అసమగ్రత కావచ్చును. కుడా శాసనమునందు 'భయిలా' అను స్త్రీ నామము కలదు గాన, అది 'భాయల' అను పురుష నామము కావచ్చునని డాక్టర్ బూలర్ గారి అభిప్రాయము.[2] కాని, సర్కార్‌గారు సంఘటించిన శాసన ప్రతిబింబమున 'య' వర్ణము తర్వాత ఒక చుక్క, మరొక అక్షరము పైముక్కగలవు.[3] కనుక అది బహుశః నాలుగు అక్షరముల నామధేయము కావచ్చును. 'భాయ—' అను ప్రాకృత రూపమునకు 'భాగ—' అను సంస్కృతచ్ఛాయ సంగతమగును. కనుక 'భాగవత' అనునది సమగ్రనామము కావచ్చును. శాతవాహనుల పురాణ రాజనామావళు లందు భాగవత నామధేయము లేదు. శుంగుల పురాణ రాజనామావళు లందు భాగవత నామధేయము కలదు. కనుక శాతవాహనుల కాలమున భాగవత నామధేయము అసహజము కాదు. కాబట్టి 'కుమారో భాయ...' అను అసమగ్ర శాసన పంక్తి 'కుమారోభాయ (వతో)' అను సమగ్ర శాసన పంక్తి అగుట సంభవము. అయిన 'కుమారః భాగవతః' అను సంస్కృత చ్ఛాయ సంగతము.

'మహారఠి త్రనకయిరో' అను శాసన పంక్తిలోని 'అయిరో' అను ప్రాకృత రూపమునకు 'ఆర్యః'అను సంస్కృతచ్ఛాయ సంగతమని డాక్టర్ బూలర్‌గారి అభిప్రాయము.[4] 'త్రనకయిరో' అను ప్రాకృత రూపమునకు 'త్రాణకార్యః' అని డాక్టర్ సర్కార్‌గారి సంస్కృతచ్ఛాయ. కాని 'అయిర' అను ప్రాకృత శబ్దము 'ఆర్య' అను సంస్కృతశబ్ద మగుట దుర్ఘటము. 'అజ్జ, అయ్య' అను ప్రాకృత శబ్దములకు మాత్రమే 'ఆర్య' అను సంస్కృత శబ్దము ఆద్యప్రకృతి.[5] 'అరియ' అను ప్రాకృత శబ్దమును 'ఆర్య' అను సంస్కృత శబ్దమునకు వికృతి అగును గాని 'అయిర' అను ప్రాకృత శబ్దము 'ఆర్య' అను సంస్కృత శబ్దమునకు వికృతి కాదు. అయినను, ఇక్ష్వాకురాజు వీరపురుషదత్తుని నాగార్జునకొండ శాసనములోని 'అయిర హఘాన' అను ప్రాకృత రూపమునకును 'ఆర్యసంఘానామ్' అనియే సర్కార్‌గారి సంస్కృతచ్ఛాయ[6] కాని ఆ సంఘీయుడు దీర్ఘమధ్యమాది పంచనికాయ పండితుడైన ఆచార్యుడు. (దీఘ మఝిమ పంచ మాతుక దేస [కవా] చకానం ఆచరయాన — దీర్ఘ మధ్యమ పఞ్చ మాతృకాదేశక వాచకానాం ఆచార్యాణామ్.) అనగా బౌద్ధమతాచార్యుడు. బౌద్ధమతాచార్యులు మహాసాంఘికులని మహాస్థవిరులని ద్వివిధము. 'స్థవిర' అను సంస్కృత శబ్దమునకు 'అయిర' అను ప్రాకృత శబ్దము సంగతము కాదు. కనుక 'అయిర హఘాన'అను ప్రాకృతరూపమునకు 'స్థవిర సంఘానామ్' అను సంస్కృతచ్ఛాయ సంగతము. అట్లు 'త్రనకయిరో' అను ప్రాకృతరూపమునకు 'త్రాణకవీరః' అను సంస్కృతచ్ఛాయ సంగతము. కాని త్రాణకశబ్దము వ్యక్తినామముగ అన్యథా మృగ్యము. అంతేకాదు. సంస్కృత 'త్ర'వర్ణము ప్రాకృతమున 'త్త' లేక 'త' వర్ణముగ మారుట సహజము. 'త్ర'వర్ణముగ ఉండుట కృతకము. ఉపరి, 'త్రనకయిరో' అను శాసనపంక్తిని ఆద్యక్షరము 'త్ర' అగుట నిర్ధారకము కాదని, అది 'వ' గాని, 'భ'గాని కావచ్చునని బూలర్

గారి అభిప్రాయము.[7] సర్కార్‌గారు సంఘటించిన శాసనప్రతిబింబ మున అది 'త్ర' వలెను, 'వ' వలెను కలదు; 'భ' వలె లేదు.[8] 'వ' అగుచో 'వనకయిరో' అగును. అయిన 'వాణకవీరః' అను సంస్కృతచ్ఛాయ సంగతమగును. కాని వాణక శబ్దము వ్యక్తి నామముగ కానరాదు. సంస్కృత 'మ' వర్ణము ప్రాకృతమున 'వ' వర్ణమగుట కలదు.[9] 'మన్మథః' అను సంస్కృతనామము ప్రాకృతమున 'వమ్మహో'అగును. 'మన్మథేవః' అని వరరుచి సూత్రము. కనుక 'వనకయిరో' అను ప్రాకృత రూపమునకు 'మాణకవీరః'అను సంస్కృతచ్ఛాయ సంగతము. మాణక శబ్దము శాతవాహనుల కాలమున వ్యక్తినామమునకు సన్నిహితము. హాల సంకలితమైన గాథా సప్తశతి యందు మాణ, మాణయిందు అను పేరులు గల కవుల గాథలు కలవు. కాబట్టి 'త్రాణకవీరః' అను సంస్కృతచ్ఛాయ కంటె, 'మాణకవీరః' అను సంస్కృతచ్ఛాయ సమంజసము కావచ్చును.

, ఇంతకు, ప్రతిమా శాసనములనుబట్టి తెలియనగు చారిత్రిక వ్యక్తులు — 1. శిముక శాతవాహనుడు, 2. నాగనికా శ్రీశాత కర్ణులు, 3. కుమారభాగ(వతు)డు, 4. మహారథి మా(త్రా)ణక వీరుడు, 5. కుమారశక్తిశ్రీ, 6. కుమారశాతవాహనుడు. ఇందు శిముక శాతవాహనుడు శాతవాహనకుల మూలపురుషుడు. ఆంధ్ర సామ్రాజ్య స్థాపకుడు. శ్రీశాతకర్ణి శిముక శాతవాహనుని పుత్త్రుడని డాక్టర్ బూలర్‌గారి సమన్వయము.[10] కాని, శ్రీశాతకర్ణి కృష్ణుని పుత్త్రుడని వాయు, విష్ణు, బ్రహ్మాండ, భాగవత పురాణము లందు కలదు. కృష్ణుడు శిముక శాతవాహనుని సోదరుడని వాయు, విష్ణు, బ్రహ్మాండ, భాగవత, భవిష్యోత్తర పురాణములందు కలదు. శ్రీశాతకర్ణి శిముక శాతవాహనుని పుత్త్రుడనుటకు ఆపాటి ఆధార ముసు లేదు. అంతేకాదు. ఆవశ్యకమును లేదు. కనుక శ్రీశాతకర్ణి కృష్ణుని పుత్త్రుడు.

నాగనికా శ్రీశాతకర్ణులు దంపతులు. కాని నాగనిక శిముక శాతవాహనుని భార్య అని, శ్రీశాతకర్ణి నాగనిక పుత్త్రుడని డాక్టర్ సంతెలాల్ కటారేగారి అభిప్రాయము.[11] అందుకు వారు ఆపాదించిన హేతువులు రెండు కలవు. అవి— 1. నాగనిక శ్రీశాతకర్ణి భార్య అగుచో సాధారణముగ ఆమెపేరు శ్రీశాతకర్ణి పేరు కంటె ముందు ఉండుట సంభవము కాదు. కారణము, భారతదేశమున రాణులకు రాజుల కంటె ముందు స్థానములేదు. 2. శాతవాహనులు తల్లులకు ముందు స్థాన మిచ్చినట్లు వారి పేరులకు ముందు కల మాతృనామ ములు సాక్ష్యము. ఈ రెండు హేతువులును అనాలోచితములు. పురుష నామము కంటె ముందు స్త్రీనామము ఉండుటయే భారత దేశ సంప్రదాయము. రాజదంపతుల మధ్యనే కాదు; దైవ దంపతుల మధ్యను అదే సంప్రదాయము. సరస్వతీచతుర్ముఖులు, లక్ష్మీనారా యణులు, పార్వతీపరమేశ్వరులు, సీతారాములు, గాంధారీధృత రాష్ట్రులు ప్రసిద్ధులు. సంస్కృత వ్యాకరణశాస్త్ర సమ్మతము. ఇక శాతవాహన రాజుల పేరులకు ముందు మాతృ నామములున్నను పుత్త్రవివక్ష కలదు. మాఠరీపుత్త్ర శివస్వాతి, గౌతమీపుత్త్ర శాతకర్ణి, వాసిష్ఠీపుత్త్ర పులుమావి, ఇత్యాదికము సుప్రసిద్ధము. ప్రతిమా శాసనమున పుత్త్రవివక్ష లేదు సరికదా, దేవీవివక్ష కలదు. దేవీశబ్దము భార్యాత్వద్యోతకము. దేవి నాగనిక మరియు రాజు శ్రీశాతకర్ణి అనగా నాగనిక శ్రీశాతకర్ణిదేవి అనగా భార్య అని అర్థము. అంతే కాదు. నాగనికా శ్రీశాతకర్ణుల ఉభయుల నామధేయములును కల ఒక అపూర్వమైన వెండి నాణెము జున్నార్ దగ్గర ఇటీవల లభించి నది. అది ప్రకటించిన శ్రీ పి. జె. చెన్మూల్‌గుండ్‌గారు అందు జేసిన వివరములతోపాటు సమన్వయించిన సిద్ధాంతమిది :[12]

''వెండినాణెము ముందువైపు పైన 'రంఞో సిరిసాతక-' అను లేఖనము, క్రింద 'నాగనికాయ' అను లేఖనము కలవు. అంతే కాదు. ముందువైపు గుఱ్ఱము బొమ్మ, వెనుకవైపు సూచి కొనగల బల్లెము వంటి వస్తువు బొమ్మ కలవు. అవి నాగనికా శ్రీశాత కర్ణులు చేసిన అశ్వమేధ యాగమునకు చిహ్నములు...

అశ్వమేధ యాగమున ప్రముఖపాత్ర వహింపవలసినది పట్ట మహిషి.. గుప్తరాజుల అశ్వమేధయాగ సంబంధమైన నాణెముల మీద వెనుకవైపు పట్టమహిషి బొమ్మతోపాటు ముందుసూచికలదు. పేరు లేదు. నాగనికా శ్రీశాతకర్ణుల నాణెము మీద బొమ్మ లేదు. పేరు కలదు. అశ్వమేధయాగ సందర్భమున వెలయించు నాణెము మీద పట్టమహిషి బొమ్మ లేక పేరు వినా మఱొక స్త్రీ ప్రమేయ ముండుట అసంభవము. కాబట్టి నాగనిక శ్రీశాతకర్ణి భార్య అని స్పష్టము.''

ఇది తిరుగులేని తీర్మానము. స్థిరసిద్ధాంతము. కాబట్టి నాగనికా శ్రీశాతకర్ణులు దంపతులని నిర్ధారకము.

కుమారభాగ (వతు) డు శిముక శాతవాహనుని పుత్త్రుడు, శ్రీశాతకర్ణి సోదరుడు అని డాక్టర్ బూలర్‌గారి సమన్వయము.[13] కాని, శిముక శాతవాహనుడు 23 సంవత్సరములు, కృష్ణుడు 18 సంవత్సరములు పరిపాలించిన అనంతరము శ్రీశాతకర్ణి పరిపాలకుడు. ప్రతిమా శాసన పంక్తిని శ్రీశాతకర్ణి పరిపాలకుడని కలదు. (రఞో — రాజ్ఞః — రాజుయొక్క) కనుక శిముక శాతవాహనుని పుత్త్రుడు శ్రీశాతకర్ణి పరిపాలన కాలమున కుమారశబ్ద విశిష్టు డగుట దుర్ఘటము. కృష్ణుని పుత్త్రుడు అనగా శ్రీశాతకర్ణి అవ రజుడు శ్రీశాతకర్ణి పరిపాలన కాలమున కుమారశబ్ద విశిష్టుడగుట కుదురును. కనుక కుమారభాగ (వతు) డు శిముక శాతవాహనుని పుత్త్రుడుకాక, కృష్ణుని పుత్త్రుడు, శ్రీశాతకర్ణి సోదరుడు అగును.

మహారథి మా(త్రా)ణక వీరుడు నాగనిక తండ్రిఅని డాక్టర్ బూలర్‌గారి సమన్వయము.[14] అందుకు హేతువు నాగనిక నానా ఘాట్ శాసనమున ఆమె మహారథి తనయఅని ఉండుట. (బాలాయ మహారతినో) కనుక సమన్వయ మిది సమంజసము.

కుమారశక్తిశ్రీ, కుమార శాతవాహనుడు నాగనికా శ్రీశాత కర్ణుల పుత్త్రులని కూడ డాక్టర్ బూలర్‌గారి సమన్వయము. ఆ సమన్వయమిది : [15]

''నానాఘాట్ శాసనము నందు నాగనిక వేదిశ్రీ, శక్తిశ్రీల తల్లి అని కలదు. ప్రతిమా శాసనములోని 'హకుసిరి' అను ప్రాకృత పదము శక్తిశ్రీ అను సంస్కృత పదమునకు ప్రాకృత వికారము. నానాఘాట్ శాసనములోని 'సతిసిరి' అను ప్రాకృత పదమునకును శక్తిశ్రీ అను సంస్కృతచ్ఛాయ సంగతము. కనుక ప్రతిమాశాసనములోని 'కుమారహకుసిరి'యే నానాఘాట్ శాసనములోని 'సతిసిరి', అనగా శక్తిశ్రీ. ద్వైరూప్యము ప్రాకృత శాసనము లందు పరిపాటి. 'సతిసిరి', 'కుమారహకుసిరి' ఒకడైన, పరిశేష న్యాయమున వేదిశ్రీ కుమార శాతవాహనుడగును. కాని రెండు శాసనములందు క్రమవ్యత్యాసముకలదు. నానాఘాట్ శాసనమున వేదిశ్రీ ప్రథముడు. శక్తిశ్రీ ద్వితీయుడు. ప్రతిమా శాసనమున శక్తిశ్రీ ప్రథముడు. వేదిశ్రీ ద్వితీయుడు. శక్తిశ్రీ జ్యేష్ఠుడైనను అజ్ఞాతమైన రాజకీయ కారణములచేత వేదిశ్రీ రాజ్యాధిపతి అగుట, లేదా, శక్తిశ్రీ స్వర్గస్థుడగుట క్రమవ్యత్యాసమునకు కారణము కావచ్చును.''

ఇందు క్రమవ్యత్యాస కారణము ఇదమిత్థము కాదు. ఇంతకంటె మఱొక కారణమునకు అనుమాన ప్రమాణము కలదు. అది వక్ష్యమాణము. ప్రతిమా శాసనములోని 'కుమార హకుసిరి' యే, నానాఘాట్ శాసనములోని 'సతిసిరి', ప్రతిమా శాసనములోని కుమార శాతవాహనుడే నానాఘాట్ శాసనములోని వేదిశ్రీ అను సమన్వయము మాత్రము సమంజసము.

అయినను, ''మఱొక శాసనమున 'హకుసిరి' అంగియ కులస్థుడని కలదు. గాన ప్రతిమా శాసనములోని 'కుమారహకుసిరి' శాతవాహన కులస్థుడుకాక అంగియ కులస్థుడగును. కుమార భాగ (వతు)డు, కుమార శక్తిశ్రీ అంగియ కులస్థులు కనుక నాగనిక సోదరులు'' అని డాక్టర్ కటారే గారి అభిప్రాయము.[16] కాని, ఆ మఱొక శాసనమునందు మహాహకుసిరి మాటకలదు కాని, అంగియకుల ప్రసక్తి లేదు. అంతేకాదు. కుమారభాగ (వతు)డు అంగియకులస్థుడనుటకును ఆధారములేదు. కాబట్టి కుమార భాగ (వతు) డు, కుమారశక్తిశ్రీ నాగనిక సోదరులు కారని స్పష్టము.

ప్రతిమా శాసనములోని 'కుమారహకుసిరి' నానాఘాట్ శాసనములోని 'సతిసిరి' అగుట నిర్బాధకము. కనుక పరిశేషన్యాయమున కుమార శాతవాహనుడు వేదిశ్రీ అగుట నిర్ధారకము.

అయినను డాక్టర్ వాసుదేవ్ విష్ణుమిరాషీగారి అభిప్రాయము మఱొక విధముగ కలదు. ఆ విషయ మిది :[17]

''ప్రతిమల సముదాయమునందు వేదిశ్రీ, సతిశ్రీల ప్రతిమలు లేకపోవుట విచిత్రము. అయినప్పటికి మనము రెండు ప్రతిమలు, రెండు ప్రతిమాశాసనములు ఇప్పుడు పూర్తిగా లేకుండ పోయినవని గుర్తించుకొనవలయును. ప్రతిమల క్రమము క్రిందివిధముగ ఉండెను — 1. రాజక సిముకుడు, 2. దేవి నాగనిక మఱియు సాతకర్ణి, 3. కుమారభాయ, 4,5. పేరులు పోయినవి, 6. మహారథి త్రనకయిర, 7. కుమారహకుసిరి, 8. కుమార శాతవాహనుడు. ఇవి నాగనిక ఆమె కుమారుడు వేదిశ్రీ రాజ్యకాలమున వేయించినవి. మొదటి ప్రతిమ శిముక శాతవాహనుడు. ఆమె మామ. రెండవ ద్వంద్వ ప్రతిమ ఆమెది, ఆమె భర్తది మూడవది ఆమె కొడుకు—ఆ సమయమునకు మరణించిన కుమారభాయ అనువానిది. ఆరవది ఆమె తండ్రిది. ఏడు, ఎన్మిది వేదిశ్రీ కుమారులు హకుసిరి, సాతవాహనులవి. నాగనిక శాసనమున కుమారభాయ ప్రసక్తి లేకపోవుటకు హేతువు బహుశః ఆ సమయమునకు అతడు మరణించుట కావచ్చును.''

ఇందు ప్రథమతః ఇప్పుడు రెండు ప్రతిమలు, రెండు ప్రతిమాశాసనములు పూర్తిగా లేకుండపోయిన వనుటకు, అవి 4, 5 అనుటకును ఆధారములేదు. ప్రతిమలు పోయినను ప్రతిమా శాసనములు అవిమాత్రమే పోవలసిన ఆవశ్యకము కానరాదు తదుపరి వేదిశ్రీ రాజ్యము చేసెననుటకు ప్రమాణాంతరములేదు. కనీసము పురాణ రాజనామావళి పురస్కారమైననులేదు. అంతేకాదు. 'కుమారభాయ–' నాగనిక కొడుకు అనుటవలన అతడు మరణించెనని అనవలసి వచ్చినది. కారణము నానాఘాట్ శాసనమున నాగనిక 'కుమారభాయ—'తల్లి అని లేకపోవుట మాత్రమే. 'ఆ సమయమునకు మరణించినను' ప్రతిమ చెక్కించి, శాసనము వేయించినపుడు నానాఘాట్ శాసనమున నాగనిక 'కుమారభాయ...' తల్లినని చెప్పుకొనవచ్చును. కాని చెప్పుకొనలేదు. అనగా నాగనిక కుమార భాయ-'' తల్లికాదని అర్థము. కనుక కుమారభాగ (వతు)డు నాగనిక పుత్రుడుకాదు. కృష్ణుని పుత్రుడు కావచ్చును. శిముకశాతవాహనుడు నాగనికమామ కృష్ణుని అన్న. అనగా నాగనిక పెదమామ. కుమార 'హకుసిరి', కుమార శాతవాహనుడు వేదిశ్రీ కుమారులని అనవలసిన ఆవశ్యకములేదు. నాగనిక తండ్రి ప్రతిమ తర్వాత నాగనిక తనయుల ప్రతిమల ఉనికి సక్రమము. వేదిశ్రీ ప్రతిమ లేకుండ వేదిశ్రీ కుమారుల ప్రతిమల ఉనికి అక్రమము. కాబట్టి కుమార 'హకుసిరి', కుమార శాతవాహనుడు వేదిశ్రీ కుమారులు కారని స్పష్టము. 4, 5 పేరులు పోయినవమట, ఆ పేరులు వేదిశ్రీ, సతిశ్రీ అనుట స్థితగతి చింతనముకాదు. 'ఊహా మాత్ర శరణ్యము. అంతేకాదు. 'సతిసిరి' అను ప్రాకృత పదమునకు 'సతిశ్రీ' అను సంస్కృతచ్ఛాయ కూడ సంగతముకాదు. స్త్రీ వాచకమైన సతీశబ్దము వినా, పురుషవాచకమైన సతి శబ్దము సంస్కృత భాషయందు మృగ్యము. పురుష వాచకమైన సతిశబ్దము లేకుండ పురుషవాచకమైన 'సతిశ్రీ' అను సంస్కృతరూపము నిష్పన్నము కాదు. 'సతిసిరి' అను ప్రాకృత పదమునకు శక్తిశ్రీ అను సంస్కృతచ్ఛాయ సాధురూపము. 'హకుసిరి' అను ప్రాకృత పదమునకును శక్తిశ్రీ అను సంస్కృతచ్ఛాయ సుష్ఠురూపము. కనుక నానాఘాట్ శాసనములోని 'సతిసిరి'యే ప్రతిమాశాసనములోని 'హకుసిరి' అను సమన్వయము అవశ్యము సమంజసము. అనగా ప్రతిమాశాసనముల

లోని కుమారశక్తిశ్రీ, కుమారశాతవాహనులు నానాఘాట్ శాసనములోని శక్తిశ్రీ, వేదిశ్రీలు ఒకరని అర్థము. అంతేకాదు. శక్తిశ్రీ, వేదిశ్రీ ఉరపు కుమార శాతవాహనుడు ఇద్దఱు మాత్రమే నాగనికా శ్రీశాతకర్ణుల పుత్త్రులు అని ప్రతిమా శాసనములనుబట్టి, నాగనిక నానాఘాట్ శాసనమునుబట్టి అవగాహకము.

అయినను, 'నాగనిక కొడుకులు—వేదిశ్రీ, సాతిశ్రీ, మహాహకుసిరి, కుమార శాతవాహనుడు' అని శ్రీ ఇంగువ కార్త్తికేయశర్మగారి అభిప్రాయము.[18] ఇందు 'సతిసిరి' అను ప్రాకృతపదమునకు 'సాతిశ్రీ' అను సంస్కృతచ్ఛాయ కూడ సంగతముకాదు. పురుష వాచకమైన సతి శబ్దమువలె పురుష వాచకమైన సాతి శబ్దమును సంస్కృత భాషయందు మృగ్యము. సంస్కృతశబ్దము లేకుండ సంస్కృతనామము నిష్పన్నముకాదు. అంతేకాదు. నానాఘాట్ శాసనమున 'సతిసిరి' అను ప్రాకృతనామము కలదుగాని, 'సాతిసిరి' అను ప్రాకృతనామములేదు. బెరాఘాట్ దగ్గఱ లభించిన ఒక నాణెము మీద 'సాతిస' అను లేఖనము కలదు.[19] అది 'సాతస' అను ప్రాకృతపదమునకు లేఖకదోషము. ఇది శాతవాహనుల నాణెములు అనుశీర్షికను వివరణీయము. 'సాతిస'అను లేఖనము సుశబ్దమైనను 'శాతేః' అను సంస్కృతచ్ఛాయ సంగతము కాని 'సాతిశ్రియః' అను సంస్కృతచ్ఛాయ సంగతముకాదు. కనుక 'సాతిశ్రీ' అను సంస్కృతనామమును కల్పించుట అపమార్గము. అనావశ్యకము. ఇక మహాహకుసిరి. ఇదొక నూతన విషయము. ప్రతిమా శాసనములందు 'కుమారహకుసిరి' అని కలదు. మఱొక నాసిక శాసనమునందు 'మహాహకుసిరి' అని కలదు. కనుక కుమార 'హకుసిరి'యే, మహా'హకుసిరి' అను భ్రాంతి కలుగుట సహజము. కాని ప్రతిమా శాసనములలోని కుమార 'హకుసిరి', నాసిక శాసనములోని మహా 'హకుసిరి' భిన్నులు. అది వక్ష్యమాణము. కుమార 'హకుసిరి' నాగనిక కొడుకు. ప్రతిమాశాసనములలోని కుమార 'హకుసిరి', కుమారశాతవాహనుడు నానాఘాట్ శాసనములోని శక్తిశ్రీ, వేదిశ్రీలు కానిచో, అనగా నాగనిక కొడుకులు నలుగురు అయినచో, ప్రతిమా శాసనములందు వేదిశ్రీ, శక్తిశ్రీల పేరుల లేకపోవుట, నానాఘాట్ శాసనమునందు 'హకుసిరి', శాతవాహనుల పేరులు లేకపోవుట అసంగతము. ప్రతిమాశాసనములందు పేరులు పోయినవని అనవచ్చునేమోగాని, నానాఘాట్ శాసనమునందు పేరులు పోయినవనుటకు అవకాశములేదు. కనుక నాగనిక కొడుకులు నలుగురుకారు. నానాఘాట్ శాసనమునుబట్టి ఇద్దఱే అని ఇదమిత్థము. 1. శక్తిశ్రీ, 2. వేదిశ్రీ (శక్తిశ్రీ=హకుసిరి, సతిసిరి; వేదిశ్రీ=కుమారశాతవాహనుడు).

మొత్తముమీద శాతవాహన కుల మూలపురుషుడు, ఆంధ్ర సామ్రాజ్య స్థాపకుడు అయిన శిముక శాతవాహనుని, నాగనికా శ్రీశాతకర్ణి జదంపతుల, శ్రీశాతకర్ణి సోదరుడు కుమారభాగ(వతు)ని, నాగనిక తండ్రి మా(త్రా)ణకవీరుని, నాగనికా శ్రీశాతకర్ణుల పుత్త్రులు శక్తిశ్రీ, వేదిశ్రీ (కుమారశాతవాహను)ల ప్రతిమలు కలవని ప్రతిమాశాసనములనుబట్టి ప్రతీయమానము. అవి గత శతాబ్ది తుదిభాగమునకే ప్రధ్వంసములగుట దురదృష్టము.

ప్రతిమా శాసనములందు శిముకశాతవాహనుని సోదరుడు, శ్రీశాతకర్ణి తండ్రి అయిన కృష్ణుని ప్రమేయములేదు. అంతేకాదు. శిముకశాతవాహనుని పుత్త్రుడు మల్లకర్ణి అని మత్స్యపురాణమున, మల్లశాతకర్ణి అని భవిష్యోత్తర పురాణమున కలదు. కృష్ణశాతకర్ణితోపాటు మల్లశాతకర్ణి ప్రమేయమును ప్రతిమాశాసనములందు లేదు. డాక్టర్ వి. వి. మిరాషీగారు రెండు ప్రతిమలు, రెండు ప్రతిమాశాసనములు పోయినవనుట నిజమేనని, అవి కృష్ణ, మల్ల శాతకర్ణుల ప్రతిమలు, ప్రతిమాశాసనములు కావచ్చును. నిజము కానిచో కృష్ణ, మల్లశాతకర్ణుల ప్రమేయము లేకపోవును· తద భావము ప్రాగభావమో, ప్రధ్వంసాభావమో ప్రస్తుతము అనిశ్చేయము.

ప్రతిమాశాసనములందు మఱొక ప్రత్యేక విశేషము కలదు. అది శిముకశాతవాహనుని, కుమారభాగ(వతు)ని, మా(త్రా)ణకవీరుని, కుమారశక్తిశ్రీ, కుమారశాతవాహనుల పేరులు ప్రథమావిభక్తియందు, నాగనికా శ్రీశాతకర్ణుల పేరులు షష్ఠీవిభక్తియందు ఉండుట. ఇదీ గమనార్హమైన విశేషము. పరిపాలించుచున్న రాజుయొక్క, అతని రాజ్ఞియొక్క పేరులు షష్ఠీవిభక్తియందు కలవని డాక్టర్ సర్కార్‌గారి సమన్వయము.[20] సమంజసము. అంతేకాదు. ప్రతిమా శాసనముల లిపి స్వరూపము, నానాఘాట్ శాసనము లిపి స్వరూపము ఒకటే. కాబట్టి ప్రతిమా శాసనములు, నానాఘాట్ శాసనము సమకాలమున ప్రకటితమైనట్లు ప్రతీయమానము. అనగా ఆ కాలము శ్రీ శాతకర్ణి రాజ్యకాలము.

ఇక నాగనిక నానాఘాట్ శాసనము - ఇది బహువాదబంధురమైన విషయము. అందుకు హేతువు శాసనమున అనేక పంక్తులు శిథిలమగుట. ఉన్న పంక్తు లందును నాల్గు స్థలములందు మూడు పదములకు పాఠాంతర కల్పనములు కలవు. కనుక పాఠాంతర కల్పనములలోని సామంజస్యము ప్రథమతః పరిశీలనావశ్యకము.

నానాఘాట్ శాసనమున తొలిపంక్తి నడుమ 'చందసూతానం' అని డాక్టర్ బూలర్‌గారి పాఠమున కలదు.[21] అది 'చందసూరానం' అని డాక్టర్ సర్కార్‌గారి పాఠమున కలదు.[22] 'చందసూతానం'అను పాఠమునుబట్టి అది 'సుతానం' అను పాఠమునకు లేఖకదోషమని, అదిగాక గుజరాతీ ప్రాకృతమున 'సుత' శబ్దము 'సూత' శబ్దముగ కలదని, బలరామకృష్ణులు చంద్రసుతులు అనగా చంద్ర వంశీయులని డాక్టర్ బూలర్‌గారి సమన్వయము.[23] బలవదాకృష్టము. కనుక సమంజసముకాదు. అంతేకాదు. సర్కార్‌గారు సంఘటించిన శాసన ప్రతిబింబమున అది 'సూరానం' అనుటకు అవకాశము కలదు.[24] సంస్కృతములోని సూర శబ్దము ప్రాకృతమున సూర శబ్దముగను ఉండుట కలదు. సూరశబ్దము సూర్యశబ్దమునకు పర్యాయపదము. 'చంద్రసూరానం' అనగా సూర్యచంద్రులకు అని స్పష్టార్థము. కనుక 'చందసూతానం' అను పాఠము ప్రామాదికము. 'చందసూరానం' అను పాఠము ప్రామాణికము.

తొలిపంక్తి తుదిని, నాల్గవ పంక్తి నడుమ 'వేదిసిరి—' అని డాక్టర్ బూలర్‌గారి పాఠమునకలదు[25] అది 'ఖందసిరి' అని చదువ

వలయునని హెచ్. కృష్ణశాస్త్రిగారి ఆదేశము.[26] అది నిమిత్తముగ 'ఖ(ద)సిరి—' అని, '(ఖద)సిరి' అని డాక్టర్ సర్కార్‌గారి పాఠమున గలదు.[27] కాని, అది శాసన ప్రతిరూపమునుబట్టి 'వేదిసిరి' అనియే సర్కార్‌గారి సవరణ.[28] బూలర్‌గారు సంతరించిన శాసన ప్రతి రూపమున, సర్కార్‌గారు సంఘటించిన శాసన ప్రతిబింబమున రెండు స్థలము లందును 'వేదిసిరి' అనియే కలదు.[29] కనుక 'ఖంద సిరి' అను పాఠాంతరము ప్రామాదికము. 'వేదిసిరి' అను పాఠము ప్రామాణికము.

మూడవపంక్తి మొదట 'అంగియకుల —' అని డాక్టర్ బూలర్‌గారి పాఠమున కలదు [30] అది 'అంభియకుల—' అని చదువ వలయునని కూడ హెచ్. కృష్ణశాస్త్రిగారి ఆదేశము.[31] అది 'అంగియకుల—' అనియే డాక్టర్ సర్కార్‌గారి పాఠమున కలదు. [32] సర్కార్‌గారు సంఘటించిన శాసన ప్రతిబింబమున 'అంభియకుల' అను భ్రాంతికి అవకాశము లేకపోలేదు.[33] కాని 'అంగియకుల' అగుటయే సంభవము. కనుక 'అంభియకుల—' అను పాఠము ప్రామాదికము. 'అంగియకుల—' అను పాఠము ప్రామాణికము.

పయి ప్రామాణిక పాఠములనుబట్టి నానాఘాట్ శాసనమున కల ప్రథమ పంక్తి ఇది[34] :

> '(......)నొ ధంమస న మొ ఈదస నమొ సంకంసన
> వాసుదేవానాం చందసూరానం (మహి) మా (వ) తానం
> చతుం నం చం లోకపాలానం యమ వరున కుబేర వాసవానం
> నమొ కుమార వరస వేదిసిరిస ర(ఞో)'

ఇందు మొదట '(ఓం నమొ ప్రజాపతి) నొ' అని డాక్టర్ బూలర్‌గారి పూరణము.[35] ఆద్యక్షరము ఓం లేక సిధం కావచ్చునని కూడ బూలర్‌గారి వివరణము.[36] 'సిధం' అని డాక్టర్ సర్కార్‌గారి పూరణము.[37] అది ఓం అయినను, సిధం అయినను ఒకటే. తదుపరి 'నమొ ప్రజాపతినొ' అను పరిష్కరణములోని 'ప్రజా పతినొ' అను పదము సర్కార్‌గారికి సమ్మతము.[38] 'నమొ' అను పదము మాత్రము సమ్మతము కాదు. అదే శాసనమునకు ఆయువుపట్టు. 'నమొ ప్రజాపతినొ' అని కలదేని వచ్చు అర్థమునకు, 'ప్రజాపతినొ' అని మాత్రమే కలదేని వచ్చు అర్థమునకు భేదము కలదు. 'నమొ' లేకుండ 'సిధం ప్రజాపతినొ' అని కలదను పక్షమున సర్కార్‌గారు సంతరించిన సంస్కృతచ్ఛాయ ఇది[39] :

> 'సిద్ధమ్' (ప్రజాపతయే) ధర్మాయ నమః, ఇన్ద్రాయ నమః,
> సంకర్షణ వాసుదేవాభ్యాం, చన్ద్రసూరాభ్యాం (=సూర్యాభ్యాం)
> మహిమ వద్భ్యాం, చతుర్భ్యః చ లోకపాలేభ్యః యమ వరుణ
> కుబేరవాసవేభ్యః నమః। కుమారవరస్య వేదిశ్రియః, రాజ్ఞః'

పయి సంస్కృతచ్ఛాయకు అర్థమిది —

'ధర్మ ప్రజాపతికి నమస్కారము. ఇంద్రునికి నమస్కారము. సంకర్షణ వాసుదేవులకు, సూర్యచంద్రులకు, మహిమవంతులైన నలుగురు లోకపాలురు యమ వరుణ కుబేర వాసవులకు నమస్కారము. కుమారవరుడైన వేదిశ్రియొక్క, రాజుయొక్క'

ఇందు 'కుమార వరుడైన వేది(శ్రీ)యొక్క' అనుటతో ఆ వాక్యము పూర్తి అయినది. 'రాజుయొక్క' అనునది మఱొక వాక్యమునకు ఆరంభము. అయిన 'కుమారవరుడైన వేది(శ్రీ) యొక్క' అను వాక్యమునకు అన్వయము క్లిష్టము. అర్థమును అస్పష్టము. అంతేకాదు. ఖారవేలుని హాథిగుంఫ శాసనమున 'నమో అ (రి) హంతానం' అని, వీరపురుషదత్తుని నాగార్జునకొండ శాసనమున 'నమో భగవతో'అని, శక్తివర్మ తాళగుండ శాసనమున 'నమశ్శివాయ' అని, హస్తి ఖోహో శాసనమున 'నమో మహాదేవాయ' అని కలదు గాన నాగనిక నానాఘాట్ శాసనమున కూడ 'నమొ ప్రజాపతినొ' అని ఉండవలయునని డాక్టర్ మిరాషీగారి అభిప్రాయము.[40] అంతే కాదు. గౌతమీపుత్త్ర యజ్ఞశ్రీ చినగంజాము శాసనమున 'సిధం. న(మో భ) గవతో' అనియే కలదు.[41] కనుక నాగనిక నానాఘాట్ శాసనమున '(సిధం. నమొప్రజాపతి) నొ' అని ఉండుటయే సంగతము. సంభావ్యమైన సంస్కృతచ్ఛాయ ఇది :

> 'సిద్ధం। నమః ప్రజాపతయే ధర్మాయ, నమ ఇన్ద్రాయ,
> నమస్సంకర్షణ వాసుదేవాభ్యాం, చన్ద్ర సూర్యాభ్యాం
> మహిమవద్భ్యాం చతుర్భ్యః చ లోకపాలేభ్యః యమ వరుణ
> కుబేర వాసవేభ్యః, నమః కుమారవరాయ వేదిశ్రియా। రాజ్ఞః'

పయి సంస్కృతచ్ఛాయకు అర్థమిది :—

> 'ధర్మ ప్రజాపతికి నమస్కారము. ఇంద్రునికి నమస్కారము. సంకర్షణ వాసుదేవులకు, సూర్యచంద్రులకు, మహిమవంతులైన నలుగురు లోకపాలురు యమ వరుణ కుబేర వాసవులకు నమస్కారము. కుమారవరుడైన వేదిశ్రీకి నమస్కారము. రాజుయొక్క'

ఇందు 'కుమారవరుడైన వేదిశ్రీకి నమస్కారము' అనుటతో ఆ వాక్యము పూర్తిఅయినది. 'రాజుయొక్క' అనునది మఱొక వాక్యమునకు ఆరంభము. కనుక అన్వయము కలదు. అర్థము కలదు. కాఁబట్టి '(సిదం. నమొ ప్రజాపతి) నొ' అను పరిష్కరణము అవశ్యకర్తవ్యము.

అయిన, కుమారవరుడైన వేదిశ్రీకి నమస్కారము ఎందుకు? అను ప్రశ్న ఉత్పన్నమగును. అందుకు డాక్టర్ బూలర్‌గారి సమాధాన మిది[42] :

> 'ప్రకృత శాసనమున ప్రధానవ్యక్తి నాగనిక. ఆమె కుమారులందు శ్రేష్ఠుడైన వేదిశ్రీకి రాజప్రతినిధి అని నాకు అనిపించుచున్నది. వేదిశ్రీకి నమస్కారము లేక ప్రశంస అని మంగళాచరణమున దైవములతోపాటు సమానముగ భావించినది. అది వేదిశ్రీ ప్రముఖ స్థానమును పొందుటను, ఉన్నతపదవిని అలంకరించుటను సూచించునది.'

ఇందు నాగనిక ఇద్దఱు కుమారులందు వేదిశ్రీ శ్రేష్ఠుడను విషయము కుమారవర విశేషణమునుబట్టి నిర్ధారకము. వరశబ్దము శ్రేష్ఠవాది. నాగనిక వేదిశ్రీకి రాజప్రతినిధి అను విషయముమాత్రము నిర్ధారకముకాదు. మంగళాచరణమున వేదిశ్రీకి నమస్కారమే కలదు. ప్రశంసలేదు. నమశ్శబ్దము ప్రశంసార్థకముకాదు. ధర్మప్రజాపతి ప్రభృతులతోపాటు వేదిశ్రీకి నమస్కారముచేయుట వేదిశ్రీ ప్రముఖ స్థానమునకు, ఉన్నతపదవికి సూచకముకాదు. నమస్కారము చేసినది నాగనిక అయిన తల్లి కుమారునికి నమస్కరించినట్లు తాత్పర్యము. అది లోకవిరుద్ధము. అందుకు డాక్టర్ మిరాషీగారి సమాధాన మిది [43] :

> 'నమొ కుమారవరస అనగా కార్తికేయునికి నమస్కారమని అర్థము. కార్తికేయునికి కుమారవరుడని పేరు కలదనుటకు ఇటీవల నేను ప్రకటించిన శాసనములోని కుమారవరదత్తుడను రాజుపేరు నిదర్శనము. వేదిసిరిస అను పదము అనంతరమున కల రఞో అను పదమునకు అన్వయించును. అనగా వేదిశ్రీ రాజ్యకాలమున అని దాని అర్థము.'

ఇందు 'నమొ కుమారవరస' అనగా కార్తికేయునికి నమస్కారమనుట అసంగతము కాదు. సుసంగతమును కాదు. కార్తికేయుడన కుమారస్వామి. కుమార శబ్దమునకే కుమారస్వామి అని అర్థము కలదు. కాళిదాసు కుమార సంభవమునందలి కుమారశబ్ద వాచ్యుడు కుమారస్వామియే కద. కనుక వరశబ్దము వ్యర్థము కాఁగలదు. కుమారవరదత్తుడు అనగా కుమారస్వామి వరముచేత పుట్టినవాడని అర్థము వచ్చును. కుమార వరప్రసాదుడని తాత్పర్యము. కనుక కుమారవరదత్తుడను రాజుపేరు కుమారస్వామికి కుమారవర నామధేయము కలదనుటకు నిర్ధారక సాధనముకాదు. అంతేకాదు. ఇష్టదేవతాస్తుతియందు ఈశ్వరునికి నమస్కారము లేకుండ కుమారస్వామికి నమస్కారముండుట సముచితము కాదు. 'వేదిసిరిస' అను పదము అనంతరముకల 'రఞో' అను పదమునకు అన్వయించుట శాతవాహనుల శాసనముల పద్ధతికి విరుద్ధము. 'రఞో' అను పదము తర్వాత రాజుపేరు ఉండుట శాతవాహనుల శాసనముల పద్ధతి. ఇందుకు మాఠరీ పుత్త్రశివస్వాతి శకసేనుని, గౌతమీపుత్త్ర శాతకర్ణి, వాసిష్ఠీ పుత్త్రపులుమావి, వాసిష్ఠీపుత్త్రచతరపణ శాతకర్ణి, గౌతమీపుత్త్ర యజ్ఞశాతకర్ణి, గౌతమీపుత్త్ర విజయశాతకర్ణి, వాసిష్ఠీపుత్త్ర చంద్రశాతకర్ణి శాసనములు పరమనిర్ధారక సాధనములు. కనుక నాగనిక నానాఘాట్ శాసనమున కూడ 'రఞో' తర్వాత రాజనామము, రాజ్యవర్ష వివరమును ఉండుట విధాయకము.

నాగనిక నానాఘాట్ శాసనమున తొలిపంక్తి తుదిని 'రఞో' అని కలదు. మ పంక్తి మొదట కొన్ని అక్షరములు చెరిగిపోయినవి. తదుపరి '(వీ)రస సూరస అప్రతిహతచకస దఖి (నాప) థ (పతినొ)' అని కలదు.[44] అనంతరము మఱల ఆ రెండవపంక్తి తుదివఱకు అక్షరములు చెరిగిపోయినవి. '(వీ) రస సూరస అప్రతిహతచకస దఖి (నాప) థ (పతినొ)' అను ప్రాకృత రూపమునకు 'వీరస్య శూరస్య అప్రతిహతచక్రస్య దక్షిణాపథ పతేః' అను సంస్కృత చ్ఛాయ సంగతము. అనగా శాసనకర్త అయిన శాతవాహనరాజు వీరుడు, శూరుడు, అప్రతిహతచక్రుడు, దక్షిణాపథపతి అని మాత్రమే అర్థము. వీరాది విశేషణములు కూడ వేదిశ్రీకి అన్వయించునని డాక్టర్ మిరాషీగారి అభిప్రాయము.[45] కాని పేరు చెరిగిపోయిన రాజునకు మాత్రమే అన్వయించును. దురదృష్టవశాత్తు 'రఞో' తర్వాత రాజుపేరు దృష్టముకాలేదు. రాణి నాగనిక పేరు కూడ శాసనమునలేదని డాక్టర్ బూలర్‌గారి అభిప్రాయము.[46] కాని అయిదవపంక్తి నడుమ '(నా)గ వరదయినియ' అని కలదు.[47] అందుకు 'నాగవరదాయిన్యా' అను సంస్కృతచ్ఛాయ సంగతము. అనగా నాగవరదాయినిచేత అని అర్థము. నాగవరదాయిని అనగా 'ఒక మహాసర్ప విగ్రహమును ఒసగిన వ్యక్తి' అని బూలర్‌గారి వివరణ.[48] కాని అది నిశ్చయము కాదని కూడ బూలర్‌గారి సవరణ.[49] వివరణకంటె సవరణ సమంజసము. నాగవరదాయిని వ్యక్తినామము: ఆ వ్యక్తి నాగనిక. నాగనిక అను పేరులోని 'ఆనిక' అను పదము స్త్రీనామ విశేషణము.[50] నాగవరదాయిని అను పేరులోని వరదాయిని అను పదము అతిశయోక్తి విశేషణము. కనుక నాగవరదాయిని అనగా నాగనిక అనియే అర్థము. నానాఘాట్ శాసనమున రాణి పేరు నాగనిక (నాగవరదాయిని) అని కలదు గాన రాజుపేరు శ్రీశాతకర్ణి యగుట తథ్యము. నాగనికా శ్రీశాతకర్ణులు రాజదంపతులని పూర్వోక్తము. కాఁబట్టి శ్రీశాతకర్ణి వీరుడు, శూరుడు, అప్రతిహతచక్రుడు, దక్షిణాపథపతి అని స్పష్టము.

ఇక శాసనమున మూడవ పంక్తి ఇది[51] :—

ప్రాకృతము :-

'మా...(బా) లాయ మహారథినొ అంగియకుల
వధనస సగరగిరివరవల (యా) య పథవియ పథమవీరస
వస...యవ అలహ (?)...సలసు·
య మహతొ మహ...'

సంస్కృతచ్ఛాయ :-

'మా...బాలయా (=కన్యయా) మహారథినః
అఙ్గిక కులవర్ధనస్య, సాగరగిరివరవలయాయాః పృథివ్యాః
ప్రథమవీరస్య—'

ఇందు 'వస ... యవ అలహ (?) ... సలసు. యమహతొ మహ' అను ప్రాకృతరూపము అనవగాహకము. కనుక సంస్కృత చ్ఛాయ సాధ్యముకాదు. సాధ్యమైనంతవఱకు నాగనిక అంగియకుల వర్ధనుడు, సాగరగిరి వరవలయిత పృథివీ ప్రథమవీరుడు అయిన మహారథి తనయ అని తాత్పర్యము నిర్వివాదము. నిర్ధారకము.

మఱి శాసనమున నాల్గవ పంక్తి ఇది : [52]

ప్రాకృతము :-

'. సిరిస భారియా దెవస పుతదస వరదస కామదస ధనదస వేదిసిరి—మాతు సతినొ సిరిమస చ మాతుయ సీమ ...పథమయ...'

సంస్కృతచ్ఛాయ :-

'—శ్రియః భార్యయా దేవస్య పుత్త్రదస్య వరదస్య కామదస్య ధనదస్య, వేదిశ్రీమాత్రా, శక్తేః శ్రీమతః (=శక్తిశ్రియః) చ మాత్రా—'

ఇందును 'సీమ...పథమయ' అను ప్రాకృతరూపము అనవగాహకము. కనుక సంస్కృతచ్ఛాయ సాధ్యముకాదు. సాధ్యమైనంతవఱకు నాగనిక దేవుడు, పుత్త్రదుడు, వరదుడు, కామదుడు, ధనదుడు అయిన——శ్రీ యొక్క భార్య; వేదిశ్రీ, శక్తిశ్రీల తల్లి అని తాత్పర్యము. కాని వివాదగ్రస్తము.

ఇందు 'నాగనిక—శ్రీయొక్క భార్య అని కలదు. శ్రీ ముందు అక్షరములు శాసనమున చెరిగిపోయినవి. అందుకు '(శాతకర్ణి) శ్రియః' అని డాక్టర్ సర్కార్‌గారి పూరణము.[53] కాని శ్రీ శాతకర్ణి పేరు శాతకర్ణిశ్రీ అని ఇతరత్ర కానరాదు. పురాణములందు శ్రీ శాతకర్ణి అని కలదు. శాసనము లందు శ్రీశాతకర్ణి అని కలదు. నాణెముల మీదను శ్రీశాతకర్ణి అని కలదు. కనుక నానాఘాట్ శాసనమున శాతకర్ణిశ్రీ అని ఉండుట విలక్షణము. అసలు '... సిరిస భారియా' అని డాక్టర్ బూలర్‌గారు సంతరించిన శాసన ప్రతిరూపమున కలదుగాని, డాక్టర్ సర్కార్‌గారు సంఘటించిన శాసన ప్రతిబింబమున '...భారియా' అని మాత్రమే కలదు.[54] కాని 'భారియా' అను పదమునకు ముందు మూడు అక్షరముల అవశేషములు కలవు.[55] అవి 'సిరిస' అను పదమునకు అవశేషములో, 'కనిస' అను పదమునకు అవశేషములో అనిశ్చేయము. 'కనిస' అను పదమునకు అవశేషములైన 'సిరి సతకనిస భారియా' అను పూర్తి పాఠమునకు కలదు. అంతేకాదు. బూలర్‌గారు సంతరించిన శాసన ప్రతిరూపము అవకాశములేఖ్య చిత్రము. సర్కార్‌గారు సంఘటించిన శాసన ప్రతిబింబము ఛాయాచిత్రము. లేఖ్యచిత్రముకంటె ఛాయాచిత్రము ప్రమాణము. కనుక '(శాతకర్ణి) శ్రియః' అను పూరణము కంటె '(శ్రీశాతకర్ణేః)' అను పూరణము సమంజసము. ప్రతిమాశాసన ప్రకరణమునుబట్టి, అశ్వమేధయాగ సంబంధినాణక సందర్భమును బట్టి నాగనిక శ్రీశాతకర్ణి భార్యఅని నిర్ధారకము.

ఇక నాల్గవ పంక్తిలోని 'దెవస పుతదస వరదస కామదస ధనదస' అను పదములు 'సిరిస' అను పదమునకు విశేషణములుకాక, 'వెదిసిరిమాతు' అను పదబంధములోని 'వెదిసిరి' అను పదమునకు సాపేక్ష సమాస పద్ధతిని విశేషణములని డాక్టర్ మిరాషీగారి అభి

ప్రాయము.[56] సాపేక్ష సమాసము సంస్కృత వ్యాకరణ సంప్రదాయమే కాని, ప్రకరణోచితము కాదు. కుమారవరుడైన వేదిశ్రీ తన మాతృశ్రీ అయిన నాగవరదాయినికి వరదుడు, ధనదుడు కావచ్చును కాని దేవుడు, పుత్త్రదుడు, కామదుడు అగుననుట కేవలము అనుచితము. దేవుడు అనగా రాజు అని, పుత్త్రదుడు అను పదము పూర్త్తదుడు అను పదము కావచ్చునని, పూర్త్తదుడు అనగా పూర్త్తములు చేయువాడని కూడ మిరాషీగారి వివరణము.[57] కాని, పూర్త్తదుడు అనగా పూర్త్తములు ఇచ్చువాడు అని మాత్రమే అర్థమువచ్చును గాని, పూర్త్తములు చేయువాడని అర్థము రాదు. పూర్త్తములన ధర్మకార్యములు. వాపీకూప తటాకాది నిర్మాణములు. ధర్మకార్యములు చేయువాడే కాని ఇచ్చువాడు ఉండడు. కనుక పుత్త్రదుడు అను పదము పూర్త్తదుడు అను పదము కాదు. పుత్త్రదుడు అను విశేషణము పుత్త్రునికి అనుచితము. భర్త్తకు సముచితము. వేదిశ్రీ నాగనిక పుత్త్రుడు. శ్రీశాతకర్ణి నాగనిక భర్త్త. కనుక 'దేవస పుతదస వరదస కామదస ధనదస' అను పదములు 'వేదిసిరి' అను పదమునకు కాక, 'సిరిస' లేక 'సిరిసతకనిస' అను పదమునకు మాత్రమే విశేషణములు.

ఇక శాసనమున అయిదవ పంక్తి ఇది :[58]

ప్రాకృతము :-

'వరియ...(నా) గవరదయినియ మాసోపవాసినియ
గహతాపసాయ చరితబ్రహ్మచరియాయ దిఖవ్రత యంఞ సుండాయ
యఞాహుతా ధూపన సుగంధా యనీయ...'

సంస్కృతచ్ఛాయ :-

...నాగవరదాయిన్యా, మాసోపవాసిన్యా, గృహతాపస్యా,
చరితబ్రహ్మచర్యయా, దీర్ఘవ్రతయజ్ఞశౌణ్డ్యా యజ్ఞాః హుతాః
ధూపనసుగన్ధాః (=సుగన్ధద్రవ్యహుత్యా సుగన్ధీకృతాః-)'

ఇందు నాగవరదాయిని అనగా నాగనిక మాసోపవాసిని, గృహతాపసి, చరితబ్రహ్మచర్య, దీర్ఘవ్రతయజ్ఞసమర్థ అయి యజ్ఞములు చేసినట్లు కలదు. ఇంతవఱకు నిర్వివాదము. కాని, నాగనిక మాసోపవాసిని, గృహతాపసి, చరితబ్రహ్మచర్య అని కలదుగాన ఆ కాలమున (శాసన కాలమున) వితంతువని విదేశీయులైన డాక్టర్ బూలర్‌గారి అభిప్రాయము. స్వదేశీయులైన డాక్టర్ డి. ఆర్. భండార్కర్, డాక్టర్ యస్. యల్. కటారే, డాక్టర్ వి. వి. మిరాషీ ప్రభృతుల అభిప్రాయము కూడ అదే. దేశీయసంప్రదాయము తెలియని విదేశీయులు పొరబడుట సహజము. తెలిసిన స్వదేశీయులు త్వరపడుట విస్మయజనకము.

డాక్టర్ బూలర్‌గారి సమన్వయ మిది :[59]

'రాణికి గల విశేషణము లందు గృహతాపసి, చరితబ్రహ్మచర్య అని కలదు. గృహతపస్సు, బ్రహ్మచర్యాచరణము వితంతువునకు మాత్రమే విహితములు. సభర్తృక అయిన భార్యకు కాదు. ఉపవాసము చేయుట కూడ వితంతువునకు విధ్యుక్తధర్మము. సభర్తృకకు ఉపవాసము చేయవలసిన ఆవశ్యకము లేదు. సభర్తృకకు దాంపత్య జీవితసౌఖ్యము విధాయకము. కనుక రాణికిగల గృహతాపసి చరితబ్రహ్మచర్య అను విశేషణములు స్పష్టముగా రాజు అప్పటికి మరణించినట్లు తెలుపుచున్నవి.'

డాక్టర్ డి. ఆర్. భండార్కర్‌గారి సంస్కరణమిది :[60]

'నాగనికాశ్రీశాతకర్ణులు కలిసి కొన్ని యజ్ఞములు చేసిరి. అశ్వమేధయాగము నాగనిక సహధర్మచారిణిగ శ్రీశాతకర్ణి చేసినది. రెండుసారులు చేసిన అశ్వమేధయాగము శ్రీశాతకర్ణి సార్వభౌముడనుటకు సాధకము. శాసనము నిజముగ ప్రకటించినపుడు శాతకర్ణి మరణించెను.'

డాక్టర్ యస్. యల్. కటారేగారి సమర్థన మిది :[61]

'నాగనిక గృహతాపసి, చరితబ్రహ్మచర్య అను విశేషణములను బట్టి వితంతువని బూలర్‌గారు వివరించిన సంగతి నిజము.'

డాక్టర్ వి. వి. మిరాషీగారి వివరణ మిది :[62]

'నానాఘాట్ శాసనములోని యజ్ఞములు నాగనిక సహధర్మచారిణిగ చేసినట్లు డి. ఆర్. భండార్కర్‌గారి అభిప్రాయము. కాని ఈ విషయమున శాసనము స్పష్టముగలేదు. శాసనము స్పష్టముగ కొన్ని యజ్ఞములైన నాగనిక గృహతాపసిగ, చరితబ్రహ్మచర్యగ ఉన్నప్పుడు చేసినట్లు చెప్పుచున్నది. శాసనములోని నాగనిక వర్ణనము ఆ సమయమున ఆమె వితంతువని చాటుచున్నది. అశ్వమేధమువంటి కొన్ని యజ్ఞములు ఆమె, ఆమె భర్త్త చేసియుండుట అసంగతము కాదు.'

శ్రీ ఐ. కార్తికేయశర్మగారి అనుసరణ మిది :[63]

'నానాఘాట్‌శాసనమున పేర్కొన్న యజ్ఞములు చేసినప్పుడు కటారేగారు తెలిపినట్లు నాగనిక వితంతువు.'

ఇట్లు వీరు మాత్రమే కాదు; ఇతర చరిత్రకారులును యిదే పాట. విచారకరమైన విషయము. నాగనిక మాసోపవాసిని కనుక వితంతువనుట మహాదారుణము. వితంతువు మాసోపవాసిని కాదు. నిత్యోపవాసిని. మాసోపవాసిని అనగా ఒక నెలమాత్రమే ఉపవాసము చేసినదని అర్థము. నిత్యము ఉపవాసము చేయునదని అర్థముకాదు. అంతేకాదు. నాగనిక దీర్ఘవ్రత యజ్ఞసమర్థ అని ఆ చెంతనేకలదు. ఉపవాసము వ్రతనియమము. యజ్ఞనియమము కూడ. నాగనిక దీర్ఘవ్రత యజ్ఞసమర్థ కనుక మాసోపవాసిని. కనుక వితంతువు కాదు. నాగనిక గృహతాపసి కనుక వితంతు వనుట కూడ మహాఘోరము. దీర్ఘవ్రతయజ్ఞదీక్షయే గృహతపస్సు. గృహతాపసి అనగా గృహస్థతాపసి అని మాత్రమే అర్థము. వానప్రస్థతాపసి కాదని వ్యవచ్ఛేదకము. అనగా నాగనిక గృహిణి అనియే తాత్పర్యము. కనుక వితంతువు కాదు. నాగనిక చరితబ్రహ్మచర్య కనుక వితంతు వనుట

కూడ మహా విపరీతము. చరిత్రబ్రహ్మచర్య అనగా బ్రహ్మచర్యమును ఆచరించినదని అర్థము. వితంతువు ఆచరించునది బ్రహ్మచర్యము కాదు. వైధవ్యము. నియమ నిష్ఠలు నిమిత్తముగ వితంతువు ఆచరించునదియే బ్రహ్మచర్యము. ఉపవాసముతోపాటు బ్రహ్మచర్యాచరణమును అనగా దాంపత్య జీవితసౌఖ్య నిషేధమును దీర్ఘవ్రత యజ్ఞదీక్షానియమము. నాగనిక చరిత్రబ్రహ్మచర్య అనగ సభర్తృక అయి బ్రహ్మచర్యమును ఆచరించినదని మాత్రమే అర్థము. కనుక వితంతువు కాదు. ఉపవాసము, ధ్యానము, బ్రహ్మచర్యము వ్రత యజ్ఞ వైభవములు. వైధవ్యములుకావు. కాబట్టి నాగనిక మాసోపవాసిని, గృహతాపసి, చరిత్రబ్రహ్మచర్య అనగా మహానియమసంపన్న అని మాత్రమే అర్థము.

అసలు యజ్ఞమునకు అధికారి గృహస్థు. అతడు కూడ సపత్నీకుడు. ఎంత మహారాణి అయినను స్త్రీ యజ్ఞమునకు అనధికారిణి. కనుక నాగనిక యజ్ఞములు చేసినది అనగా నాగనికా శ్రీశాతకర్ణులు యజ్ఞములు చేసిరనియేఅర్థము. ఇది శ్రౌతసంప్రదాయము. అంతేకాదు. నానాఘాట్ శాసనమునందు ఆరవపంక్తి ఆరంభమిట్లు కలదు:[64]

ప్రాకృతము :-

'రాయస...(య) ఞే హి యిఠ వనో—'

సంస్కృతచ్ఛాయ :-

'రాజస్య...యజ్ఞైః ఇష్టమ్ (తేషాం) వర్ణాః
(—వర్ణనా—వివరణమ్)'

ఇందు 'రాయస' అను ప్రాకృతపదము అవశ్యగమనార్హమైన విశేషము. సంస్కృత రాజన్ శబ్దమునకు షష్ఠ్యేకవచనముగ, శాతవాహనుల శాసనములందు, నాణెములమీద 'రాయస' అను ప్రాకృత రూపము కానరాదు. నిరుపపదమైన రాజన్ శబ్దముకంటె సోపపదమైన మహారాజ శబ్దమునకు 'మహారాయస' అను ప్రాకృతరూపము నిరాఘాటము. కనుక ఆరవపంక్తి ఆరంభములోని 'రాయస' అను పదమునకు ముందు అయిదవపంక్తి చివర 'మహా' అను ఉపపదము ఉండుట సంభవము. అంతేకాదు. యఞేహి అను ప్రాకృతపదమునకు యజ్ఞైః అను సంస్కృతచ్ఛాయతోపాటు యజ్ఞేషు అను సంస్కృతచ్ఛాయ కూడ సంగతము.[65] '(మహా) రాజస్య — యజ్ఞేషు ఇష్టమ్' అను సంస్కృతచ్ఛాయకు మహారాజు యొక్క—యజ్ఞములందు ఈయబడినది అని అర్థము వచ్చును. (యజదేవపూజా సఙ్గతి కరణదానేషు) ఆ మహారాజు శ్రీశాతకర్ణి అగుట నిర్ధారకము. కాబట్టి నానాఘాట్ శాసనమున వర్ణితములైన యజ్ఞములెల్ల నాగనికా శ్రీశాతకర్ణులు చేసిన యజ్ఞములని స్పష్టము.

నాగనికా శ్రీశాతకర్ణులు చేసిన యజ్ఞము లివి :[66]

1. అగ్న్యాధేయము, 2. అనారంభణీయము, 3.…రికము 4. రాజసూయము, 5. అశ్వమేధములు, 6. … … …, 7. … …వాయము, 8. భగల దశరాత్రము, 9.… … …, 10. గర్గాతిరాత్రము, 11 గవామయనము, 12. ఆప్తోర్యామము, 13. …గవామయనము, 14. అంగిరసామయనము, 15. శతాతిరాత్రము, 16. అంగిరసాతిరాత్రము, 17. ఛందోపవనాతిరాత్రము, 18. అంగిరసాతిరాత్రము, 19. …త్రము, 20. అంగిరసాయనము, 21. త్రయోదశరాత్రము, 22. త్రయోదశరాత్రము, 23. దశరాత్రము.

ఇన్ని యజ్ఞములును శ్రీశాతకర్ణి చేసినవి. అన్ని యజ్ఞములందును నాగనిక సహధర్మచారిణి. సహధర్మచారిణి లేకుండ పురుషుడు యజమానుడు అగుట, సభర్తృక కాకుండ స్త్రీ యజమానురాలు అగుట సంప్రదాయవిరుద్ధము. శాస్త్రనిషిద్ధము. అంతేకాదు. యజ్ఞము చేసినప్పుడు దానము చేయుట, దానము చేసినప్పుడు శాసనము వేయుట కూడ సంప్రదాయము. సాధారణ పద్ధతి. ఆఖరి యజ్ఞము కాగానే అన్ని దానముల పట్టికను నానాఘాట్ శాసనమున ప్రకటించుట సంభవము. కాబట్టి నానాఘాట్ శాసనకాలమున నాగనిక వితంతువు కాదని, నాగనికా శ్రీశాతకర్ణులు సజీవరాజదంపతులని స్పష్టము.

అయిన కుమారవరుడైన వేదిశ్రీకి నమస్కారము ఎందుకు? అను ప్రశ్న అటులే ఉన్నది. ఇష్టదేవలతోపాటు కుమారవరుడైన వేదిశ్రీకి నమస్కారము చేసినది నాగనిక మాత్రముకాదు. నాగనికా శ్రీశాతకర్ణులు ఉభయులును. అనగా తల్లిదండ్రులు కుమారునికి నమస్కరించిరని అర్థము. ఇది మరింత లోకవిరుద్ధము. కుమారుడు బ్రదికియుండగ తల్లిదండ్రులు నమస్కరించుట కూడని పని. జరుగని పని కూడ. అంతేకాదు. పెద్దలు పిన్నలకు నమస్కారము చేసిన పిన్నలకు ఆయుఃక్షీణమను విశ్వాసమును అనాదిగ కలదు. ఆయువు తీరిన తర్వాత అట్టి ప్రమాదమునకు అవకాశము లేదు. అంతేకాదు. చనిపోయిన కుమారుని దేవతలలో చేర్చి పూజించు సంప్రదాయము లేకపోలేదు. కనుక స్వర్గస్థుడైన కుమారుడు వేదిశ్రీకి, సజీవులైన తల్లిదండ్రులు నాగనికా శ్రీశాతకర్ణులు ఇష్టదేవతలతోపాటు నమస్కారముచేయుట మాత్రమే సంభవము. కాబట్టి నానాఘాట్ శాసన కాలమునకు వేదిశ్రీ మరణించెనని ప్రకరణమునుబట్టి ప్రతీయమానము.

అయిన నాగనిక వేదిశ్రీ తల్లి అని వేదిశ్రీ మరణించిన తర్వాత నానాఘాట్ శాసనమున పేర్కొనబడుట సమంజసమా? అను మరొక అనుబంధప్రశ్నకు అవకాశము కలదు. కాని నానాఘాట్ శాసనకాలమునకు సమీప పూర్వకాలమున వేదిశ్రీ మరణించిన, నానాఘాట్ శాసనమున నాగనిక వేదిశ్రీ తల్లి అని పేర్కొనబడుట అసమంజసముకాదు. అంతెకాదు వేదిశ్రీ కుమారవరుడని నానాఘాట్ శాసనమునందే కలదు. కుమారవరుడన కుమారశ్రేష్ఠుడు. వేదిశ్రీ మరణించినను కుమారశ్రేష్ఠుడు కనుక, నాగనిక వేదిశ్రీ తల్లి అని నానాఘాట్ శాసనమున పేర్కొనబడుట సహజము.

ప్రతిమాశాసన ప్రకరణమునుబట్టి శక్తిశ్రీ జ్యేష్ఠుడు. నానాఘాట్ శాసన ప్రతిపాదనమునుబట్టి వేదిశ్రీ శ్రేష్ఠుడు. కనుక ప్రతిమా శాసన ప్రకరణము జ్యేష్ఠానుపూర్వి: నానాఘాట్ శాసనవివరణము శ్రేష్ఠానుపూర్వి. అంతేకాదు. వేదిశ్రీ స్వర్గస్థుడగుటవలన కూడ ముందు పేర్కొనుట సంభవము వక్ష్యమాణమన్న అనుమాన ప్రమాణ మిది. కనుక ప్రతిమాశాసన ప్రకరణమునకు నానాఘాట్ శాసన వివరణమునకు క్రమవ్యత్యాసము సకారణమని అవగాహకము. అథవా, నానాఘాట్ శాసనమున ప్రసిద్ధమైన సూర్యచంద్రక్రమమును చంద్రసూర్య వ్యత్యస్తము చేసిన శాసనరచయిత శక్తిశ్రీ వేదిశ్రీ క్రమమును వేదిశ్రీ శక్తిశ్రీ వ్యత్యస్తము చేయుట అసంభవముకాదు. కాబట్టి వేదిశ్రీ కుమారశాతవాహనుడని నిర్ధారకము.

ఇక కుమార 'హకుసిరి', మహా 'హకుసిరి' భిన్నులనుటకు హేతువు 'మహాహకుసిరి' నాసిక శాసనము. ఆ శాసన మిది:[67]

ప్రాకృతము:-

రాయామచ అరహలయస చలిసాలణకస[2] దుహుతుయ
మహాహకుసిరి[3] (యా) యయ భటపాలికాయ
రాయామచస అగియ తణకస భడాకారికయస భారియాయ
కపణకమాతుయ చెతియ గరవ్ పవతె తిరణ్హుమి నిఠపాపిత

2· 'చలిసిలకణస' కావచ్చును.

3. ఆద్యక్షరము 'రా' అని కూడ చదువవచ్చును. రెండవ అక్షరము 'రా' వలె కనబడును గాని అది నిశ్చయముగ శిథిలమైనది.

అనువాదము

రాజామాత్యుడు అరహలయచలిసాలణకుని కుమార్తె,
రాజామాత్యుడు అగియతణక భడాకారికయుని భార్య
అయిన మహాహకుసిరియాభటపాలిక, త్రిరశ్మి (తిరణ్హు)
పర్వతముమీద చైత్యగృహమును నిర్మించినది.

ఇది డాక్టర్ బూలర్‌గారి వివరణము. ఇందు మహాహకుసిరియాభటపాలిక చైత్యగృహమును నిర్మించినట్లు కలదు. కాని భటపాలిక చైత్యగృహమును నిర్మించినదని, ఆమె 'మహాహకుసిరి' మనుమరాలు అని ఇ. సెనార్ట్‌గారి అభిప్రాయము.[68] మనుమరాలు అనుట ఊహామాత్ర శరణ్యము. 'మహాహకుసిరి (యా) యయ' అని బూలర్‌గారి పాఠము కాగా, 'మహాహకుసిరి——య' అని సెనార్ట్‌గారి పాఠము.[69] అంతేకాదు. 'మహాహకుసిర్' అను పదమునకు 'య' అను వర్ణమునకు మధ్య రెండు అక్షరములు ఉండవలయునని కూడ సెనార్ట్‌గారి వివరణము.[70] ఆ రెండు అక్షరములును '(యా)య' అగును.

'తిరణ్హు' అను ప్రాకృత శబ్దమునకు 'త్రిరశ్మి' అను సంస్కృతశబ్దము సదృశము కావచ్చునని బూలర్‌గారిసూచనము.[71] అటులే డాక్టర్ సర్కార్‌గారి సంస్కృతచ్ఛాయలందు కలదు.[72] కాని సంస్కృతరశ్మి శబ్దము ప్రాకృతములందు సర్వథా 'రస్సి' అగును గాని 'రణ్హు' కాదు.[73] సహస్రరశ్మి=సహస్సరస్సి. ప్రాకృతములోని 'తిరణ్హు' శబ్దమునకు సదృశమైన సంస్కృతశబ్దము మృగ్యము. ఒక్క 'ధృష్ణు' శబ్దమునుండి 'తిరణ్హు' రూపము కిట్టించవచ్చును గాని, అది క్లిష్టకల్పనము. ప్రాకృతమునందు తిరణ్హు శబ్దము సంస్కృతభవము కాక, దేశ్యము కావచ్చును. ప్రాకృతములందు దేశ్యములు ప్రసిద్ధము. దేశ్యశబ్దములకు శబ్దసంగతి కల సంస్కృతశబ్దములు దుర్ఘటము. గాథాసప్తశతియందు 'అత్త' మొదలైన దేశ్యశబ్దములకు అర్థసంగతి కల 'శ్వశ్రూ' మొదలైన సంస్కృత శబ్దములే సంస్కృతచ్ఛాయలందు కలవు. తిరణ్హు శబ్దమునకు అర్థమును అనవగాహకము. వాసిష్ఠీపుత్త్ర పులుమావి నాసిక శాసనమున 'తిరణ్హుపవతసిఖరే' అని కలదు.[74] ప్రాకృతశాసనమునందును 'పవతె తిరణ్హుమి' అని కలదు. కనుక తిరణ్హు శబ్దము పర్వతము పేరు. దేశ్యములైన పేరులకు భాషాంతరీకరణము కృతకము. కనుక మహాశక్తిశ్రీ నాసికశాసనమునకు సంస్కృతచ్ఛాయ ఇట్లు సంగతము.

'రాజామాత్యస్య అరహలయస్య చలిసిలనకస్య దుహిత్రా మహాశక్తిశ్రీ ఆఖ్యయా భటపాలికయా రాజామాత్యస్య అగియతనకస్య భటకారికాఖ్యస్య భార్యయా కపననకమాత్రా చైత్యగృహమ్ పర్వతే తిరణ్హౌ నిష్పాదితమ్'.

పయి సంస్కృతచ్ఛాయకు అర్థమిది:

'రాజామాత్యుడు చలిసిలనవాస్తవ్యుడు అయిన అరహలయుని కూతురు, రాజామాత్యుడు అగియతన వాస్తవ్యుడు అయిన భటకారికుని భార్య, కపననకుని తల్లి అయిన మహాశక్తిశ్రీ అను పేరుగల భటపాలిక తిరణ్హు పర్వతముమీద చైత్యగృహమును స్థాపించెను'.

ఇందు మహాశక్తిశ్రీ అనగా 'మహాహకుసిరి' స్త్రీ అని ఇదమిత్థము. ప్రతిమాశాసనములందు కుమార 'హకుసిరి' పురుషుడు. కనుక ఇద్దఱు భిన్నులు. అంతేకాదు. కుమార 'హకుసిరి' కుటుంబము రాజకుటుంబము. మహా 'హకుసిరి' కుటుంబము మంత్రి కుటుంబము. కాబట్టి కుటుంబ భేదమునుబట్టి స్త్రీ పుంస భేదమునుబట్టి కుమార 'హకుసిరి'యే మహా 'హకుసిరి' అను సంభావనములు సమంజసములు కావని స్పష్టము.

ఇక మాఠరీపుత్త్ర శివస్వాతి శకసేనుని కన్హేరీ శాసనములు—ఇవి రెండు శాసనములు. ఒక శాసనమున 'సిధమ్ రఞో మ (మా) ఢరి పుతసస్వామి సకసెనస సవచ్ఛరె 8—'అని స్పష్టముగకలదు.[75] అందుకు 'సిద్ధమ్. రాజ్ఞః మాఠరీపుత్త్రస్య స్వామి శకసేనస్య సంవత్సరే 8—' అను సంస్కృతచ్ఛాయ సంగతము· అనగా 'రాజు మాఠరీపుత్త్ర శకసేనుని 8వ రాజ్యవర్షమున' అని అర్థము. మఱి, రెండవశాసనమున 'సధ ర. మ (ఢరి పుతస సకసె) నస...' అని కలదు[76] ఇందు కుండలీకృతభాగము మొదటి శాసనమునుబట్టి

డాక్టర్ బూలర్‌గారి పూరణము. కనుక రెండును మాఠరీపుత్త్ర స్వామిశకసేనుని శాసనములు. రెండవశాసనము శంకనీయము కాని మొదటిశాసనము నిర్ధారకము. అయిన మాఠరీపుత్త్రస్వామి శకసేనుడు ఎవరు? — మాఠరీపుత్త్రవిషయము, శకసేన విశేషము వాయు, మత్స్య, బ్రహ్మాండ, విష్ణు, భాగవత పురాణములందు లేదు భవిష్యోత్తర పురాణమున కలదు. ఆ శ్లోక మిది :

'అష్టావింశతి వర్షాణి శకసేనో భవిష్యతి
యమాహుర్మాఠరీపుత్త్రం శివస్వాతిం మహాజనాః'

ఇందు శివస్వాతి మాఠరీపుత్త్రుడని, ఉపరి శకసేనుడని కలదు. ఈ శివస్వాతి మత్స్య, బ్రహ్మాండ, విష్ణు భాగవతపురాణములందు కలదు. అతడు శివస్వామి అని వాయుపురాణమునకలదు. అంతేకాదు. ఆరు పురాణములందును అతడు గౌతమీపుత్త్ర శాతకర్ణికి అవ్యవహితపూర్వుడు. శివస్వాతి 28 సంవత్సరములు పరిపాలించునని వాయు, మత్స్య, బ్రహ్మాండ, భవిష్యోత్తర పురాణములు నాల్గింటను ఏకవాక్యత కలదు. అంతేకాదు. మాఠరీపుత్త్ర, శకసేన, శకశాత, శకశాతకర్ణి నామాంకితములైన నాణెములును కలవు. అవి శాతవాహనుల నాణెములను శీర్షికను వివరణీయును. కనుక శాతవాహనరాజునకు శకసేన విశేషము శంకనీయముకాదు కాబట్టి మాఠరీపుత్త్రస్వామి శకసేనుని రెండు శాసనములును—అథమపక్షము ప్రథమాశాసనము—మాఠరీపుత్త్రశివస్వాతి శకసేనుని శాసనములని స్పష్టము.

ఇందుకు లిపిస్వరూపము ఇంచుకుబాధకము. డాక్టర్‌బూలర్ గారు సంతరించిన శాసన ప్రతిరూపములందు మాఠరీ పుత్త్రస్వామి శకసేనుని కన్హేరీ శాసన ప్రతిరూపమునకు (14 సంఖ్య) ఇరువైపుల గౌతమీ పుత్త్రయజ్ఞ శాతకర్ణి కన్హేరీ శాసన ప్రతిరూపములు (4, 15 సంఖ్యలు) కలవు.[77] మూడు శాసన ప్రతిరూపముల లిపి స్వరూపమును పరిశీలించిన మాఠరీపుత్త్ర స్వామిశకసేనుని కన్హేరీ శాసనము, గౌతమీపుత్త్ర యజ్ఞశాతకర్ణి కన్హేరీ శాసనముల కంటె పూర్వకాలికమని ద్యోతకమగును. వాసిష్ఠీపుత్త్రపులుమావి, గౌతమీపుత్త్రశాతకర్ణి నాసిక శాసనముల ప్రతిరూపములును కలవు.[78] అవి పరిశీలించిన మాఠరీపుత్త్ర స్వామిశకసేనుని కన్హేరీ శాసనము, గౌతమీపుత్త్రశాతకర్ణి నాసికశాసనముల కంటె అనంతర కాలికమని ద్యోతకమగును. కాని, మాఠరీపుత్త్ర శివస్వాతి శకసేనుడు గౌతమీపుత్త్రశాతకర్ణికి అవ్యవహితపూర్వుడు. అంతేకాదు. గౌతమీపుత్త్రశాతకర్ణిఅనంతరము మాఠరీపుత్త్రుడు, శకసేనుడు కానరాడు. గౌతమీపుత్త్రశాతకర్ణి మొదలు శ్రీపులుమావి వఱకు అన్ని పురాణము లందును కల అందఱు శాతవాహనరాజుల పూర్తిపేరు లివి :

1. గౌతమీపుత్త్రశాతకర్ణి, 2. వాసిష్ఠీపుత్త్రపులుమావి (శాతకర్ణి), 3. వాసిష్ఠీపుత్త్రశాతకర్ణి, 4. వాసిష్ఠీపుత్త్ర శివపులుమావి (శాతకర్ణి), 5. శివస్కందశాతకర్ణి, 6. గౌతమీ పుత్త్రయజ్ఞశాతకర్ణి, 7. శ్రుతస్కంద (శాతకర్ణి), 8. గౌతమీ పుత్త్ర విజయ శాతకర్ణి, 9. వాసిష్ఠీపుత్త్ర చంద్ర శాతకర్ణి, 10. శ్రీపులుమావి.

ఇందు పుత్త్రవివక్ష శాసనము లందు నాణెము లందును కలదు. ఈ పదిమందిలోను ఒక్కడును మాఠరీపుత్త్రుడు కాడు. శకసేనుడును కాడు. మఱి నాణెములనుబట్టి తెలియనగు ఇతర శాతవాహనరాజు లందును మాఠరీపుత్త్రుడు లేడు. శకసేనుడును లేడు. కనుక మాఠరీపుత్త్రుడు, శకసేనుడు గౌతమీపుత్త్ర శాతకర్ణికి అవ్యవహిత పూర్వుడైన శివస్వాతి అని కల భవిష్యోత్తర పురాణవచనము పూత్కారయోగ్యము కాదు. మాఠరీపుత్త్రస్వామి శకసేనుడు మాఠరీపుత్త్ర శివస్వాతి శకసేనుని కంటె మఱొకడు కాడు. కాబట్టి లిపి స్వరూపమునుబట్టి మాఠరీ పుత్త్రస్వామి శకసేనుని కన్హేరీ శాసనములు మాఠరీపుత్త్ర శివస్వాతి శకసేనుని శాసనములు కావనుట కూడ సంగతము కాదు. లిపి స్వరూపమున కాల భేదమునకు వలె ప్రాంతీయ భేదమునకును అవకాశముకలదు. నాసిక శాసనములను, కార్లే శాసనములను మఱల ప్రకటించిన ఇ. సెనార్టు గారి అభిప్రాయ మిది :[79]

'Ofcourse local peculiarities may have played their part too.'

ఇందు ప్రాంతీయమైన ప్రత్యేకతలు కూడ పాత్ర వహించునని కలదు. కనుక గౌతమీపుత్త్రశాతకర్ణి నాసిక శాసనముల లిపికి, మాఠరీపుత్త్రస్వామి శకసేనుని కన్హేరీ శాసనముల లిపికి పౌర్వాపర్య నిర్ణయము పరమ నిర్ధారకముకాదు. అంతేకాదు. నాగనిక నానాఘాట్ శాసనముల లిపికి నాగనిక పేరు కల శ్రీశాతకర్ణి వెండి నాణెముమీది లిపికి సాదృశ్యములతోపాటు వైవిధ్యములును కలవు.[80] కనుక మాఠరీపుత్త్రస్వామి శకసేనుని కన్హేరీ శాసనములు మాఠరీ పుత్త్రశివస్వాతి శకసేనుని శాసనములనుట సాధకము.

శాతవాహనుల ఇతర శాసనములు ఇట్లు వివాదగ్రస్తములు కావు. కనుక పరిశీలనావశ్యకము లేదు.

పయి పునఃపరిశీలనకు ఫలితాంశము లివి :

1 శిముకశాతవాహనుని పుత్త్రుడు కృష్ణుడు.

2 కృష్ణుని పుత్త్రుడు శ్రీశాతకర్ణి.

3 శ్రీశాతకర్ణి భార్య నాగనిక.

4 నాగనికా శ్రీశాతకర్ణుల పుత్త్రులు ఇద్దఱు – 1. శక్తిశ్రీ, 2. వేదిశ్రీ ఉరఫు కుమారశాతవాహనుడు.

5 నానాఘాట్ శాసన కాలమునకు వేదిశ్రీ స్వర్గస్థుడు.

6 నాగవరదాయిని అనగా నాగనిక.

7 నానాఘాట్ శాసనకాలమున నాగనిక వితంతువు కాదు.

8 నానాఘాట్ శాసనమున పేర్కొన్న యజ్ఞములెల్ల నాగనికా శ్రీశాతకర్ణులు కలిపి చేసినవి.

9 కుమార 'హకుసిరి', మహా 'హకుసిరి' కాడు.

10 మాఠరీపుత్త్రస్వామి శకసేనుడు అనగా మాఠరీపుత్త్ర శివస్వాతి శకసేనుడు.

సూచికలు

1. A) ASWI. V. p. 64.
   B) SI, pp. 184–5.
   C) సా. సం. అను., పు. 1
2. ASWI. V. p. 64.
3. SI. between pp. 186, 187.
4. ASWI. V. p. 64.
5. CGPL, p. 199.
6. SI. p. 223.
7. ASWI. V. p. 64.
8. SI. between pp. 186, 187.
9. CGPL, p. 178.
10. ASWI. V p. 178.
11. IHQ. XXVIII. p. 73.
12. JNSI. XXXVIII, pp. 6, 11.
13. ASWI. V. p. 64.
14. Ibid.
15. Ibid. p. 68.
16. IHQ. XXVIII, p. 73.
17. MSI. I pp. 125–6.
18. CSCE, p. 92.
19. JNSI. XVI, p. 70 & 81.
20. SI. p. 184, FN. 3.
21. ASWI. V. p. 60.
22. SI, p. 186.
23. Ibid, between pp. 186, 187.
24. Ibid.
25. ASWI, V. p. 60.
26. ASIAR, 1923 24, p. 83,
27. SI. p. 187.
28. Ibid, p. 488.
29. A) ASWI, V.
    B) SI. between pp. 186, 187.
30. ASWI, V. p. 60.
31. ASIAR, 1923–24, p. 23.
32. SI, p. 187.
33. Ibid, between pp. 186, 187.
34. A) ASWI, V. p. 60.
    B) SI, pp. 186–7.
35. ASWI. V. p. 60.
36. Ibid.
37. SI. p. 186.
38. Ibid. p. 187.
39. Ibid.
40. MSI, I. p. 123.
41. EI. I. pp. 95–6.
42. ASWI. V. p. 67.
43. MSI. I. p. 123.
44. A) ASWI. V. p. 60.
    B) SI. p. 187.
    C) సా. సం. అను., పు. 1
45. MSI, I, p. 123.
46. ASWI, V. p. 66.
47. A) ASWI. V. p. 60.
    B) SI, p. 187.
    C) సా. సం. అను., పు. 1
48. ASWI, V. p. 62
49. Ibid.
50. SI. p. 185, FN. 3.
51. A) ASWI. V. p. 60.
    B) SI. pp. 187, 189.
52. Ibid.
53. SI, p. 189.
54. Ibid, between pp. 186, 187.
55. Ibid.
56. MSI, I, p. 124.
57. Ibid.
58. A) ASWI. V. p. 60.
    B) SI. p. 187.
    C) సా. సం. అను., పు. 1
59. ASWI. V. p. 67.
60. IA. XLVII, p. 72, FN. 11.
61. IHQ. XXVIII, p. 72.
62. MSI, pp. 126–7.
63. CSCE, p. 92.
64. A) ASWI. V. p. 60.
    B) SI, p. 187.
    C) సా. సం. అను , పు. 2

65. CGPL, pp. 251-2.
66. A) ASWI, V. p. 60.
B) SI, pp. 187-190.
C) సా. సం. అను., పు. 2
67. ASWI, IV, p. 99.
68. EI. VIII, pp. 91-2.
69. Ibid.
70. Ibid.
71. ASWI, IV, p. 99.
72. SI, pp. 194, 199.
73. CGPL, p. 219.
74. I. p. 190.
75. ASWI. V. p. 79
76. Ibid, p. 82.
77. ASWI, V.
78. A) ASWI. IV.
B) EI. VIII, pp. 59-96.
C) SI. between pp. 196, 197.
79. EI. VIII, p. 92.
80. JNSI, XXXVIII, p. 10.

సంకేతములు

ASIAR = Archaeological Survey of India. Annual Report.

ASWI = Archaeological Survey of Western India.

CGPL = Comparitive Grammar of the Prakrit Languages.

CSCE = Coinage of Satavahanas and Coins from Excavations.

EI = Epigraphia Indica.

IA = Indian Antiquary.

IHQ = The Indian Historical Quarterly.

JNSI = The Journal of the Numismatic Society of India.

MSI = Studies in Indology by Mirashi.

SI = Select Inscriptions.

సా. సం. అను. = సాతవాహన సంచిక — అనుబంధము.

శిశిర గీతం

శ్రీ గుడిపాటి రఘునాథం

మళ్ళీ ఒక ఆకు రాలింది.
ప్రాణాలన్నీ ఇంకిపోయి
కన్నీళ్ళనేవే లేక
తన కళ్ళనే
కన్నీళ్ళుగా రాలుస్తున్న
చెట్టు బుగ్గల్నించి
మళ్ళీ
ఒక కన్నురాలిపోయింది.

సముద్రంలో మునిగి
అటూ ఇటూ కదులుతూ
అడుక్కుచేరే
ఒక పేద పడవలానో
పడవలోని మనిషి ఆశలానో
మళ్ళీ ఒక ఆకు రాలిపోయింది.

నేలపైరాలే ప్రతిరాత్రీ
నేనూ
ఒక ఆకులా రాలిపోతాను
నిద్రలోకి.

చెట్టు కన్నులా నేను రాలటమంటే, మరేంలేదు.
భూగోళం కనుగుడ్డులోకలిసి
విశ్వమంతా
మరింతగా వీక్షించటమన్నమాట !

కాలం విలువేమా

శ్రీ సోమసుందర

భూరక్షకుడు

ఇంత చలి ప్రొద్దువేళ — తూరుపులో తెలివెలిరేకులు సన్నగా మెడలు సారించకముందే — మసగ ముసుగులు దిగంతరేఖలకు వైదొలగకముందే — హటాత్తుగా లేచి, కాడి భుజాన వేసుకొని ఎక్కడికలా వెళ్ళిపోతున్నావు, పిచ్చయ్యా?

నిజమే, నీవు నిద్రమేలుకొన్నావు; ముందుకే నడుస్తున్నావు; కాని ఆ మేలుకోవడం నిజంగా జాగృతియేనా? ఆ నడక నిజమైన పురోగమనమేనా?

ఛీ మెడమీదికాడి నీ దౌర్భాగ్యయోగానికి చిహ్నమనుకుంటున్నావే తప్ప - అదే నీకొక మహత్తర హలాయుధమని ఎప్పుడేనా తలపోశావా?...అన్నా పిచ్చయ్యా!

నీవు మండలాధిపతివి కావని నాకు తెలుసు; ఈ భూమండలంలోనే సామాన్యులలోకెల్లా అతి సామాన్యుడవు.

ఉరుము రిమి మేఘశకలం నిన్ను దగాచేసి కనుమరుగైతే— నుదుట్ని తడుముకుంటావు; ఆశల్ని నిట్టూరుస్తావు!

పడ్డల్ని తోలుకుంటూ అర్ధమనస్కంగా, అడ్డదిడ్డంగా నడుస్తావు; బుడ్డ బూసరకాయల్నో, పిల్లిపెసర కాయల్నో బిడ్డల కోసం కోసుకుంటావు; అవునా పిచ్చయ్యా!

కొండ చెరియ ప్రక్క మెరుపాకటి—మొయిలు మేలిముసుగు తొలగించి నిన్ను చూసి, సన్నగా నవ్వితే—మురిసిపోతావు! వెర్రి సంబరంతో దూడల్ని ముద్దుపెట్టుకుంటావు

చలివేస్తే గొంగళి కప్పుకుంటావు; కాళ్ళు చుర్రుమంటే పాత చెప్పులు తొడుక్కుంటావు; సాహస చర్యగా కలలు కంటావు

నిన్నటినుంచి నేటికీ నేటినుంచి రేపటికీ దినవారీ బ్రతుకు సాగిస్తావు; అంతేనా పిచ్చయ్యా? నేనేమైనా అబద్ధమాడుతున్నానంటావా?

తృప్తి...తృప్తి...తృప్తి తప్పిస్తే మరేమీలేదు!

వేదకాలాలనుంచీ గాంధీకాలాలవరకూ నీకు బోధించిందే తృప్తి!

తాలిమి నీ ప్రాణం... ఓరిమి నీ దర్శనం!

పుడమి ముడి గుండెల్ని మథిస్తావు. వెన్నల్నీ వెన్నెల్నీ పిండుతావు. లోకానికి అరిగింపు పెడతావు నైవేద్యం తరువాత గంట మ్రోత ఒక్కటే మిగుల్చుకున్న పూజారిలా ప్రసాదమైనా లభించక, వెర్రిగా నవ్వుకుంటూ వెలుపలికి వెళ్ళిపోతావు!

నీకు రోజూ యింతే పాపం! ఆరుగాలం ఆరుబయటే నీ మకాం!

ఎప్పుడో తెల్లవారుతుంది; ఎప్పుడో చీకటి నిన్ను జోకొడుతుంది!

పిచ్చయ్యా, నీకు నిజంగా తెల్లవారే దెప్పుడు?

ఆదివారమైనా నీకు సెలవుకాదు; ఆదీ అంతంలేని బరువు చేదుకాదు!

నీ మెదడు గదిలో ఖాళీలే గాని, భర్తీలులేవు. నీ పడకగది నిండా—మెసలడానికి ఖాళీలేకుండా పిల్లలూ, మేకలూ! కోడిరెట్టలూ, దూడరేణాలూ!

ఋతువులు తొందరగా దొర్లినా, కాలం రైలుబండిలో నీ కష్టాలకు టిక్కెట్టు దొరకదు. దివారాత్ర చక్రబంధం నిన్ను గిరగిరా త్రిప్పినా నీ గలేజీ దూరంకాదు.

అన్నా పిచ్చయ్యా! సార్థక నామధేయుడవయ్యా!

సూర్యుని నిప్పుల నిట్టూర్పులనుంచీ, నక్షత్రా లలంకరించుకొని మోసగించే ఆకాశాలనించీ, భూమిని రక్షించేందుకు నిరాడంబరంగా, నిష్కాపట్యంగా నిలచిన భూరుహానివి నువ్వు, పిచ్చయ్యా!

నువ్వు బ్రతికి ఉండగా నిన్నెవరూ గుర్తించరు!

చెట్టు కూలినపుడే శూన్యం వెక్కిరించేది!

స్థూలకాయం

ఈ రాత్రి నగరాన్ని చూశాను; శిలాశయ్యపై మునిసిపల్ దీపం క్రింద నగ్నంగా పవళించిన బిచ్చగత్తె లాగుంది; విగత యౌవనంతో పెనుగులాడుతున్న సంఘర్షణలాగుంది.

ఈ రాత్రి నగరాన్ని చూశాను; రక్తనదుల మహానరకాన్ని చూశాను; ఆరుతూ వెలుగుతూ మభ్యపెట్టే వ్యాపార ప్రకటనల ఎర్రని దీపాలు భ్రమ కొలుపుతున్నాయి - బ్రహ్మరాక్షసి మత్తు కన్నుల్లా!

తొందర తొందరగా వెళ్ళిపోతున్న కార్లు—ఎర్రని కన్నులతో తరిమే కారెనుబోతుల్లా ఉన్నాయి!

ఈ రాత్రి నగరాన్ని చూశాను; నిద్రపోతున్న చెవుల్ని—ఏదో భయం పీడాకరంగా, భయంకరంగా, బ్రద్దలుకొడుతోంది. దుస్స్వప్నాలు పరకీయాపహరణార్థం దుశ్శాసనుల్లా విజృంభించాయి!

ఈ రాత్రి నగరాన్ని చూశాను; దూరంగా చెట్లచాటుకు తప్పుకొన్న చంద్రుడు ముక్కుమూసుకున్నాడు; ముసలి పీనుగులా ఒణుకు తున్నాడు; కలకబారిన కన్నులా జేవురించి అసహ్యంగా ఉన్నాడు.

ఈ రాత్రి నగరాన్ని చూశాను; తన్ను తానే ప్రేమించుకొనే విలాసవతిలాగుంది; తెగతాగి నరాల పొంగుతో తన్నుకుంటూన్న స్థూలకాయునిలాగుంది.

నిజంగానే ఈ రాత్రి చూశాను నగరాన్ని!

పాంథశాల

ఓ బాటసారీ, నీ అడుగుల సవ్వడి వింటూ, నీ పాదాల కద లికలు కంటూ, నీ దారి కెలకుల విడిసిన ఈ పాంథశాలలో ఆసీను డనై ఉన్నాను.

నా సోదరా, రా, నీకు నేనెంత సన్నిహితుడ్నో గమనించు సాదరంగా... నీ గమనానికి బలాన్నీ, నీ చలనానికి వేగాన్నీ, నీ నరాల కుద్దీపననీ, కలిగిస్తూన్నది నేనే! ఎప్పుడైనా నీవాలోచించావా తమ్ముడూ!

నీ ఆలోచనలకు మెరుపు రేకలద్దీ, నీ ఉచ్ఛ్వాసాలకు సురభిళ మలయ పవనాలు హత్తి, నీ పురోగతిని ప్రోత్సహించేది నేనే! గ్రహించావా మిత్రమా!

ప్రతినిత్యం నీకోసం వెచ్చని అన్నంగా మారి, నీ కంచంలో నిరీక్షించేది నేనే! నీ తలపై అనవరతం సంచలించే నీలిమొయిలు పరదాను నేనే! వానకారు ఎగిరినై నీ మెదడు పండించేది నేనే!...

బరువులు మోస్తూ, దుర్భరమై నడువలేక నడుస్తూ బ్రతుకు నీడుస్తూ సాగుతున్నపుడు—నీ పాదాలక్రింద మోటు బాటలలో కొంటెకోణంగి సూదిరాళ్ళను తొలగించేది నేనే! మెత్తని ఎర్రని ధూళిని పరుస్తాను!...

ఓ తెరువరీ, నేనే — నీకోసం తెరచుకొన్న దారిని; నీ విశ్రాంతిని కోరే చల్లని నీడను; ఏ చెట్టు మొదటనో దప్పికతో ఉండ చుట్టుకుపోయి, కుప్పకూలిపోకుండా ముందుకు సాగేందుకు—నీబాట ప్రక్కనే పిల పిల మ్రోగుతూ మునుముందుకు పారే సెలయేటిని నేనే! స్వచ్ఛ శీతలోదకాలందించే నదిని!

రా...అన్నా...రావయ్యా! నా దగ్గరగా, నా గుండెలకు చేరువగా, ఒంగి నా సలిలాలు దోసిళ్ళనిండా గ్రోలు! దాహతప్త గాత్రానికి ప్రశాంతి చేకూర్చు!

నూతనోత్సాహాలు పల్లవించు; కొత్తపల్లవి ఆలపించు!

పురోగమించు నేడే! కలకబారే కలల దారులలో వెలుతురు చేనులు పన్నుకో! సాగుమా బాటసారీ!

ప్రతిసారీ చీకటి పడినప్పుడు, చీకాకులు మిడిసిపడినపుడు—నడకలాపి రవంత విశ్రమించు ... వేకువ వేవెలుగుల పొత్తిళ్ళలో పొడమే కొత్త సత్తువలు లగించుకొని నీవు ముందుకు సాగేందుకు నిర్భీతిని సంసిద్ధం చేసేది నేనే! మండే కన్నులపై చలువలు పూసేది నేనే!

ఏ ఎడారి దారులలోనో, ఏ దుర్గమ పర్వత శ్రేణిలోనో, ఏ కీకారణ్యాల గర్జారావాల నడుమనో, ఒక చల్లని చిరునవ్వుల సెలయేటి దాపునో—ఒక పట కుటీరాన్ని నిర్మించుకొన్నపుడు — నీకోసం నేనే ఒక నిప్పు పూవు నవుతాను. నీ కన్నులకు వెలుతురు రేకు లందిస్తాను. నిన్ను సేద తీరుస్తాను. నీ ఏకాంత తమస్సుల పోకారుస్తాను.

ప్రత్యూషకాంతుల ఉదారంగులు నీ గవాక్షాలను తాకినపుడు నీలో విరిసే నిర్భయ నూత్న తేజస్సును నేనే! అనవరతం గాలినై, వెలుగునై నిన్ననుసరించేది నేనే మిత్రమా!

నీకోసం చిని చిన్ని జాజిపూవునై సురభిళ గానాన్నొలికిస్తాను. వసంత విస్వమరనై ఎదురవుతాను. ఒక నీలి రెక్కల పిట్టనై నీ శ్రమాభిన్న శ్రవణాలకు ఆనంద తరంగాల నందిస్తాను.

వేకువలో నీ గుండెల వెలుగులా ఎర్రని గులాబి పూవునై విరిసి దర్శనమిచ్చేది నేనే!

చల్లని మంచు పన్నీటి బిందువునై రాలి, నీ మునివ్రేళ్ళకు హాయి చేకూర్చేది నేనే!

రా సోదరా! నా ఊహా విద్యుద్రేఖల నందుకో! ఉద్రేక జలపాతంలా సాగు!నేనే నీ నీడను; నీ కన్నులముందు పరచుకొనే వెలుగును! నీ కానందం చేకూర్చే అనిల వీచికను;...

రా తెరువరీ, అడుగుల జడిగా...ఆవేశ ధారగా...

ఉద్యమోత్సాహంగా...అమృత స్రోతస్వినిగా...

[1977 జనవరి నుంచి మే వరకు రచించిన 54 ప్రకరణాల కావ్యం 'కాలం వీలునామా'. అందు 12, 15, 18 ప్రకరణాలు నివేదితం. —సో. సు.]

అహంకారి ప్రార్థనలు

మూలం : శ్రీ నసీమ్ ఎజ్‌కెల్
("ది ఇగోయిస్ట్స్ ప్రేయర్స్")

అనువాదం శ్రీ కె. గోదావరి శర్మ

1

నాకు ఇంకా బాగా
దెబ్బలు తగలనీ, దేవుడా.
నీ ధర్మసూక్ష్మాలు
తెలుసుకోవడానికి
అంతకంటె మార్గం కనిపించడంలేదు

2

నాకుండే దుర్వ్యసనాలు
ఇప్పటికీ ఉన్నాయి.
నాకులేని సద్గుణాలు
ఇప్పటికీ లేవు.
ఇలాంటి మానవ జీవన సరళినుంచి
మనిషిని ఇంకెవరు రక్షిస్తారు,
అతడి సృష్టికర్త కాకపోతే ?
స్వామీ, నీ విధి నువ్వు నిర్వహించు.

3

ఒద్దు భగవాన్,
కర్మఫలం మీద
నాకు కోరిక లేదు.
కాని, కొంచెం కోరికితే
ఏమైనా అనుకుంటావా ?
రుచి చూస్తే ఎంతో బాగుంది,
నాకేమో ఆకలిగాఉంది.

4

నీ సంకల్పాలు నిర్వర్తించడానికి
నన్నుమాత్రం నియోగించకు, దేవుడా !
నిజానికి నేను సమర్థుడినే,
కాని నా సంకల్పాలు నాకున్నాయి.
ఎన్నుకోవడానికి
నిన్నంటితిరిగే భక్తులెందరో ఉన్నారుకద !
స్వార్థపరుణ్ణి, నన్నెందుకు ఎన్నుకుంటావు ?
సరే, నువ్వు బలవంతపెడితే
నీ ఇష్టప్రకారమే చేస్తాను.
కాని దాన్ని నా ఇష్టంతో జతపడేలా ప్రయత్నించు.

5

అధికాదాయ వర్గంలో
ఒంటెగా నన్ను పుట్టించు, దేవుడా,
సూది కన్నులోంచి
సునాయాసంగా దాటిపోతాను.

6

జ్ఞానం విలువ
బాగా ఎక్కువే.
కాని అజ్ఞానం మాత్రం చవగ్గా దొరుకుతుందా?
నన్ను కొంచెం బేరమాడనీ, ప్రభూ,
నేనేమంత ధనికుణ్ణి కాను.

7

నా పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకో ప్రభూ,
నాకు విదేశ వ్యామోహంలేదు.
నేనున్న చోటే
నా పాటని వెతుక్కోనీ.

డాక్టర్ బి. ఆర్. కె. రావు

బ్రిటిషు పాలనలో క్షామం, నిరుద్యోగం, పేదరికం

రామమోహన్‌రాయ్, నౌరోజి, రమేష్‌చంద్రదత్, గోవిందరనడే, గోపాలకృష్ణ గోఖలేల భారతీయ ఆధునిక ఆర్థిక ఆలోచన

[రచయిత శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ శాఖలో రీడర్‌గా ఉంటున్నారు]

భారతదేశంలో కౌటిల్యుని తర్వాత సమాజానికి సంబంధించిన ఆర్థిక, భౌతిక వికాస సంబంధమైన విషయాలను గురించిన ఆలోచన పరిమితమయ్యింది. ఆ కాలంలో ఆర్థిక పరిపాలన సంబంధమైన సూచనలు మాత్రమే వెలువడినవి. నేడవలంబిస్తున్న దృష్టితో చూస్తే పందొమ్మిదవ శతాబ్దంలోనే నిజమైన ఆర్థిక ఆలోచన ప్రవహించసాగింది. పాశ్చాత్య సంస్కృతి, దాని ఆర్థిక పరిస్థితులు ప్రభావితంచేయగా భారతీయ ఆర్థిక వ్యవస్థ సాంప్రదాయకతను విడనాడి విపణికొరకు నిర్వహించబడే రూపాన్ని సంతరించుకుంది. నెమ్మదిగా జరిగిన ఈ ప్రక్రియ భారతీయ చేతివృత్తుల్ని, పరిశ్రమల్ని నశింపజేసి నష్టం కల్గించింది.

ఆధునిక ఆర్థిక ఆలోచన విపణి నిర్వహణకు పూనుకున్న ఆర్థిక వ్యవస్థలనుండే ఉద్భవించినా, కొంతకాలం తర్వాత ఆ వ్యవస్థా చట్రాలకు పరిమితంకాలేదు. నేడీ ఆర్థిక ఆలోచన ఒక స్వతంత్ర విషయంగా రూపొంది తన వైశాల్యాన్ని నానాటికి విస్తృతం చేసుకుంటున్నది. అర్థశాస్త్రంలో భాగం కావడానికి ఆర్థిక వ్యవస్థకు విపణి సంబంధం కావలసిన ఆవశ్యకత నేడు లేదు. సమాజ సంబంధమైన ఆర్థిక లక్షణాలు సంతరించుకున్న ప్రాముఖ్యతలపైన నేడు అర్థశాస్త్రం ఆధారపడుతున్నది. అర్థం శాస్త్రం నేడు ఆర్థికవ్యవస్థ పనిచేసే తీరుతెన్నుల్ని, స్వభావాన్ని, దానివృద్ధికి తోడ్పడే పరిస్థితుల్ని, మార్గాల్ని అధ్యయనం చేస్తోంది. అర్థశాస్త్రంలో విపణి, విపణేతర ఆర్థిక వ్యవస్థలు అధ్యయనం చేయబడుతూ, సంక్షేమ ఆర్థిక విషయంగాను, ఆర్థికవృద్ధిగాను, ఆర్థిక ప్రణాళికారచన మొదలుగ గల అనేక విషయాలుగను పల్లవించి పురోగమిస్తున్నవి.

భారతదేశంమీద పాశ్చాత్య సంస్కృతి, ఆర్థిక వ్యవస్థల ప్రభావము, ఇందువల్ల ఏర్పడిన సంఘర్షణ, సహకారాలు భారతీయ ఆర్థిక ఆలోచన పునరుజ్జీవనానికి రూపురేఖలు దిద్దినవి. విదేశీ శక్తుల వత్తిళ్లవల్ల భారతీయ ఆర్థిక వ్యవస్థలో కొన్ని బీటలు ఏర్పడినవి. ఈ ఆర్థిక వ్యవస్థపై పనిచేస్తున్న భారతీయ, పాశ్చాత్య ప్రభావాలు పరస్పరం ప్రభావితం చేసుకోవడానికి పందెం వేసుకు పనిచేసినట్లు కన్పించింది. ఇవి రెండూ నెమ్మదిగా మాత్రమే ఐక్యతను పొందసాగినవి. అది కూడ పాక్షికంగానే జరిగింది. సామ్రాజ్యవాదశక్తు లవలంబించిన విదేశ వ్యాపార, ఆర్థిక విధానాలవల్ల భారతదేశంలో సాంప్రదాయసిద్ధంగా వస్తున్న కళలపైన, చేతిపనులమీథ, లఘుపరిశ్రమలపైన భారంగల వత్తిడి ఏర్పడింది. అందువల్ల పురాతన వ్యవస్థలోని స్వయంసంపూర్ణత గల గ్రామాలు, చిన్న ప్రాంతాలు బాగా దెబ్బతిన్నవి. భూస్వామ్య సంబంధాలలో నూతనమైన మార్పులు ఏర్పడినవి. విదేశ వ్యాపారం విస్తరించగా వ్యవసాయరంగంలో కొంతవరకు వ్యాపార ప్రక్రియ ప్రారంభమయ్యింది. టీ, కాఫీ తోటలు, ఖనిజ పరిశ్రమలు పెరిగినవి. కొత్త విద్యావిధానం ప్రారంభమై నూతన విద్యావంతులవర్గం ఏర్పడింది. ఈ వర్గం నూతన పరిపాలనా, యాజమాన్య నిర్వహణలకు తోడ్పడింది.

ఈ పరిస్థితుల్లో ఉదార విద్యాభ్యాసము, సామ్యవాద, ప్రయోజన (Utility) వాద సంబంధమైన ఆలోచనలు ఏర్పడినవి. ఇదే సమయంలో సంస్థాగతంగాను, ఆర్థిక ఆలోచనలోను, స్వదేశ విదేశాల మధ్యనున్న విభేదాలు విదేశమూలంనుండి ఉద్భవించిన అర్థశాస్త్రాన్ని భారతదేశ పరిస్థితులకు అనువర్తించడాన్ని నిరసించ ప్రారంభించినవి.

అప్పుడే విదేశాల్లో సహితము విపణి ఆర్థిక సూత్రాలను నిరసించడం జరిగింది. వాటి విశ్వామవర్తితత విమర్శించబడింది. దానికి ప్రతి ఫలంగా చారిత్రక, జాతీయ, సామ్యవాద ఆర్థిక ఆలోచనా ధోరణులు విజృంభించినవి నైతిక, అనువర్తిత లక్షణాలులేని అర్థశాస్త్రం నిరుపయోగమనే ఉద్దేశ్యం భారతదేశంలో బాహాటంగా ప్రచారం లోకి వచ్చింది. భారతదేశ దారిద్ర్యానికి, వ్యవసాయంలో వెనుకబడిన తనానికి, పారిశ్రామిక రాహిత్యతకు సంబంధించిన సమస్యల్ని ఏ ఆధునిక ప్రభుత్వంకూడా నిర్లక్ష్యం చెయ్యరాదని ఘంటాపథంగా చెప్పబడింది. బ్రిటిషు, భారతీయ ఆర్థిక వ్యవస్థల అభివృద్ధి ఒకే స్థాయిలో లేనందువల్ల భారతదేశం యదార్థ వనరులు ఇంగ్లండుకు పోనారంభించినవి. ఈ సంబంధంగా చెప్పినవిషయాన్ని ''డ్రెయిన్ థీరీ'' అని అంటున్నారు ఈ పరిస్థితుల్ని చక్కదిద్దటానికి సరైన చర్యలు తీసుకోవలసి ఉన్నప్పటికి భారతదేశాన్ని పాలిస్తున్న బ్రిటిషు ప్రభుత్వం ఆ పనికి పూనుకోలేదు. అందువల్ల భారతీయ ఆలోచన స్వేచ్ఛావ్యాపార ఆర్థిక విధానాన్ని (లెయ్‌సెజ్ ఫెయిర్) కాకుండా సమాజానికి చెందిన ఆర్థిక పరిస్థితుల్ని చక్కదిద్దడానికి సమర్థవంతంగా జోక్యం కలుగజేసుకునే ప్రభుత్వ విధానాన్ని కోరింది.

ఆర్థిక పురోగమనం అవసరము, వాంఛనీయమనే గాక, ఆర్థికవృద్ధిలో వేగిత్వరణ తేవచ్చునని, ఇందుకుగాను రాజ్య చర్య సమర్థవంతమైన పాత్రను నిర్వహించవచ్చునని భారతీయ ఆర్థిక ఆలోచకులు విశ్వసించారు. ఇందువల్ల డ్రెయిన్ సిద్ధాంతంలోను, పేదరికానికి వెనుకనున్న కారణాలలోను, అల్పాభివృద్ధిలోను ఎక్కువ శ్రద్ధ కన్పర్చడంవల్ల ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి సాధనకు తీసు కోవలసిన చర్యలఎడ దృష్టిని సారించారు. అందువల్ల భారతీయ ఆర్థిక సమస్యలను విడివిడిగా ఒకోదానినిగురించి ఆలోచించటాని కంటె, అన్నింటిని మొత్తంగా ఒకే సమస్యగా పరిగణించారు. తత్కారణంగా అందుకు సంబంధించిన ఆర్థిక ఆలోచనకు అనుభవిక (ఎంపెరికల్) దృష్టి, జాతీయ దృక్పథము ఏర్పడినవి. ఇరవయ్యవ శతాబ్దంలో మాత్రమే భారతీయ ఆర్థిక ఆలోచన అమూర్త సామాన్యీకరణ (Abstract Generalisation)ను పొందింది. కాలం జరిగినకొద్దీ ఈ ధోరణి బలపడింది. ఇప్పుడు భారతీయ ఆర్థిక శాస్త్రవేత్తలు విదేశీ అర్థశాస్త్రజ్ఞులవలె అమూర్తమైన వాదనను చేస్తున్నారు; ఆర్థిక నమూనాలను కూడ రచిస్తున్నారు.

ద శ లు

ఇండియన్ ఎకనామిక్ ఎసోసియేషన్ మాజీ అధ్యక్షులు డాక్టర్ భబతోష్‌దత్త వ్రాసిన ''ది ఎవల్యూషన్ ఆఫ్ ఎకనామిక్ థింకింగ్ ఇన్ ఇండియా''కు అనుసారంగా భారతీయ ఆర్థిక ఆలో చనా ప్రవాహాన్ని మూడుదశలుగా విభజించవచ్చు.

(1) మొదటిదశ: రాజా రామమోహనరాయ్ ఆలోచనతో పాటు దాదాభాయ్ నౌరోజి (1825-1913), రమేష్‌చంద్రదత్ (1848-1909), జస్టిస్ మహదేవ్ గోవిందరనడే (1842-1901) గోపాలకృష్ణగోఖలే (1866-1915)ల ఆలోచనలను జతపర్చవచ్చు. 19వ శతాబ్దం చివరి భాగంలోను, ఇరవయ్యవ శతాబ్దం మొదటిభాగంలోను వీరు వ్రాసారు. భారతీయ పేదరికాన్ని, పేదరికాన్ని పెంచడానికి బ్రిటిషువారు తోడ్పడుతున్న తీరును తెలియజేసే యదార్థాలమీద దృష్టిని సారించి ఈ అవాంఛనీయ స్థితిగతుల్ని తొలగించేందుకు భారతదేశాన్ని పాలిస్తున్న బ్రిటిషు పాలకులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ముఖ్యంగా భార తీయ వనరుల్ని ఇంగ్లండుకు పంపడాన్ని-(డ్రెయిన్ చేయడాన్ని – ఖండించారు. (2) రెండవదశ: ఆర్థిక కార్యాల్లో అనుభవం గలవారు, అర్థశాస్త్రబోధన, ఆలోచన భారతీయ విశ్వవిద్యాలయా లకు ప్రాకి విస్తరించినందువల్ల ఏర్పడిన ఆర్థిక ఆలోచన ఇటువంటి వారిని జాతీయవాదులని భబతోష్‌దత్త అన్నారు. ఆచరణలో ఎదురౌతున్న ఆర్థిక సమస్యల్ని గూర్చి ఆలోచిస్తూ అనేక ముఖ్య ఆర్థిక విషయాలమీద తమ అభిప్రాయాలను వ్యక్తం చేసారు. ఇంగ్లండు ఆది దేశాల లాభం దృష్టితోగాక భారతీయ ప్రయోజ నాల దృష్టితో సమస్యలకు సమాధానాల నేర్పర్చారు. వీరి ఆర్థిక నిర్ణయాలు, వాదనలు రాజకీయ వాదనకు తోడ్పడుతూ వచ్చినవి. స్వదేశీ అవలంబనోద్యమము, సామ్రాజ్యానికి ప్రాధాన్యత నివ్వడంపై జరిగిన చర్చలు, ఆర్థిక రక్షణ విధానాలు, విదేశీ మారకపు రేటు మొదలైన విషయాలీ కాలంలో చాలా ఉద్రేకాన్ని కల్గించినవి. (3) మూడవదశ: ఈ దశలో అమూర్త సిద్ధాంత చర్చలు, తత్సంబంధమైన విషయ ప్రతిపాదనలు జరిగినవి.

రాజారామమోహనరాయ్

ఆర్థిక సమస్యలపై రాజారామమోహన్‌రాయ్ వెలువరించిన భావాలు ముఖ్యమైనవి. ''పర్మనెంట్ సెటిల్‌మెంట్''కు సంబం ధించిన సమస్యలమీద ఆయన వెలువరించిన భావాలు ప్రాముఖ్యత లోకి వచ్చినవి. ఈస్ట్ ఇండియా కంపెనీ చార్టరుకు తిరిగి ఆమోద ముద్ర వేయవలసిందిగా బ్రిటిష్ కామన్స్ సభ సెలక్టు కమిటీ కోర బడింది. ఈ కమిటి ఎదుట రాజారామమోహనరాయ్ వెలువరించిన అభిప్రాయాల్లో ఆయన ఆర్థిక ఆలోచనలోని చాలభాగం విదిత మౌతోంది. ఆర్థిక సమస్యల్లోని సమిష్టితీరు, అంతఃసంబంధము అతని దృష్టిపథంలో కన్పించడమేగాక, భారతీయ ఆర్థిక వ్యవస్థ చట్టం రూపురేఖలు మారుతున్నట్లతడు భావించాడు. విత్తానికి సంబంధించిన (రాజకోశమునకు సంబంధించిన) మితవ్యయ సమస్య లతోబాటు అనేక ఇతర విత్త సంబంధ విషయాలపై ఆయన తన అభిప్రాయాలను వెలువరించారు.

పర్మనెంట్ సెటిల్‌మెంట్ అమలులో ఉన్నప్పుడు భూముల విలువలు పెరిగినవి. అయితే ప్రభుత్వం వసూలు చేసిన రెవెన్యూ మారలేదు. కాని కట్టుబడిదార్లనుండి భూస్వాములుమాత్రం ఇది వరకటికంటె హెచ్చుగా వసూలు చేసారు. భూస్వాములు వసూలు చేసే రెవెన్యూను తగ్గించి పూర్వస్థితి స్థాయిలోనే ఉంచాలని రామ

మోహన్‌రాయ్ వాదించాడు. అలాగే భూస్వాములనుండి వసూలుచేసే రెవెన్యూను కూడా తగ్గించాలని రాయ్ వాదించాడు. ఈ తగ్గింపువల్ల వచ్చే లోటును పూర్తిచేయడాని కతడు ప్రత్యామ్నాయ మూలాలను చూపిస్తూ, ప్రభుత్వ ఖర్చులనుకూడా తగ్గించాలన్నాడు. విలాస వస్తువులమీద పన్నుల్ని పెంచి రెవెన్యూ లోటును తగ్గించాలన్నాడు. దైనందిన కావసర వస్తువులపై వేసే పన్నులు బీదలకు భారం కాబట్టి వాటిని వెయ్యకూడదన్నాడు. ప్రభుత్వ పరిపాలనలోని సివిల్ సర్వీసులోను, న్యాయశాఖలోను బ్రిటిషువారికి బదులు భారతీయుల్ని నియమించి ప్రభుత్వ ఖర్చుల్ని తగ్గించాలన్నాడు. ఈ శాఖల్లో బ్రిటిషువారు నియుక్తులు కావడంవల్ల మనం ఇచ్చే జీతాలద్వారా మన ఖజానాను వారు 'డ్రెయిన్' (ఖాళీ) చేస్తున్నారని ఆయన వాదించాడు. ఈ ఉదారవాదం భారతదేశంలో తాత్విక, చారిత్రక రంగాలకు పరిమితం కాగా, పందొమ్మిదవ శతాబ్దం చివరలోనే, ఆర్థిక సమస్యల పరిష్కారానికి అవసరం కాగా, ఉదార భారతీయ ఆర్థిక ఆలోచన ఆ కాలంలో ప్రాముఖ్యతలోకి వచ్చింది.

దాదాభాయ్ నౌరోజి

దాదాభాయ్ నౌరోజీ భారతీయ అర్థశాస్త్రానికి తండ్రి అని చెప్పవచ్చు. భారతీయ ఆర్థిక సమస్యల్ని ఆచరణ దృష్టితో అధ్యయనం చేయడాని కతడు పునాదులువేసి అందుకవసరమైన సాంఖ్యక సాధనలు (statistical tools = గణాంక సాధనలు) ఏర్పర్చాడు. ఆయనకు చాలా విషయాల్లో అభిరుచి ఉండేది. అతడు తాత్వికుడే కాక, వ్యాపారి కూడ. పార్లమెంటు సభ్యుడేగాక భారతదేశ రాజకీయ భవిష్యత్తులో అత్యంత శ్రద్ధాసక్తులు కలిగి "హోంరూల్" ఉద్యమాన్ని గట్టిగా బలపర్చిన నాయకుడు కూడ. రెండుసార్లు భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. సమస్యల ఎడ శాస్త్రీయ దృక్పథంగల్గి విషయనిష్ఠ సమన్వితమైన విశ్లేషణ (Objective Analysis) చేసేవాడు. మౌలిక ఆలోచకుడుగా ఎంచబడ్డాడు. ఆయన సేకరించిన దత్తాంశాలు (Data) ఏర్పర్చిన సాధనాలు (Tools) లేకపోతే ఆనాటి ఆర్థిక సమస్యలకు సమాధానాలు చెప్పబూనడం అసంభవ ప్రయత్నంగా మిగిలేది. అవసరమైన దత్తాంశాలను సేకరించి, పనికివచ్చే సాధనాల నేర్పర్చడాని కతడు చేసిన ప్రయత్నం భారత అర్థశాస్త్ర వృద్ధికి తోడ్పడింది. దేశభక్తి అతన్ని ఆర్థిక విషయ పరిశీలనలోకి నడిపించింది. తన నిర్ణయాలనాతడు దేశ శ్రేయస్సుకు ఉపయోగించడానికి కృషిచేసాడు. భారతీయులకు నష్టం కలగజేసి తద్వారా బ్రిటన్ తన లాభాన్ని పెంచుకోవడం నైతికంగా సరైనమార్గం కాదని నౌరోజీ వక్కాణించాడు. భారతదేశపు పేదరికంమీద, భారతదేశంలో బ్రిటిషువారు నెరపిన పరిపాలన ఫలితాలమీద, ఆయన చాలా రచనలు చేసాడు.

క్షామములు

1870లో నౌరోజీ ఈస్ట్ ఇండియా ఎసోసియేషన్ బొంబాయి శాఖ ఏర్పర్చిన సదస్సులో "భారతదేశం కోర్కెలు – సాధనాలు" అనే విషయంమీద పరిశోధనాపత్రం సమర్పించాడు. భారతదేశానికి సంబంధించిన విషయాలను గురించి చర్చించడానికి డబ్ల్యు. సి. బెనర్జీతో కలిసి "ది లండన్ ఇండియా సొసైటీ"ని స్థాపించి బ్రిటిషువారిని, భారతీయుల్ని ఒకే వేదికమీదికి తెచ్చి భారతీయ సమస్యల్ని చర్చించేటట్లు చేసాడు. ఇంతలోనే భారతదేశాన్ని అనేకసార్లు బాధించిన "క్షామము"లు అందరిదృష్టికి వచ్చినవి. క్షామాలు ఉత్పత్తి కొరతవల్లగాక, పంపిణీ లోపంవల్ల వచ్చినాయనే దృష్టితో ఆహార పదార్థాల సరఫరా కుపయోగించేందుకు, రైల్వేలను నిర్మించడానికి, బ్రిటిషువారు పూనుకున్నారు. 1868 డిసెంబర్ మూడవ తేదీన భారతదేశ క్షామాలపై వ్రాసిన పరిశోధనా పత్రంద్వారా క్షామముల చరిత్ర నంతటిని విశదీకరించాడు. భారతదేశపు పేదరికము, క్షామాలు ఏర్పర్చిన ముఖ్యసమస్య అతనిని భారతదేశపు ఉత్పాదక వనరుల్ని, జాతీయాదాయాన్ని గురించి పరిశోధించేటట్లు చేసింది. ఇందుకవసరమైన సమాచారం దొరకడం కష్టంగా ఉన్నా, రాబర్ట్ నైట్ సంపాదకత్వాన నడుస్తున్న "ది ఇండియన్ ఎకానమిస్టు" అనే పత్రికనుండి సేకరించాడు. అయితే ఈ సమాచారం కూడ అతనికి పరిశోధనలో ప్రత్యక్షంగా ఉపయోగించడానికి వీలుగాలేదు. భారతదేశానికి సంబంధించిన జాతీయ, తలసరి ఆదాయాల అంచనాలు ధారావాహికంగా అందుబాటు కావాలని కోరేవాడు. తదనుసారంగా ఈ అంచనాల తయారీలో నిమగ్నుడైనాడు.

జాతీయాదాయం

1870 జులై 27వ తేదీన ఈస్ట్ ఇండియా ఎసోసియేషన్ సమావేశంలో సమర్పించిన "భారతదేశం కోర్కెలు–సాధన మార్గాలు" అనే పత్రంలో అప్రత్యక్షణ గణన (Calculation) మార్గాన్నవలంబించాడు. భూమిపన్ను వెరశిని 21 మిలియన్ల పౌండ్లుగా చూపాడు. వ్యవసాయోత్పత్తి విలువలో ఇది ఎనిమిదవ వంతు ఉన్నదని ప్రమేయం పెట్టుకుని మొత్తం వ్యవసాయోత్పత్తి విలువ 168 మిలియన్ పౌండ్లుగా ఉంటుందని అంచనా చేసాడు. "వస్తు తయారీ పరిశ్రమలు, స్పిరిట్స్‌మీద ఎక్సయిజు సుంకము, ఇతర కమిషన్లు" కలిపి 100 మిలియన్ పౌండ్ల విలువ నిస్తాయని చెప్పాడు. ఉప్పు, నల్లమందు, అడవులు మొదలైనవి 32 మిలియన్ల పౌండ్ల విలువ నిస్తాయని చెప్పాడు. ఇందువల్ల 300 మిలియన్ పౌండ్ల జాతీయాదాయం ఏర్పడగా 40 షిల్లింగులు (ఆనాటి 20 రూపాయలు) తలసరి ఆదాయం వస్తుందని అంచనా వేసాడు.

1876లో "భారతదేశంలో పేదరికం" అనే విషయంమీద మరో రెండు పరిశోధనా పత్రాలు వ్రాసాడు. ఇందులో భారత ప్రజల పాతాళపు లోతు పేదరికాన్ని సూచించే అదనపు సత్యాలను కొన్నిటిని తెలియజేసాడు. ప్రతి రాష్ట్రంలోను ఉన్న భూమి వైశాల్యాన్ని ఎకరాలలో చెప్పే సంఖ్యలను, ఉత్పత్తి, వ్యవసాయోత్పత్తి ధరలకు సంబంధించిన సంఖ్యలను ఉపయోగించాడు. ఇతర మూలాలకు కొంత చోటిస్తూ మొత్తం జాతీయాదాయం 340 మిలియన్ల పౌండ్లని అంచనా వేసాడు. వివిధ రాష్ట్రాల తలసరి ఆదాయాలు

ఒకటిగా లేనట్లు కూడా చూపాడు. బొంబాయి రాష్ట్ర తలసరి ఆదాయం అత్యున్నతమై 79 షిల్లింగులు కాగా, నార్త్-వెస్టరన్ రాష్ట్రం, జౌథ్ల తలసరి ఆదాయం అతి తక్కువై 35 షిల్లింగులుగా ఉన్నది. రైల్వేలు, ఇండ్లు, ప్రభుత్వ పెట్టుబడులనుండి వచ్చే ఆదాయాలను విస్మరించినందుకు, జీతాలు, వేతనాలు, పెన్షన్లు, వృత్తి ఆదాయాలు, పెట్టుబడి, వ్యాపారాల ఆదాయాలు మొదలైన వాటిని విస్మరించి, జాతీయాదాయాన్ని అంచనా వేయడంలో భౌతిక జాతీయ ఉత్పత్తికి ప్రాముఖ్యతనిచ్చినందుకు నౌరోజీపై విమర్శ వచ్చింది. ఉపయోగితల (సేవలు) ఉత్పత్తిపై తనకు అభిరుచిలేదని, భౌతిక ఉత్పత్తులకు, ఉత్పాదకతగల వనరులకు తాను ప్రాధాన్యత నిస్తానని నౌరోజి చెప్పారు. జాతీయ భౌతికోత్పత్తిని మాత్రమే జాతీయాదాయంగా చూపే కలవరంలో పడినప్పటికి, నౌరోజీ పెట్టుకున్న వెరశి జాతీయోత్పత్తి భావన ప్రశంసార్హమైనదని, నౌరోజీ సాధనల్లో లోపమున్నా ఆర్థిక విషయాలకు సంబంధించిన వాదనల్లో ఏ సాధనాల నుపయోగించాలో అతనికి తెలుసునని డాక్టర్ బభుతోష్ దత్త వ్రాసారు. ''భారతదేశంలో పేదరికం''అనే పరిశోధనా పత్రంలో ఉదరపోషణ స్థాయి (level of substistence) వద్ద ద్రవ్యరూపంలో జరిగే జీవన వ్యయాన్ని ప్రజలసగటు ద్రవ్య ఆదాయాన్ని పోల్చిచూపాడు. ఉదర పోషణ ఖర్చు లేక కనిష్ట జీవన వ్యయాన్ని శుభ్రంగా సామాన్య ఆరోగ్యంతో బ్రతకడానికి కావలసిన మామూలు అవసరాలను కొనడానికి చేసే ఖర్చుతో పోల్చాడు. ఈ జీవన వ్యయాన్ని అంచనావేసి చూపడానికి, ప్రవాసులైన కూలీలు ప్రయాణంలో చేసే వినియోగంమీద చేసే ఖర్చులకు, బొంబాయి ప్రెసిడెన్సీలో వ్యవసాయ కూలీలు చేసే వినియోగ ఖర్చులకు, పూనాలోని అందరికంటె తక్కువ గ్రేడు ప్రభుత్వోద్యోగులు వినియోగంమీద చేసే ఖర్చులకు, వివిధ రాష్ట్రాల్లోని ఖైదీలు చేసే తలసరి వినియోగ ఖర్చులకు సంబంధించిన దత్తాంశాలను నౌరోజి ఉపయోగించారు. దీనిని భారతీయ ఆర్థిక సాహిత్యంలో లభ్యమయ్యే జీవన వ్యయ విశ్లేషణగ డాక్టర్ దత్త వర్ణించారు. సగటు భారతీయుడు అతి బీదవాడని, నౌరోజి, అభిప్రాయాన్ని వ్యక్తంచేసాడు. బాగా పండిన రుతువులో కూడా కనీస ఉదర పోషణ కవసరమైన దానిని అందించడానికి ఉత్పత్తి చాలదని నౌరోజి అన్నారు. అసమానత్వాలవల్ల, పండని రుతువుల్లో సరఫరా చేయడానికి నిల్వచేసుకోకపోవడంవల్ల ఈ దుస్థితి మరింత తీవ్రతరమౌతుంది.

ప్రభుత్వ కోశము : విత్త వ్యవహార పాలన

ప్రభుత్వ విత్త వ్యవహార పాలనాధికారాలు ప్రజల చేతుల్లో ఏమాత్రం కూడా లేవు. బ్రిటిషుపాలన పై నుండి తన నిర్ణయాలను ప్రజలపై రుద్దుతూ ఉండేది. 1881 చట్టంలోని 19వ సెక్షన్ ప్రకారం కౌన్సిల్ సభ్యుడెవరు ప్రభుత్వ రుణము, ప్రభుత్వ ఖర్చు, ప్రత్యేక పద్దులను గురించి బిల్లును ప్రవేశపెట్టడానికి వీలు లేదు. 1892 చట్టం 52వ సెక్షన్ ప్రకారం కౌన్సిల్ సభ్యులు ప్రభుత్వ విత్తానికి సంబంధించిన సమస్యలమీద చర్చించడం మినహాయించి మరేమీ చెయ్యరాదని అధికార పరిమితి ఏర్పర్చబడింది. ఈ విత్త సంబంధ విషయాలమీద కౌన్సిలు సభ్యులు తీర్మానాన్ని ప్రవేశపెట్టరాదని కౌన్సిల్లో ఓటింగ్ను కోరరాదని నిర్బంధం ఏర్పర్చబడింది. అంతేగాక ఈ 1892చట్టంలోని 22వ సెక్షన్ప్రకారం సెక్రటరీ ఆఫ్ స్టేట్ భారతదేశం కొరకు ఇంగ్లండులో రుణాన్ని సేకరించి భారతదేశంలో పన్ను చెల్లించేవాని నెత్తిమీద ఆ రుణాన్ని తిరిగి చెల్లించే భారాన్ని మోపవచ్చు. ఈ విత్త సంబంధమైన విషయాలమీదనేగాక, ఏ యితర విషయం మీదనయినా భారతదేశంలో చేసిన శాసనాలను, ఇంగ్లండు, చెల్లవని కొట్టివేయవచ్చు. ఇందువల్ల ప్రభుత్వ ఖర్చులు హద్దులు లేకుండా జరగడానికి, సబబు లేకుండా రుణభారాన్ని భారతీయులమీద ఉంచడానికి, భారతజాతీయ ప్రయోజనాల-కనుగుణ్యం కాని విత్త విషయాల పరిపాలన సాగడానికి అవకాశం ఏర్పడింది.

భారతదేశం సివిల్, మిలటరీ ఖర్చులు కూడా పెరిగినవి. మొత్తం ప్రభుత్వ ఖర్చులో మిలటరీ ఖర్చు మూడవ వంతు ఉన్నది. యూరోపు రాజరికాలు చేస్తున్న మిలటరీ ఖర్చుల్నిది మించింది. భారతదేశంపై యుద్ధ నిర్వహణ ఖర్చుల భారం విపరీతంగా మోపబడింది. 1857 ''తిరుగుబాటును'' అణచడానికి, ఆఫ్ఘన్ యుద్ధాన్ని నిర్వహించడానికి, నార్త్వెస్ట్ ఫ్రాంటియర్ యుద్ధాలను నిర్వహించడానికి, నౌకాదళాలను నిర్మించడానికి పెట్టిన ఖర్చు భారమంతా భారతదేశంమీద పెట్టబడింది. ఈఖర్చులకు సంబంధించిన నిర్ణయాలు చెయ్యడంలో భారతదేశానికి భాగం లేనందువల్ల, ఈ ఖర్చులవల్ల ఇంగ్లండు ప్రయోజనాలు నెరవేరుతుండడంవల్ల భారతదేశంపై పెట్టబడిన ఈ భారం అవినీతికరమని భారతీయులన్నారు. అందువల్ల భారతదేశం, ఇంగ్లండుల రెంటి ప్రయోజనలకు చేయబడిన సంయుక్త సివిల్, మిలటరీ ఖర్చులను ఈ రెండు దేశాల మధ్య తగినట్లు పంపడానికి 1895 మే 24వ తేదీన లార్డ్ వెల్బీ అధ్యక్షతన కమిటీ నియుక్తిచేయబడింది. ఈ కమిషన్లో నౌరోజీ సభ్యుడుగ నియమించబడ్డాడు. ఈరెండు దేశాలు తమ తమ ఆర్థిక శక్తి ననుసరించి ఖర్చుల భారం మోయవలసి ఉంటుందని నౌరోజి ఉద్ఘాటించారు.

బీదదైన భారతదేశంలో బ్రిటన్ నుండి వచ్చిన సివిల్సర్వీసు వారికి చెల్లించే జీతాలు ఆర్థికంగా సమంజసం కావని నౌరోజి చెప్పారు. యూరోపు నుండి వచ్చి ఇండియా సివిల్ సర్వీసులో పని చేస్తున్న ఉద్యోగులు పెద్ద జీతాలు తీసుకుని ఆ పెద్ద మొత్తాలను తమ దేశాలకు పంపడంవల్ల భారతదేశం ద్రవ్యమంతా ఖాళీ అయిపోతోంది. ఇందువల్ల భారతీయుల ఉద్యోగావకాశాలు బాగా తగ్గిపోతున్నవి కనుక సివిల్ సర్వీసులను భారతీయులకే యిచ్చి జరుగుతున్న అధిక ఖర్చుల్ని తగ్గించాలి. విత్త వ్యవహార పాలన లోపంవల్ల ప్రభుత్వ రాబడి పెరుగుతోందిగాని, అంతకంటె ప్రభుత్వ ఖర్చులు, అంతకుమించి ప్రభుత్వం అప్పు వేగంగా పెరుగుతున్నవి. ప్రభుత్వ

విత్త వ్యవహారాలు చూస్తే పన్నులు వసూలుచేసే విధానంగా గాక రక్తాన్ని కార్చే విధానంగా ఉన్నదని నౌరోజి అన్నారు. ఈ విధంగా భారతదేశ ద్రవ్యం ఇంగ్లండుకు ప్రవహించి నష్టం జరగడాన్ని ''డ్రెయిన్ థీరీ'' అని అంటున్నారు.

డ్రెయిన్ సిద్ధాంతము

భారతదేశానికి ఇంగ్లండుకు మధ్య భారతీయుల అభిమతానికనుసారంగా కాకుండా నెలకొల్పబడిన విత్త వ్యవహార సంబంధాలు భారతదేశ యదార్థ వనరుల్ని ఇంగ్లండుకు ప్రవహించిపోయేటట్లు చేసి భారతదేశాన్ని శాశ్వతంగా పేదరికానికి గురిచేస్తున్నవి. దేశభక్తుడైన పౌరుడుగా భారతదేశంలో పేదరికాన్ని ఏర్పర్చిన కారణాలను అధ్యయనంచేసి, చెప్పిన నిర్ణయాల సారాంశమే డ్రెయిన్ థీరీ అని, నౌరోజి అర్థికాభిప్రాయాలను, అతని కాలంలో ఏర్పడిన ప్రముఖ సమస్యలపై అతని అంచనాలను, ఉన్నత స్థాయిలో ఆర్థిక విషయాలను అధ్యయనం చేసేవారికి నచ్చేటట్లుగా 'డ్రెయిన్ థీరీ' చట్రంలో ఇమడ్చవచ్చని ప్రొఫెసర్ బి.యస్. గంగూలీ ''దాదాభాయ్ నౌరోజి అండ్ ది డ్రెయిన్ థీరీ, దాదాభాయ్ మెమోరియల్ లెక్చర్స్'' అనే గ్రంథంలో వ్రాసారు. భారత వనరులు ఖాళీ చేయబడడంద్వారా భారత ఆర్థికాభివృద్ధి బలంగా నిరోధించబడుతోంది. ఇందువల్ల భారతదేశం అప్పులపాలయ్యింది. విత్త, సివిల్, మిలటరీ శాఖ లేర్పర్చిన వ్యవస్థ భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఖాళీ చేయడానికి రెండు స్థాయిలలో పని చేసింది : (1) విదేశ వ్యాపారము (2) భారతదేశ ఆర్థిక వ్యవస్థ దేశంలో పనిచేసే తీరు.

డ్రెయిన్ యంత్రాంగము పనిచేయడానికి, బలపడటానికి అనేక కారణాలు తోడ్పడినవి. భారతదేశం ఇంగ్లండుకు వలస దేశంగా ఉండటంమొదటి కారణము. ఇంగ్లండు చాలా దూరానఉండి భారత దేశాన్ని పరిపాలిస్తున్నది. భారతదేశ ఆర్థిక, సాంఘిక, రాజకీయ సంస్థలు ఇంగ్లండులో ఆ రంగాల్లోఉన్న సంస్థల వంటివి కానేకావని బ్రిటిషు పాలకులు గుర్తించలేకపోయారు. ఇంగ్లండుకు సరిపోయే నిర్ణయాలు భారతదేశానికి తగవని వారనుకోలేదు. భారతదేశంలో బ్రిటిషు వారు నెలకొల్పిన సివిల్, మిలటరీ వ్యవస్థలు భారతదేశానికి ఆర్థికంగా అత్యంత భారతరము, బాధాకరము అయినవి. ఈ వ్యవస్థలో పనిచేసిన బ్రిటిష్, యూరోపియన్ ఉద్యోగులు చాలా పెద్ద జీతాలు తీసుకుని తమ దేశాలకు పంపేవారు. బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణకు జరిగిన యుద్ధ ప్రయత్నాలు ఇండియాచే బయట, లోపల చాలా వ్యయాన్ని చేయించినవి. బ్రిటిషువారి చేతుల్లో ఉన్న రైల్వేల కిచ్చిన సబ్సిడీలు మరింత ఆర్థిక వ్యయా న్నేర్పర్చినవి. రైల్వేలలో చాలా పెద్ద జీతాలు తీసుకునే భారతీయేతర ఉద్యోగులు అనేకమంది ఉన్నారు. రైల్వేలను లాభదాయకంగాని మార్గాలవెంట సైనిక కార్యనిర్వహణకు నడిపారు. ఇందువల్ల పన్నుల భారాన్ని హెచ్చించవలసి వచ్చింది. ఇది దేశం లోపల జరిగే ''డ్రెయినేజి'' (ఖాళీ అగుట) పన్నుల భారంవల్ల, రైతుల చేతుల్లో ద్రవ్యం నిలువ గావడానికి వీలుకాక ఆర్థికాభివృద్ధికి పెట్టుబడి జరగలేదు. భూమిపై పెట్టుబడి చేయడానికి రైతులకు ఆర్థిక స్తోమతు లేనందువల్ల భూసారం తరిగిపోయింది. దేశ ప్రజల చేతుల్లో కొనుగోలు శక్తి తగ్గి వస్తువులకు డిమాండు పడిపోయింది. ఇందువల్ల ఏర్పడిన అనేక భారాల్లో వ్యవసాయ రంగంమీద జనాభా వత్తిడి ఏర్పడటం ఒక అనర్థమని చెప్పాలి. పన్నుల విధింపు భారంగాఉన్నదే గాని పెరిగిన ప్రభుత్వ ఖర్చుల్ని నిర్వహించగల రాబడిని యివ్వలేదు. దీనివల్ల ప్రభుత్వం విదేశాల నుండి హెచ్చుగా అప్పు చేయవలసి వచ్చింది. ''హోమ్ చార్జెస్'' విధింపు ఈ భారానికితోడై ప్రజల బాధలు పెరిగినవి. ఇందువల్ల విధించిన పన్నులవల్ల వచ్చే రాబడి చాలక, అదనంగా పన్నులు వేయవలసి వచ్చింది. తత్కారణంగా శాశ్వతంగా ఉండే పేదరికపు విషవలయం ఏర్పడి, అందులో ఒక వైపున పన్నుల ద్వారా వచ్చే రాబడికి డిమాండ్ పెరగడము, మరొక వైపు పన్నులు చెల్లించే శక్తి ధారావాహికంగా తరిగిపోతూ ఉండటము కన్పించింది.

ప్రభుత్వకోశం నుండి ఆర్థిక వ్యవస్థలోకి వనరులు తిరిగి వచ్చినట్లయితే భారతదేశంలో పన్నులు చెల్లించే శక్తి తరిగిపోతూ ఉండేది కాదు. వనరులు ఖాళీ అయ్యి బయటికి పోవడము **(External Drain)** జరుగుతున్నందువల్ల ఆర్థిక వ్యవస్థలోకవి తిరిగిరావడానికి వీలుకాలేదు. భారతదేశంలో ప్రోగుచేసిన వనరులు చాలా మార్గాలద్వారా బయటికి పోతూ ఉండేవి. విదేశాల నుండి తీసుకున్న అప్పులను తీర్చడానికి ప్రభుత్వం కొన్ని వనరుల్ని ఉపయోగించేది. బ్రిటిషు, యూరోపియన్ ఉద్యోగులు తీసుకున్న జీతాలు వారి దేశాలకు పంపబడుతూ ఉండేవి. ఇంగ్లండులోని ఇండియా ఆఫీసు ఖర్చుకు మనం డబ్బు చెల్లిస్తూ ఉండేవాళ్లము. బ్రిటిషువారి చేతుల్లో ఉన్న ఇండియాలోని రైల్వేలు, తోటలు సంపాదించిన విదేశీమారక ద్రవ్యము భారతదేశంలో జమ చేయబడకుండా ఇంగ్లండుకు పంపబడుతూ ఉండెడిది. బ్రిటిషువారి చేతుల్లోఉన్న భారత ప్రభుత్వము, మన దేశంలో ఉన్న విదేశీయులు ఇంగ్లండు నుండి, విదేశాల నుండి వారికి కావలసిన 'స్టోర్సు' వస్తువులనుకొని వాటికి మూల్యంగా మన డబ్బును ఆ దేశాలకు చెల్లిస్తూ ఉండేవారు. ఇందువల్ల భారతదేశ కోశాగారం ఖాళీ కావడము, ఇతర దేశాలకు పోయిన మన వనరులు తిరిగి మన దేశానికి రాకపోవడము జరిగింది. ఎగుమతి మిగులు యంత్రాంగం ద్వారా కూడా విదేశాలకు మన వనరులు **(External Drainage)** పంపబడినవి. సాధారణంగా అయితే ఇటువంటి ఎగుమతి మిగులు ఉండటంవల్ల విదేశాలకు మనము చెల్లించవలసిన బాకీలు తీర్చడానికిగాని, యితర దేశాల్లో పెట్టుబడి పెట్టడానికిగాని, మన ఆర్థిక వ్యవస్థను బలపర్చడానికి విదేశాల నుండి మూలధన వస్తువులు తెచ్చుకోవడానికిగాని వీలవ్వ వచ్చును. కాని ఈ ఎగుమతి మిగులుకు బదులు మన దేశానికేమీ తిరిగి రాలేదు సరికదా, విదేశాలకు మన మివ్వవలసిన అప్పులు పెరుగుతూ వచ్చినవి. దాన్ని చెల్లించడానికి భారమైన పన్నుల విధింపు అవసరమయ్యింది. అయితే పన్నుల ద్వారా సేకరించిన వనరుల్ని విదేశాలకు ప్రవహింప చెయ్యడము నష్టదాయకం కాబట్టి తప్పు పని.

ఇందువల్ల ఔద్యోగితను పెంచడాని కవసరమైన పెట్టుబడి చేయ డానికి భారతదేశంలో వీలులేకపోయిందని నౌరోజీ చెప్పారు. రావడా నికి వీలున్న ఔద్యోగిత తగ్గడంవల్ల భారతదేశం ఉత్పాదకశక్తి తగ్గుటేగాక పడిపోతూ వచ్చింది. పన్నులద్వారా వచ్చే రాబడి పెరి గినా, అది దేశ ఆర్థికాభ్యుదయానికి సూచికకాదు. పైగా భారత ప్రజలపై జరుగుతున్న ఆర్థిక దోపిడికి, భారతదేశ వనరులు ఇతర దేశాలకు ప్రవహించిపోవడానికి గుర్తుగా మాత్రమే ఉన్నది.

తెల్లవారు ప్రవాసంపోయిన వలస రాజ్యాలలో ఈ ''డ్రెయిన్ యంత్రాంగం'' పని చెయ్యలేదు. ఈ వలసలు బ్రిటిషు మూల ధనాన్ని ఆకర్షించి రాబట్టుకోవడంవల్ల వాటికి దిగుమతి మిగులు లభ్యమయ్యింది. విదేశాల నుండి వచ్చిన పెట్టుబడి వారి ఉత్పాదక శక్తిని పెంపొందింప జేసుకోవడానికి తోడ్పడగా, విదేశీయులకు ఇవ్వ వలసిన అప్పుల్ని తీర్చుకోవడానికవి తోడ్పడినవి. భారతదేశానికి విదేశ మూలధనం రాకపోగా వచ్చినంతవరకు అప్పులు తిరిగి చెల్లించడాని కవసరమైన శక్తిని పెంపొందించుకోవడానికి తోడ్పడని కార్యక్ర మాలలోకి మాత్రమే వచ్చినది. ఈ విధంగా భారతీయ ఆర్థిక వ్యవస్థ చాల బలహీనంచేయబడింది. ''మన వనరులన్నీ విదేశాలకు పోవడంవల్ల మన వనరులతో మన రైలురోడ్లు నిర్మించుకోవడానికి వీలులేకపోయింది ఇంత నష్టం జరుగకుండా ఉండి, ఇంగ్లండు నుండి అప్పు తీసుకోవడం లాభదాయకమైనట్లయితే, ఆరోగ్యవంత మైన వ్యాపారం జరగడానికి వీలుండేది. ఇందువల్ల చెల్లించే వడ్డీకి విచారపడవలసిన అవసరం ఉండేది కాదు'' అని నౌరోజీ వ్రాసినట్లు పై చెప్పిన తన గ్రంథంలో ప్రొఫెసర్ గంగూలీ వ్రాసారు. ఎకౌం ట్లలో మెరుపుపెట్టి ఇంగ్లండుది తప్పుగా లేకున్నట్లు చూపినా, భారతదేశానికి నష్టంకలుగజేసి ఇంగ్లండుకి లాభం కలుగజేయడానికే బ్రిటిషు వారి ఆర్థిక విధానం తోడ్పడింది. ఉ: చైనాను దోపిడి చేయడానికి ఇండియా ద్వారా చైనాకు నల్లమందు ఎగుమతి చేయ బడుతూ ఉండేది భారతదేశం చేసిన విదేశ వ్యాపారంవల్ల వచ్చే ఆదాయమంతా బ్రిటిషు వారికే వెళ్ళేది. తమ దేశాన్ని నల్లమందు ద్వారా పాడుచేస్తున్నదని చైనీయులు భారతదేశాన్ని తిట్టేవారు.

(స శే ష ం)

మరోసారి గాయపడ్డాను

శ్రీ ఎస్. మునిసుందరం

అట్లా బజారులో వెళుతూంటే
  కనిపించావు నువ్వు.
చైతన్యం అవాక్కుగా నిల్చిపోయింది
ఎన్ని సంవత్సరాలు
కాలం కసికి బలైపోయాయి.
నీ జ్ఞాపకాల నక్షత్రాలు
ఈ శూన్య నిలయంలో
ఇంకా సెలవేస్తూనేవున్నాయి.
ఒకనాడు
వేడి వేడిగా సూరీడు
ముఖానికి చురకలువేస్తూంటే
చాలీచాలని తాటాకుల నీడలలో
ఒళ్ళు దాచుకొంటూ
తాటితోపులో, ముంజలు జుర్రుతూ
విసిరిన నీ వాడిచూపుల తూపులు తగిలి
చీలిన నా హృదయం.
ఉష ప్రేమతో అందించిన
లేతగులాబీ కౌశేయాలు ధరించి
దిక్కులు కులుకుతున్నపుడు
విచ్చిన కనకాంబరాల మొక్కలమధ్య నిలబడి
నీవు అందించిన సౌందర్యసుధలు త్రాగి
మత్తెక్కిన నా ముగ్ధహృదయం.
సాయం సంధ్య హరితపత్రాలపై
పారాణితో లైలామజ్నుల ప్రేమగాథ వ్రాస్తున్నపుడు
కొత్త సింగారాలతో
ఒయ్యారాలు ఒలకబోస్తున్న గున్నమామిళ్ల మధ్య
వెన్నెల జల్లుల్లా, ముత్యాల పువ్వుల్లా
కురిసిన, విరిసిన నీ చిరునగవుల
సుమపేశల, సురుచిరానుభూతుల
మకరందాలు గ్రోలిన నా బేల హృదయం.
బజారయితే ఏం ?
మహారాజు ఆస్థానం అయితే ఏం ?
గాయపడ్డది
మరోసారి గాయపడ్డది.

శ్రీ నందిని సిధారెడ్డి

బతికిన చావు

"అయ్యా...

అయ్యా, అయ్యా...

అయ్యా, అయ్యా, అయ్యా..."

పిలుపులు !

ఆకాశం చిల్లులుపడి కురుస్తున్నట్టు — ఒకటే పిలుపులు !

ఆ పిలుపుల్లో ఆదుర్దా వుంది. తత్తరపాటు వుంది.

తమ కష్టాన్ని ఏదో మేసిపోతున్నట్టు —

నోటి దగ్గరి ముద్ద ఎవరో దోచుకుపోతున్నట్టు —

పిలుపులు! పిలుపులు! ఒకటేపిలుపులు! ప్రకృతేనోర్రైనట్టు—

నర్సింలు చెవుల్లో పిలుపుల రాళ్లవాన

కాలవ నీళ్లకు నోచుకోని ఎకరం పొలం నర్సింలుది.

'తాయ్ బంద్'లో పాలు పంచుకునేంత డబ్బుగానీ, ధైర్యం గానీ లేని నర్సింలుకు ఊరి చెరువు నీళ్లురావు. ఆ నీళ్ల (నర్సింలు వంతువి) దొర పొలాని కెళతాయ్.

మరి, నర్సింలు పొలం ?

నర్సింలు కాలవలోంచి గూడేసుకోవాలి తన పొలానికి —

తనతో గూడేసి, గూడేసి కండలన్నీ కరిగిపోయిన నర్సింలు భార్య ఓ రోజున 'పాడే'సుకుని వెళ్లిపోయింది.

ఇప్పుడు —

కూతురు లచ్మి ఒక వంక, నర్సింలు ఒక వంక తాళ్లే పట్టుకుని తట్టతో గూడేస్తున్నవేళ —

చెవుల్లో పిలుపుల రాళ్ల వాన —

నర్సింలు 'గూడ' ఆపేసి గడ్డెక్కి చూశాడు.

కొడుకు సెంద్రిగాడు అరుస్తో పరిగెత్తుకొస్తున్నాడు.

"అయ్యా వాయ్యా. మన వొరిసేనంత పాడయిపోతంది. ఎవ్వల్దో ఎద్దొచ్చి సేను మేత్తంది రాంద్రే..."

పరుగులోనే చెప్పేసాడు.

నర్సింలు చేతులు పిసుక్కుంటూ దుడ్డుకర్ర తీసుకుని చేను వైపు పరుగు తీశాడు.

నర్సింలు వెనకాల సెంద్రిగాడు —

సెంద్రిగాని వెనకాల లచ్మి —

పరుగు ... పరుగు ... పరుగు

బలిసిన ఎద్దే !

చేను మేసేస్తుంది. సెంద్రిగాడి మనసు రేగిపోతుంది.

నర్సింలు మాత్రం చేతులో 'కర్ర' కింద పడేసి, ఎద్దునే మాత్రం పట్టించుకో నిష్టం లేనట్టు వెనక్కి మరలాడు.

లచ్మి మరలింది అయ్య వెనకాల్నే—

సెంద్రిగాడి కిదేంటో అసలే అర్థం కాలేదు.

"ఏందే అయ్య...ఎద్దు నేమనకుంటనే వొత్తన్నవ్ ?"

"అదెవల్దో ఎర్కేనా ? దొరవార్ది"

సెంద్రిగాడి కింకా అర్థంకాక చూస్తున్నట్టుండిపోయాడు.

'అయ్య, అక్క ఇద్దరు ఎల్లిపోయారు.

హృదయంలో వరి కర్రలు—మేయబడుతున్న వరి కర్రలు—

ఆ కర్రలే చెక్కల్లై లేస్తున్నట్టు.....'

సెంద్రిగాని పండ్లు కిర్రు మన్నాయి.

అయ్య పడేసిపోయిన దుడ్డుకర్రను సెంద్రిగాడుతీసుకున్నాడు.

కళ్లు వంట పొయ్యిలయినట్టు —

మేస్తున్న ఎద్దుమీది కురికాడు సెంద్రిగాడు.

* * *

"అయ్యా...

అయ్యా; అయ్యాయ్యా ..

అయ్యాయ్యాయ్యాయ్యాయ్యా .."

పిలుపులు ! అవే పిలుపులు !

చెట్లన్నీ గొడ్డలి దెబ్బల కింద పడి ఏడుస్తున్నట్టు —

ఒకటే పిలుపులు !

ఆ పిలుపుల్లో ఆదుర్దా కాదు, బాధ వుంది. తత్తరపాటు కాదు, ఏడుపు వుంది.

చీమల్ని చెప్పు కాళ్లతో నలిపేస్తున్నట్లు —

వుండు జీవితాల్ని గుండుసూదుల్తో పొడుస్తున్నట్లు —

పిలుపులు ! పిలుపులు ! ఒకటే పిలుపులు !

నర్సింలు చెవుల్లో రాళ్లవాన !

గూడేయటం ఆపి గడ్డెక్కి చూశాడు నర్సింలు !

'తన కొడుక్కు...తన సెంద్రిగాడు...ఏడ్చుకుంట ..

ఎవరు? కొడుతున్న దెవరు ఎవరెవరెవరు?.. దొర !!

తన సెంద్రిగాడ్ని దొర వారుగట్టెతో కొడుతున్నాడు.

ఊరుకుంటే సెంద్రిగాడు సచ్చిపోతాడు.'

ఏంచేయాలో అర్థం కాలేదు నర్సింలుకి —

'దొరనెదిరించటం' 'ఊహూ '

దొర ముందు ఒక్క మాటయినా మాట్లాడలేని తను 'ఊహూ, లాభం లేదు ..తనెళ్లి అడిగితే...తనని కూడా తంతాడు. అబ్బో...ఎట్ల...ఎట్లా...ఎట్లెట్లెట్లెట్లెట్ల ?????

ఏంచేయాలో తోచట్లేదు నర్సింలుకింకా —

"నా తమ్ముణ్ని సంపేత్తండ్రు అయ్యో రాండ్రయ్యో నా తమ్ముడు ... నా సెంద్రిగాడ్ని . రాండ్రి తండ్రో . ఉర్కి రాండయ్యో" లచ్మి తనువంతా నోరైనట్లు అరుస్తుంది.

చుట్టుపక్కల వాళ్లంతా ఓ ఇరవై మంది దాకా పరిగెత్తుకొచ్చారు. చూశారు.

నర్సింలుని రెచ్చగొట్టే మనిషో కర్ర అందుకున్నారు.

పెద్దగా ఏవో కేకలేసుకుంటూ దొరమీది కురికారు.

దొర గుండుమీదకూచున్న ఇద్దరు 'రౌడీ'లకు సైగచేశాడు. ఇద్దరూ గుండుల్లాగే వున్నారు.

నర్సింలు కర్ర లేవనే లేదు.

'తన కొడుకునే కాదు, తనని కూడా కొడతారు.

దొర పగబడితే తనని ఆ ఊర్లో బతకనిస్తాడా ?

కొడుక్కోసం...దొరని ఎదిరించి ...

రెండు వంద లెకురాల పొలాన్ని ఎకురంనర పొలం ఎదిరించి బతుకుతుందా...ఆ దెబ్బలు తను భరించగలడా...అయ్యో...'

తన చిన్నప్పుడు దొర తండ్రి కొట్టిన దెబ్బలు గుర్తొచ్చాయి నర్సింలుకి.

మిగతా వాళ్ల కర్రలకి భయపడి దొర పరిగెత్తాడు.

ఆ కర్రలు- రౌడీల కత్తులకి భయపడుతున్నాయి.

ఆ కత్తులు—వాళ్ల రెచ్చిన కర్రలకి భయపడుతున్నాయి.

రెండు కత్తుల్లోంచి ఒక కత్తి నర్సింలుని కనిపెట్టింది.

చల్లారిపోయిన కర్ర లాగున్న నర్సింలుని బెదిరిస్తే మిగతా కర్రలన్నీ బెదుర్తాయని ప్లాను వేసుకుంది.

ఒక కత్తిమీద కర్రలు పడుతున్నాయి.

మరో కత్తి నర్సింలుమీద పడింది.

అప్పుడు నర్సింలు కర్ర లేవబోయింది. అప్పటికే—ఆ కత్తి నర్సింలు కర్రని లేవనీయకుండా చేసేసింది.

* * *

'అయ్యా ..

అయ్యా...అ . య్యా అ య్ య...ఆ'

అవే పిలుపులు !

మెల్లగా 'కట్లు' కదులుతున్నట్లు—

హాస్పిటల్ బెడ్లు మెల్లగా కిర్రుమంటున్నట్లు-

పిలుపులు స...న్న...గా !

ఆ పిలుపులు రాళ్లవానలాలేవు. కనీసం తుంపరలానూలేవు.

గ్లూకోస్ ఒక్కొక్కచుక్కే రాల్తున్నట్టు-

రోగమొచ్చి హాస్పిటల్ గడియారం మూల్గుతున్నట్టు—

పిలుపులు !

ఎవరూ పట్టించుకోలేదు.

వినడానికి అయ్యలేదు.

చెట్‌పట్‌న నర్సొచ్చి సెంద్రిగాడ్ని తిట్టుకుంటూ వెళ్లిపోయింది.

ఆ తర్వాత కళ్లు తెరచేసరికి అక్క తల నిమురుతోంది.

"ఏందిరా సెంద్రీ?"

"అయ్యేడీ"

లచ్మి నోరు మూసుకుంది.

సెంద్రిగాడు మాత్రం నోరుమూసుకోలేదు.

లచ్మే తప్పనిసరై నోరు విప్పాల్సి వచ్చింది.

''అయ్య . అయ్య మన కండ్లల్ల మన్నుకొట్టి పాయిండు. కత్తిదెబ్బలు శాన వడ్డయ్. దావ్‌ఖాన రాకముందే జీవిబొయింది.''

ఇద్దరూ బిగ్గరగా ఏడ్వబోయి బిగబట్టుకున్నారు.

''పంచ్‌నామా సేస్తమని పోలీసోళ్లు పీన్గ తీస్కపాయింౘ్రదు.''

ఈసారి లచ్మికి ఏడుపాగలేదు.

పైన తిరగటంకోసం పెట్టిన హాస్పిటల్ 'ఫ్యాన్' తిరగటం లేదు.

సెంద్రిగాడి కళ్లు తిరుగుతున్నాయి.

అంతకన్నా స్పీడుగా మెదడు తిరుగుతోంది.

మాట రాలేదు. లేవబోయి పడిపోయాడు.

*   *   *

''అయ్యో...

అయ్యలూ...అమ్మలూ...

అయ్యలమ్మలయ్యలూ...అయ్యో... అక్కలన్నలయ్యలూ ... అయ్యో''

అవే పిలుపులు!

పదహారేళ్లు నిండి పూస్తున్నట్లు—

గుండె గట్టి చేసుకుని తుపాకీ గుండ్లవుతున్నట్లు—

ఒకటే పిలుపులు! ధన్ ధన్ ధనా ధనా ధనా ధన్ ధన్ ధన్...

ఆ పిలుపుల్లో- ధైర్యముంది. ఆక్రోశముంది. తిరుగుబాటు ఉంది. సందేశం వుంది-దేశం వుంది.

సెంద్రిగాడు బుద్ధులు పుస్తకాల్లో చదవలేదు. జీవితాల్లో చదువుకున్నాడు.

సెంద్రిగాడు జనాన్ని పోగుచేసి చెపుతూ పోతున్నాడు.

దొర కళ్లకింద బతకలేక ఉరిపోసుకున్న 'బాలి'కథ చెప్పాడు.

'తాయ్‌బందీ' దొరకూ పటేలుకూ మధ్య జరిగిన కొట్లాటలో 'బలి' అయిపోయిన సాయిమల్లని కథ చెప్పాడు.

తన తండ్రి కథ చెప్పాడు. తాగించి చంపబడ్డ, అనుభవించి చంపబడ్డ...చాలామంది కథలు చెప్పకుపోతున్నాడు.

సెంద్రిగాడు చెపుతూ చెపుతూ.........

ఎండకాలం!!

దొర ఉక్కపోత భరించలేక కిటికీ తెరిచాడు.

ఎండ మండిపోతుంది.

వడ పరుగెత్తికొచ్చి మీదపడింది.

జనం ఎండకన్నా తీవ్రంగా వుంది—

కేకలు వడకన్నా ఉధృతంగా పరుగెత్తుకొస్తున్నాయ్—

గుమిగూడిన జనం...

ఇళ్లు మండి పోతున్నట్టు ఎండ!

జనం మంటలై వస్తున్నట్లు ఎండ!

క్రలు . ఎండ...ఎండలో క్రలు రగుల్తున్న క్రలై... చుట్టూ చూశాడు దొర.

పిలిచాడు. పిలిచాడు. అరిచాడు. అరిచాడు. గర్జించాడు.

ఎవరూ రాలేదు.

పెళ్లాన్ని పిలిచాడు. పేర్లుపెట్టి రౌడీల్నిద్దర్నీ పిలిచాడు.

ఎవరూ రాలేదు. కనీసం జవాబన్నా రాలేదు దూరంగా గజ్జల చప్పుడుతప్ప — పిలిచి అరిచినా, అరిచి గర్జించినా .. నిశ్శబ్దం!! జనాల అడుగులు—క్రల అరుపులు—అడుగులు అరుపులు—బయటికిపోతే చావే ఖాయం—ఇంట్లో—ఆ ఇంట్లోనే—ఎక్కడో దాక్కోవాలి—ఎక్కడ—ఎక్కడ దాక్కునేదీ—ఎక్కడెక్కడ...అటు—ఇటు - అటిటెటు—ఎటు - ఎటెటు—ఎక్కడెక్కడెటెటెటు ... అయ్యో...అయ్యో...అయ్యయ్యయ్యయ్యొటెటెటు.........

పెరట్లో చేద బావి పిలిచినట్లనిపించింది.



నగరంలో నాగరికత

దరిద్రుని అరచేతిలోని దురదృష్టరేఖల్లా
  స్పష్టంగా అగుపిస్తున్నాయి
నగరం శరీరం మీద పరచుకున్న రహదారులు !
ఆ రహదారులపై ప్రవహించే నాగరికతా ధారలు ! !

అనాకారాన్ని, అనారోగ్యాన్ని
అలంకారపు ముసుగులో దాచుకో యత్నిస్తున్న
వెలయాలులా వెలుగుతుంది, నాగరికత !
ఎందరినో కవ్విస్తుంది పిచ్చివాళ్లను చేసి –
హృదయమున్న ఏ కొద్ది మందినో
కలచివేస్తుంది పాతిత్యాన్ని తలచి.

నాగరికత తన నిజస్వరూపాన్ని
నగరం పొలిమేరలో భూస్థాపితం చేసి
'అత్యాధునికత' పేరుతో
అనాగరిక ప్రేతాన్ని ఆహ్వానించి నిలుపుకుంది.
నగరంలోని అందరికీ
అదే ఆదర్శం అంది !

పెరిగిపోయి, చెరిగిపోయిన శిరోజాలతో
ఉన్నకళ్లు కప్పేసుకొని,
కాస్త వళ్లు విప్పేసుకొని,
నగరం నడివీధిలో నిలచి
సగర్వంగా నవ్వుతుంది !

ఆ నాగరికత –
రంగుటద్దాలలోంచి చూస్తుంది లోకాన్ని !
రంగుల వలయాల భ్రమణం అంటుంది జీవితాన్ని ! !

ఎక్కడో చిలుక గుండెలో దాచుకున్న
మాయల ఫకీరు ప్రాణంలా
ఇక్కడే విస్కీబుడ్డి చివరి చుక్కలో
దాచుకుంది నాగరికత జీవం.
మానవతను మత్తులో నిద్రపుచ్చి
జాగృతిలో నగరం గుండెలపై
జాతర చేస్తుంది, తాను !
అనేకానేకుల పొరతులందుకొంటుంది మేను ! !

ఈ నాగరికత నడయాడే నగరంలో -
కాకులు తెల్లగా కనిపిస్తాయి !
వేదికల గోడలపై నిలచి
కవితల గానం చేస్తాయి ! !
చెవులు మూసుకొని చెట్లు
ఆ కవితలకు తలలూపుతూవుంటే,
కళ్లు తెరుచుకొని పశువులు
నిదురపోతూ వుంటాయి !

ఇది ఏ మహానగరమైనా కావచ్చు !
ఒకానొక నగరం కాకపోవనూవచ్చు ! !

కలలు కవుల కలాలు

తెరచిఉన్న యెదలోనికి వలపులా
  ముడుచుకున్న మొగ్గలోనికి రంగులా
మూసుకున్న నా కళ్లలోనికి
రంగు రంగుల కలలు
రమ్యభావ పుటలలు - వస్తూ ఉంటాయి –
తలపుల తలుపులు విచ్చుకొని !
కనురెప్పల సందుల వొచ్చుకొని ! !

రేయంతా
పారిజాతం చెక్కిళ్లపై ముత్యాల ముద్దులిడి
తెల్లవారిన తరువాత

దినరాజు కిరణకౌగిట కరిగే
మంచువంటి కలలు -- సృష్టికర్త
కుంచెవంటి కలలు !

గత స్మృతుల తీయని బాధాగాథలలో
కన్నీటి ధారలను కడకు మిగిల్చిపోయే
కరిగిన వయసువంటి కలలు !
కడిగిన మనసువంటి కలలు ! !

కొన్ని కలలు
మలయమారుతంలా మెల్లగా సాగి
చందనంలా చల్లగా సోకి

వెన్నెలల అమృతం కురిపిస్తాయి!
కన్నులను పారిజాతాలు విరియిస్తాయి!!
నా నయనాంచలాల చంద్రశాలలలో —
అజంతా సుందరులు!
ఎల్లోరా కన్నియలు!!
''నింగిమూలలె నీలి పందిళ్లు పరచి'' ''ఊర్వశి''
'సకల కళాసంగమ తీర్థమ' లకుమా —
'పూల బాసలు' తెలిసిన ఎంకినాయుళ్లూ —
కమ్మని గీతాల వెన్నెలజాలు ''కిన్నెరసాని''—
జీవం పోసుకొని
నాకు వైతాళికా గీతాలు వినిపిస్తాయి!
నా కనులన వెలుగు జిలుగులు కురిపిస్తాయి!!
మరికొన్ని కలలు —
చితికలను ప్రోగుచేసి
మంటలను రగిలించి
నిలువెల్లా దహిస్తాయి!
కనుల నీరు కురిపిస్తాయి!!
వేదనే జీవమై, కార్చ కన్నీరులేక
ఈ రెప్పల నీడనే సేదదీరింది
దీన, దారిద్ర్యహీన ''బిక్షా వర్షీయసి''—
నా కలల హృదాంతరాళం పునాదిగా
భర్మహర్మ్య విలసితమైనది 'మరోప్రపంచం.'
నా కలల రాపిడిలో
పదునుదేరింది 'వజ్రాయుధం'.
మదిలోని భావాలు
మ్యూములో చోటుచేసుకొనే రీతిగా
ఎదలోని తలపులు
కలలలో నీడచూసుకుంటాయి!
మనిషి లోతులనంటి
కలలు బ్రతుకుతువుంటె,
కలల అంచులతేలి
కవి బ్రతికి ఉంటాడు!
కనుల వరాలు
కలలు — కవుల కలాలు!!

శ్రీ మేకా మన్మధరావు

కలల పాట

శ్రీ దిలావర్

కలలను శ్వాసిస్తూ బతికే కళ్లను
క్రూరంగా పెరికేసే హంతకుడా!
ఎలా చెప్పమంటావు ఈ కలలెందుకో ...?
కళ్లలోని ఈ కలల అలలు
పచ్చగా జీవంపోస్తూ ఏ సమాజ వృక్షం వేళ్లు తాకుతాయో!
ఏ దీన జన హృదయాగాధాలకు పాకుతాయో!
కళ్ల కొలిమిలో ఎగిసే ఈ జ్వాలలు
ఏ నిరాశా అరణ్యాలను కాల్చుతాయో!
ఏ అసమతా దిగంతాలను కూల్చుతాయో!
అరే పాగల్!
చీకటి యాక్సిడెంటులో
నువు కోల్పోయిన వెలుతురు నెత్తురు ఎక్కించేందుకే
స్పందనలేని నీ గుండెను కదిలించేందుకే
ఈ 'బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్' తగిలించాను నా కళ్లకు.
నాకు తెలుసు —
నీ కళ్లలోంచి కారే మూర్ఖత్వం ఆపడానికి
నా కళ్లు నీకు అమర్చడం ఒక్కటే మందని!
అందుకే కలల బాణంతో నా కళ్లు పెకలించి
వెలికి దీసిన రక్త చరిత్ర పుటలు
నీ ముందు పరచు తున్నాను ఇవిగో ...
ఎందరెందరు మహానుభావులో చూడు
కలలు పండించడంకోసం ప్రాణాలర్పించిన వారు ...
రా! పశువులు పాలిస్తున్న నీలోని అడవిలోంచి
నా కళ్లలో వెలిగే కలల కాంతిలోకి
ఆ కలలు వినిపిస్తున్న కమ్మని పాటలోకి.

డా. తంగిరాల వెంకటసుబ్బారావు

కన్నడ 'భూమిగీత' తెలుగు 'వసుధైకగీతం'

- ఒక తులనాత్మక పరిశీలన

'భూమిగీత' కన్నడంలో శ్రీ ఎం. గోపాలకృష్ణఅడిగ అనే ఆధునిక కవి వ్రాసిన గేయం. 'వసుధైక గీతం' తెలుగులో కీ. శే. దేవరకొండ బాలగంగాధర తిలక్ వ్రాసిన గేయం. కన్నడ గీతం 1954లో వ్రాయబడింది. తెలుగుగీతం 1962లో వ్రాయబడింది. రచనాకాలంలో రెండింటికీ ఎనిమిదేళ్ళు తేడావున్నా, రచనా సమయంలో ఆయా కవుల వయస్సును తీసుకున్నట్లయితే యించుమించు ఇద్దరూ ఒకే వయస్సులో ఈ గీతాలు వ్రాశారు. అడిగ 1918 లోనూ, తిలక్ 1927లోనూ పుట్టారు కాబట్టి 35-36 సంవత్సరాల వయస్సులో ఈ కవుల భావాలెలా వున్నాయో ఈ కవితలద్వారా మనం తెలుసుకోవచ్చు.

భావకవితలతో, ప్రాచీన పదజాలంతో, కేవలం సౌందర్యాన్వేషణకు మాత్రమే పరిమితమై, ఊహాలోకంలో విహరిస్తున్న 'నవోదయ' కన్నడ కవిత్వాన్ని, వైయక్తికానుభూతి ప్రధానమైన, ఆలోచనాత్మకమైన, నూతన శబ్దజాలంతో, మానవుడు - కాలం, మానవుడు-భూమి, మానవుడు-సమాజం మొదలైన ద్వంద్వాల పరస్పర సంబంధాన్ని సహేతుకంగా స్థాపించే 'నవ్యకవిత్వం' అనే వాస్తవిక జగత్తులోకి తీసికొనివచ్చిన మహాకవి శ్రీ గోపాలకృష్ణ అడిగ. ఈయన తన 'భూమిగీత' రచనతోనే ఈ మార్పు తీసికొనివచ్చారని చెపుతారు విమర్శకులు. స్వాతంత్ర్యానంతరం తెలుగు సాహిత్య లోకంలో కవిత్వానికి ప్రధానలక్షణమైన శైలిని, కవికి ప్రధాన గుణమైన కరుణార్ద్ర మనస్కతను విస్మరించి, వర్గ కలహాన్ని ప్రోత్సహిస్తూ వక్రమార్గంలో సాగుతున్న అభ్యుదయ కవిత్వాన్ని, సన్మార్గంలోకి రప్పించి, కవి మానసిక పరిధిని విస్తృతం చేసి, వచన కవితకు ఒక మహోన్నతస్థానాన్ని ప్రసాదించిన, మానవతావాదియైన ఉత్తమకవి బాలగంగాధర తిలక్ ఈయన ఈ ఉద్యమాన్ని 1955లోనే ప్రారంభించినా ఫలసిద్ధిమాత్రం 1962 ప్రాంతానికే అని చెప్పాలి. ఈ విధంగా భూమిని గూర్చిన ఈ రెండు గీతాలూ ఈ కవులిద్దరి జీవితాలలోనూ, వీరి భాషల కవితా చరిత్రలోనూ 'మైలురాళ్ళు' అని చెప్పవచ్చు.

కన్నడ 'భూమిగీత' తాత్త్వికమైనది. క్లిష్టసంకేతాలతో కూడినది. ఇందులో మానవుడు నాయకుడు. పుట్టుక, బాల్యం, యౌవనం, మధ్యవయస్సు - ఈ వివిధ వయోదశలలో మానవుని అనుభూతులు, అతనికి భూమితోగల సంబంధం, ఇహపరముల చర్చ దీంట్లో కనబడతాయి. పైగా యిది 129 పాదాలతో నాలుగు భాగాలుగా సాగిన సుదీర్ఘగీతం. తెలుగు 'వసుధైకగీతం' కళాత్మకమైనది. ఆలంకారికమైన సులభ సంకేతాలతో కూడినది. ఇందులో నాయకుడు కవి. సర్వమానవ సమానత్వమూ, జాతి మత రహితమైన విశాల భావన, మానవుని భావిని సుఖసంతోషమయం చేయడానికి కవి తీసుకోవలసిన బాధ్యత ఈ కవితలో నొక్కి చెప్పబడ్డాయి. ఇది 25 పాదాల చిన్నగేయం. భూమి గీతంలో యిది ఆరోవంతు మాత్రమే.

'భూమిగీత'లో మొదటి భాగంలో 56 పాదాలున్నాయి. ఇందులో మొదటి 10 పాదాలూ భూమిమీద మానవుని పుట్టుకను గురించి వివరిస్తాయి. ఒకవిధంగా ఇది కవిపుట్టుకే. ఈ కవి ఎత్తైన పడమటి కనుమల ప్రక్కనున్న సముద్రతీర ప్రదేశమైన దక్షిణ కనరా జిల్లాకు చెందినవాడు. అందువల్లనే గీతాన్ని ప్రారంభిస్తూ ఇలా అంటాడు :

> ''మలెఘట్ట సోపాన కెళపట్టియలి;
> ఉరుళు,-మూరేఉరుళు,-కడల కుదితద ఎణ్ణె కొప్పరిగెగె.''
> [నగఘట్ట సోపానముల అడుగు మెట్టుమీద; దొర్లు,
> -మూడే దొర్లులు, -కడలి కాగుతున్న మానె పెనంలోకి]

మానవుడు (కవి) భూమిమీద పుట్టాడు. భూమాత అతణ్ణి లాలించింది 'కొబ్బరాకులు వీచి చెయి చాచి పిలిచింది; పోక గెల గిలక పట్టి ఆడించింది.' చెరుకు గానుగ తిరుగుడులో కూర్చుని కడుపు తీపితో అజస్రధారగా పాలిచ్చింది. పకుల పాటలు, తుమ్మెదల ఝంకారాలు అనే జామూను నాదంలో తూగించింది. ఆకాశంలో మేఘ విశ్వరూపానికి క్రింద జీవజ్యోతి వెలిగించింది.

తరవాత 11 వ పాదం నుంచి 56 వ పాదం వరకూ సాగిన రచనకు 'శైబాయం' అని పేరు పెట్టాడు కవి. ఇందులో ప్రకృతిలో ఎక్కడ చూసినా కనపడే జీవోత్పత్తి, చావు పుట్టుకల ద్వంద్వము, యౌవనంలో ఏదో తపన, ఏదో వెలుగు కోసం దాహం, రకరకాల ఆకర్షణలు, నుదుటికి నెయ్యి రాసిన పిల్లిలాగ తోకయెత్తు

కొని బొంగరం తిరిగినట్టు పరిభ్రమించే మనస్సు; జీవుల్ని చంపి తన పొట్టలో పెట్టుకొని తిరిగి పుట్టిస్తూ, ఒక జీవిని చంపి యింకో జీవిని పోషించే భూమాత; కృష్ణుని రక్షణలేని ధృతరాష్ట్రునికౌగిలి వంటి భూమాత కౌగిలి; ఇటువంటి భూమిమీద కాళ్ళు పెట్టుకొని నక్షత్ర లోకాలవైపు ప్రయాణం సాగించాలని తపించే మానవుడు; 'ఇహం' అనే పంజరంలో చిక్కిన మానవజీవి అనే పక్షి పరానికి పోవాలని చేసే వ్యర్థప్రయత్నం — మొదటి భాగంలోని 'శ్రేబాయం' అనే ఈ రెండవ ఘట్టంలో వివరింపబడ్డాయి. జననం వెనకనే మరణం వుంటుంది అనే విషయాన్ని చాలా చమత్కారంగా చెప్పారు అడిగ :

''నర్సుగళు డాక్టరరు హొరెగెమనె యొళహొరగె
అవర బెన్నిగె సదా నాల్కుమంది;
తొట్టి లంగడి యల్లి బొంబు తుంబా అగ్గ,
జాతకర్మది నిరత ఈ పురోహితభట్ట అపర ప్రయోగదలి
పారంగత''

[''నర్సులు డాక్టర్లు పురిటింట్లోకి వస్తూపోతూ
వాళ్ళ వెనక ఎప్పుడూ నాలుగుమంది;
తొట్టిలంగడిలో వెదురు బొంగు చాలా చవక;
జాతకర్మ నిరతుడు ఈ పురోహితుడు అపర ప్రయోగంలో
పారంగతుడు'']

భూమి ఇహానికీ, ఆకాశం పరానికీ సంకేతాలు. భూమి మీద వున్నా మానవునికి ఆకాశం ఆకర్షణ ఎక్కువ. పరలోకాన్ని గురించిన మానవుని తపన ఇలా వర్ణించబడింది :

''కరెయువువు మత్తు మత్తూ బాన హక్కిగళు;
గాళి దరబారి గరవత్తు కరెయోలె;
కివిసుత్త బందు కర్ణపిశాచి పిసుగుట్టి కాడిదువు మేలె,మేలె.
మంత్రవాదియ కుతంత్రద రగళె, జోరాగి రేగిదను నాబరిదె
నన్నమేలె:
ఢిక్కి హొడెదెను పంజరద కంభ, మాడక్కె;
చీరి బడిదెను రెక్కె, కుక్కి పుక్కవ, కిత్తురాశి హో కిదె
తిండి తట్టెయొళగె.''

[పిలుస్తాయి పదే పదే నింగి పకులు
గాలి దర్బారుకు అరవై పిలుపులు
చెవిచుట్టూ వచ్చి కర్ణ పిశాచాలు గుసగుసలతో బాధిస్తాయి
పైపైకి రమ్మని
మంత్రవాదుల కుతంత్రాల రగడ జోరై నామీద నేనే
రేగాను ఊరికే
ఢీఢిక్కి కొట్టాను పంజరం స్తంభానికి పై కప్పుకి
కూసి బాదాను రెక్కలు కసిగా, ఈకలు ముక్కుతో పొడిచాను,
పీకి రాశిపోశాను తిండి మూకుట్లో]

'భూమిగీత' లో 57వ పాదం నుంచి 71వ పాదం వరకూ రెండవ భాగం. ఇందులో కవి మానవుని జీవితంలోని కొన్ని అనుభూతుల్ని దూరంగా నుంచుని చూడడానికి ప్రయత్నిస్తాడు. (ఈ భాగంలో ఎక్కడా 'నేను' అనే ఉత్తమ పురుష ప్రయోగం లేదు). దేహము, మనస్సు వేరు వేరు. యౌవనోద్రేకం వున్నంత కాలం మనస్సు గుర్రప్పిల్లలాగ గంతులేస్తుంది. దానికి దేహం అనే బంగారు కళ్ళెం, రత్న లగాము ఉన్నాయి. వెనక, జీవితం అనే 'షాః పసందు' (= గుర్రపు బండి) వుంది. మనస్సు అనే కోతి చేత యౌవనం రకరకాలుగా గంతులు వేయిస్తుంది. నడుములు విరిగే వరకూ ఈ సంకురాత్రి చిందు కొనసాగుతుంది. యౌవనం మళ్ళి, వయసు వ్రాలి, బరువు బాధ్యతలు మీద పడేసరికి, మనస్సు దేవుణ్ణి శరణు వేడుతుంది. అప్పటికే దేహం ప్రమిదలో నూనె అయిపోతూ వుంటుంది. ప్రమిద బీటలు తీస్తుంది. అయినా మనం వత్తిని పేనుతూ వుంటాము. జీవుడు దేహాన్ని వదలడానికి ఇష్టపడడు. అతడికి దేహంమీద చాలా మమకారం. కాని భూమాతకు మానవుడి మీద ఏ విధమైన మమకారమూ వుండదు. ఆముష్మిక చింతలో మునిగివున్నప్పుడు కూడా భూమాత మానవుణ్ణి వదిలిపెట్టదు. నిర్దాక్షిణ్యంగా అతడి గుండె కొబ్బరిచిప్పను బలికోరుతుంది. మానవుని మరణాన్ని గురించి ఆమె ఏమీ జాలిపడదు. అసలు పట్టించుకోదు. జీవుడు దేహాన్ని వదలి వెదురు పల్లకిఎక్కి వెళ్ళిపోతూవుంటే, భూమాత యింట్లోంచి బయటకు రాదు. అప్పుడు ఆమెకు ఇంకో పురుడు! పాత జీవులు నశించిపోతూంటే, క్రొత్తజీవుల సృష్టిలో నిమగ్నమైపోయి వుంటుంది భూమాత.

72వ పాదం నుంచి 104 పాదం వరకూ సాగిన మూడవ భాగంలో కవి ఈ బ్రతుకు సత్యమా ? లేక మాయా ? అనే విషయాన్ని చర్చించాడు. దేహాన్ని నేలతల్లి నిర్మించిన లక్క యింటితో పోల్చి యిలా అంటాడు :

''నెలతాయి మాయకద అరగినర మనెయల్లి
హస్తినా పురద స్మృతి హొత్తలిల్ల,
మయనిర్మితవో, సుయోధన రచితవో
అంతు కడ్డి గీరువ తనక శంకె ఇల్ల.''

[''నేలతల్లి మాయల లక్కరాచనగరులో
హస్తినాపుర స్మృతి వెలగలేదు.
మయ నిర్మితమో, సుయోధన రచితమో
మొత్తానికి అగ్గిపుల్ల గీసే వరకూ శంకలేదు'']

శరీరం మట్టిలోంచి తయారయిన లక్కయిల్లు. ఇది నశించిపోతుందనే భయం కలిగే వరకూ ఆత్మవిచారం కలగదు. నేలతల్లి దీనిని నశింప జేయడానికి చూస్తూ వుంటుంది. కుంతికి—కర్ణుడికీ వున్న సంబంధమే భూమికి—మానవుడికి వుంది. చివరికి చంపడానికి తప్ప కొడుకు దగ్గిరికి రాదు. భూమాత ఒళ్ళంతా పురిటిళ్ళు శ్మశానాలు. ఆమె స్వరతి సంప్రీత. జంతుజాలం, వృక్షజాలం భూమాతకు సహజ సంతానం. మానవులు ఆమెక్కు సవతి బిడ్డలు. నేలతల్లి తనకు సవతితల్లి కావడంవల్ల మానవుడు ధ్రువుడిలాగ అరణ్యానికిపోయి తపస్సు చేసికొని, ఈ జీవితానికి గల అర్థాన్ని వెతుక్కోవడానికి వీలుంది. ఐహికమైన విషయాలన్నింటిని పరిత్యజించాలి. ఋషుల మార్గాన్ని అనుసరించి పోవాలి. బాహ్య బంధాలన్నింటినీ తెంచుకుంటే తప్ప ఆత్మసాక్షాత్కారం కాదు అంటారు అడిగ :—

''నెలతాయి మలతాయి
ఉత్తాన పాదనిగె సురుచి; ధ్రువ నక్షత్రక్కె
కాడ మూలకవె పథ ఆగసక్కె.
ఆరణ్యకర మౌనమంత్ర బిచ్చిద బట్టె.
తెగెదుకో నీ కొట్ట ఎల్ల వస్త్ర విలాస;
ఈ కోటు ఈ శరటు, ఈ శరాయి;
ఈ భగ్న జోపడియు నిన్నదే; తెగెదుకో;
బత్తలాగదె బయలు సిక్కదిల్ల.''
[''నేలతల్లి మారుతల్లి
ఉత్తానపాదునికి సురుచి; ధ్రువ నక్షత్రానికి
అడవి మూలకమే పథం ఆకాశానికి
ఆరణ్యకుల మౌనమంత్రం విప్పిన దారి.
తీసుకో నీవిచ్చిన ఎల్ల వస్త్ర విలాసం;
ఈ కోటు, ఈ షర్టు, ఈ షరాయి;
ఈ భగ్న కుటీరమూ నీదే; తీసుకో;
బిత్తలయితే కాని బయలు చిక్కదిక్కడ.]

అంటే కవి దృష్టిలో మానవుడు చేయదగినవి రెండేపనులు: ఐహికమైన ఆకర్షణ లన్నింటినీ వదిలి, దిగంబరుడై అడవికి పోయి, ఇతర పశు పక్ష్యాదులతో కలిసి బ్రతకటం. లేదా ప్రాచీన ఋషులు బోధించిన మార్గంలో ఆత్మసాక్షాత్కారం కోసం ఐహిక బంధాల నుంచి విముక్తుడు కావడం.

'భూమిగీత'లోని నాల్గవ భాగంలో (105-129పాదాలు) మానవుడు పైన చెప్పిన రెండు మార్గాలలో ఏదీ అనుసరించలేక మధ్యలో త్రిశంకు స్వర్గంలో గబ్బిలంలా వ్రేలాడుతున్నాడు. జీవి ఇహాన్ని వదలలేడు, పరాన్నీ వదలలేడు. మానవుడు పూర్తిగా మట్టి బొమ్మ కాదు; ఈ మట్టిబొమ్మలో ఊపిరి తంత్రంవుంది, కాంతి మంత్రం వుంది. పంచభూతాలతో తయారైన ఈదేహం నశించి, తిరిగి పంచభూతాల్లో కలిసిపోవడం సహజం. కాని అలాకలిసిపోయిన తర్వాత కూడా విద్యుత్కాంతి వంటి ఒక శక్తి భూమిమీద మిగిలిపో తుంది. ఆ శక్తి భూమ్యాకాశాలకు సంబంధించిన విరుద్ధసత్త్వం గలిగిన జీవుల్ని మళ్ళీ సృష్టిస్తుంది. లేదా విరుద్ధ సత్వాలను ఒక చోట కూరుస్తుంది. ఈ విధంగా విరుద్ధ సత్వాలను ఒకచోట కూర్చే ఈ శక్తియొక్క మూలం ఏమిటి? ఇది మనుష్యునిలోనే వుందా? లేక మనుష్యుని పరిధికి అవల వుందా? ఈ విషయం తేలటం లేదు. ఈ అన్వేషణ కుంటివాడి భుజాలమీద గ్రుడ్డివాడు కూర్చున్నట్లుంది.

ఈ గీతంలో ఒకటి రెండు లోపాలు కూడా లేకపోలేదు. ఈ రచనాకాలానికి కవి వయస్సు 36 సంవత్సరాలు. ఈ కవితలో కవి పుట్టుక, బాల్యం, యౌవనం, మధ్యవయస్సు-అనే దశలలోని అనుభవాలనేచెప్పాడు కాని, వృద్ధాప్యం, మరణం—ఈ అనుభూతుల్ని చెప్ప లేదు గీతం నాయకునితో కవి కొన్ని భాగాల్లో తాదాత్మ్యం చెంది 'నేను' అని ఉత్తమపురుష వాడుతాడు. కొన్నిచోట్ల ప్రథమపురుష వాడుతాడు. పంచభూతాలను గురించి చెపుతూ ధూళి, గాలి, నిప్పు, ఆకాశం మాత్రం చెప్పి ఊరుకున్నాడు. నీటి ప్రసక్తి తేలేదు. అక్కడక్కడ మాటల పునరుక్తి, ప్రతీకల పునరుక్తి కూడా ఉంది.

మొత్తం మీద 'భూమిగీత' ఆత్మాన్వేషణ కవిత. ఈగేయం లోని కవి అన్వేషణ నుదుటికి నెయ్యి రాసిన పిల్లి వంటిది. అందు వల్లనే భావాలలో అక్కడక్కడ శైథిల్యం కనబడుతుంది. ఈకవిత వివిధ పరిధుల్లో అసహాయక మానవుని జీవితంలా చుట్టి, ఏ నిర్ణయాన్నీ తీసుకోకుండా నిలిచిపోతుంది. అయినా జీవితం యొక్క సంకీర్ణతను సరళం చేయకుండా, వివిధ రీతుల అనుభవాలను ఒక దానితో ఒకటి గీసి చూసి, దేన్నీ సులభంగా ఒప్పుకోకుండా, నమ్మకాలుగా మిగిలిన భావాలను అనుమానించి, తన అనుభవంతో తూచి చూచే రీతి, ఈ భూమిగీతానికి కన్నడ సాహిత్యంలో విశిష్టస్థానాన్ని సంపాదించి పెట్టింది.

తిలక్ 'వసుధైక గీతం'లో ఆరు చరణాలున్నాయి. చివరి చరణంలో తప్ప తక్కిన వాటిలో నాలుగేసి పాదాలున్నాయి. ఆఖరి చరణంలో మాత్రం అయిదు పాదాలున్నాయి. ఈ గీతంలో కవి మొదటి నుంచి చివరిదాకా 'నేను' అనే ఉత్తమపురుష వాడాడు. ఈ 'నేను' ఈనాటి కవి తప్ప వేరెవ్వరూ కారు. కవి ఈనాడు ప్రపంచంలో ఒక దేశానికీ, ఒక రాష్ట్రానికీ కట్టుబడినవాడు కాడు. సమస్త ప్రపంచాన్నీ మనస్సులో పెట్టుకొని కవిత అల్లుతున్నాడు. నేటి కవి భూమండలమంతా వ్యాపించివున్నాడు. త్రివిక్రముడిలా ఆకాశమంత ఎత్తు పెరిగాడు సూర్యుడు అతని తలలో పువ్వులా వున్నాడు:

''భూమధ్యరేఖ నా గుండెలోంచి పోతోంది
భ్రుకుటి లోపల నక్షత్రగోళం తిరుగుతోంది
ఈవేళ నన్నానవాలు పట్టలేవు నువ్వు
సూర్యుణ్ణి చూడు నా తలమీద పువ్వు''

ప్రజల బాధలే ఈనాటి కవికి శయ్య. ఈ జీవితం లోతుల్లో నుంచి రత్నాలవంటి సత్యాలు వెదికి తీశాడు. ఉత్తర ధ్రువంలో ఒక పాదం, దక్షిణ ధ్రువంలో ఒకపాదం పెట్టి సర్వం సహా చక్రవర్తి పదవి సంపాదించుకున్నాడు ఈనాటి కవి. అంటే ప్రపంచ లో వున్న సర్వమానవకోటికీ ఈనాటి కవి బాధ్యత వహిస్తున్నాడు సంకుచితమైన జాతిమతాల సరిహద్దుల్ని చెరిపివేస్తున్నాడు. అకుంఠితమైన మానవీయ పతాకను ఎగురవేస్తున్నాడు. గత చరిత్రంతా యుద్ధాలతో నిండి ఒక రక్తజలధిలా వుంది. దానికి నేటి కవి స్నేహసేతువు నిర్మిస్తున్నాడు. ఈ కవి వచస్సు సూర్యకాంతి ప్రవాహంలా వ్యాపించి సర్వప్రపంచాన్నీ స్వేచ్ఛగా స్నానం చేయిస్తోంది. ఇక్కడ తెలుగుకవి భూమిని కన్నడ కవిలాగ తల్లిగా కాకుండా ప్రియురాలిగా భావించి ఇలా అంటాడు: ''మధ్యధరా సముద్రతీర ఖర్జూర తరుచ్ఛాయ మధ్యాహ్నవేళ, నీ స్నిగ్ధ కపోల తల్పాన ముద్దిడిన ప్రియసఖుణ్ణి నేను.''

శృంగారం, విప్లవం, కరుణ, క్రోధం, శాంతి—మొదలైన సమస్త భావాలతోనూ కవి మానవాళికి అభయహస్తం ఇస్తాడు. మధ్యధరా సముద్రతీరంలో ప్రేయసీ ప్రియుల ప్రసక్తితో శృంగారం, మౌంట్ వెసూవియస్ అగ్నిపర్వతాన్ని వెలిగించి దిగ్భ్రాంతికల్గి ప్రకంపింపజేస్తూ పాడటంలో భయానకం, పాల్ రాబ్సన్ సంగీత గీతం

లోని జాలిలో కరుణం; ఆఫ్రికా అడవులలోని సింహగర్జనతో ప్రజలను అన్యాయాలకు గురి చేసిన వారిపై రౌద్రం, కైలాస పర్వతం పంపించే శాంతి సందేశంలో శాంతం—మొదలైన వివిధ రసాలను ప్రదర్శిస్తాడు తిలక్. ఇక్కడ మధ్యధరా సముద్రతీర ప్రతీకద్వారా జీవితాన్ని గాఢంగా ప్రేమించి అనుభవించిన ఫ్రాన్స్, ఇటలీ, గ్రీసు మొదలైన దేశవాసుల శృంగార సంస్కృతిని స్మరిస్తున్నాడు కవి. ఇటలీలోని మౌంట్ వెసూవియస్ అగ్నిపర్వతంద్వారా మానవాళి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం పాశ్చాత్యదేశాలలో జరిగిన మహా విప్లవాలను వాటిలో కవిపాత్రను సూచిస్తున్నాడు. అమెరికన్ పాల్ రాబ్సన్ అనే నీగ్రో సంగీత విద్వాంసుణ్ణి, ఆఫ్రికా అడవులలో సింహగర్జనను చెప్పి ప్రపంచంలోని దళితజాతియైన నీగ్రోజాతి దైన్యాన్ని తిరుగుబాటును ధ్వనింపజేస్తున్నాడు.

చివరి చరణంలో తిలక్ ప్రజల బాధలు చూసి కన్నీరు మున్నీరుగా శోకించే కవిని, వారి సుఖంకోసం మిన్నేరును పన్నీరుగా దింపిన కవిని చెప్పాడు. ఇక్కడ కవిత్వానికీ ప్రజలకూ వుండే అవినాభావ సంబంధం సూచింపబడింది. ఊహలో మాత్రమే వున్న సర్వమానవ సమానత్వాన్ని ఆచరణలోకి తెచ్చాడు నేటికవి. ప్రజలు భూత కాలంలో అష్టకష్టాలు పడ్డారు. కవి చేస్తున్న కృషివల్ల వర్తమానం ఆకర్షణీయంగా తీర్చిదిద్దబడింది. భావి ఇంకా ఉజ్జ్వలంగా వుంటుంది. వర్తమానం సుందరాభిసారికలా హేలగా నిలిచి, 'ఆగామి కాల గంభీరస్వామి కంఠం'లో ఒకమాల వేయబోతోంది. ఆ మాలగా నిలిచాడు కవి. అంటే ఈనాటి కవి భూతాన్ని స్మరించకుండా, వర్తమానాన్ని భావితో కలుపుతూ, మానవాళికి భూతల స్వర్గాన్ని సృష్టించడానికి కష్టపడుతున్నాడు. దశ దిశలూ కలుపుతున్నాడు. మానవాళి భావి ఉజ్జ్వలంగా దివ్యంగా వుంటుందనే ఆశాభావంతో ముగుస్తుంది ఈ వసుధైక గీతం :

"వర్తమానం నేడు సుందరాభిసారికవోలె నిలిచి హేలగా
ఆగామి కాల గంభీరస్వామి కంఠాన వేయబోయే మాలగా
నిలిచింది నేను, పిలిచింది నేను, దశదిశల కలిపింది నేను"

అడిగ 'భూమిగీత'లో ఇహము — పరము — జీవుడు : ఈ మూడింటి పరస్పర సంబంధంయొక్క గంభీర వివేచన కొనసాగింది. భూమిని గురించిన మానవుని పరిశీలన, ప్రతిస్పందన ఇందులో చర్చింపబడ్డాయి. మానవుడికి భూమితల్లి, ఆకాశం తండ్రి. మొదటిది ఇహానికీ, రెండవది పరానికీ ప్రతీకలు. ఐహికమైన వాస్తవమే అతణ్ణి పట్టి లాగుతుంది. అయినా ఆధ్యాత్మికమైన దైవచింతన, పాప పుణ్య వివక్షత, పరలోక కల్పన, నాగరకతా ప్రయాణం మొదలైన ఆదర్శాలవైపు దృష్టి సారిస్తాడు. వాస్తవికత—ఆదర్శం: ఈ రెండింటి నడుమా మానవుని వ్యక్తిత్వం సంఘర్షణ పడుతుంది. ఈ సంఘర్షణ అన్ని జీవులకూ లేదు. పశు పక్ష్యాదులు కేవలం భూమికి మాత్రమే అంటిపెట్టుకొని

వుంటాయి. వాటికి 'మట్టి వాసన' మాత్రమే వుంటుంది. మానవుడికి మట్టివాసనాపోదు, ఆదర్శాల ఆకర్షణా విడిచిపెట్టదు. భూమి మీద నిలబడ్డ మానవుడికి ఆకాశం ఆకర్షణే ఎక్కువ. ('భూమి గుండెల్లో వేళ్లు తన్నిన కాళ్ళు నావి, ఊరికే నక్షత్రలోకాలకు ఊహా ప్రయాణం'). ఇహం అనే పంజరంలో పక్షిలాచిక్కుకున్న మానవుడు పరలోకాన్ని గురించిన తపనతో గిలగిల కొట్టుకుంటాడు. పంజరంలోంచి తప్పించుకుందుకు విఫల ప్రయత్నాలు చేస్తాడు. నిస్సహాయంగా చూస్తాడు. తిలక్ 'వసుధైకగీతం'లో ఇంత తాత్త్వికచర్చ లేదు. అయినా సర్వమానవ సమానత్వమూ, కవి మనస్సుకు కావలసిన విశాల పరిధి, ఆర్ద్రతఈ గేయంలో నొక్కి చెప్పబడ్డాయి. నేటి కవి విశ్వరూపం ధరించిన విష్ణుమూర్తి; 'సర్వం సహా చక్రవర్తి'.అతడు సంకుచితమైన జాతిమతాల సరిహద్దుల్నిచెరిపివేయాలి. అన్ని భావాలతోనూ, అన్ని రసాలతోనూ తన వాణిని పలికించి, ప్రపంచంలోని సర్వమాన వాళికీ అభయహస్తం ఇవ్వాలి. దశదిశలనూ కలిపి మానవుని సుఖదుఃఖాలను గానం చెయ్యాలి. సుందరమైన వర్తమానాన్ని ఉజ్జ్వలమైన భావితో అనుసంధించాలి.

కన్నడగీతంలో ఆత్మాన్వేషణ వుంటే, తెలుగు గీతంలో సర్వమానవ సుఖాన్వేషణ, కవికర్తవ్య నిరూపణ వున్నాయి. రెండూ వచన గీతాలే అయినా కన్నడ గీతంలో కవి ఖండగతిని నియతంగా పాటించినట్టు కనబడుతుంది తెలుగుగీతంలో అంత్యప్రాసలు, అంతర్లయ తప్ప మాత్రాగణాలు లేవు. ఇద్దరూ భూమిని గురించే పాడినా, కన్నడకవి భూమిని తల్లిగా భావించగా, తెలుగుకవి ప్రియురాలిగా భావించాడు. కన్నడకవి మానవ జీవితంలోని వివిధ దశల అనుభూతుల్ని వర్ణించగా, తెలుగుకవి సమస్త మానవాళి ఏకత్వాన్ని ప్రబోధించాడు. 'జీవితానికి అర్థం కుదరడంలేదు, ఆత్మసాక్షాత్కార మార్గం కనబడడంలేదు', అనే నిరాశతో ముగుస్తుంది కన్నడగీతం. 'మానవాళికి ఉజ్జ్వల భావివుంది' అనే ఆశావాదంతో ముగుస్తుంది తెలుగుగీతం. అడిగ తననే ఆధారంగా చేసికొని, తన అనుభూతుల్ని చిత్రించాడు. తిలక్ సమస్త భూమండలాన్ని ఆధారంగా చేసికొని, మానవాళి ఏకత్వాన్ని దృష్టిలో పెట్టుకొని, కవిగా తాను చేసిన, చేస్తున్న కృషిని విశదీకరించాడు. అంటే విశ్వకవి అనుభూతుల్ని గానం చేశాడు. అడిగ భూమిని (ఇహాన్ని) గురించే కాకుండా, ఆకాశాన్ని (పరాన్ని) గురించి కూడా చాలా ఆలోచనలు చేశాడు. తిలక్ కేవలం భూమిని (ఇహాన్ని) గురించి మాత్రమే ఆలోచించాడు. అడిగకు భావి అయోమయంగా, కుంటివాడి భుజాలమీద గ్రుడ్డివాడు కూర్చున్నట్టుగా కనబడింది. తిలక్‌కు వర్తమానం సుందరాభిసారికగా, హేలగా నిలిచి, చేతిలో కవి అనే మాలను ధరించి, దానిని 'ఆగామికాల గంభీరస్వామి' మెడలో వేయబోతున్నట్టుగా కనబడింది. అంటే తిలక్ దృష్టిలో నేటికవి సుందరమైన వర్తమానాన్ని, దివ్యమైన భావితో కలిపే పరిమళభరితమైన పూలమాల మొత్తంమీద ఇద్దరు కవులూ, భూమి—మానవుడు; వీరి సంబంధాన్ని గురించే ఆలోచించారని చెప్పవచ్చు. ఆలోచించిన విధానం మాత్రం భిన్నం. ఒకరిది ఆత్మాన్వేషణమార్గం; ఇంకొకరిది సర్వమానవ సమానత్వమార్గం.

గడచిన ఇరవై సంవత్సరాలుగా కన్నడ సాహిత్యంలో ముఖ్యంగా కవితారంగంలో అడిగ ప్రభావం చాలా ఎక్కువ. శ్రీశ్రీ తరువాత—ముఖ్యంగా 1955–65 మధ్యకాలంలో తన గీతాలతో తెలుగు యువకవి లోకాన్ని ప్రభావితం చేసిన కవి తిలక్. ఇద్దరిలోనూ కవితాశైలిని గూర్చిన పట్టుదల కనబడుతుంది. కాని అడిగ కవితలలో మొదట్లో ప్రాచీనపద సహితమూ, సమాస బంధురమూ, గానయోగ్యమూ అయిన భావకవితాశైలి వున్నా, రాను రాను వాస్తవికతతో కూడిన అంతర్లయాత్మకమైన సరళ వచనశైలి వచ్చింది. తిలక్ మొదటినుంచి చివరివరకూ ఎక్కువగా భావకవితాశైలినే అనుసరించాడు. మొదట మాత్రాగణబద్ధంగా, కొన్ని గీతాలు వ్రాసినా, పిమ్మట వచనగీతాలమీదే ఎక్కువదృష్టి నిలిపాడు. ఈ వచన గీతాలలో కూడా మధ్య మధ్య ఏవో రెండు మూడు పాదాలు మామూలు తెలుగు మాటలతో చెప్పినా, ఈయన శైలి నూటికి తొంభైపాళ్ళు తత్సమ పదబాహుళ్యమూ, సమాస భూయిష్ఠమూ అయిన భావకవితాశైలే. ఇద్దరి కవితల్లోనూ అంత్యప్రాసలు ఎక్కువగా దొర్లుతాయి; అనుస్యూతంగా అంతర్లయ ప్రవహిస్తూ వుంటుంది. అయితే ఇద్దరికీ ఒక్క భేదంవుంది. అడిగ వ్రాసిన ప్రతి కవితలోనూ మాత్రాగణాలు—ముఖ్యంగా ఖండగతి కనబడుతుంది. తిలక్ వచన కవితలలో అంత్యప్రాసలు వేసినా మాత్రాగణాలు మాత్రం పాటించలేదు. అంటే అడిగశైలి నిత్యజీవితానికి సంబంధించిన మామూలు మాటలతో కూడిన స్వేచ్ఛాశైలి; చందస్సు మాత్రం మాత్రాగణాల గాడిలో ఇరుక్కుపోతుంది. తిలక్ శైలి ఊహాలోకాలకు సంబంధించిన ప్రాచీన పదాలతో కూడిన ఆలంకారికమైన కావ్యశైలి; ఛందస్సుమాత్రం ఏ బంధమూ లేకుండా స్వేచ్ఛగా సాగిపోయే వచనం. ఇంకొక రకంగా చెప్పాలంటే అడిగకు శైలిని గురించిన పట్టుదల సడలింది కాని ఛందస్సును గురించిన అలవాటుమాత్రం పోలేదు తిలక్‌కు కావ్యశైలిని గురించిన పట్టుదల స్థిరంగా వున్నా, వచన గీతాల్లో ఛందస్సుల సర్పపరిష్వంగాన్నుంచి పూర్తిగా తప్పించుకున్నాడు. అంతమాత్రంచేత తిలక్ ఛందస్సుకు బద్ధవిరోధి అని చెప్పడానికి వీలేదు. వచన కవితల్లో ఛందస్సును పూర్తిగా త్యజించినప్పటికీ, తిలక్ ఉత్పలమాల, చంపకమాల, ఆటవెలది (ఈ ఛందస్సంటే ఆయనకు చాలా యిష్టం)—ఇత్యాది ప్రాచీన ఛందస్సుల్లో ప్రత్యేకంగా కవితలల్లాడు. ('స్వయంవర', 'పరిత్యక్త', 'ఆటవెలది', 'గోరువంకలు'). కావ్యశైలిపై ఆయనకుగల ప్రగాఢాభిమానమే దీనికి కారణం. కన్నడంలో ఒక్క అడిగయే కాదు, ఏ ఆధునిక కవీ కూడా ప్రాచీన ఛందస్సుల్లో కవిత చెప్పలేదు. వాళ్ళు పద్యాల నడుముల్ని పూర్తిగా విరగ్గొట్టారు. తెలుగులో లాగ సాంప్రదాయిక ఛందోవాహిక లేకపోవడం వల్లనే నేటి కన్నడ కవులు మాత్రాగణాలను పట్టుకొని ఊగులాడుతున్నారనిపిస్తుంది. తెలుగు నవ్యకవితా కన్యవుంచుకుంటే ప్రాచీన ఛందస్సుల పట్టుచీరల సమగ్ర ఆచ్ఛాదన వుంచుకుంటుంది. లేకపోతే పూర్తిగ మాత్రాగణాల అంగదట్టాన్ని కూడా పరిత్యజించి, దిగంబరంగా దర్శనమిస్తుంది. మధ్యేమార్గంలేదు. తిలక్ కవిత దీనికి భిన్నంకాదు!

నాగటి చాలున రతనాలు పండాలి!

రైతే దేశానికి వెన్నెముక!

అతడే ఆర్థిక వ్యవస్థకు పునాది!

రైతు చేతికి బలం సమకూర్చాలి!

ఇందుకోసమే గత ఐదు సంవత్సరాలుగా

ఆంధ్రప్రదేశ్‌లో సన్నకారు రైతుల అభివృద్ధిసంస్థ పనిచేస్తోంది.

ఇంతవరకూ చిన్నరైతులకు రు. **31** కోట్ల మేరకు

పరపతి సౌకర్యాన్ని యీ సంస్థ అందజేసింది.

వివిధ పరపతి సంస్థలు అందజేసిన ఆర్థిక సహాయంవల్ల

పేదరైతు జీవితంలో కొత్తదనం వచ్చింది.

ఆంధ్రప్రదేశ్‌లో **174** బ్లాకుల్లో సమగ్ర గ్రామీణాభివృద్ధి

పథకాలవల్ల చిన్నరైతులు స్వయం సమృద్ధి స్థాయికి

చేరుకుంటున్నారు.

చిన్నరైతులు పెద్దయెత్తున సహాయాన్ని పొందుతున్నారు.

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్.

No. 56.

శ్రీ హసంతి

శ్రీ ఇంద్రగంటి భానుమూర్తి

తెలిసిన కథె గోదమ్మా విన
తీరని వ్యథె యౌనమ్మా—

ఊరిలోన మసలే మా
గాలికి, మరి ధూళికే—

ఎండి మోడుబారిన మా
యేటి గట్టు రావికీ—

అచటి కొచ్చిపోయేటి
ఆరు ఋతువులకు సైతం—

కన్నీళ్లె ఇచట కురియు
కరి మొయిళ్ల బారుతూ—

*   *   *

గాలిని కదిలేస్తే మా
ఊరి ఊసు చెబుతుందీ—

గాలి

మా వూరొక పల్లెటూరు
మమతల మల్లెల చేరూ
మావా, అన్నా, అల్లుడు
మరదల, వదినా, అనుకొను

కళ్లకు చల్లగ తగుల్తు
పల్లె చివర మొగలేరూ
ఇళ్లనించు బం? రూ
ఎదల వంచు కన్నీరూ—

కోవెల అట, కోవెలలో
కోదండ స్వామివారు.
స్వామిని సేవించుకొంటు
వాకిట విరిగన్నేరూ—

దొడ్డరైతు రామయ్యలు
దోసపాదు కుటుంబాలు
పాడీ పంటా చేలూ—
మూడు పూల జీవితాలు—

కీడొస్తే మేలొస్తే
కీడూ మేలూ వస్తే
వాగొస్తే వరదొస్తే
వరదా వాగూ వస్తే

కరువైతే బరువైతే
బరువూ కరువూ అయితే
కష్టం సుఖమూ వొస్తే
కలసి వకటిగా నిలిచే—
మా వూరొక పల్లెటూరు
మమతల మల్లెల చేరూ—

ఏటిగట్టు రావేమో
ఏమంటుందం టే—

రావి

రవల పాగాలేని
రచ్చపట్టూ రాజు
మా పల్లె కంతకూ
మగ మహా రాజూ!
మేలైన తలకట్టు
మిసిమి మీసపు కట్టు
పెదరైతు రామయ్య!
పేరుకూ తగినయ్య—

తలకు పాగా చుట్టి
నోట చుట్టా పెట్టి
పొన్నుకర్రాపైన
మొగము నిలబెట్టి
చేని గట్టూపైన
కాన వచ్చేవాడు
పెదరైతు రామయ్య
పేరుకూ తగినయ్య

ముద్దబంతికి మల్లె
పెద్ద కుంకుమబొట్టు
కంటె మెడలో కట్ల
కాసులా పేరూ
ఉండుండి కిణ్ కిణను
వెండి మట్టెలూ
సీతమ్మ ఆయమ్మ
ఆతనీ యిల్లాలు

ముక్కునా ముత్తెంపు
ముంగరమ్మా!
ముచ్చటగ కొప్పేమొ
ముదుచునమ్మా!
కొప్పులో ఒక పువ్వె
కులుకునమ్మా!
సీతమ్మె ఆయమ్మ
ఆతనీ యిల్లాలు—

దొడ్డరైతు రామయ్యది
దోసపాదు కుటుంబం—
కొడళ్లూ కొడుకులతో
కూతుళ్లూ అల్లురతో
కలకలలాడే యిల్లూ
గలగలలాడే యిల్లూ
ఆ యింటా పుట్టిందీ
అందమైన కొమ్మందీ—

అచటి కొచ్చి వెళ్లేటి
ఆరు ఋతువు లివిగో
ఏవోఁ, ఏవోఁ అంటూ
ఏదో అంటున్నాయి—
బంగరుకోనా భావల్లారా!
చంద్రాగిరీ చానల్లారా!

పువ్వా పువ్వా
పూసిందాటా!
ఏమీ పువ్వా
పూసిందాటే?
ఎవరైన చూశారటే—ఓయమ్మ
పువుపేరు విన్నారటే—

పేరూ పేరూ
శారద ఏమిటె?
ఏమోనమ్మా
ఏమే వర్షా?
హేమంత సీమంతినీ — ఓయమ్మ
ఏమందురే యింతినీ—

నాకూ తెలియదు
నా తోడమ్మా

ఒక వాసంతికె
ఉన్నది తెలుసూ
వాసంతి నువు చెప్పవే—ఓయమ్మ
వగలాడి నోర్విప్పవే—

పూచిన పూలా
పొదరూవంటీ
కలవారింటా
గల గల నవ్వే
పిల్లెవరొ ఎరుగరేవరి—ఓయమ్మ
పేరయితె మల్లికే మరి—

గ్రీష్మ, వసంత

సీతాకోకా చిలకల్లే, యి టె
యిట్టె ఎగిరిపోయేదీ ఎవరే?
ఎవరే, ఎవరే, ఎవరే?
మల్లిక, మల్లిక, మల్లికె!

మల్లె మొగ్గలకు మనసిచ్చి—మన
సైన మల్లెలకు జడ యిచ్చేదీ
ఎవరే, ఎవరే, ఎవరే?
మల్లిక, మల్లిక, మల్లికె!

మావి తోపులో కోవెల కోయన
కోయని కోయని కొసరేదీ—
ఎవరే, ఎవరే, ఎవరే?
మల్లిక, మల్లిక, మల్లికె!

వర్ష

మొయిలు కిటికీ తెరిచి
ముత్యాలు జల్లితే
పాపటా చేరుగా
ముత్యాలపేరుగా
చెవుల జూకాలుగా
చెరువుకొని, జడులలో
ఆడుకొందీ — పాప
పాడుకొందీ —

కాయితపు పడవలకు
కలలెత్తిపోసీ
పాడితో పంటతో
పల్లె నిండాలనీ
జడిమధ్య పడవనా
కడకు వదిలిందీ—
ఆకొంటూ — పాప
పాడుకొంటూ—

గాలిలో ఓరగా
వాలుతెర చాపెత్తి
నేనె రావాలనీ
వేల తడవాలనీ
కాగితపు ఓడతో
కబురు పంపిందీ—
పాడుకొంటూ—పాప
ఆడుకొంటూ—

వానొచ్చెనే అంటు
తాను మేనే మరిచి
గిర గిరా జల్లులో
తిరిగి తిరిగీ అరెరె
పాపమయ్యో నీట
పాప పడి పోయెనే—
ఆడుకొంటూ—జల్లు
లాడుకొంటూ—

శరత్తు

వెన్నెల్లో, వెన్నెల్లో
వెన్నెల్లో కన్నెల్లూ!
కన్నెల్లో ఆటల్లూ
ఆటల్లో పాటల్లూ!

కన్నెల్లో కలకంఠి
గళమెత్తి పాడిందీ
గళమెత్తి తీయంగా
కలకంఠీ పాడితే
వెండీ మెట్లా కిన్నెరవీణా
వెన్నెల మీటిందమ్మా!

కన్నెలతో కల్యాణీ
ఎన్నో ఆటలాడిందీ
కల్యాణీ కన్యలతో
కలిసీ మెలిసీ ఆడంగా
పువ్వులగాలీ మంచీగంధం
పూసీ పోయిందమ్మా!

గోరింటా కొమ్మలకూ
పయ్యంటా తగిలిందీ
కొమ్మలకూ ఆ కొమ్మా
కొసకొంగూ తగిలితే
రివ్వున నెదమరు తేజీ వచ్చని
రెక్కా విప్పిందమ్మా!

హేమంత

మొగలీ పువ్వంటే
మగనీకోసం కన్నె
గొబ్బిళ్లో గొబ్బిళ్లని
గొబ్బీ పెట్టిందీ—

గుమ్మడి పండంటీ
కొడుకూకోసం కన్నె
గొబ్బిళ్లో గొబ్బిళ్లని
గొబ్బీ తట్టిందీ—

కొత్తా కోర్కెలతో
గుండె గుబాళింపా
గొబ్బీ పాటలుపాడీ
గొబ్బీ కొలిచిందీ

తరువాయి కధ నేను
తలవనైనా లేను
మంచుతో మనసంత
మసకేసి పోయేను
మాటరాకా గొంతు
పూడి పోయేను—

శిశిర

గాలి కదలదు
రావియా కొడదు
చెలులైన ఒకమాట
చెప్పలేరాయె—
మిగిలింది నేనింక
మీకు చెప్పాలి—

ఒకమారు మొగలేరు
ఉరవడిగ పొంగింది
పొంగింది పొరలింది
సుడులు తిరిగిందీ—

వరద గోదారల్లె
వరద కృష్ణమ్మల్లె

గలగలా అల అలా
అల అలా జల జలా

కొసనీటి పడగెత్తి
ఇసకలో బుసకొడుతు
పగబట్టు తాచల్లె
వొచ్చి లేసిందీ—

అటు పొంగి, ఇటుపొంగి
అందుకొంటూ నింగి
ఆడిపోతూ, అల్ల
లాడి పోతూ—

తాటాకు బొమ్మ యిఁటె
తాటకై పోయినటు
ముద్దరాలీ ఏరు
పెద్ద రక్కసిలాగ

వాతావరణమంత
భీతావహమై పోగ
ఉరవడిగ, వడి వడిగ
పరవళ్లు తొక్కుతూ

ఏరు తీయుటలేదు
ఏమి తోచుటలేదు
ఏరు బలి కోరింది
ఊరు నీరై పోయె

ఊరు ఊరంతాను
ఏరు దరి చేరింది
ముడుపు లిచ్చిందీ— మరి
మొక్కు లిచ్చిందీ—

ముగ్గులిడి పువ్వులిడి
పూజ చేసిందీ
జోతులిడి వణకేటి
చేతులెత్తిందీ-

కళ్లల్లా ప్రాణాలు
కదులుతున్నాయి
కళ్లు కన్నీళ్లుగా
కరుగుతున్నాయి

ఏరు తీయుటలేదు
ఏమి తోచుటలేదు.

*　　*　　*

పెదరైతు అర మగత
నిదరలో కలలోకి

నాటి రాత్రి వచ్చి
ఏటి దేవత అంది

"కన్నె మల్లిని నాకు
కనక బలి యిస్తివా
నీ యిల్లు, నీ పల్లె
నిలిచి ఉంటాయి!"

అన్నమాటలు వినగ
అంతలో మెలకువై
గామయ్య స్థాణువై
రాయియై పోయె—

ఆ మాట ఆనోట
ఆ నోట నోటగా
వార్త కార్చిచ్చులా
పాకిపోయిందీ—

*　　*　　*

భార్యా బిడ్డలతో అన్నయ్యలు
భర్త యిల్లాగల అక్కయ్యలు
పిల్లా పాపా లేగలు తీగలు
జాలిగ చూశారందరూ
వాలుగ చూశారందరూ
ఆ మల్లికనే ఆ మల్లికనే

మల్లిక ఒక్కతె మనకిక దిక్కని
మల్లిక ఒకతే హృదయమున్నదని
అయ్యలు అమ్మలు పిన్నలు పెద్దలు
ఆ మల్లికనే ఆ మల్లికనే
జాలిగ చూశారందరూ
బేలగ చూశారందరు

*　　*　　*

తండ్రీ ఏదో చెప్పాలను కొను
ఇల యెట్టోక పరి తనదెస చూచు
కలవరపడుతూ కన్నుల నీరిడు
తలవాల్చుకొనీ తల్లడిలూ

అయ్య యేదొ చెప్పాలని చూస్తే
అమ్మేమో వారించగ చూచు
అయ్యకు నోటా మాటా రాదు
అమ్మకు కంటా కన్నీరాగదు

*　　*　　*

ఇల్లిల్లూ మరి ఊరంతా
ఏరూ, నీరూ, హోరూ, జోరూ

తన కలలన్నీ కోరికలన్నీ
అణిగీ మణిగీ మునిగిపోయి
మనసంతా ఒక కల్లోలం
మనిషిని ఏదో ఆవేశం
ఆవేశించీ ప్రేరేపించీ
అయ్యోపాపం అనిపించీ

తండ్రి వేదనా తల్లి రోదనా
తననే ముందుకు నడిపించీ
అయ్యకేమొ చెప్పాలని వస్తే
అటు పక్కకు తల తిప్పక ఏడ్చు
అమ్మనేమొ ఓదార్చగ జూస్తే
అయ్యవంక గని తను తల వాల్చు.

*　　*　　*

మౌనంగా తనె ముందుకు వచ్చీ
మల్లిక తల్లీ తండ్రీ చెంపల
జారేటీ కన్నీటిని తుడిచీ
జాలిగ ఒక నిట్టూర్పును విడిచీ
కళ్లతోనె నిర్ణయమూ తెలిపీ
కన్నవారికీ మ్రొక్కిందీ—

పిన్నలు పెద్దలు అందరినీ
పేరు పేరునా ఓదార్చిందీ
ఇల్లూ పల్లెను గొడ్డూగోదను
ఒళ్లు నాకు లేదూడలనూ
కళ్లారాగని చివరి సారిగా
మల్లిక వీడ్కోల్ చెప్పిందీ—

*　　*　　*

కాళ్లకు వొదినా పసుపూ పూసీ
కాటుక కుంకుమ తీరిస్తే,

అన్నా కొత్తా చీరా తెస్తే
అక్కా జడలో పూలు ముడిస్తే,

తల్లీ బంగరు సొమ్ములు పెట్టీ
తనివి తీరగా చూస్తుంటే,

మల్లిక వారందరినీ చూసీ
అల్లన మెల్లగ నవ్విందీ—

*　　*　　*

మల్లికతో ఏటి కడకు
పల్లె కదలి వచ్చింది
ప్రతిగుండె మంచుబండ
కన్నొక కన్నీటి కుండ

తీరాన అంబరాన
దిగులు మబ్బు మూసింది
కనిపించని వేదనతో
గాలి నిండిపోయింది—

*   *   *

పెళ్లికూతురై తరలి వచ్చి ఆ
మల్లిక నీటను అడుగిడుతూ
వదినను చూసీ అంటుందీ—

కాళ్లకి నీవూ పూసిన పసుపూ
కరిగిందమ్మా వదినమ్మా!

వదినమ్మా తలవాల్చి ఏడ్చితే
మల్లిక మెల్లగ నవ్విందీ—

పెళ్లికూతురుగ తరలి వచ్చినా
మల్లిక ముందుకు అడుగిడుతూ
అన్నను చూసీ అంటుందీ—

అన్నా నీవూ పెట్టిన చీరా
అయ్యో తడిసిం దన్నయ్యా!

అన్నయ్యా తలవంచి ఏడ్చితే
మల్లిక మెల్లగ నవ్విందీ—

పెళ్లి కూతురై అచటికి వచ్చిన
మల్లిక నీటను ముందుకు వెళ్లీ
అమ్మను చూసీ అంటుందీ

అమ్మా నీవూ పెట్టిన సొమ్ములు
అయ్యో ఏటా గలిసినవమ్మా

అమ్మా కరిగి కన్నీరైతే
మల్లిక మెల్లగ నవ్విందీ—

పెళ్లికూతురై ఏటికి వచ్చిన
మల్లిక కొంచెం ముందుకు వెళ్లీ
అక్కను చూసీ అంటుందీ—

అక్కా జడలో ముడిచిన పూలూ
అయ్యో మునిగిపోయినవమ్మా!

అక్కయ్యా తలవాల్చి ఏడ్చితే
మల్లిక మెల్లగ నవ్విందీ—

పెళ్లికూతురై ఏటను గలిసే
మల్లిక శిరస్సువరకూ మునిగి
అయ్యను చూసీ చూసీ చూసీ
అట్టే కరిగిపోయిందీ—

*   *   *

కన్నీళ్లే ఇచట కురియు
కరిమొయిళ్ల బారుకూ
తెలిసిన కథేగాదమ్మా—విన
తీరనివ్యథే అవునమ్మా!

సృష్టి

కొలకలూరి

శ్మశానం
　పుడమి మర్మస్థానం.

సమాధి
శృంగార చేష్ట.

శవం
స్పెర్మ్.

గడ్డిపరక
బిడ్డ.

కాలం నాణేనికి
శిథిల కణం బొరుసు,
జీవశక్తి బొమ్మ.



శ్రీ జంధ్యాల బాలగంగాధర తిలక్

ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యత

దేశ సామాజిక, సాంస్కృతిక, నైతిక, ఆర్థికాభివృద్ధికి ఆ దేశ ప్రజలెల్లరు విద్యావంతులయి ఉండుట ఎంతయినా ఆవశ్యకము. కనీసము అక్షరాస్యులయి ఉండవలెను. అట్లు కానిచో ఆ దేశము త్వరితగతిని అభివృద్ధి చెందలేదు. నిరక్షరాస్యత ప్రజాస్వామ్యము మనుగడకే పెద్ద గొడ్డలిపెట్టు. దాదాపు అన్ని సమస్యలకు నిరక్షరాస్యత మూలకారణము. వ్యావసాయిక ఉత్పాదనము, పారిశ్రామిక ఉత్పాదనము, పెక్కు అల్ప వికసిత దేశములలో అసంతృప్తికరముగా ఉండుటకు ఒక ముఖ్యకారణము నిరక్షరాస్యతయే అని పేర్కొన వచ్చును. నిరుద్యోగ నిర్మూలనము, దారిద్ర్య నిర్మూలనము, అసమానతలు తగ్గించుట, జనాభా పెరుగుదల నరికట్టుట, ఆరోగ్యము, పారిశుధ్యము మొదలగు కార్యక్రమములలో ఏ కార్యక్రమము అయినను విజయవంతమగుట ప్రజల విద్యా స్థాయిపై ఆధారపడి యున్నది. నిరక్షరాస్యులయిన ప్రజలపై ప్రభుత్వము ఎంతవ్యయము చేసినను సంతృప్తికరమగు ఫలితము కనిపించదు. ప్రఖ్యాత జనాభా సిద్ధాంతవేత్త థామస్ రాబర్ట్ మాల్థస్ (Thomas Robert Malthus) "దరిద్రుల స్థితిగతులను మెరుగుపరచవలెనను ఉద్దేశ్యముతో ప్రభుత్వము వెచ్చించు నిధులు వారి స్థితిగతులను మెరుగు పరచకుండుటయేకాక వారి దయనీయస్థితులను మరింత దయనీయ దశలోనికి తీసికొనిపోవుచున్నవి. నిజముగా వారి స్థితులను మెరుగు పరచి వారిని సంతోషకరమగు జాతి పౌరులుగా తీర్చిదిద్దుటకు విద్యా వ్యాప్తియే ఏకైక సాధన"మని వక్కాణించెను.[1]

విద్య ప్రజల వ్యక్తిగత జీవితములలో సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుటయేకాక దేశాభివృద్ధికి కూడా ఎంతో సహకరించును. ఏ దేశ మయినను అందలి ప్రజలలో కనీసము 40 శాతము అక్షరాస్యులయి ఉండకున్న ఆ దేశము అభివృద్ధి చెందజాలదని ఆండర్సన్ — బౌమన్ (Anderson and Bowman)లు తీర్మానించిరి.[2] కనీసము 70 శాతము ప్రజలు అక్షరాస్యులుగను, 6-11 సం.ల వయసుగల వారిలో కనీసము 50 శాతము ప్రాథమిక విద్యాలయములలోను, 11-14 సం.ల వయసుగల వారిలో కనీసము 30శాతము మాధ్యమిక విద్యాలయాలలోను నమోదు అయి ఉన్నయెడల ఆ దేశములో తలసరి ఆదాయము 500 అమెరికను డాలర్లకు తక్కువ కాకుండా ఉండవచ్చునని ఇటీవలి పరిశోధనవలన తెలియుచున్నది.[3]

క్రీ. శ. 1800 నాటికి ఇంగ్లండులో అక్షరాస్యత శాతము 65-75అయి ఉండునని అంచనా.[4] ఆ దేశములో పారిశ్రామిక విప్లవమునకు ఈ అక్షరాస్యత రేటు ఎంతయో తోడ్పడియుండును కదా! నిరక్షరాస్యు లధికముగా ఉన్నయెడల పారిశ్రామిక విప్లవము సంభవించియుండెడిది కాదేమో!

మన దేశము ముఖ్యముగా వ్యావసాయిక దేశము. కాని మన దేశములో వ్యవసాయములో శ్రామికుని తలసరి ఉత్పాదకత ఇతర దేశములతో పోల్చి చూచిన చాలా తక్కువ. ఇందులకు ప్రధాన కారణము నిరక్షరాస్యతయే. వ్యవసాయములో యంత్రీకరణము (mechanisation) నకు, క్రొత్త విత్తనముల ఉపయోగమునకు, రసాయనికముల ఉపయోగమునకు, అధునాతన పద్ధతుల ఉపయోగమునకు మొదలయిన అన్ని కార్యములకును కర్షకుల అక్షరాస్యత, విద్యాస్థాయిలకు ప్రగాఢ సంబంధమున్నదని పలువురు శాస్త్రవేత్తలు నిరూపించిరి.[5] కావున ప్రజలలో అక్షరాస్యత వ్యాప్తి గావించిన యెడల అధునాతన పరికరముల ఉపయోగము పెరిగి శ్రామికుని ఉత్పాదకత, భూమి ఉత్పాదకత, మొత్తము కృషి ఉత్పాదనము అధికమగును.

కేవలము ఆర్థిక పురోగతికేకాక అక్షరాస్యత, విద్యావ్యాప్తి సమాజ శ్రేయస్సుకు మరెన్నో విధముల తోడ్పడును. ముఖ్యముగా కుటుంబ నియంత్రణ కార్యక్రమము, శిశు సంరక్షణ, ఆరోగ్యము మున్నగు కార్యక్రమములు విజయవంతమగుటకు అక్షరాస్యత ఆవశ్యకత పలువురు గుర్తించిరి. విద్యావ్యాప్తి వలన సమాజములో నేరములు తగ్గుటకు అవకాశములున్నవి. ప్రజలలో సంకుచిత వ్యక్తిగత దృక్పథములుపోయి వానిస్థానమున సామాజిక దృక్పథము ఏర్పడును. సనాతన మూఢ నమ్మకములుపోయి వైజ్ఞానిక దృక్పథము చోటు చేసికొనును. ఈనూతన విలువలు భావితరముల వారికి సంక్రమించి సమాజము ఎల్లవేళల ఆరోగ్యకరమగు రీతిలో అభివృద్ధి చెందును.

అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ సాధించిన ప్రగతిని కూలంకషము అవలోకనము చేయుట ఈవ్యాసముయొక్క ప్రధానోద్దేశ్యము. జాతీయ స్థాయితో పోల్చిచూచిన ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యత చాలా తక్కువ. 1971 నాటి అక్షరాస్యత ఆధారముగా మన దేశములోని రాష్ట్రములను కేంద్రపాలిత ప్రాంతములను కలిపి 5 భాగములు చేయగా ఆంధ్రప్రదేశ్ నాల్గవ విభాగములోనికి వచ్చుచున్నది. అక్షరాస్యతలో మన రాష్ట్రమునకు 21వ స్థానము లభించుచున్నది.[6]

మన దేశములో 'అక్షరాస్యత'కు సరియగునిర్వచన మీయబడలేదు చదువుట, వ్రాయుట ఎరింగిన ప్రతిఒక్కరు అక్షరాస్యులుగా పరిగణింపబడుచున్నారు. అట్లుకాక 'అక్షరాస్యత'కు విస్తృతమయిన అర్థమీయవలెనని పలువురు మేధావుల సంకల్పము.[7] అంతర్జాతీయ

విద్యా, వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థవారు 1965లో టెహరాన్‌లో ఏర్పాటు చేసిన సమావేశములో 'అక్షరాస్యత'కు విస్తృతము విశిష్టమయిన రూప మిచ్చిరి "అక్షరాస్యత కేవలము ధ్యేయము కారాదు. అది మానవునికి కేవలము అక్షర జ్ఞాన మిచ్చుటతో పూర్తి కాదు. మానవునికి తన సామాజిక, సాంస్కృతిక, నైతిక, ఆర్థిక, పౌర బాధ్యతల నెరిగింగింపజేయుటకు తోడ్పడవలెను. తాను చేయుచున్న వృత్తి గురించి క్రొత్త విషయములు తెలిసికొనుటకు, వాటిని ఆచరణలో పెట్టుటకు సహకరించవలెను. అప్పుడే అది అసలయిన (సంపూర్ణ) అక్షరాస్యత అనబడును."[8] దీనినే పలువురు కార్యపరమగు అక్షరాస్యత (Functional Literacy) అని వ్యవహరించెదరు. సాధారణ అక్షరాస్యత దాదాపు 4 సం. ల ప్రాథమిక విద్యాభ్యాసము వలన పొందవచ్చును. కాని కార్యపరమగు అక్షరాస్యత కేవలము ప్రాథమిక విద్యాభ్యాసము వలన సాధింప శక్యము కాదు. మాధ్యమిక విద్యాస్థాయి వరకు అభ్యసించిన గాని కార్యపరమగు అక్షరాస్యత సాధించలేము. కనుకనే మన రాజ్యాంగములో 14 సం. ల వయసులోపు బాలబాలిక లందరకును ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యావిధానముద్వారా విద్య నొసంగవలెనని జాతి నిర్మాతలు పేర్కొనినారు. కార్యపరమగు అక్షరాస్యత సాధించుటకు ముందు సాధారణ అక్షరాస్యత సాధించుట ఆవశ్యకము.

అక్షరాస్యతకు ఈ విధమగు అర్థమిచ్చినయెడల (కార్యపరమగు) అక్షరాస్యుల సంఖ్య మన సాంఖ్యక సంస్థలు సేకరించిన సంఖ్యలకంటె చాలా తక్కువగా నుండును. అభివృద్ధి చెందుచున్న దేశములలో కార్యపరమగు అక్షరాస్యత సాధించుటకు చాలా కాలము పట్టవచ్చును. కాని కనీసము సాధారణ అక్షరాస్యత త్వరితగతిని సాధించుట అత్యంత ఆవశ్యకము.

అక్షరాస్యత రేటు కనుగొనుటలో కొన్ని పేర్కొనదగు తేడాలున్నవి. అన్ని వయసులకు చెందిన జనాభాలో అక్షరాస్యుల శాతమును సవరణ చేయబడని అక్షరాస్యత శాతము (Crude or Unadjusted rate of literacy) అందురు. కాని ఈ పద్ధతిలో ఒక ముఖ్యమయిన బలహీనత కాన్పించును 4–5 సం. లకు లోపు వయసు కలిగిన పిల్లలలో నిరక్షరాస్యత కలదని. లేక వారు అక్షరాస్యులు కారని వ్యవహరించుట అవివేకను. కావున 4 సం.లలోపు పిల్లల సంఖ్యను జనాభా సంఖ్యలనుండి తీసివేసి అక్షరాస్యుల శాతము కనుగొనుట సరియగు పద్ధతి. ఈ విధముగా కనుగొన్న అక్షరాస్యత శాతమును సవరణ చేయబడిన అక్షరాస్యత శాతము (Adjusted Rate of Literacy) అందురు. కాని సాధారణముగా ఏ దేశములోనయినను కనీసము 15 సం.ల వయసు కలిగినవారే శ్రామికులుగ పనిచేయుదురు. [9] ఈ శ్రామికులే దేశ సామాజిక ఆర్థికాభివృద్ధికి మూలకారకులు. కావున కొందరు 15 సం.లకు మించిన వయసు కలిగిన జనాభాను, వారిలోని అక్షరాస్యులను మాత్రమే పరిగణించి అక్షరాస్యత శాతములు కనుగొందురు. ఈ విధముగా కనుగొన్న అక్షరాస్యత శాతమును వయోజనులలో అక్షరాస్యత శాతము (Adult Literacy Rate) అని కూడా అందురు. మరొక పద్ధతి ననుసరించి విభిన్న వయసు గ్రూపులకు చెందిన జనాభాలో అక్షరాస్యులను పరిగణించి ఆయా గ్రూపులకు వేర్వేరు అక్షరాస్యత శాతములను కనుగొందురు.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఈ విభిన్న రకముల అక్షరాస్యత శాతముల గురించి తెలిసికొందము :

ఆంధ్రప్రదేశ్‌లో 1961లో కంటె 1971లో నిరక్షరాస్యులధికముగా ఉన్నారు. 1961లో మన రాష్ట్రములో నిరక్షరాస్యులు 28.4 మిలియనులు. కాని 1971 నాటికి ఈ సంఖ్య 32.8 మిలియను లయినది. అనగా ఈ దశాబ్దములో 15.7 శాతము నిరక్షరాస్యుల సంఖ్య అభివృద్ధి చెందినది. మన రాష్ట్రమునకు సంబంధించిన జనాభా, అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, అభివృద్ధి, సవరణ చేయబడని అక్షరాస్యత శాతములు పట్టిక సంఖ్య 1లో పొందుపరుపబడినవి.

అక్షరాస్యతలోను అక్షరాస్యత అభివృద్ధిలోను స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసము ఎక్కువగా కన్పించుచున్నది. 1971లో పురుషులలో 33.17 శాతము అక్షరాస్యులు. కాని స్త్రీలలో కేవలము 15.77 శాతము అక్షరాస్యులు. ఈ వ్యత్యాసములు గ్రామ ప్రాంతములలోను పట్టణ ప్రాంతములలోను కూడా బాగుగా కన్పించుచున్నవి. గ్రామ ప్రాంతములలో 1971లో పురుషులలో అక్షరాస్యత శాతము 27 3 కాగా స్త్రీలలో కేవలము 10.9 శాతము మాత్రమే. పట్టణ ప్రాంతములలో పురుషులలో 57 3 శాతము, స్త్రీలలో 36.3 శాతము అక్షరాస్యులు. ఈ విధముగా స్త్రీ పురుషులమధ్య అక్షరాస్యత స్థాయి సమముగాలేదు. కాని 1961 నుండి 1971 వరకు అక్షరాస్యతలో అభివృద్ధి శాతము స్త్రీలలో ఎక్కువగా ఉండుట మన ప్రగతికి సంకేతమే! పురుషులలో అక్షరాస్యత సం.నకు 3.3 శాతము చొ.న అభివృద్ధి కాగా, స్త్రీ అక్షరాస్యులు 5.8 శాతము చొ.న అభివృద్ధి చెందిరి.

గ్రామ ప్రాంతములలోను పట్టణ ప్రాంతములలోను కూడా అక్షరాస్యతలో వ్యత్యాసములు పేర్కొనదగిన స్థాయిలో నున్నవి. పట్టణ ప్రాంతములలో 1971లో 47 శాతము అక్షరాస్యులు. కాని గ్రామప్రాంతములలో కేవలము 19.2 శాతము అక్షరాస్యులు. 1961–1971 దశాబ్దములో గ్రామప్రాంతములలో అక్షరాస్యుల అభివృద్ధి రేటు కూడా పట్టణ ప్రాంతములలోని రేటుకంటె తక్కువగా నున్నది. పట్టణ ప్రాంతములలో ఈ రేటు 5.1 శాతము. కాని గ్రామప్రాంతములలో ఈ రేటు 3.4 శాతము.

ఈ విధముగా స్త్రీ పురుషుల మధ్యను, గ్రామ ప్రాంతములు పట్టణ ప్రాంతములు మధ్యను అక్షరాస్యతలోను అక్షరాస్యత అభివృద్ధి రేటులోను అసమానతలు తీవ్రముగా నున్నవని తెలియుచున్నది. కేవలము లింగ, ప్రాంతముల మధ్య భేదమే కాక విభిన్న కులముల వారిమధ్యకూడా అక్షరాస్యతలో అసమానతలు గోచరమగుచున్నవి. అవి పట్టిక 2లో పొందుపరుపబడినవి.

ప ట్టి క స ం ఖ్య 1

ఆంధ్రప్రదేశ్‌లో జనాభా, అక్షరాస్యులు, నిరక్షరాస్యులు : అభివృద్ధి

	మొత్తము		పురుషులు		స్త్రీలు	
	1961	1971	1961	1971	1961	1971
జనాభా : (మిలియన్లలో)						
మొత్తము	35.99	43.50(2.09)	18.16	22.01(2.12)	17.82	21.50(2.07)
గ్రామ ప్రాంతములు	29.74	35.10(1.80)	14.94	17.69(1.84)	14.77	17.40(1.78)
పట్టణ ,,	6.27	8.41(3.41)	3.21	4.31(3.43)	3.06	4.10(3.40)
అక్షరాస్యులు : (మిలియన్లలో)						
మొత్తము	7.63	10.69(4.01)	5.48	7.30(3.32)	2.14	3.39(5.84)
గ్రామ ప్రాంతములు	5.04	6.73(3.35)	3.75	4·83(2.88)	1.25	1.90(5.20)
పట్టణ ,,	7.63	10.69(5.12)	5.48	7.30(4.36)	2.14	3.39(6.56)
నిరక్షరాస్యులు: (మిలియన్లలో)						
మొత్తము	28.36	32.81(1.57)	12.68	14.71(1.60)	15.68	18.11(1 55)
గ్రామ ప్రాంతములు	24.70	28.37(1.49)	11.19	12.86(1.49)	13.52	15.50(1.46)
పట్టణ ,,	3.65	4.45(2.19)	1.49	1.84(2·35)	2.16	2.61(2.08)
అక్షరాస్యుల శాతము :						
మొత్తము	21.20	24.58	30.18	33.17	12.01	15.77
గ్రామ ప్రాంతములు	16.95	19.17	25.10	27.30	8.46	10.92
పట్టణ ,,	41.79	47.09	53·58	57.31	29.41	36.34
నిరక్షరాస్యుల శాతము :						
మొత్తము	78.80	75.42	69.82	66.83	87.99	84.23
గ్రామ ప్రాంతములు	83.05	80.83	74.90	72.70	91.54	89.08
పట్టణ ,,	58.21	52.91	46.42	42.69	70.59	63.66

గ మ ని క : కుండలీకరణములలోని సంఖ్యలు దశాబ్దములో సం.నకు అభివృద్ధి శాతములు :

మూలము : Census of India, 1971

పట్టిక సంఖ్య 2

ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న కులముల వారిలో అక్షరాస్యత, 1971

(శాతములు)

	మొత్తము	పురుషులు	స్త్రీలు
షెడ్యూల్డు కులముల వారు :			
మొత్తము	10.66	15.83	5.29
గ్రామ ప్రాంతములు	8.40	12.96	3.72
పట్టణ ,,	27.53	37.68	17.02
షెడ్యూల్డు తెగలవారు :			
మొత్తము	5.34	8.47	2.13
గ్రామ ప్రాంతములు	4.78	7.73	1.76
పట్టణ ,,	15.74	21 84	9.16
అన్ని కులముల వారు :			
మొత్తము	24.58	33.17	15.77
గ్రామ ప్రాంతములు	19.17	27.30	10.92
పట్టణ ,,	47.09	57.31	36.34

మూలము : Census of India, 1971

పై పట్టిక ఆధారముగా షెడ్యూల్డు కులములవారు బాగుగా వెనుకబడి యున్నట్లును, షెడ్యూల్డు తెగలవారు షెడ్యూల్డు కులముల వారికంటె ఇంకను వెనుకబడియున్నట్లును స్పష్టమగుచున్నది. షెడ్యూల్డు కులములు/తెగల వారిలో నిరక్షరాస్యత ప్రబలియున్నట్లు కూడా తెలియుచున్నది.

ఆంధ్రప్రదేశ్‌లోని విభిన్న ప్రాంతములలో అక్షరాస్యతస్థాయి ఎట్లున్నదో తెలిసికొనుట అవసరము. రాష్ట్రములోని 21 జిల్లాలలోని స్త్రీలలోను, పురుషులలోను, మొత్తము జనాభాలోను అక్షరాస్యత శాతములు పట్టిక సంఖ్య 3లో ఈయబడినవి. మొత్తము జనాభాలో అక్షరాస్యత ఆధారముగా స్థాయిని సూచించు సంఖ్యలు (Rank orderings) కూడా ఈయబడినవి. దీనినిబట్టి అక్షరాస్యతలో హైదరాబాదు, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, గుంటూరు జిల్లాలు బాగుగా అభివృద్ధి చెందినట్లును, మెదక్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు బాగుగా వెనుకబడి యున్నట్లును తెలియుచున్నది. ముఖ్యముగా తెలంగాణా జిల్లాలు వెనుకబడియుండుట స్పష్టముగా గోచరమగుచున్నది. మొత్తము జనాభాలోని అక్షరాస్యత ఆధారముగా మనరాష్ట్రములోని జిల్లాలను పట్టిక సంఖ్య 4లో చూపిన రీతిగా 3 భాగములుగా చేయవచ్చును.

అక్షరాస్యతలో వెనుకబడిన జిల్లాలు ఆర్థికంగా కూడ వెనుకబడియున్నవి. ఉదాహరణకు హైదరాబాదు, కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలలో తలసరి ఆదాయము స్థిర ధరలలో రు. 275– రు. 402ల మధ్య ఉన్నది. ఈ జిల్లాలు అక్షరాస్యతలో బాగుగా అభివృద్ధి చెందిన జిల్లాలు. నల్గొండ, కరీమ్‌నగర్, మహబూబ్‌నగర్ మొదలగు జిల్లాలలో తలసరి ఆదాయము రు. 250 కంటె తక్కువగా నున్నది. మహబూబ్‌నగర్‌లో ఆదాయము రు. 192లు మాత్రమే.[10] ఈ జిల్లాలు అక్షరాస్యతలో కూడా వెనుకబడియున్నట్లు మనము గమనించియున్నాము. కావున ఆర్థిక కారణములు అక్షరాస్యతలో వెనుకబడి యుండుటకు, అభివృద్ధి చెందుటకు ప్రధాన కారణములుగా పేర్కొనవచ్చును. •

పట్టిక సంఖ్య 3

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలలో అక్షరాస్యత శాతము, 1971

	జిల్లా పేరు	మొత్తము	పురుషులు	స్త్రీలు
1	శ్రీకాకుళము	18.52 (13)	27.67	9.58
2	విశాఖపట్టణము	21.25 (12)	29.54	12.94
3	తూర్పు గోదావరి	30.84 (4)	37.31	24.34
4	పశ్చిమ గోదావరి	34.41 (3)	40.45	28.34
5	కృష్ణా	35.17 (2)	41.72	28.38
6	గుంటూరు	30.73 (5)	39.41	21.81
7	ప్రకాశం	23.16 (11)	33.15	13.03
8	నెల్లూరు	26.83 (6)	35.24	18.29
9	చిత్తూరు	25.40 (7)	35.95	14.41
10	కడప	24.73 (8)	36.22	12.74
11	అనంతపురం	23.84 (9)	34.66	12.42
12	కర్నూలు	23.57 (10)	34.05	12.75
13	మహబూబ్‌నగర్	15.55 (19)	23.29	7.72
14	హైదరాబాదు	40.37 (1)	49.90	30.18
15	మెదక్	16.10 (18)	25.20	6.88
16	నిజామాబాద్	17.19 (16)	26.14	8.23
17	ఆదిలాబాద్	14.15 (21)	21.66	6.45
18	కరీమ్‌నగర్	15.31 (20)	23.85	6.64
19	వరంగల్లు	18.11 (15)	26.37	9.47
20	ఖమ్మం	18.51 (14)	25.14	11.57
21	నల్గొండ	17.05 (17)	25.05	8.76
	ఆంధ్రప్రదేశ్	24.57	33.18	15.75

గమనిక : కుండలీ కరణములలో ఉన్న సంఖ్యలు స్థాయిని సూచించు సంఖ్యలు (Rank order).

మూలము : Statistical Year Book of Andhra Pradesh, 1976.

పట్టిక సంఖ్య 4
ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యత, 1971

I అభివృద్ధి చెందిన జిల్లాలు (అక్షరాస్యత: 30 శాతము +)	II సగటుస్థాయిజిల్లాలు (అక్షరాస్యత : 20–30 శాతము)	III వెనుకబడిన జిల్లాలు (అక్షరాస్యత : 0–20 శాతము)
1 హైదరాబాదు	1 నెల్లూరు	1 శ్రీకాకుళం
2 కృష్ణా	2 చిత్తూరు	2 ఖమ్మం
3 పశ్చిమ గోదావరి	3 కడప	3 వరంగల్లు
4 తూర్పు గోదావరి	4 అనంతపురం	4 నిజామాబాద్
5 గుంటూరు	5 కర్నూలు	5 నల్గొండ
	6 ప్రకాశం	6 మెదక్
	7 విశాఖపట్టణం	7 మహబూబ్‌నగర్
		8 కరీమ్‌నగర్
		9 ఆదిలాబాద్

పైన పేర్కొనబడిన అక్షరాస్యత శాతములు అన్నియు సవరణ చేయబడని అక్షరాస్యత శాతములు. సవరణ చేయబడని అక్షరాస్యత శాతములలోని బలహీనత ముందుగనే పేర్కొని యున్నాము. కావున విభిన్న వయసు గ్రూపులలో అక్షరాస్యత శాతములు కనుగొని పట్టిక సంఖ్య 5లో పొందుపరచితిమి. 35 సం. ల లోపు వయసుగల పురుషులలో అక్షరాస్యత 40 – 50 శాతము ఉండగా, 35 సం.లకు మించిన వయసుగల వారిలో అక్షరాస్యత 32.8 శాతమున్నది. మానవుని ఉత్పాదక జీవితము (Productive life) లో ఈ వయసుకు ప్రాధాన్యత అధికము. కావున వీరిలో అక్షరాస్యత పెంపొందింప వలసిన ఆవశ్యకత ఎంతయినా కలదు. ఇదే విధముగా స్త్రీలలో కూడా ఈ వయసు గ్రూపుకు చెందిన వారిలో అక్షరాస్యత శాతము బహుతక్కువ – కేవలము 9. 3 శాతము.

అక్షరాస్యత, విద్యాస్థాయిలకు సంబంధించిన మరికొన్ని వివరములు 6 వ పట్టికలో ఈయబడినవి.

34 సం.లు వయసు మించిన వారిలో విద్యాస్థాయి కూడా చాలా తక్కువగానున్నట్లు కన్పించుచున్నది. పట్టిక సంఖ్య 6 లో పేర్కొనిన రెండు వయసు గ్రూపులలోను స్త్రీ పురుషుల మధ్యను గ్రామ పట్టణ ప్రాంతముల మధ్యను అక్షరాస్యతలోను విద్యాస్థాయి లోను వ్యత్యాసములు స్పష్టముగా గోచరమగుచున్నవి. 1961 –

పట్టిక సంఖ్య 5

ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యత శాతము : అభివృద్ధి

వయస్సు గ్రూపు	ప్రాంతము	పురుషులు 1961	పురుషులు 1971	స్త్రీలు 1961	స్త్రీలు 1971
10–14	మొత్తము	45. 55	47. 13	25. 49	31. 16
	గ్రామ	39. 06	40. 25	18. 98	23. 32
	పట్టణ	74 54	75. 94	55. 21	63. 32
15–19	మొత్తము	44. 19	50. 28	22. 22	31. 01
	గ్రామ	36. 54	41. 69	15. 80	22. 18
	పట్టణ	75. 29	78. 95	49. 09	60. 30
20–24	మొత్తము	43. 82	50· 95	16. 71	23. 50
	గ్రామ	36. 42	41. 97	11. 63	16. 10
	పట్టణ	72. 53	78. 67	39. 15	49. 77
25–34	మొత్తము	37. 85	43. 14	12. 84	16. 91
	గ్రామ	31. 52	35. 67	8. 83	11. 52
	పట్టణ	65. 35	70. 59	31. 64	47. 36
35+	మొత్తము	29. 63	32. 79	6. 69	9. 26
	గ్రామ	24. 70	27. 23	4. 31	6. 17
	పట్టణ	55. 55	59. 17	19. 51	24. 18
మొత్తము	మొత్తము	30. 19	33. 18	12. 03	15. 75
	గ్రామ	25. 14	27. 31	8. 45	10 92
	పట్టణ	53. 62	57. 30	29. 33	36. 31

మూలము : Census of India, 1971

1971 దశాబ్దములో విద్యావంతులలో అభివృద్ధి కూడా ఈ పట్టికలో చూడవచ్చును.

విద్యాస్థాయిలోను, అక్షరాస్యత స్థాయిలోను గ్రామ ప్రాంతములు పట్టణ ప్రాంతముల కంటె వెనుకబడి యుండుటకు ఒక ముఖ్యకారణము గ్రామములలో తగిన సౌకర్యములు లేకపోవుటయే.[11] కాని పురుషులలో కంటె స్త్రీలలో విద్యాస్థాయి, అక్షరాస్యత స్థాయి తక్కువగా నుండుటకు మనము సాంఘికముగా వెనుకబడియుండుట ఒక ముఖ్య కారణము. ఇంకను విద్యావంతులయిన స్త్రీలకు సమాజములో తగిన స్థానము లభించుట లేదు. స్త్రీవిద్యకు తగిన ప్రోత్సాహమీయబడుట లేదు. ముఖ్యముగా గ్రామ ప్రాంతములలో స్త్రీవిద్యను ఎక్కువగా నిరసించుట మన మెరిగిన విషయమే! విద్యయొక్క ఉపయోగము స్త్రీలు బాగుగా గుర్తించలేకపోవుచున్నారు. స్త్రీవిద్య వలన సమాజమునకు తరతరాలకు కలుగు లాభములను సమాజము గుర్తించలేక పోవుచున్నది. కేవలము స్త్రీ విద్యకు—ఉద్యోగమునకు—ఆదాయమునకు ముడిపెట్టి చూచుట విషయమునకు అన్యాయము చేయుటయే.

పట్టిక సంఖ్య 6

ఆంధ్రప్రదేశ్ జనాభాలో విద్యావంతుల శాతము: అభివృద్ధి

	వయసు 15–34 సం. మధ్యవారిలో				34 సం.ల వయసు మించిన వారిలో			
	పురుషులు		స్త్రీలు		పురుషులు		స్త్రీలు	
	1961	1971	1961	1971	1961	1971	1961	1971
అన్ని ప్రాంతములలో :								
మొత్తము అక్షరాస్యులు	41.01	47.15	16.25	22.36	29.63	32.79	6.68	9.26
కేవలము అక్షరాస్యులు	19.91	6.89	9.16	4.52	20.20	8.23	4.78	2.83
ప్రాథమిక విద్య	14.61	27 74	6.13	14.81	7.06	20.01	1.75	5.98
మెట్రిక్ మరియు ఆపై స్థాయి	6.49	12.52	0.96	3.03	2.37	4.55	0.15	1.83
గ్రామప్రాంతములలో:								
మొత్తము అక్షరాస్యులు	34.05	38.94	11.32	15.44	24·70	27.23	4.31	6.17
కేవలము అక్షరాస్యులు	19.78	6.58	7.35	3.32	18.74	7.42	3 30	1.81
ప్రాథమిక విద్య	11.39	25.00	3 78	11.14	5.27	18.00	0.99	4.26
మెట్రిక్ మరియు ఆపై స్థాయి	2.88	7.36	0.19	0.98	0.69	1.81	0.02	0.35
పట్టణ ప్రాంతములలో .								
మొత్తము అక్షరాస్యులు	69.90	75.25	38.34	48.25	55 55	59·17	19.51	24.18
కేవలము అక్షరాస్యులు	20.50	7.94	17.20	8.99	27.86	12.09	12.77	7.78
ప్రాథమిక విద్య	27.90	37.13	16.71	28.57	16.45	29.53	5.88	14.26
మెట్రిక్/ఉన్నతపాఠశాలస్థాయి	16.40	24.41	3.62	9.10	7.88	12.41	0.56	1.60
డిగ్రీతో సమానము కాని సాంకేతిక డిప్లొమా	4.40	0.94	–	0.11	0.24	0.40	0.02	0.05
సాధారణ డిప్లొమా	0.70	0.12	0.10	0.14	0.34	0.29	0.05	0.09
డిగ్రీ మరియు ఆపై స్థాయి	4.00	4.71	0.71	1.34	2.78	4.45	0.23	0.40

గమనిక : కేవలము అక్షరాస్యులు అనగా విద్యాభ్యాసము లేకుండా కేవలము అక్షరాస్యులు; అనియు మెట్రిక్ అనగా మెట్రిక్/లేక ఉన్నత పాఠశాల స్థాయి అనియు అర్థము.

మూలము : Census of India, 1971

ఈ విధముగా ఆర్థిక సామాజిక కారణములు అక్షరాస్యత స్థాయిలోను, విద్యాస్థాయిలోను విభిన్న రకముల అసమానతలకు, అసలు స్థాయి తక్కువగా నుండుటకు ప్రధాన కారణములు. కావున ఆర్థిక సామాజికరుగ్మతలను తొలగించవలసిన ఆవశ్యకత ఎంతయినా ఉన్నది. అంతేకాక సరియగు విద్యా ప్రణాళికా విధానము సమస్యా పరిష్కారమునకు చాలా వరకు దోహదము చేయవచ్చును.[12]

ఆరవ ప్రణాళికా ప్రారూపములో ఈ సమస్యల పరిష్కారమునకు తగిన ప్రాధాన్యత ఈయబడినది. జాతీయ వయోజన విద్యా కార్యక్రమము ద్వారా దేశములోని వయోజనులలో నిరక్షరాస్యతను ఒక దశాబ్దములో నిర్మూలించవలెనని కేంద్ర ప్రభుత్వ సంకల్పము. ఈ జాతీయ వయోజన విద్యా కార్యక్రమము భారీ ఎత్తున ప్రారంభమయినది. కేంద్ర ప్రణాళికా నిధులలో రు. 100 కోట్లు ఈ కార్యక్రమమునకై కేటాయించిరి.[13]

ఇదే విధముగా నిర్బంధ ప్రాథమిక విద్యా విధానము ద్వారా బాలుర్లలో నిరక్షరాస్యతను నిర్మూలించవలెనని కేంద్ర ప్రభుత్వము ధ్యేయముగా భావించినది. ఈ రెండు కార్యక్రమములలోను గ్రామ ప్రాంతములకు అధిక ప్రాధాన్యత ఈయబడెను[14] అంతేకాక ఈ రెంటిని జాతీయ కనీస సదుపాయ కార్యక్రమములో కూడా ప్రముఖ భాగముగా గుర్తించిరి.[15]

ఆంధ్రప్రదేశ్ అవతరించునాటికి అనగా 1956–57 లో 6–11 సం.ల వయసుగల బాలురలో 73.9 శాతము, బాలికలలో 44.1 శాతము మొత్తము 59.1 శాతము ప్రాథమిక విద్యాలయాలలో నమోదు అయి ఉన్నారు. ఇదే విధముగా 11–14 సం.ల వయసుగల బాలురలో 22 శాతము, బాలికలలో 5 శాతము, మొత్తము 14 శాతము మాధ్యమిక పాఠశాలలలో నమోదు అయి ఉన్నారు. 2 దశాబ్దములకు అనగా 1976–77 నాటికి ఈ సంఖ్యలు వరుసగా 88.4 శాతము, 54.3 శాతము, 70.9 శాతము ప్రాథమిక పాఠశాలలలోను, 34.2 శాతము బాలురు, 16.3 శాతము బాలికలు, మొత్తము 25.3 శాతము మాధ్యమిక పాఠశాలలలోను నమోదు అయినట్లు తెలుపుచున్నవి.[16] ఈ సంఖ్యలు నూరు శాతముగా మారుట ఎప్పటికి సంభవించునో కదా!

కృషితో నాస్తి దుర్భిక్షమ్ !

అధోజ్ఞాపికలు

1 T. R. Malthus (1798) : Essay on Principle of Population (Every man's Library, London, J M Dent & Co.,) 1958 Vol. II p. 212.

2 C. A. Anderson : "Literacy and Schooling on the Development Threshold : Sone Historical Cases" in C. A. Anderson & M. J. Bowman, Eds., Education and Economic Development (1965, Chicago, Aldine) 347–62.

3 Jandhyala B. G. Tilak : "Literacy, Education and World Development", Eastern Economist, 69/8 (Aug. 19, 1977) Independence Day Issue 355 – 359.

4 C. M. Cipolla : Literacy and Development in the West (1969) Penguin.

5 ఉదాహరణకు A. Kahan (1965) : "Determinants of the Incidence of Literacy in Rural Nineteenth Century Russia", in M. J. Bowman & C. A. Anderson, Eds., Education and Economic Development (Chicago, Aldine) 298 – 302; Jandhyala B. G. Tilak : "Literacy, Education and Agricultural Productivity in India", Indian Educational Review (Forthcoming); D. P. Chandhri (1968) : Education and Agricultural Productivity in India (Delhi University, Ph. D. Thesis, unpublished);
B. Dey (1978) : "Effectiveness of Education on Indian Agriculture", Manpower Journal, 14/2 (July–Sept.) 31–46 చూడుడు.

6 Jandhyala B. G. Tilak : "Regional Inequality in Literacy in India", Indian Journal of Adult Education 39/1 (Jan. 1978) 14 22;
జంధ్యాల బాలగంగాధర తిలక్ : "అక్షరాస్యత : అభివృద్ధి", భారతి 54/6 (జూన్, 1977) 25 – 28 చూడుడు.

7 ఉదాహరణకు M. Blang: An Introduction to Economics of Education (1970, Penguin) చూడుడు.

8 Education and Development : Report of the Education Commission 1964 – 66 (Ministry of Education, Govt. of India, New Delhi NCERT, New Delhi) p. 783.

9 కొన్ని అల్ప వికసిత దేశములలో 15 సం.ల లోపు పిల్లలు కూడా శ్రామికులుగా పనిచేయుచున్నారు. ఇతర వివరములకు Jandhyala B. G. Tilak : "Labour Force Participation in Andhra Pradesh" (unpublished); "Employment of children in India" (unpublished చూడుడు.

10 జిల్లాస్థాయిలో తలసరి ఆదాయ వివరములు సరియైనవి లభించుట కష్టము. ఇక్కడ పేర్కొనబడిన సంఖ్యలు Andhra Pradesh Fifth Five Year Plan 1974-79 నుండి గ్రహింపబడినవి.

11 ఉదాహరణకు మన రాష్ట్రములో 1853 గ్రామముల జనాభా 1.5 కి. మీ. దూరములో ప్రాథమిక పాఠశాల లేక, 9226 గ్రామముల జనాభా 3 కి.మీ. దూరములో మాధ్యమిక పాఠశాల లేక అవస్థపడుచున్నారు. ఇతర వివరములకు Third All-India Educational Survey చూడుడు.

12 విద్యా ప్రణాళికా విధానములో చేయవలసిన మార్పులకు **J.P.Naik** (1975) Elementary Education in India (Allied, Bombay); జంధ్యాల బాలగంగాధర తిలక్ : "అక్షరాస్యత : అభివృద్ధి" భారతి 54/6 (జూన్ 1977) 25-28; అధోజ్ఞాపిక (8) చూడుడు.

13 జాతీయ స్థాయిలో వయోజన విద్యా కార్యక్రమమున కిచ్చిన ప్రాధాన్యత, ఇతర వివరములకు జంధ్యాల బాలగంగాధర తిలక్: "సాంప్రదాయేతర విద్యావిధానము : వయోజన విద్య", భారతి 56/3 (మార్చి 1979) 12-18.

14 ఆరవ ప్రణాళికలో విద్యారంగమున కిచ్చిన ప్రాధాన్యత గురించిన వివరములకు **Jandhyala B. G. Tilak: "Education in the Sixth Plan" (unpublished)** చూడుడు.

15 జాతీయ కనీస సదుపాయ కార్యక్రమము గురించిన వివరములకు జంధ్యాల బాలగంగాధర తిలక్ : "ఆరవ ప్రణాళిక : కనీస సదుపాయములు" భారతి, 55/11 (నవంబరు 1978) 38-43.

16 ఈ సంఖ్యలు Education in India 1956-57 నుండి, Selected Educational Statistics 1976-77 నుండి గ్రహింపబడినవి.

అరవనివ్వండి ప్రభంజనంలా

శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ

ఆమెను నేడు
అరవనివ్వండి ప్రభంజనంలా
తిరగనివ్వండి బొంగరంలా
ఆడనివ్వండి కందుకంలా
పాడనివ్వండి కోయిలమ్మలా
నవ్వనివ్వండి వెన్నెలలా
చెప్పనివ్వండి వసపిట్టలా.

ఆమె రేపు
అత్తవారింటికి వెడుతుంది
కత్తులబోనో మరియేమో అది !
ఆమె స్వాతంత్ర్యం పొద్దుతిరుగుడుపువ్వు !
అందుకనే
ఆమెను నేడు
అరవనివ్వండి ప్రభంజనంలా ... !

శ్రీ నా. భక్తవత్సలరెడ్డి

శ్రీ బి. ఎస్. సుబ్బారావు

హరిశ్చంద్ర కథ - గౌరన - రాఘవాంకులు - కొన్ని విషయాలు

[1]గౌరన తానుగా తీర్చిదిద్దిన పాత్రలు మూడు — కాలకౌశిక, కలహకంఠి, కర్కోటకులు. చంద్రమతి గాని, లోహితాస్యుడు గాని అతని పాత్రలు కావు. ఇవి రెండూ రాఘవాంకుడు పరిచయం చేసిన పాత్రలు. కన్నడంలో లోహితాస్యుడు 'లోహితాస్వ'గా కనపడతాడు.

నక్షత్రకుని పాత్ర? [2]రాఘవాంకునికి ముందే సంస్కృత సాహిత్యంలో పదోశతాబ్దంలో క్షేమేశ్వరుని 'చండకౌశికనాటకమూ', పన్నెండో శతాబ్దంలో హేమచంద్రుని శిష్యుడు రామచంద్ర సూరి 'సత్య హరిశ్చంద్ర నాటకమూ' కనపడుతున్నాయి. సత్య హరిశ్చంద్ర నాటకములో ఆరు అంకాలున్నాయి. కథావస్తువు మహాభారతంనించి తీసుకొన్నట్లు తెలుస్తుంది. [2a]ఈ నాటకంలో విశ్వామిత్రునికి 'కులపతి'అనీ, నక్షత్రకునికి 'అంగారక'అనీ, చంద్రమతికి 'సుతారా' అనీ పేర్లు పెట్టబడి వున్నాయి. ఇలాగే ఇతర పాత్రలకికూడా వేరే పేర్లు కన్పడుతున్నాయి. [3]పద్మాకరరెడ్డి చెప్పినట్లు రాఘవాంకుడే నక్షత్రకుని పరిచయం చేశాడు.

రాఘవాంకుని ''హరిశ్చంద్ర కావ్యం''లో కలహకంఠి పాత్ర లేదు. అలాగే కాలకౌశిక, కర్కోటక పాత్రలు కూడా. కన్నడంలో కాలకౌశికుడు ఒక బ్రాహ్మణుడు. ధూర్త బ్రాహ్మణుడు. మారు వేషంలో వుండే అనలసఖుడు. ఆ బ్రాహ్మణుని ఇంటిలోని వాళ్ళని గురించి చెప్తూ

[4]''ఒడెయనతి కోపి, హెండతి మూర్ఖ, మగ
కడుధూర్త సొసెయాదడధిక నిష్ఠురె, మనెయ
నడెవవరు దుర్జనరు నెరెమనెయవరు మిథ్యావాదిగళు పశుగళగడు
అడిగడిగె కోపిసువ సాయె సదె బడివ......''

యజమాని ముక్కోపి, భార్య మూర్ఖురాలు, కొడుకు కడుధూర్తుడు, కోడలుచూస్తే పరుషంగా మాట్లాడేది. ఇంటికి వచ్చేపోయే వాళ్ళు దుర్జనులు. ఇరుగు పొరుగు అబద్ధాలు చెప్పేవాళ్ళు, పుండాకోర్లు, అడుగడుగున కోపించుకొంటూ, చావకొట్టుకొనేవాళ్ళు...అంటాడు. ఇలా రాఘవాంకుడు ఒక్కొరిని ఒక్కొ మాటలో, వాళ్ల స్వరూప స్వభావాల్ని చూపిస్తూ, పరిసరాల్ని కూడా గుర్తిస్తాడు. మాటల్లో పొందిక, సంపూర్ణత కన్పడుతుంది గౌరన కాలకౌశిక, కలహకంఠిలను వర్ణించటానికి చాలా ద్విపదల్ని వినియోగించాడు. స్వరూపం వేరుగా, స్వభావం వేరుగా వర్ణించాడు.

[5]''మెదుక పట్టిన తల మెడ గండమాల
నుదుట మీదట సుడి సురి గొన్న బొమలు
బుఱ్ఱి ముక్కును లొట్టబోయిన గన్ను''...అంటూ

కలహకంఠి ఆకారాన్ని వర్ణిస్తూ, స్వభావాన్ని ఆమె నోటి గుండానే చెప్పిస్తాడు. చంద్రమతిని కాలకౌశికుడు ఇంటికి తీసుకరాగానే, కర్కోటకుని దౌత్యంవల్ల భార్యాభర్తలిద్దరూ కాట్లాడుకొంటారు. కలహకంఠి చంద్రమతిని చూస్తూ

[6]''... వేగిరమె
నన్నెఱింగెదు గాక నా పేరు తెలియ
విన్న మృత్యువుకైన వెరవేకివచ్చు
... ...
నా పొడగాంచిన నగరంబు వడకు'' అంటుంది.

అనలసఖుని భార్య మూర్ఖురాలు. ఆ ఒక్క పదంతోనే ఆమె విషయం అంతా అవగతం అవుతుంది. కాలకౌశికుని భార్య నగరాన్ని కూడా వణికేట్లు చేయగల ఘటనాఘటన చాతుర్యం గలది. 'హరిశ్చంద్రోపాఖ్యానం'లో ఈ మూడు పాత్రలకి సంబంధించిన కథ ఒక వుప కథగా అలంకరించుకొంది. 'హరిశ్చంద్ర కావ్యం'లో ఈ పాత్రలకి అంతటి ప్రాధాన్యం లేదు అన్పిస్తుంది.

గౌరన రాఘవాంకులు ఇద్దరూ రాసింది హరిశ్చంద్రుని కథనే కనుక, ఇద్దరూ అనుసరించి మార్పులు చేసింది స్కాంధ, మార్కండేయ పురాణాంతర్గత కథనే కనుక ఇరువురి గ్రంథాల్లోనూ కొన్ని పోలికలు కన్పడుతున్నాయి. ఆ పోలికలు పురాణాంతర్గత కథ నించి వచ్చినవి కాకుండా వుంటే, అవి రాఘవాంకుని హరిశ్చంద్ర కావ్యం నించి వచ్చినవిగానే గుర్తించొచ్చు [7]రాఘవాంకుడు గౌరన కన్నా ముందటివాడు కనుక. వాటిలో కొన్ని —

కాలకౌశికుడు హరిశ్చంద్రుడు అడిగిన డబ్బుని పూర్తిగా ఇచ్చేసి, చంద్రమతినీ, లోహితాస్యునీ తోడ్కొని ఇంటికి వచ్చేస్తాడు. హరిశ్చంద్రుడు [8]''కుటిల కుంతలి నమ్మికొన్న ధనంబు వ్రయంబు గాకుండ సర్వంబును ముడిచి నయమొప్ప'' నక్షత్రకుని కిస్తాడు.

అతడా ధనం తీసుకొని ఆశీర్వదించి 9 'నీతో వచ్చిం దానివల్ల బత్తె సెలవుగా నీవు చెల్లించితివి .... మేకొన్న గాధి సుతుని ఋణంబెల్ల జొప్పడ దీర్చి'' పంపు, దీవించి వెళ్తానంటాడు. కన్నడంలో వారిరువుర్ని అమ్మగా, బ్రాహ్మణుడు ఇచ్చినడబ్బుని తీసుకొని నక్షత్రకుడు ఇది 'నా బత్తేనికే సరిపోయింది' ఇక మా గురువు కీయవలసిన డబ్బు ఇస్తే ఇవ్వు, లేకపోతే లేదను, నే వెళ్తా'నంటాడు. అపుడు చంద్రమతి బ్రాహ్మణుని చూసి 'ఇది నక్షత్రకునికి న్యాయమా ? మీరైన 'చెప్పండి' అంటుంది. కౌశికుడు నక్షత్రకుణ్ణి పంపించింది—ఎల్లైన హరిశ్చంద్రునిచేత అబద్ధం ఆడించాలని. అందుకే రాఘవాంకుని నక్షత్రకుడు వచ్చిన డబ్బుని చంకనెత్తుకొని మిగతా డబ్బు ఇస్తే ఇయ్, లేకపోతే లేదను, వెళ్తా అని నిర్లక్ష్యంగా అంటాడు. అయితే గౌరన నక్షత్రకుడు ఇలా గాకుండ గాధిసుతుని డబ్బుకే ప్రాధాన్యం ఇస్తాడు. ఇక్కడ చంద్రమతి ప్రసక్తే లేదు.- కారణం ఆమె కాలకౌశికుని ఇంటికి వెళ్లింతర్వాత జరిగినకథ కనుక.

గౌరన నక్షత్రకుడు హరిశ్చంద్రుని అమ్ముతానని చాటుకొంటూ పోయేటపుడు, వీరబాహుడనే ఛండాలుడు తనని కొనుక్కొంటానని అనగానే హరిశ్చంద్రుడు కోపోద్రిక్తుడవుతాడు. అయి, అతన్ని దూషిస్తాడు. అపుడు నక్షత్రకుడు కల్పించుకొని వచ్చిన వాళ్లని ఇలా తూలనాడితే నిన్నెలా అమ్మేది, మా గురువు డబ్బుని ఎలా సంపాదించుకొనేది అని కేకలు వేస్తే రాజు గమ్మునవుతాడు. నక్షత్రకుడు వీరబాహుణ్ణి చూసి

10 ''పురుషు దేసుగు నెక్కి పొడవుగా నిక్కి
వరరత్న మెగిరిపోవైచిన పొడవు

ధనరాశి.'' మా కిచ్చేసి హరిశ్చంద్రుణ్ణి తీసుక పొమ్మంటాడు. వీరబాహుడు డబ్బు కావాలంటే ఇపుడే ఇస్తానుగాని, 'ఈ రాజు సుకవాసి, పనిపంద...'' అని సందేహాన్ని వెలిబుచ్చుతాడు. హరిశ్చంద్రుడు

11 ''ఈ రీతి నపనమ్మికేల నామీదం
జాల నీ౯ని కుల్కి సత్యంబు కొలుకు
నూలి పోగున జిక్కి నుసలకున్నాడ
... ...
నే సత్యమునకు గా నిప్పుడు నీకు
దాసుడనై జట్టి దక్కుచున్నాడ ''

నన్ను నమ్ముమంటాడు.

రాఘవాంకుని హరిశ్చంద్రుడూ కూడా చండాలుడైన వీరబాహుడు తనని కొనుక్కొంటానని ముందుకు రాగానే అతన్నిదూషిస్తాడు. ఆ మాటలకు కోపగించుకొని అతడు వెళ్తాడు. అపుడు రాజు ఎవరైనా ధనికుడు తనని కొనుక్కొనేందుకు వచ్చేలోపల గడువు కాస్తా గడిచిపోతుందని ఆలోచించుకొని, పొరబాటు తెల్సుకొని, వీరబాహుణ్ణి పిల్చి, క్షమాపణలు చెప్పుకొంటాడు. హరిశ్చంద్రుడు

12''... ... ... కరియ
నేఱు మేలక్కె మిడిదడె కవడె బిడె హబ్బి
హాఱుదని తుద్దక్కె సురిద హాస హొన్నరాశియు నీయ
బేహు...''

మనిషి ఏనుగుమీద నెక్కి గవ్వ పైకి విసిరేస్తే అది ఎంత పైకి పోతుందో అంత కొత్త బంగారపురాశి ఇవ్వాలి అన్న షరతును చెప్తాడు. వీరబాహుడు అడిగినంత బంగారం ఇచ్చేందుకు ఒప్పుకొంటాడు తెలుగులో లాగా రాజుని 'పిరికిపంద'లాంటి పదాల్తో బాధించడు. 'నువ్వేమి పనులు చేయగలవ'ని మాత్రం అడుగుతాడు. అందుకు తెలుగులోలాగా తాను సత్యసంధుడనని చెప్పకోకుండా, సేవకుడిలాగా 'నువ్వు చెప్పిన పనులన్నీ చేస్తా'నంటాడు.

హరిశ్చంద్రుణ్ణి చూసి వీరబాహుడు 13''ప్రేతవనము నా గుత్తగా చేసుకొన్నాను. ఏ పీనుగు వచ్చినా తమ ఇచ్చగా గాల్చి మరలిపోకుండ నాయాన బొడిచి, యా శవము మొలనున్న వస్త్రంబు, మొగము కోకయును, ఒక మాడ వాత పాతికయు నాకిచ్చి, పిండాశనము దిని నీవు బ్రతుకుము. ఈ దినమునుండి వీరదాసను పేర వెలయుము'' అంటాడు. కన్నడంలో కూడా ఇంచుమించు ఇలాగే వుంది. అయితే తెలుగులో రాజు పేరు 'వీరదాసుడు.' కన్నడంలో ఏ పేరో తెలవదు గాని, అతడు పేరు చెప్పకొంటూ, ఢంకా కొట్టుకొంటూ ఛండాలుడు ఇచ్చిన ముద్రాంకితాలని పురజనులకి చూపిస్తూ ప్రేత భూమికి వెళ్తాడు.

విశ్వామిత్రుడు తక్షకుణ్ణి పిల్చి లోహితాస్యుని తన విషంచే చంపి రమ్మంటాడు. కన్నడంలో చివరికి గాని ఆ ప్రస్తావనరాదు. బ్రాహ్మణ కుమారుల్తో కూడా లోహితాస్యుడు అడవికి వచ్చి, తాము ఏరుకొన్న పుల్లల్ని కట్టుకొని, నెత్తిన పెట్టుకొని మోయలేక మోసుకొంటూ వస్తూ, చిగురుల్తో, చిక్కగా, ఏపుగా పుట్టమీద పెరిగివున్న దర్భని చూసి కోసుకొంటానని పుట్ట ఎక్కి కోసే సమయంలో పాము కరుస్తుంది. లోహితాస్యుడు మరణిస్తాడు. ఆ సంఘటన చూసిన బ్రాహ్మణ కుమారులు ఇంటికి వెళ్తారు. అది సాయం సమయం. అపుడు కవి వాడిన వుపమానం ఇది.

14''ఈ హొత్తు ఎన్న కులద కుడి మురుటితు ఎందు ఉమ్మళం
బెత్తు బేళదె మాణన్ ఎంబంతె రవి బిద్దనందు పడువణ
కడలొళు''

ఈ పొద్దు తన కులాంకురం రాలిపోయిందని ఏడ్వలేక ఏడుస్తూ సూర్యుడు పడమటి సముద్రంలో పడ్డాడు అని.

లోహితాస్యుని పాము కరవగానే ముని పుత్రులు పరిగెత్తి చంద్రమతికి ఆ వార్త విన్నవిస్తారు. ఆ విషయం విన్నవెంటనే అదిరి 'హా! పుత్ర యనుచు' మూర్ఛబోయి, కొంతసేపటికి తేరుకొని, 'ఈ విధికేమని వగతు' అని విలవిల్లాడుతుంది. లోహితాస్యుని రూపుని, చనిపోయేముందు అతని చేష్టల్ని తలచుకొని బాధపడుతుంది. అలా బాధపడుతుంటే కాలకౌశికుని భార్య కోపించి

15 ''యోసి అమంగల్య మొదవ నేడ్చెదవు
యీ సంధ్య ప్రొద్దు మా యింటి ముందటను
... ... లే లెమ్ము పిసాళింపక''

అంటుంది. చంద్రమతి కలహకంఠి కాళ్లపైబడి కొడుకు 'ఈల్గక మునుపే' ఎవరినైనా అడవికి పంపి తెప్పించమంటుంది. కలహకంఠి కనికరం లేకుండా

15 'తలమని మంగల దల బాయ ద్రోచి
... ... మిక్కిలి జాణ వేదు
... ...
మందు పెట్టగలేము మన జేయలేము
వెదక నంపగలేము వెజ్జు దేలేము
... ...
పన్నుగా నీ చేయు పనులెల్ల దీర్చి
ప్రొద్దుపోయినమీదఁ బోయి నీ పుత్రు
సుద్ది నిక్కంబుగా జూచి రమ్ము...'' అంటుంది.

ఆమె అలాగే ఇంటి పనులన్నీ చేసి, విప్రవనితను నిద్రపుచ్చి, కొఱవిని తీసుకొని 'పతిభక్తితోడు'గా పోయి లోహితాస్యుని కన్గొంటుంది. కన్గొని బావురుమంటుంది.

కన్నడంలో బ్రాహ్మణ కుమారులు వెంటనే వచ్చి ఈ వార్త చెవినేయరు. చంద్రమతి తన కొడుకు ఎంతటికీ రాకపోతే కారణమేమై వుంటుందోనని బాధపడ్తూ వుంటుంది. అపుడు కవి అంటాడు— ''కొడుకుకోసం ఏడుస్తూవుంటే అమంగళమని తిట్తారు. వెదకదామని బయలుదేర్తే పారిపోయిందంటారు...'' అని. తెలుగులో గౌరన ఆ కవి మాటల్ని కలహకంఠిద్వారా నేరుగా చెప్పిస్తాడు. ఇది తప్ప మిగతా విషయం రెండింటిలోనూ సమానమే. అయితే కన్నడంలో ఇంటి యజమాని చంద్రమతికి పనులన్నీ పురమాయించి, చేసి, బిడ్డని వెతుక్కోను పొమ్మంటాడు.

చంద్రమతి పుత్రుని రుద్రభూమికి తీసుకపోయి ''పొంత యొల్కులలోనఁ బొడవడికాలి, కొంత చిక్కిన కడకొఱవులు దెచ్చి'' పోగుపెట్టి కొడుకుని ఆ చితిపై పెట్టి కొరివి పెట్టబోతూ ఆగిపోయి భోరున ఏడ్చేస్తుంది. ఆ శబ్దంవిన్న వీరదాసుడు, తన్నెవరో మోసగించి ఈ రాత్రి చితి పేర్చారనుకొంటూ వస్తాడు. కన్నడంలో అఱగాలిన కొఱవిల్ని తెచ్చుకొని, చితిపేర్చి, కొడుకును పెట్టి, చేతితో కొరివి పట్టుకొని

16 ''బెళెదల్లి బెళె హుట్టిదల్లి హుట్టిందు''
'పుట్టినచోటే పుట్టు, పెరిగినచోటే పెరుగు' అని ఆశీర్వదిస్తూ కొరివి పెట్టాలనుకొన్నంతలో దుఃఖం పెల్లుబికి ఎలా పెట్టగలనా అంటూ ఏడ్చేస్తుంది. ఆ శబ్దంవిని రాజు వస్తాడు. వచ్చిన హరిశ్చంద్రుడు నువ్వెవరివని అడగగా ఆమె

17 ''పురుషవరేణ్య యీ పురి నొక్క విప్ర
వరునింట దాసినై వర్తించు చుందు
నప్పు దీర్పగ నుపాయము మఱిలేక
తప్పనాడక పతి దన్నమ్ము కొనియె
నా సుతుడిత డంస నారి నా పేరు'' అంటుంది.

అంటూ

17 ''యెఱిగియుండితి రేని యేమైన మందుఁ
గరుణ నిచ్చి సజావుగా వీనిఁ జేసి
నన్ను రక్షింపుము...'' అని మాతృభావం తొణికిసలాడుతుండగా దైన్యంగా అతన్ని ప్రార్థిస్తుంది. వీరదాసుడు ఆమెని తన 'కులపతి ఆత్మతెలియక' తాను వీరబాహుని దాసుడనని, ఈ ప్రేత భూమిలో శవం తగలపెట్టాలంటే తగు ధనం ముందుగానే ఇచ్చుకోవాలనీ చెవ్తూ 'నువ్వు స్త్రీవి కనుక మన్నించాను· వెంటనే పోయి మా కివ్వాల్సిన డబ్బు తెచ్చుకో, వెళ్లు' అంటాడు అపుడు చంద్రమతి

18 ''సకల దీవుల నేలు జనపతి పుత్రుఁ
డకట చేరెడు నేల కర్వాండు గాదె
నీ వేమిసేతు పన్నిన మునిమాయ'' నన్ను వెంబడిస్తూంది, అంటుండగ 'హరిశ్చంద్ర విభుడాత్మఁ గలగి, యీ తరుణి నా పత్నియగు' ననుకొని, అయినా పైకి తెలవనీకండా 'రాజు భార్యవంటున్నావు, నీ దగ్గర ధనం లేదా? ఏమిటి? అయినా నీ వూసు నాకెందుకు; నాకు ఓ 'మాడ' చాలు. డబ్బు ఇవ్వలేకపోతే, 'మెడకుకట్టిన మినుకు' ఇమ్ము చెల్లు వేసుకుంటా నంటాడు. 'నా మెడలోని మినుకు అన్యపురుషుల కంటపడదు. ఇతడు హరిశ్చంద్రుడే' అని నిశ్చయించుకొంటుంది చంద్రమతి. కొని ధరణిపై పడి కొడుకుని రక్షించుకోమని హరిశ్చంద్రుని ప్రార్థిస్తూ విలపిస్తుంది.

కన్నడంలో రాజు వస్తూనే 'నువ్వెవ్వరంటూ' ప్రశ్నలవర్షం కురిపిస్తూ కళ్లెర్రచేసి 'హద్దుమీరి ప్రవర్తించావంటే వీరబాహుని మీద ఆన. ఎముకలు విరగ కొట్తా'అంటూ చితిని చెల్లాచెదరుచేసి, శవం కాలుని పట్టి ఈడ్చి పారేస్తాడు. చంద్రమతి భోరునఏడ్చుతూ, కుయ్యో మొర్రోగా బాదుకొంటూ 'పారేయొద్దు. బిడ్డని పారేయొద్దు. దెబ్బ తగులుతుంద'ని అల్లాడుతూ, బిడ్డని అదలాబదలా జవురుకొని అక్కున చేర్చుకొని 'నీ కులం ఏదో మతం ఏదో తెలియకుండానే వేడుకొంటున్నా, వీడు నా బిడ్డకాదు. నీ బిడ్డగా తల్చి, కాల్చేందుకు కరుణించి నన్ను వదలిపెట్టు' అంటుంది. హరిశ్చంద్రుడు 'పిచ్చిదానా! ఎంత ఏడ్చి ఏం లాభం, డబ్బు గుడ్డలు లేకుండా ఇక్కడ కాల్చడం వీలుపడని పని' అంటుండగా, 'నేనో దాసిని, నీ కిచ్చేందుకు ఏమీలేదు' అంటుంది. హరిశ్చంద్రుడు

1 ''... ... ... నిన్న కొరళి నొళిర్ద
కడు చెలువ తాళియనదన్నడవ నిరిసి నీ బిడిసికోబళికవెనలు''
'నీ మెడలో అందంగా వున్న ఆ తాళిని తాకట్టుపెట్టి, డబ్బుతెచ్చి, ఆ తర్వాత విడిపించుకో' అనగానే మిక్కిలి దుఃఖిస్తూ 'నా భర్త చనిపోయినట్టుంది. లేకపోతే నా గుప్తమాంగల్యం ఎలా కనపడ్తుంది' అని ఆలోచిస్తూ

19 ''విగత సప్త ద్వీప పతియ బసుఱలి బందు
మగనె, నిన గొమ్మెట్టు సుడుగాడు హోగె యాయ్తె
మిగె సకల లోక దొళు తన్నాణె సలువన కుమార నెనిసువ
నిన్నను
బగెయదీ చాండాల నాణె యిదు వంతాయ్తె
జగద నవనిధి గొడెయ నాత్మ భవనెనిసి ము
ట్టిగెయ సుంకద హోగ విల్లాయ్తె మగనె...''

సప్తద్వీపాధిపతి కులాంకురమా, నీకు స్మశానమే శత్రువయిందా? సకలలోక రక్షకుని పుత్రుడవని తెలియక ఈ చండాలుడు శపథం చేశాడు గదా! ప్రపంచంలోని నవనిధుల కధిపతి 'కుమారుడవైన నీకు చితి సుంకానికి కూడా డబ్బు (హోగ) లేకపోయెగదా' అంటూ పెద్ద పెట్టున ఏడ్చేస్తుంది. ఆ విషయం విన్న రాజు వణికిపోతాడు. పోయి 'ఇతడు ఏ రాజు పుత్రుడు' అని అడుగుతాడు. ఇది 'తమ కథ కాసీకుండా చెయ్యి ఈశ్వరా!' అని లోలోపలే అనుకొంటాడు. అనుకొని తన విధ్యుక్తధర్మం గమనించి 'ఎవరైనా గానీ గాక, తన్వీ శవం కాల్చాలంటే నాకు డబ్బియ్యి; గొప్పోళ్ల పేర్లు చెప్పినంత మాత్రాన విడిచేస్తాననుకొంటున్నావా? నంగి ఏడ్పులవల్ల ప్రయోజనం లేద'ని దబాయిస్తాడు. చంద్రమతి 'నేను అబద్ధం చెప్పకో లేదు; వున్న విషయమే. అయోధ్యా నగర రాజైన రవికుల తిలక హరిశ్చంద్ర భార్యని. వీడు కొడుకు' అంటుంది. తానే హరిశ్చంద్రుణ్ణని చెప్పకోకుండా వీరదాసుడు కాశీలో భార్యాపుత్రుల్ని అమ్మ కొన్న లగాయతు కథ అంతా చెప్పి, ఆ రాజుతో పని ఏమిటే అంటూ హేళనగా మాట్లాడతాడు. ఆ మాటలకి చంద్రమతి కోపగిచ్చుకొంటుంది. తర్వాత ఒకరి నొకరు పరస్పర సంభాషణల వల్ల తెల్సుకొంటారు.

గౌరన చంద్రమతి ఒకరకంగా పలాయన బుద్ధి కలది. పుత్రుడు చనిపోయాడన్న వార్త విన్నంతనే పుత్రశోకం పెల్లుబికి వస్తున్నా 'తన కష్టాలకి కారణం మునిమాయ'అన్న ధ్యాసని వదలదు. పదే పదే అనుకొంటుంది. అసలు తప్పంతా మునిదిగానే భావిస్తుంది తప్ప, తన భర్త పాత్ర ఎంత అన్న ఆత్మ విమర్శెరాదు. రాఘవాంకుని చంద్రమతి ఇలాంటిది కాదు. తానేదో, తన కొడుకేదో తప్ప, తమ కష్టాలకి ఇంకోరు బాధ్యులని నెపాన్ని ఇతరులపై తోసేంతటి బలహీనురాలు కాదు.

గౌరన చంద్రమతీ హరిశ్చంద్రులు ఇద్దరూ ఒకరి నొకరు తెల్సుకొంటారు. కాని నటిస్తారు. చంద్రమతి, 'మినుకు' ఇమ్మన గానే హరిశ్చంద్రుని గుర్తిస్తుంది. అప్పకోసం తన భర్త తన్నమ్మ కొన్నాడంతనే 'ఆత్మ తెలియక' వుంటాడుకాని 'ఇది మునిమాయ' అనగానే వాళ్లని భార్యాపుత్రులుగా గుర్తిస్తాడు. అయితే ఆ విషయాన్ని బయటపెట్టడు. రాఘవాంకుని పాత్రలు అలాంటివికావు. తాళి కనపడ్డా తన భర్త చనిపోయాడేమో అనుకొంటుంది. పరోక్షంగా హరిశ్చంద్రుడు తన కథని చెప్పినా కూడా అతన్ని రాజుగా గుర్తించదు.

గౌరన హరిశ్చంద్రోపాఖ్యానాన్ని 20 ''కవితా చమత్కృతి గాంచి కవులందఱును శిరః కంపంబు'' చేసేటట్టు రచిస్తానన్నాడు. దాన్ని చదవడం వల్ల 21''జనులకు పుణ్యముల్ సమకూరు'' అంటాడు. అంతేకాని రాయటంలో తన అభిప్రాయం ఏమిటో వ్యక్తం చేయడు.

రాఘవాంకుడు హరిశ్చంద్ర చరిత్రని వింటే మానవులు జన్మంలో చేసుకొన్న పాపాలన్నిటినీ పోగొట్టుకోగలరు అన్న లాభంని చెప్తూ

22 ''హర నెంబుదే సత్య సత్య వెంబుదు హరను''

''శివం సత్యం, సత్యమే శివం'' అన్న సత్యాన్ని నిరూపించేందుకు ఈ కావ్యాన్ని రాశానంటాడు.

లోహితాస్యుడు పుట్టమీదెక్కి దర్భని కోసుకొంటూండేప్పుడు పాము అతన్ని కాటేస్తుంది. అతడు పుట్టమీదనించి కిందపడతాడు. ఆ విషయాన్ని రాఘవాంకుడు ఇలా పోల్చాడు.

23 ''......కొరళడి యాగి కెడెద వకటకట మద
ముదిత రాహుగ్రస్తవాద తరుణేందు బింబం నెలకె బేళ్వందదె''

పొగిరెక్కి, గంతులేస్తున్న రాహువు కబళించగా తరుణేందు బింబం నేలపై బడ్డట్టు పాము కాటుతిన్న లోహితాస్యుడు కిందపడ్డాడు.

కవులందరిచేత తలలాడిస్తానని భీరువులు పలికిన గౌరన, రాఘవాంకుని ఈ చిన్ని వుపమానాన్ని కాపీ కొట్టాడు. కాలకౌశికుని ఇంట కష్టాలు పడుతున్న చంద్రమతి

24 ''బలు రాహు ముఖమునఁ బడి కాంతి దప్పి
జలదరించెడి బాల శశిరేఖఁ బోలె'' వున్నదట.

రాహువు వాతపడేది పూర్ణచంద్రుడేగాని, బాల శశిరేఖ కాదు. ఈ అసంగతాన్ని చక్కగా గుర్తించారు 25డా. నాగయ్యగారు. రాఘవాంకుడు ''తరుణేందు బింబం'' అన్న పదానికి ''బాల శశిరేఖ'' సమానార్థకమా? కాపీ కొట్టడంలో పొరబాటా?

గౌరన రాఘవాంకులకి సంబంధించి పై చెప్పిన విషయాలు కొన్ని మాత్రమే.

చూసిన గ్రంథాలు

1 గౌరన — హరిశ్చంద్రోపాఖ్యానము; సంపాదకురాలు: డా. పి. యశోదారెడ్డి. [గౌరన]
2 రాఘవాంక - హరిశ్చంద్ర కావ్యం; సంపాదకులు: ఎన్. బసవారాధ్య, పండిత ఎస్. బసప్ప. [రాఘవాంక]
3 ఏ. వి. పద్మాకరరెడ్డి — తెలుగులో హరిశ్చంద్ర కథ (అముద్రితము) [రెడ్డి]
4 డా. జి. నాగయ్య — ద్విపద వాఙ్మయము [నాగయ్య]

(మిగతా 62వ పేజీలో)

శ్రీ మందిగొండ ఈశ్వర చరణ్

మల్లికార్జున పండితారాధ్యుడు ద్వైతియా ?

"శ్రీమచ్ఛైవమతే శివః పరతమో జీవ ప్రపంచౌ స్థిరౌ
చైతన్యాది గుణైః శివేన సమతా మాప్నోతి జీవః కిల
బద్ధః శంభు సమిచ్ఛయాఽద్య పశుతాం ప్రాప్తః పుమాన్ సంసర
త్యార్తః సన్ తదనుగ్రహోచ్ఛివ సమో భక్త్యైవ ముక్తో భవేత్!"
(శివశ్రీ మూలంపల్లి రాజశేఖరశాస్త్రులు)

'విద్యారత్న' శివశ్రీ నిడుదవోలు వేంకటరావుగారు గొప్ప పండితులు. విమర్శకులు. పరిశోధకులు. బహుముఖమేధావంతులు. వారు తెలుగు సాహిత్యానికి చేస్తున్న సేవలు ప్రశంసనీయాలు. చిరస్మరణీయాలు. కాని, వారి మేధా సంపత్తిని, వ్యక్తిత్వాన్ని గౌరవించినట్లుగా వారి అభిప్రాయాలను మన్నించడం సత్యాన్వేషణ పరులకు అన్నివేళలా సాధ్యం కాని పని నిజంగా ఇది దురదృష్టకరం. కాని చేయగల దేమీలేదు. ప్రస్తుతం వారు శివతత్త్వ సారానికి వ్రాసిన పీఠికలోని అంశాలను విమర్శింప బూనడం కేవలం సత్యాన్వేషణ దృష్టితోనే !

'శివతత్త్వసారా'న్నితొలుతస్వర్గీయ కొమర్రాజు లక్ష్మణ రావు పంతులుగారు పరిష్కరింపగా ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారు ప్రచురించారు. శ్రీ పంతులుగారు తమ పీఠికలో మల్లికార్జున పండితారాధ్యుడు ద్వైతి యన్న భావనను ప్రవేశపెట్టారు. "కేవలము యుక్తులచే తన మతమును స్థాపించుటకు యత్నించి నను వేద ప్రమాణమును గూడ విడువలేదు. వేదవాక్యములు కేవలము ద్వైతమునే బోధించునని ప్రతిపాదించియున్నాడు ... అద్వైత పరములుగా కానవచ్చెడు వాక్యములకు ద్వైత పరముగా అర్థము చెప్పయత్నించెను." అని పంతులుగారి వ్రాత.

స్వర్గీయ వంగూరి సుబ్బారావు పంతులుగారు, డా॥ కె॥ గోపాలకృష్ణారావుగారు మొదలైన పెద్దలు గతాను గతికముగా శ్రీ పంతులుగారి అభిప్రాయమునే అనుసరించారు. ఈ అభిప్రాయం లోక సమ్మతమూ కాదు. శాస్త్ర సమ్మతమూ కాదు.

పై ముద్రణం తర్వాత సుమారు నలభై సంవత్సరాలకు శ్రీ నిడుదవోలు వారు పరిష్కరింపగా కృష్ణా పత్రికవారు దీనిని తిరిగి ముద్రించారు. ఈ ముద్రణ కాలానికి కన్నడ శివతత్త్వ సారం కూడా లభించడంచేత శ్రీ నిడుదవోలు వారు కన్నడాన్ని అనుసరించి కొన్ని పద్యాలను అనువదించి అనుబంధంలో చేర్చారు. పాఠ భేద నిర్ణయంలో కూడా కన్నడాన్ని సంప్రదించడంవల్ల శ్రీ రావు గారు కొన్ని రుచికరమైన పాఠాలను సంతరించగలిగారు. ఈ రకంగా ఈ ముద్రణ విశిష్టమైనదనడంలో సందేహంలేదు.

దీనికి స్వామి శివశంకరులు ఉపోద్ఘాతాన్ని వ్రాస్తూ "అద్వైత పరములైన వేదవాక్యములకు ద్వైత పరముగా అర్థము చెప్పుట సంభవించినది" (ఉపో. పుట 11) అని వ్రాయడం శ్రీ కొమర్రాజు వారి ప్రభావమే అనక తప్పదు.

శ్రీ వేంకటరావుగారు దీనికి 90 పేజీల విపులమైన పీఠిక వ్రాశారు. ఎన్నో విషయాలను చర్చించారు. 'మత సంప్రదాయము' అనే ఉపశీర్షికలో "ఇతః పూర్వము ప్రకటితములైన వానిలో శైవ మతమును గూర్చిన ప్రశంసయున్నది కాని — యది సాహితీ విమర్శక దృష్టితో చేసినదే కాని సంప్రదాయక దృష్టితో చేసినది కాదు. పరిష్కర్తలకా సంప్రదాయములు తెలియకపోవుటచేత — నందును గొన్ని పొరపాటులు దొర్లినవి. ఒకప్పుడట్లున్నను నా గ్రంథములు పునర్ముద్రితములైనప్పుడు వానిని సరిచేయుట తరువాతివారు చేయ దగినపని." (పీఠిక–పుట–84) అని వ్రాశారు. పై వాక్యాలు శ్రీ రావుగారిపరిష్కరణవిధానాన్ని పట్టిచూపుతున్నాయి. శ్రీ కొమర్రాజు వారు మొదలైనవారు శైవ సంప్రదాయములు తెలియనివారు. వారి వ్రాతలలో పొరపాట్లు దొర్లినాయి. శ్రీ రావుగారిలాంటి తరువాతి పరిష్కర్తలు వాటిని దిద్దవలసి ఉన్నది. ఇంతవరకూ బాగానేఉంది. కాని వారి వ్రాతలకూ చేతలకూ పొత్తు కుదరడంలేదు. "నీలకంఠ శివాచార్యులవారు విశిష్ట ద్వైతియైనను పండితుడు మాత్రము ద్వైతి యనియే చెప్పవలయును" అని పీఠిక పుట 86లో నిష్కర్ష చేశారు. ఇది దారుణం. సంప్రదాయం తెలియనివారు చేసిన తప్పనే తెలిసినవారు కూడా చేయడం విచిత్రమైన విషయం.

మల్లికార్జున పండితారాధ్యుడు ద్వైతికాదు. ఆయన కాని, ఆయన అనుయాయులు కాని ఆవిధంగా చెప్పుకోనూలేము. ఇవ్వాళ్టి రోజున ఆంధ్రదేశంలో శ్రీపండితుని ఆరాధ్య సంప్రదాయం అనుసరిస్తున్నవారు చాలామంది ఉన్నారు. సాక్షాత్తుగా ఆతడిని తమవంశ మూలపురుషుడిగా చెప్పుకుంటున్నవారూ ఉన్నారు. వారంతా తాము విశిష్టద్వైతులమని, శివ విశిష్టద్వైతులమని, శివాద్వైతులమని

చెప్పుకుంటున్నారేతప్ప ఒక్కరు కూడా తాము ద్వైతులమని చెప్పు కోవడంలేదు. పండితారాధ్య వంశస్థులు, నీలకంఠ భాష్య ఆంధ్రాను వాదకులు ఐన శివశ్రీ నిర్మల శంకరశాస్త్రిగారు ఆరాధ్య సంప్రదాయంయొక్క ప్రచారంకోసం ప్రారంభించిన సంఘానికి "శివాద్వైత సిద్ధాంత సంఘ"మని పేరు పెట్టుకున్నారు. ఆరాధ్య సంప్రదాయానికి అమూల్యమైన సేవచేసి, తమ సాహిత్యంచేత పునరుజ్జీవనం కలిగించిన మహామహోపాధ్యాయ శివశ్రీ ముదిగొండ నాగలింగ శాస్త్రులవారు "మల్లికార్జున పండితాదులు శుద్ధాద్వైతమును ఖండించియున్నను వారి మతము శివాద్వైతమే" అని సిద్ధాంతం చేశారు. (బసవ పురాణ పీఠికా విమర్శనము—పుట—48). శివశ్రీ పండిత ముదిగొండ కోటయ్యశాస్త్రి అయ్యవారు తమ "శైవ సర్వస్వం"లో తమ సంప్రదాయం 'శివాద్వైత"మని స్పష్టంచేశారు. ఇంతమంది ఇన్ని రకాలుగా చెబుతూఉంటే, ఇవేవీ కాదని శ్రీ రావుగారు సంప్రదాయం తెలిసి ఉండికూడా మల్లికార్జునుడు ద్వైతియని బల్లగుద్ది చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఇది లోకం రీతి.

ఇక శాస్త్రమర్యాదను పరిశీలించినప్పుడు ఆరాధ్య సంప్రదాయానికి శ్రీ మత్త్రిలోకగురు నీలకంఠశివాచార్యులబ్రహ్మసూత్ర భాష్యం మూలకందం. ఇది అతి ప్రాచీనమైనది ఈ విషయాన్ని శ్రీ రావుగారు కూడా వప్పుకున్నారు. ఆరాధ్య సంప్రదాయాన్ని గూర్చి ఎవరు ఏమి చెప్పదలచుకున్నా దీనిని సంప్రదించడం తప్పదు.

శ్రీ శివాచార్యులు భోక్త్రాధిపత్య అధికరణంలో "చిదచిత్ప్రంచ విశిష్టశ్శివ ఏవ అద్వితీయః కారణం కార్యంచ భవతీతి విశిష్ట శివాద్వైతం" అనీ "ఇదంహి జగత్ పరమేశియః శరీరం సకల చిద చిత్ప్రంచక పరశక్తి విశిష్టాద్వితీయ వైభవః పరమేశ్వరః" అనీ సిద్ధాంతం చేశారు. దీనినిబట్టీ అనంతర ప్రకరణాలనుబట్టీ ఆరాధ్య సంప్రదాయం విశిష్టాద్వైతం, శివవిశిష్టాద్వైతం, శివాద్వైతం అని నిర్ణయమౌతున్నది.

ఈశ్వరుడు, జీవుడు, జగత్తు అనే మూడు తత్త్వములు శైవంలో పతి పశు పాశము అని చెప్పబడ్డాయి. ఈ పతి పశు పాశ వివేకం శైవంలో అతిప్రధానమైన ఘట్టం.

పతి శివుడు. సర్వాత్మకుడు. నిఖిల సంసార దోషరహితుడు. మాంగల్య గుణాధారభూతుడు. నిమిత్తోపాదాన కారణుడు. సూక్ష్మ చిద చిద్విశిష్ట శివుడు కారణము. స్థూల చిద చిద్విశిష్ట శివుడు కార్యము. చేతనా చేతనాత్మకమయిన జగత్తు పరాశక్తి. పరాశక్తి విశిష్టాద్వితీయ వైభవుడు పరమేశ్వరుడు.

జీవుడు నానాత్వ శోభితుడు. కర్త. భోక్త. శరీరభిన్నుడు. మానసికంగా సర్వథా శివునితో రమించువాడు. ఈశ్వరుడు అవినాశి. చైతన్య స్వరూపుడు. శుద్ధస్వరూపుడు. సహజ సుఖరాశి. శివుడు అంశి. జీవుడు అంశము. అంశి అంశములు భిన్నములు కావు. అంశి యొక్క గుణములు అంశమందు కూడా ఉంటాయి. కాబట్టి జీవుడు శివుడే! కాని అనాదియైన అజ్ఞానంవల్ల పాశబద్ధుడై కర్మలు చేస్తూ ఫలాన్ని అనుభవిస్తూ ప్రకృతిలో రమించడంవల్ల పశువని పిలువబడుతున్నాడు. పాశములు ఐదు. ఆణవము, కార్మికము, మాయీయము, బైందవము, రోధశక్తి. వీని బంధనాలనుండి బయటపడి శివునకు సత్యములు నిత్యములైన సర్వజ్ఞత్వం, నిత్యతృప్తత్వం, అనాదిసిద్ధ బోధత్వం, స్వతంత్రత్వం, అలుప్తశక్తిత్వం, అనంత శక్తిత్వం అనే షడ్గుణైశ్వర్యాలను పొంది పునరావృత్తి రహితమైన శాశ్వత శివసాయుజ్యం పొందడం జీవుడి కర్తవ్యం. ఇదే శివత్వసిద్ధి లేక ముక్తి — అని శైవ సిద్ధాంత దీపిక చెబుతున్నది. ఇటువంటి ముక్తిని జీవుడెవడైనా పొందవచ్చు. ఉత్తమాధమ అధికారాలు కాని, పుణ్య పాప వివక్షకాని శివత్వ సిద్ధిని పొందడంలో జీవుడికి అడ్డురావు. ఇటువంటి అనిర్వచనీయమైన సిద్ధి శివానుగ్రహంవల్ల కలుగుతుంది. శివానుగ్రహం నిరంతర ఉపాసనచేత కలుగుతుంది. అట్టి ఉపాసన ఏ తీరున చేయవలెనో శ్రీ శివాచార్యులు ఉపదేశించారు. వారు "నిరంతరం శివోహమితి భావనా ప్రవాహేణ శిథిలిత పాశతయాపగత పశుభావ ఉపాసకశ్శివ యేవ భవతి" అని నిర్ణయించారు. దీనినే మల్లికార్జున పండితుడు

"కలనైన నొండు దైవము
గలదనియెడు పలుకుదక్కి కలడొక్కడ కే
వల శివుడె దైవమని ని
శ్చల భక్తి శివైక్యుడుండు సంతతము శివా!"
(146)

అని కంఠోక్తిగా చెప్పాడు. దీనివల్ల శ్రీ నీలకంఠ శివాచార్యులు విశిష్టాద్వైతియైనను పండితుడుమాత్రం ద్వైతి అనేవాదంపరాస్తమౌతున్నది.

ద్వైతము శ్రీమత్ మధ్వాచార్యులతో ముడిపడి ఉన్నది. కాబట్టి వారు వారి శిష్య ప్రశిష్యులు ద్వైతాన్ని గురించి చెప్పిన విషయాలను పరిశీలించడంద్వారా శివాద్వైతానికి ద్వైతానికి గల భేద సాదృశ్యాలు తేటతెల్లమౌతాయి.

శ్రీ మధ్వాచార్యుల తరువాత అంతటి గౌరవ ప్రపత్తులను పొందినవాడు శ్రీ వ్యాసరాయలు. వారు మధ్వమతంగా విశేషఖ్యాతి పొందిన ద్వైతాన్ని ఒక్కశ్లోకంలో హృదయంగమంగా వర్ణించారు.

"శ్రీ మన్మధ్వయతే హరిః పరతరః సత్యం జగత్తత్త్వతః
భిన్నాః జీవగణాః హరే రనుచరా నీచోచ్చభావం గతాః
ముక్తిర్నైక సుఖానుభూతిరమలా భక్తిశ్చ తత్సాధనం
హ్యక్షాది త్రితయం ప్రమాణ మఖిలామ్నాయైక వేద్యోహరిః"

శ్రీ హరి సర్వశ్రేష్ఠుడు. జగత్తు సత్యము. తత్త్వతః జీవులుభిన్నులు. సత్త్వరజస్తమో గుణాలవల్ల జీవులలో ఉత్తమాధమ మధ్యమ భేదాలు స్వాభావికాలు. ఈ భిన్నత్వం శాశ్వతమైనది. ఒక తరగతికి చెందిన జీవుడు మరొక తరగతికి వెళ్ళలేడు. జీవుడు—ఈశ్వరుడు, జీవుడు — జీవుడు, జడము – ఈశ్వరుడు, జడము — వస్తువు, జడము—జీవుడు ఇవి ఎప్పుడూ భిన్నములే. వీటికే పంచ

భేదములనిపేరు. ''పంచభేదాః ఇమేనిత్యాః సర్వావస్థాసు నిత్యశః''. స్వస్వరూపంతో స్వయోగ్యతానుగుణమైన ఆనందానుభవం ముక్తి. ఇట్టి ముక్త్యావస్థలో కూడా పైనచెప్పిన పంచభేదములుంటాయి. అనగా పునరావృత్తి రహిత సాయుజ్య సిద్ధి జీవునకు లేదు. శ్రీహరి సర్వోన్నతుడు, సర్వశక్తి సంపన్నుడు ఐనప్పటికి జీవుని స్వరూప స్వభావాలను మార్చడంలో అస్వతంత్రుడు. వేదోక్త మార్గానికి తనను తాను బంధించుకొని జీవుని వాని కర్మకు వానిని వదలి వేస్తాడు.

ఈ వివరణం వల్ల శివాద్వైతానికి, ద్వైతానికి గల ముఖ్య భేదాలను క్రింది పట్టికలో చూడవచ్చు.

శి వా ద్వై త ం	ద్వైతం
1. జీవుడు శరీర భిన్నుడు.	శరీరియే జీవుడు.
2. అంశియొక్క అంశము కాబట్టి జీవుడు ఈశ్వరుడే.	జీవుడు ఈశ్వరుడు కాడు.
3. జీవునిలో భేదములు లేవు.	కలవు. అంతేకాక అవి శాశ్వతములు.
4. శివుడు అంశి. జగత్తు జీవుడు అంశములు.	ఇవి మూడును వేర్వేరు తత్త్వములు.
5. ముక్తికి జీవులందరూ అర్హులే.	కారు.
6. పునరావృత్తి రహిత శివ సాయుజ్యము ముక్తి.	స్వస్వరూపంతో స్వయోగ్యతానుగుణమైన ఆనందానుభవం ముక్తి.
7. జీవుల కర్మానుభవాన్ని నశింప చేయడానికిశివుడుస్వతంత్రుడు సమర్థుడు.	కాడు.

మల్లికార్జున పండితారాధ్యుడు శివతత్త్వసారం 25 వ పద్యంలో పశుపతియైన ఈశ్వరుడు పశువుల బంధమోక్షం చేస్తాడని మోక్షదాత అని వర్ణించాడు. 28,29, 30 పద్యాలలో ఈ భావాన్నే ఇంకా విస్తరించాడు. ఈశ్వరాను గ్రహంవల్ల సంసార దుఃఖంనుండి విముక్తులై జీవులంతా ఈశ్వరుడి వలెనే ప్రకాశిస్తారని ఉద్బోధించాడు. 177 నుండి 120 వరకు గల పద్యాలలో ఎటువంటి పాపాత్ముడైనా శివ భక్తి వల్ల ''పరుసవేది సోకిన యినుముక్రియ'' పుణ్యాత్ముడౌతాడని వర్ణించాడు.

''నరకస్థులు స్వర్గస్థులు
నరతిర్యగ్గర్భయేవ నస్థాది పశూ
త్కరములు భవత్ప్రసాద
స్ఫురణము దొరకొనుడు ముక్తి బొందుదురు శివా!'' (106)

అని ఆతడి దృఢ నిశ్చయము.

''మృడ ! నీదుపాద భక్తిని
వడిగొని భజియించునట్టి వారల కెల్లన్
చెడు ఘోర పాప చయములు
కడుకొని శుభములును నూర్ధ్వగతులగును శివా !''
(శ్రీ రావుగారి అనువాదం - అనుబంధం 726)

వీటిని బట్టి జీవులలో శాశ్వత భేద వాదం పండితుడు అంగీకరించలేదని తెలుస్తున్నది. ఎటువంటి పుణ్యాత్ముడికైనా, పాపాత్ముడికైనా ఈశ్వరుడు తన అవ్యాజ కరుణ చూపి ముక్తి నిస్తాడని ఆయన భావించాడని తెలుస్తున్నది. ఇది ద్వైత సిద్ధాంతానికి వ్యతిరేకం. ద్వైతంలో జీవులందరూ ముక్తికి అర్హులు కారు. వారందరికీ వారి వారి స్వరూప స్వభావాలతో నిమిత్తం లేకుండా ముక్తినీయ ఈశ్వరుడు స్వతంత్రుడు కాడు. ఈ విధంగా మూల సూత్రాలనే అంగీకరించని పండితుని ''ద్వైతియే'' అనడం అవిచారిత రమణీయం. ఇది సంప్రదాయాభిజ్ఞత కాదు.

శ్రీ వేంకటరావుగారు పీఠిక 86 వ పుటలో ఈ విధంగా వ్రాశారు.

''తత్త్వమసి యను వాక్యమునకు మధ్వమతస్థులు తస్యత్వమసి'' యని యర్థము చేయుట మన మెఱుగుదుము. పండితుడీ యర్థమునే యీ క్రింది పద్యమున జెప్పెను—

''జీవుడు శివుడను వాక్యము
భావింపగ నైక్యమునకు ప్రతిపాదకమే
జీవుండన బశు భృత్యుడు
గావున నీ వాడ వేరు గాదనుట శివా !''

శ్రీ రావుగారు పొరపడ్డారు. 'ప్రమాదోధీమతామపి'. శివాద్వైతము భేదాభేదరూపకము. శివుడు అంశి. జీవుడు, జగత్తు అంశములు. సృష్టిస్థితిలయ తిరోధానానుగ్రహములనబడే పంచ కృత్యములు తప్ప తక్కిన సమస్త గుణములందు జీవుడు శివుడే! అయితే అజ్ఞానంవల్ల పాశబద్ధుడై జగత్తులో రమించడంవల్ల పశువనబడుతున్నాడు. ఉపాసనా బలంవల్ల పశుత్వాన్ని ఛేదించుకొని శివుడితో సమానుడౌతున్నాడు. కాబట్టి శివాద్వైతం శుద్ధాద్వైతంకాదు. శుద్ధాద్వైతంలో అసలు భేదప్రసక్తే లేదు. ఇక ద్వైతంలో భేదం శాశ్వతం. జీవుడు శివుడెన్నడూ కాలేడు. 'పునరపి జననం పునరపి మరణం' అన్నట్లుగా అనంతమైన జన్మ లెత్తుతూ, తనస్వరూపానికి, స్వభావానికి తగినట్లుగా కర్మలుచేస్తూ, అందుకు అనుగుణమైన ఆనందాన్ని అనుభవించడం జీవలక్షణం.

పండితారాధ్యుడు పై పద్యంలో 'నీవాడగాని వేరుగాదనుట శివా!' అనడం ద్వైతం కాదు. భేదాభేదరూపకమైన అద్వైతం.

తాను నిజానికి వేరైనా తనకూ శివునకూ అంశి అంశ సంబంధం ఉన్నదని తెలుసుకొని జీవుడు ఉపాసనవల్ల శివయోగముగ్నుడవడం, శివసాయుజ్యం పొందడం శివాద్వైత సిద్ధాంతం. నిజానికి భేదం లేనిదే అభేదం లేదుకదా! కాబట్టే పశుత్వ సంజ్ఞను పొందిఉన్నప్పటికీ 'నేను నీ వాడ్నే వేరుకాదు' అని పండితుడు చెప్పుకోవలసి వచ్చింది. భేదబుద్ధితో ప్రారంభించి అభేదత్వాన్ని పొందడం పై వాక్యానికి తాత్పర్యం. ఈ విషయాన్నే శ్రీ నీలకంఠ శివాచార్యులు ''శివోహమితి భావనా ప్రవాహేణ'' అని సెలవిచ్చినారు.

పోనీ! పై పద్యంలో పండితుడు ద్వైతపరంగా అర్థం చెప్పాడనే అనుకుందాం. ఐనప్పటికీ పండితుడు ద్వైతి ఎంతమాత్రం కాలేదు. ఒక సిద్ధాంతాన్ని నిరూపించవలసి వచ్చినప్పుడు ప్రతిపక్షం యొక్క సిద్ధాంతాన్ని తొలుత అంగీకరించి ఆ పైన పూర్వపక్షం చేసి తమ సిద్ధాంతాన్ని నిలుపుకోవడం, లేదా ప్రతిపక్ష సిద్ధాంతాన్ని తమ కనుకూలంగా వివరించి దానిని తమదిగానే నిరూపించుకోవడం వాద విదులకు తెలియనిది కాదు. ద్వైతం అని చెప్పబడుతున్న పై అర్థాన్ని స్వీకరించి పండితుడు తన శివాద్వైతాన్ని సమర్థించుకున్నాడు. దీనివల్ల ఆతడు ద్వైతి అనడం అసమంజసం. శ్రీ శంకరులు బౌద్ధులనుండి మాయావాదాన్ని స్వీకరించారు. అంతమాత్రాన వారు బౌద్ధులనడంలేదుకదా! ఇది కూడా అంతే! సిద్ధాంతంచేసే సమయంలో ఎన్నో యుక్తులను వాడుకోవలసి ఉంటుంది. ఒక ప్రత్యేకమైన యుక్తిని తీసుకొని 'ఈతడు చెప్పింది ఇదే!' అనడం సబబుకాదు.

ఈ చర్చ ఇలా ఉండగా మరో గొప్ప చిక్కువచ్చి పడింది. పండితుడు ద్వైతియైనపక్షంలో శ్రీ మధ్వాచార్యులు, వారి శిష్య గణం పండితుని శిష్యులు కావలసి వస్తుంది. ఇది ఆరాధ్యులకు ఆనంద కారణం కావచ్చుకాని, మాధ్వులకు సమ్మతమౌతుందా?

నిజానికి పండితుడు ద్వైతికాడని చెప్పడానికి ఈ వ్యాసరచయిత ఇంతశ్రమ పడనక్కరలేదు. ఇందుకు సులువైనమార్గం మరొకటి ఉంది. శ్రీ నిడుదవోలు వేంకటరావుగారే అందుకు ప్రమాణం. వారే వేరొకచోట ''పండితుడు ద్వైతి కా''దని బల్లగుద్ది చెప్పారు. అంటే శివతత్త్వసారం పీఠికలో తాము చెప్పిన విషయాలనే తామే ఖండించుకున్నారు.

ఇంతకుముందు స్మరింపబడ్డ శివశ్రీ నిర్మల శంకరశాస్త్రి గారు 'శివాద్వైత సిద్ధాంత సంఘం' పక్షాన ''శివజ్యోతి'' అను వార్షిక పత్రిక నొకదానిని ప్రచురిస్తున్నారు. ప్రథమ సంపుటంలో ''ఆంధ్రదేశమున వర్ధిల్లిన శైవము—ఆరాధ్య సంప్రదాయము'' అనే వ్యాసంలో శ్రీ రావుగారు శ్రీ కొమర్రాజువారి అభిప్రాయాన్ని, స్వామి శివశంకరుల అభిప్రాయాన్ని అనువదించి ఇలా చెప్పారు-

''మల్లికార్జున పండితుడు శివతత్త్వసారమున ప్రసాదించినది—అద్వైతవాదులను ప్రతిఘటించునపుడు ఖండించి ప్రమాణీకరించినది—శివాద్వైతముకాని వేరుకాదు. తన మతము శివాద్వైతమని ఇందే ఈ క్రింది పద్యమున స్పష్టపరచియున్నాడు.

అద్వైతైకస్థితి నీ
యద్వైతమకాన యీశ్వరాద్వైతము స
ర్వాద్వైతమనగి వేరు జ
గద్విపరీతమగు తత్త్వగతి గలదె శివా !

ఇచట నీశ్వరాద్వైతమనగా శివాద్వైతమని యర్థము. ఈశ్వర శబ్దము శివునియందే రూఢము. ''యస్మిన్నీశ్వర ఇత్యనన్య విషయశ్శబ్దో యథార్థాక్షరః'' అని కాళిదాసోక్తి. దానిని 'ఐశ్వర్యాద్వైత'మని 62వ పద్యమున పండితుడు చెప్పియున్నాడు .. .. బ్రహ్మసూత్రములకు శ్రీ శంకరాచార్యుల వారికిముందే శ్రీ నీలకంఠ శివాచార్యులవారి శివాద్వైత భాష్యము ప్రఖ్యాతమై యుండుటచేతను అది వ్యాప్తిలోనుండి పండితుని కాలములో ప్రామాణికమై వెలయుటచేతను పండితుడు ద్వైతపరముగా వేదవాక్యముల కర్థము చెప్పవలసిన ఆవశ్యకత యెంతమాత్రమునులేదు ... పండితుడు శ్రీ నీలకంఠ శివాచార్యుల భాష్యము ననుసరించి ఈశ్వరాద్వైతమునే సిద్ధాంతీకరించెను.

బసవపురాణమున సోమనాథుడు, పండితుడు ప్రతిపాదించినది ఈశ్వరాద్వైతమనియే చెప్పియున్నాడు.

''అదిగాక వినుడీశ్వరాద్వైతమనుట
ఇదియు సర్వాద్వైతమే యట్లుగాక !''

వాస్తవికతలోనిది శివాద్వైతమే! భిన్నత యందేకత్వము ప్రతిపాదిత మగుట చేత ఇందు ద్వైతమున కవకాశమే లేదు.''

(క్రీగీటులు వ్యాసరచయితవి)

'శివతత్త్వ సారం' పీఠికా వ్రాతలకు 'శివజ్యోతి' వ్రాతలకు గల భేదం విజ్ఞులు గమనించే ఉంటారు. శ్రీ రావుగారు ఇంతగా తమ అభిప్రాయాన్ని ఎందుకు మార్చుకోవలసి వచ్చిందో మాత్రం అర్థంకావడంలేదు. ఈ రెండింటిలో ఏది సత్యమని పాఠకుడు నమ్మాలో కూడా తెలియడం లేదు. వీటిని బట్టి శ్రీ రావుగారికి స్థిరమైన అభిప్రాయాలు లేవని, లేదా ఉండవని మాత్రం తెలుస్తున్నది.

మరొక విచిత్రమైన విషయం ఏమంటే పై వ్యాసంలో శ్రీ రావుగారు స్వామి శివశంకరుల అభిప్రాయాన్ని ఉటంకించి విమర్శించారు. శ్రీ రావుగారి బృహత్పీఠికతో ప్రచురింప బడ్డ ముద్రణకే శ్రీ శివశంకరులు వ్రాసినఉపోద్ఘాతంలో ఈ అభిప్రాయం చెప్పబడ్డది. పీఠిక వ్రాస్తున్న సమయంలో ఉపోద్ఘాతంలోని విషయాలను సమర్థించి ఆ తరువాత ఎక్కడనో వాటిని పేరుపెట్టి విమర్శించడం పరిశోధక పరమేశ్వరులకు మాత్రమే చెల్లింది.

శ్రీ రావుగారి వ్రాతలేవైనా శ్రీ పండితుడు మాత్రం 'ద్వైతి' కాదని ఫలితాంశం.

ఇతి శివమ్ !

ఆధార గ్రంథములు

1. శివతత్త్వసారము : కృష్ణా పత్రిక వారి ముద్రణ.
2. శివజ్యోతి 1 × 2.: శివాద్వైత సిద్ధాంత సంఘం.
3. బసవపురాణ పీఠికావిమర్శనము : మహా మహోపాధ్యాయ ముదిగొండ నాగలింగశాస్త్రిగారు.
4. శైవ సర్వస్వము : శివశ్రీ ముదిగొండ కోటయ్యశాస్త్రిగారు.
5. శ్రీ నీలకంఠభాష్యము : శివశ్రీ నిర్మల శంకరశాస్త్రిగారి ఆంధ్రానువాదం
6. Madhvas' Teachings in his own words : B.N.K. Sharma
7. Introduction to Vedanta : P. Nagaraja Rao
8. విజ్ఞాన సర్వస్వము 6 వ సంపుటము.
9. శైవ సిద్ధాంత దీపిక.

హరిశ్చంద్ర కథ - గౌరన-రాఘవాంకులు - కొన్ని విషయాలు

(57వ పేజీ తరువాయి)

References

1 రాఘవాంకుడు వృద్ధ బ్రాహ్మణునికి కాలకౌశికుడని నామమిడెను. – రెడ్డి: 129; రాఘవాంకుడు తన హరిశ్చంద్ర కావ్యమున కాలకౌశికుని భార్యపాత్రను సృష్టించి యామెకు కలహ కంఠిక అను సార్థక నామధేయ మొసర్చెను. – రెడ్డి : 130.

2 రాఘవాంక; పీఠిక : పుట : 36.

2a. నక్షత్రకుని పాత్ర కన్నడములో రాఘవాంకుని హరిశ్చంద్ర చారిత్రము కంటె ముందే చండ కౌశిక నాటకములో కలదను ఒక అభిప్రాయము కలదు. కాని లభ్యమగుచున్న సంస్కృత చండకౌశిక నాటక ప్రతులలో నక్షత్రక పాత్ర గాని, లేక ఆ పాత్రకు సమానమైన మరియొక పాత్ర గాని కన్పించుట లేదు. – రెడ్డి : 138. cf 65–71.

3 పైదే.

4 రాఘవాంక : ద్వాదశ స్థలం. పద్యం : 3. పుట : 167

5 గౌరన : ద్వితీయ భాగం : 1080–1082.

6 గౌరన : ద్వితీయ భాగం : 1190–1195.

7 రెడ్డి : పుట : 76.

8 గౌరన : ద్వితీయ భాగం : 1208–1210.

9 – పైదే – పుట : 170.

10 – పైదే – పుట : 179.

11 – పైదే – పుట : 180–181.

12 రాఘవాంక – ఏకాదశ స్థలం. పద్యం : 25 పుట· 161.

13 గౌరన – పుట : 183–184.

14 రాఘవాంక : ద్వాదశ స్థలం : పద్యం : 10, పుట : 169.

15 గౌరన : పుట : 193–194.

16 రాఘవాంక : ద్వాదశ స్థలం : పద్యం : 35, పుట : 183.

17 గౌరన : పుట : 201.

18 గౌరన : పుట : 202.

19 రాఘవాంక : ద్వాదశ స్థలం : పద్యం : 38. పుట : 184.

20 గౌరన : పుట : 40.

21 గౌరన : పుట : 232.

22 రాఘవాంక : చతుర్దశ స్థలం : పద్యం : 32 పుట: 203.

23 రాఘవాంక : ద్వాదశ స్థలం : పద్యం : 9. పుట : 169.

24 గౌరన : పుట : 186.

25 నాగయ్య : పుట : 404.

శ్రీ కశింకోట ప్రభాకరదేవ్

కుక్కలు

వెలుగుని చీకటి కసికసిగా మింగేవేళ —

వరండాలో వాలుకుర్చీలో కూర్చొని న్యూస్‌పేపరు చదువుకొంటూంటే, మా పాలేరు వెంకడు చెమటలు కక్కుకుంటూ, ఆయాసపడిపోతూ "గోరం జరిగిపోనాది దొరా!" అంటూ వచ్చాడు.

వాడి వాలకం చూస్తుంటే ఏడవడానికి సిద్ధంగా వున్నవ్యక్తి లాగ కనిపించాడు. ముఖం బాగా పాలిపోయింది. ఏదో ఘోరాన్ని చూసిన వ్యక్తిలాగ వణుకుతున్నాడు.

"ఏం జరిగింది?" ప్రశ్నించాను.

"మావోడ్ని పోలీసులెత్తుకుపోయారు."

"ఏం తప్పుచేశాడని?" ఆశ్చర్యంగా ప్రశ్నించాను. నా ప్రశ్నకు వెంకడి ముఖం చిన్నబోయింది.

"మావోడి సంగతి తవరికి తెలీదా దొరా! వొర్తి సత్తిగల పోడు. ఆడ్నొట్టుకుని, నువు నకసలైటు వన్జెప్పి, ఈడ్చుకు పోయింద్రు. ఆడ్ని నువ్వే కాపాడాలి దొరా!" అంటూ నా కాళ్ళ మీదపడి భోరుమన్నాడు.

నాకేం చెయ్యాలో తెలియలేదు.

'వెంకడి కొడుకు నక్సలైటవడం ఏమిటి? ఇంపాసిబుల్. వాడొత్తి అమాయకుడు. పిరికివాడు. అటువంటి వ్యక్తిలో యింతటి తిరుగుబాటుతనం తలెత్తుతుందా?' నేను ఆలోచనల్లోపడి, మాట్లాడకపోవడంతో వెంకడు పైగావంచాతో కళ్ళొత్తుకుంటూ చెప్పడం ప్రారంభించాడు.

"ఇదంతా ఆ నాయుడుగోరు సేయించిన కుట్ర దొరా! మావోడ్ని నాయుడుగోరి బొట్టి (కూతురు) మనువాడుతానని సెప్పిందట. ఈ సంగత్తెల్సి నాయుడుగోరు తన బొట్టిని పిల్సి సీవాట్లెట్టారట. ఎన్ని సివాట్లెట్టినా ఆ నాయుడుగారి బొట్టి మావోడ్ని తప్పించి మరింకెవడ్ని మనువాడ్నని ధయిర్యంగా సెప్పేసిందట. మరిక నాభం నేదని సెప్పి, నకసలయిట్లు గురించి కూపీ తియ్యడావికి జవాన్లొత్తే...కుమ్మక్కై సేసేసి...మావోడు నకసలైటని సెప్పి బొక్కలోనెట్టించేసినాడు మా బతుకున్ని అన్నాయం సేసేసినాడు..."

వెంకడు చెప్పింది జాగ్రత్తగా విని గాఢంగా నిట్టూర్చాను. ఇక, నేనేం ప్రయత్నం చేసినా లాభం వుండదు. 'నక్సలైట్' అనే ముద్రతో అరెస్టు కాబడితే, అందులోనుండి బైటకు రప్పించ గలగడం నావంటి వాళ్ళకు అసాధ్యం. అన్నింటికి భగవంతుడున్నాడంటూ, వెంకడ్ని మెల్లగా ఓదార్చి, ధైర్యంచెప్పి పంపించేశాను. అంతకన్నా మరి నేనేం చెయ్యగలను?

మనస్సంతా వికలమయింది. చీకటి బాగా వ్యాపించడంతో యింట్లోకి నడిచాను.

* * *

మర్నాడు—

మా యింటిముందు కోలాహలంగా వుండడంతో "ఏమిటా?" అని కిటికీలోనుండి చూశాను.

మున్సిపాలిటీబండి ఆగి వుంది.

అందులో బోలెడన్ని కుక్కలు రక్తసిక్తమై కుప్పగా పడి వున్నాయి. దుర్భరమైన బాధననుభవిస్తున్నట్టుగా, గట్టిగా అరవడానికి...కదలడానికి కూడా శక్తి లేనట్టుగా విలవిల్లాడుతూ ఆర్తనాదాలు గావిస్తున్నాయి.

ఆ బండిచుట్టూ జనం గుమిగూడి వున్నారు. కాకీరంగు నిక్కర్లు వేసుకున్న వ్యక్తులు పొడుగాటి కర్రల్ని, వలల్ని పట్టుకుని కుక్కలకోసం వీధిలో తిరుగాడుతున్నారు.

ఇంతలో, మా అయిదేళ్ళ 'పాప' గబగబా వీధిలోనుండి పరిగెత్తుకుంటూ నా దగ్గరకు వచ్చింది.

'డాడీ! ఆ కుక్కల్నెందుకు బండిలో పట్టుకెడుతున్నారు?" అని ప్రశ్నించింది.

"చంపేయడానికి..." ముక్తసరిగా జవాబు చెప్పాను.

"పాపం...ఎందుకు డాడీ! ఆ కుక్కల్ని చంపేస్తారు?" పాప కళ్ళల్లో సానుభూతి తొంగిచూసింది.

"పిచ్చి కుక్కల వలన సమాజానికి హాని కలుగుతుందని వాట్ని చంపేస్తారమ్మా!"

"మరి...ఆ కుక్కలన్నీ పిచ్చివేనా? అందులో ప్రతిరోజూ రాత్రి మన గుమ్మంలో పడుకుంటుందే ఆ కుక్కకూడా పిచ్చిదేనా డాడీ?" ప్రశ్నించింది.

'పాప' ప్రశ్నకు వులిక్కి పడ్డాను. ఎందుకో ఆ సమయంలో నక్సలైటుగా అరెస్ట్ గావించబడిన వెంకడి కొడుకు గుర్తుకు వచ్చాడు.

''ఊహూం... ఆ కుక్క పిచ్చిది కాదమ్మా!'' అన్నాను బాధగా.

''మరెందుకు డాడీ! ఆ కుక్కను కూడా చంపివేయడానికి పట్టుకుపోతున్నారు?'' ఆ చిన్నారి గొంతులో దుఃఖం ధ్వనించింది.

నా గుండె నెవరో పిండినట్లయింది.

''తమ స్వార్థంకోసం పాపా!'' మనసులో చెలరేగుతున్న అల జడిని అణచుకోవడానికి ప్రయత్నిస్తూ చెప్పాను.

నా మాటలు పాపకు అర్థమయ్యాయో లేదోగాని మరింక నన్నేం ప్రశ్నించలేదు.

నక్సలైట్స్ హింసావాదులే కావచ్చు. వాళ్ళను అణచడం పౌర శాంతిభద్రతలదృష్ట్యా సమర్థనీయం కావచ్చు. అయితే, తమకు అడ్డం నిలచిన వాళ్ళను 'నక్సలైట్స్' పేరుతో పిచ్చికుక్క లను వేటాడినట్లుగా వేటాడ్డం ఏం న్యాయం? ధనికవర్గాల గుప్పిట నుండి ఈ వ్యవస్థ మారేదెప్పుడు? మార్పుగలిగే నాథుడెవ్వడు??... అన్నీ ప్రశ్నలే.

బాధగా, నిస్సహాయంగా ఆర్తనాదాలు గవిస్తున్న రక్తసిక్త మయిన బండిలోని 'కుక్కలు'ను చూస్తూ స్థాణువులాగ నిలబడి పోయింది పాప.

నువ్వూ - నేనూ

శ్రీ పి. యస్. శాస్త్రి

కమల్,
ఆరోజు నీ చెవిలో చెప్పిన మాటలు,
గుర్తున్నాయా నీకు ?
''నువ్వూ నేనూ యిప్పుడు కలిసివున్నాం సరదాగా !
ఎల్లకాలం యిలాగే వుంటామని, వుండాలని,
ఊసులు చెప్పుకుని, బాసలు చేసుకున్నాం !
కాని మన యీ ప్రేమ తీవ్రత తగ్గాక,
మన భౌతిక వాంఛలు తీరాక,
వాతావరణ కాలుష్యం,
కొంచెం కొంచెంగా మన మనస్సుల్లో చేరాక,
నువ్వన్నది నేనూ,
నేనన్నది నువ్వూ,
అతి తీవ్రంగా ఖండించడం ప్రారంభించాక,
నీమాట చెల్లాలని నువ్వూ
నా మాట నెగ్గాలని నేనూ
పట్టుబట్టడం ప్రారంభించాక,
మన ప్రేమ బంధాన్ని
పునరుద్ధరించి, గట్టిపరచగలిగింది
మన బుజ్జిపాప చిరునవ్వే సుమా !'' అని !
అప్పుడు నీ మొహం ఎలాగైందో గుర్తుందానీకు ?
టమాటా ఎరుపు, గులాబీల మెరుపు,
అంతా కలగలుపు !
''ప్రియా, అలా జరగదుగాక జరగదు !
నీకూ నాకూ మధ్య విభేదాలు రావుగాక రావు !
ఇదే నా హామీ !
హాయిగా నిశ్చింతగా వుండు !''
అన్నావు నువ్వు !
''కాని నువ్వు ఓడిపోయావో లేదో
మన బుజ్జిపాప బోసినవ్వుచూసి చెప్పు !
ఈ చెవితో విని ఆ చెవితో వదిలేస్తా !
నీమీద ఒట్టు ! నమ్ము నన్ను !!''

కలగూరగంప

శేషేంద్ర చారిత్రక అవసరం 'కవిసేన'!

కవిత్వం పుష్పించటానికి 'అనుభూతి' వాతావరణం కావాలి. విమర్శ దీపించటానికి 'అనుశీలన' చూపు కావాలి. ఇటు కవిత్వాన్నీ, అటు విమర్శను సమాదరించి, దృక్పథ స్ఫోరకత్వాన్నిచ్చే 'సిద్ధాంతం' లేక 'లక్షణ తత్వం' వెలుగొందాలంటే దానికి అనుభూతి, ఆలోచన, అవగాహన, అనుశీలన అంతర్నేత్రాలు కావాల్సిందే.

*   *   *

తల్లి గర్భ స్థితికి తదనుకూల పరిస్థితులు సమీకృతం కానపుడు — దృష్టి అసమగ్ర రూపంలో ఉన్నప్పుడు — వికృత శిశువు జననం ఎలా జరుగుతుందో అలాగే రచన విషయంలో కూడా అదే జరిగి తీరుతుంది.

*   *   *

సాధారణంగా కవిత్వాన్నిగానీ, ఇతర సాహిత్యాన్నిగానీ దూషించటం ప్రధానంగా రెండు రకాలుగా జరుగుతుంది. ఒకటి— సాహిత్యంలో ముడి పదార్థంగా ఉండే వస్తు విషయాదులు నచ్చక పోవటాన్ని బట్టి. రెండు—తామనుకున్న (శిల్ప) రూపంలో కాకుండా మరో రకంగా ఉండే ప్రయోగాల్ని చూడలేక పోవటాన్ని బట్టి. ఇంచుమించు ఇదే అభిప్రాయాన్ని కొ.కు. గారు విశ్లేషించారుకూడా. ఈ రెండు లక్షణాల శాటిన్ తెరల్ని కప్పుకుని, అలంకారాల కృత్రిమ సౌందర్యంతో మెరుస్తుంది కవిసేన, కాదూ శేషేన్ చేసేన.

ఉన్న ప్రతి అధ్యాయం ఆరంభంలోనో, మధ్యలోనో ఛటుక్కున లేచి "ఒక చారిత్రక అవసరం కోసం కవిసేన ఏర్పడిందనీ" ఎక్కడికక్కడ గర్జిస్తూనే "కవిసేనలో చేరిపోయి రక్షణ పొందండహో" అని మలుపు మలుపుకీ హితోపదేశం ఒలకపోస్తూనే వున్నారు శేషేంద్ర.

అనవగాహన

"తెలుగు సాహిత్యానికీ, తనకూ ఏలాటి సంబంధమే లేద"ని [నీలా జంగయ్య సంస్కార భూషణం పుస్తకావిష్కరణ సభలో మాటాడుతూ] చెప్పుకున్నందుకు ఏ పేచీ లేదు — 'తెలుగు సాహిత్యం ఒక ఎడారి'(ఎల్లోరా రేపటి వసంతం పుస్తకానికి పీఠికలో) అని రాసినందుకూ ఏ పేచీ లేదు —"వెధవది తెలుగు భాష ఏనాడో మరచి పోయాను" [చైతన్యస్టడీ సర్కిల్ సభలో] అనే ప్రకటన తన గొప్పతనాన్ని చాటుకున్నందుకు ఏ పేచీలేదు — కానీ, సంబంధమే లేదంటూ తెలుగు కవిత్వాన్నీ, తెలుగుదేశాన్నీ, తెలుగు ప్రజల్నీ ఉద్ధరిస్తానికి మూడు వందల యాభయి రెండు పేజీల కంకణం కట్టుకున్నందుకే పేచీ! తెలుగు కవిత్వం ఎడారి అంటూనే, అగ్నీ అమృతము కలిపి అందిస్తున్నారనీ, వీరోచిత విందులు వాళ్ల వచన పద్యాలని అవధానీ సువర్ణలను ఆకాశానికెత్తుతున్నపుడే పేచీ —! వెధవది తెలుగు భాష మరచి పోయానంటూనే, తెలుగు భాషలో మరచిపోదామన్నా మరచి పోలేనన్ని కవితాపుటలు (పుస్తకాలు) ప్రచురించి ఫుట్‌పాత్‌లమీదవదుల్తూ, అవి కొనండి మొర్రో అంటూ మీటింగుల్లో చెబుతున్నందుకే పేచీ -!

ఇంతకీ కవిసేన కవిత్వాని కిచ్చిన నిర్వచన మేమిటి ?? Spontanious over flow of powerful feelings కాదు, Moods of Imitation అంతకన్నా కాదు, 'వాక్యం రసాత్మకం కావ్యమ్' అసలేకాదు. మరేమిటి ??

"కవిత అంటే విచిత్ర చిత్రాలు, విచిత్రోక్తులు, విచిత్ర భాష" ఇది కవిసేన కవిత్వ నిర్వచనం నిర్వచనం కింద కొన్ని ఉదాహరణల జాబితా ఇవ్వబడింది. అందులో వాల్మీకివి అయిదు, జోష్ మల్‌హ్యాబాదీ అనే కవిదొకటి, సౌదా అనే కవిదొకటి, నవీద్‌ది ఒకటీ ఇచ్చి ఆ తర్వాత వరుసగా తన పుస్తకాల్లోంచి ఓ పది కొటేషన్స్ ఉదాహరించారు.

అయితే - "రామలింగయ్య అల్లు హాస్యరసాలజల్లు" అన్న ఒక కవి లైన్లు ఉత్త చెత్త అని వివరించాడు — విచిత్రోక్తులు, విచిత్ర భాష కవిత్వమైనపుడు పై పంక్తులు (అవి ఉపన్యాసంలోనైనా) ఎందుకు కవిత్వం కాదు ?? విచిత్రోక్తుల పరంపరగా సాగే గజ్జల మల్లారెడ్డి ఉపన్యాసం ఎందుకు కవిత్వం కాదు ?? ఆరవ్వాడు మాట్లాడే తెలుగు [విచిత్రంగా ఉంటుందా భాష] మాత్రం ఎందుకు కవిత్వం కాదూ?? అంతేకాదు, "కుర్చీ రాత్రికి రాత్రే లేచిపోయింది ఆడపిల్లలా!" అన్నా "కలం ఆబిద్దు రోడ్డు మీదే పెద్దమనిషి అయింది" అన్నా "బాబూ అటు చూడు — ఆకాశం అడవిలో నీళ్లాడింది — నెలలు నిండందే" అన్నా కవిత్వమయి పోయినట్టేనా ???

కవిత్వంపట్ల సరైన అవగాహన, దృక్పథం లేనపుడు ఇచ్చే స్టేట్‌మెంట్లకూ వచ్చే చిక్కులన్నీ ఇలానే ఉంటాయి. త్రిపురనేని మధుసూదన్‌రావ్ గారన్నట్లు "పదార్థాల స్వరూపాన్ని అవగాహన చేసుకోవాలంటే వాస్తవాలనుంచి పరిశీలన ఆరంభం కావాలి. నిర్వచనాలనుంచి పదార్థాల స్వరూపాన్ని నిర్ణయించాలనుకోవడం అశాస్త్రీయం. ఎందుకనంటే ఏ విషయంలోనూ శాశ్వితమైన నిర్వచనాలుండవు."

పోనీ—'కవి ఎవడు?' అనే ప్రశ్న వేసుకుని "పోట్లాట వాడు బతకటానికి పీల్చే ఊపిరి" అని సమాధానం చెప్పటం బాగుంది. అయితే పోట్లాటకు ఆయన అవగాహన ఏమిటీ? అంటే — "కవి

పూలతో పోట్లాడతాడు. పూల తోటలతో పోట్లాడుతాడు. మేఘాలతో పోట్లాడుతాడు'' అనీ సమాధానం.

''లోకం కోసం శోకం'' అని కవి కార్యం నిర్ధారించబడింది. అయితే ఇక్కడ లోకం అంటే ఏమిటి? పూలా? పూల తోటలా? మేఘాలా? పాటల ? సముద్రాలా? లిల్లీలా, కెమిలియా లా? పడవలా? వెన్నెలలా? ఏదో ఒకటి అవాలి కాబట్టి – దేశమంటే మట్టికాదనీ, మనుషులని చాటిన గురజాడకు దేశంపట్ల కవిత్వంపట్ల ఉన్న దృక్పథం సరయింది కాదు కాబట్టి—కవిసేన ఆత్మకళాభ్యాసంతో నూతన శకాన్ని నిర్మిస్తుంది కాబట్టి—పువ్వుని చూస్తూ శతాబ్దాలు బతగ్గలదు కాబట్టి—ఒక్కపాటకోసం బతుకు బతుకంతా ధారపోయగలదు కాబట్టి – పూలతోటలతో పోట్లాడగలదు కాబట్టి—జేబుల్లో కోకిలల్ని నింపుకొంస్తుంది కాబట్టి కవిసేన 'లోకం' మనుషులు కానే కాదు! కాకూడనే కూడదు!

అసలు మనిషికి శేషేంద్ర నిర్వచనం చూడండి.

''మనిషి ఆలోచించే జంతువన్నారు శాస్త్రజ్ఞులు. కానీ – మనిషి కన్నీరుకార్చే జంతువు అంటాడు. అవగాహన ఎంత బలహీనంగా జరిగిందిక్కడ ??

మనిషికి జంతువుకన్నా 'ఆలోచన' అనేది అదనంగా ఉన్నదనీ, ఆలోచనాజ్ఞానం జంతువుకు లేదనీ, కదా జంతువుకన్నా మనిషి గొప్పశక్తి అని శాస్త్రజ్ఞులు సమంజసంగా నిర్వచించారు. కానీ, ఆ అభిప్రాయం సరిగ్గా లేదనీ కవిసేన అభిప్రాయం కాబోలు, 'మనిషిని కన్నీరు కార్చే జంతువు' అంది. జంతువూ కన్నీరు కారుస్తుంది. మనిషీ కన్నీరు కారుస్తుంది కదా, అయినపుడు వాటిమధ్య రెండు నిర్వచనాలెందుకు ? మనిషికి జంతువుకీ అభిన్నత్వమనే అవునా ? కవిసేన అవగాహనా ??

రాజకీయాలపట్ల, సమాజం పట్ల, సోషలిజం పట్ల, వర్గ చైతన్యంపట్ల, కవిసేన అవగాహన ఇలాగే–ఇంతకంటే విపరీతంగా—అనవగాహన గుహల మధ్య అయోమయ లోయల మధ్య ఉన్నట్లు ఈ మేని—ఫెస్టో ((శ్రీరమణకి క్షమాపణలతో) కపళికలు చెబుతాయి.

''కవిసేన రాజకీయ ఉద్యమం కాదు. (కానీ)రాజకీయాలతో సంబంధముంటుంది – రాజకీయ పార్టీలతో సంబంధముండదు. (కానీ) ఆయా పార్టీల వాళ్ళు ఇందులో సభ్యులుగా ఉండొచ్చు'' అనటంలోనూ; ''కవికి సామాజిక చైతన్యం కావాలి కావాలి కావాలి ముఖ్యం ఈనాడు అత్యవసరమైంది వర్గ చైతన్యం'' అని అంటూనే ''రాజకీయాల్ని, రాజకీయ వాదుల్ని, సహస్ర నేత్రాలతో బాహువులతో పట్టుకోండి - రాజకీయాల్ని విడిచెయ్యాలి'' అనటంలోనూ – ; ఎన్ని అజ్ఞాన అవక తవక అవగాహనలున్నాయో విడమరచి రంధ్రాన్వేషణ చేసి చూపటం అనవసరమనుకుంటూ. వివాదాల్ని వదలెయ్యమంటూనే ''కవితకు కొలబద్ద లేదనే అన్‌సైంటిఫిక్ దృక్పథాన్ని ఖండించాలి'' అనే వివాదం విసిరారు.

ఇంతకీ కవిత్వం సాంచాల్లో పోసి తియ్యటానికి 'గ్లాసు' అనో, కొలత పెట్టి కుట్టడానికి కవిత్వం 'చొక్కా' అనో, తగుపాళ్ళలో వేసి వండటానికి కొత్త రకం 'వంట' అనో – కొలబద్దతో కొలవటానికి అబిద్దు రోడ్డు అనో కవిసేన అనుకుంటే అనుకోవచ్చు కానీ, కవిత్వానికెప్పుడూ కొలబద్ద లేదు. ఉండబోదు. ఎందుకంటే కవిత్వం పుట్టాకే లక్షణాలు విశ్లేషించబడ్డాయి, సిద్ధాంతాలు రూపొందించబడ్డాయి కాబట్టి. సమాజ పరంగా, సాహిత్యపరంగా కాలం తొక్కిన పరిణామాల దారుల్లో లక్షణగ్రంథాలు, సిద్ధాంత గ్రంథాలు పూచాయి కాబట్టి. వాటిలోంచి కవిత్వం ఎప్పుడూ పుట్టలేదు. కవిత్వంలోంచే అవి పుట్టాయి. అయితే – అంతకు ముందున్న విమర్శనూ, అంతకు ముందున్న కవిత్వాన్ని జీర్ణించుకుని కొత్తదనం పుష్పించటం జరుగుతుంది.

ఇక—సార్వత్రిక సూత్రం మాట. సార్వత్రిక సూత్రాన్ని స్వీకరించటానికి కవిత్వం గణితంకాదు. విగ్రహమూకాదు. ఎందుకంటే – నిరంతరం పరిణామశీలంతో ఆధునికతా అన్వేషణతో ప్రయాణం చేసే తపన 'కవిత' వ్యక్తిత్వం కాబట్టి. ఇదే హిస్టారికల్ ఎండ్ సయింటిఫిక్ దృక్పథం అవుతుంది.

''ఆర్థిక, సామాజిక సమస్యలవరకు ఈ శతాబ్దం అంగీకరించిన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని కనిన పరిష్కారంగా స్వీకరించాలి'' అని కృత్రిమ సిన్సియారిటీ ప్రదర్శించింది కవిసేన. అయితే ప్రధానంగా వైజ్ఞానిక (కవి) నాయకత్వం నెలకొల్పాలని పోరాడుతుందనే ఈ కవిసేన, ప్రధానంగా శ్రామిక నాయకత్వాన్ని కోరే మార్క్సిజాన్ని ఏం అర్థం చేసుకున్నట్లు? ''సామాజిక ఆర్థిక సమస్యల్ని పరిష్కరించే సాధనమైన రాజకీయం మానవ జీవిత విశ్వరూపానికి ఒక వెంట్రుక మాత్రమే''అనే అభిప్రాయంతో ఉన్న కవిసేన, సమస్త మానవ జీవితం సామాజిక పోకడలు అన్నీ ఆర్థిక స్థితి మీదే ఆధారపడి ఉంటాయనే మార్క్సిజాన్ని ఏం అర్థం చేసుకున్నట్లు?? పైగా మార్క్సిజాన్ని స్వీకరించామని అర్థంకాని ఆత్మవంచన చేసుకోకపోతే ఏం పోయింది??

కవిసేన వైరుధ్యాలు

మేనిఫెస్టోలో భిన్న అభిప్రాయాలుండటం కవిసేన చారిత్రక అవసరమో? వైజ్ఞానిక ఉద్యమమో అయితే కావచ్చు కానీ, పచ్చివైరుధ్యాలుండటం మాత్రం క్షమాతీతం. పరిశీలనా సౌలభ్యం కోసం [చర్చ, వివరణ దాకా అక్కరలేదనే రీతిలో] కొన్ని భావాల వివాదాలు ఉదాహరిస్తాను.

- కవిత్వంలో సహజమైన వర్తమాన భాష అవసరం. (పే. 111)

  అసలు కవిత్వమే ఒక విచిత్ర భాష. సామాన్య భాషకంటె భిన్నమైంది. (పే. 128)

- కవికి కావలసింది ఇంద్రియవాదం. హేతువాదంకాదు. (పే. 54)

ఏది నిజం అనే జిజ్ఞాసమీద రాగం పెంచుకోండి· హేతువాదం ఆవేశింప జేసుకోండి. ఆలోచించండి. (పే.73)

- జీవితానికి సాహిత్యం ప్రతిబింబం కావడంకాదు. ఆ పని కవి కంటె కెమెరా చక్కగా చేస్తుంది. ఇక కవి ఎందుకు? (పే. 62)

  వాక్యనిర్మాణ వ్యూహం ఎలా పన్నితే, భాష, కవి చూసిన చిత్రాన్ని ఫోటో తియ్యగలదో ఆ మర్మజ్ఞత కలిగించుకోవాలి. (పే. 83)

- కవికి రాజకీయాలే కాదు సర్వసామాజిక వ్యవహారాలూ కావాలి. రాజకీయాలే జీవన జ్వాలల్లో మూడువంతులయితే కవి ఆ జ్వాలలమధ్య ఉండాలి. (పే 14)

  నీవు కవిత్వం గురించి తెలుసుకోవాలంటే మొట్టమొదట నీ రాజకీయ తోక ముడుచుకోవాలి. (పే. 198)

- మార్క్స్, ఎంగెల్స్ ప్రకారం కావ్యప్రయోజనం సోషలిస్టు సమాజ స్థాపన. కవిసేన కూడా డిటో అంటుంది. (పే. 344)

  చిల్లర దేవతలు సిద్ధాంతాలు చెబుతారు. నేను మధువందిస్తాను. నాతో రండి. మధువు సేవించండి. దేవతల్లా ఆకాశంలో తిరగండి. (పే. 31)

- కవికి సామాజిక చైతన్యం కావాలి కావాలి కావాలి! (పే. 258)

  సాహిత్య రంగంలో ఈనాడు తెగవిగురుతున్న సామాజిక చైతన్యం ఒక వెంట్రుక ముక్క. (పే. 20)

  నీ సామాజిక చైతన్య కవులు ఉసుళ్ల పుట్టలాగాపుట్టారే— ఆకలి తీరిందా? (పే. 29)

- కావ్యప్రయోజనం సోషలిస్టు సమాజ స్థాపన (పే. 344) మానవ సమాజ క్షేమం (పే. 12)

  సాహిత్య భాష ఏ ప్రయోజనంకోసం సాగదు. (చైతన్య స్టడీ సర్కిల్‌లో శేషేన్ ప్రసంగం)

- కవిత్వం అంటే—ఆ కొండల కవతల, సముద్రాల కావల, అందని దూరాల్లో, ఆ అంతరిక్షాల ఎత్తుల్లో ఉండే కొలబద్దలతో కొలుచుకో—ఈ వెధవల చంకల్లోనే ఇరుక్కుని చావకు (పే. 70)

  కవిత్వం జీవితపు వీధుల్లో దొరుకుతుందని, హోటళ్లలో బస్టాండ్లలో, ప్రజలు వరదలై పారే ప్రదేశాల్లో ఉంటుందని తెలుస్తుంది. అక్కడ వెతుకు కవిత్వంకోసం మూడో నేత్రంతో. (పే. 71)

- వస్తువు అనే ముడిసరుకు శిల్పం అనే మంత్రదండంచేత కవితగా మార్చివేయబడుతుంది. (పే. 24)

  కవిత్వం అనుభూతి మూలక ఆత్మకళాభ్యాసంనుంచి పుడుతుంది. (పే. 22)

ఇప్పటికయినా విమర్శకునికీ ముఖ్యంగా ఒక సిద్ధాంతకర్తకు ఉద్యమ నిర్మాతకూ ఆలోచన అనేదీ అనుశీలన అనేదీ అంతర్నేత్రాలుగా ఉండాలని ఒప్పుకోకపోతే—అన్నీ మంత్రదండంతోనే సాధ్యమవుతాయని అనుకుంటే ఆ అనంతాకాశపు అయోమయ స్రష్టని ఆలోచనా ద్రష్టలెవరూ హర్షించరుగాక హర్షించరు·

కవిత్వం - అభిప్రాయం

మార్క్సిజం కాలం తెచ్చిన ఒక విప్లవాత్మకమైన, విశ్లేషణాత్మకమైన దృక్పథం, ''కళలు ప్రజలకోసం''— ఆ చూపులోనే గోర్కీ, మయకోవస్కీ, లూసన్, నెరూడా, లోర్కాలాంటివారు పరిపూర్ణ సాహిత్యకారులుగ నిలదొక్కుకున్నారు. ఆదే అభిప్రాయాన్ని కవిసేన శేషేంద్ర ''ప్రజాకోటికోసం కవి ప్రయోగిస్తాడు తన ఆయుధం. ప్రజాగాథకోసం ప్రవహిస్తుంది కవి సిరా'' అని వ్యక్తపర్చారు. ఇది దృఢమయిన అభిప్రాయంకాబట్టే ''ప్రజలు వరదలుగా పారే ప్రదేశాల్లో కవిత్వముంది వెతుకు మూడో నేత్రంతో.'' అనగలిగాడు. కానీ—ఈయనకుమ్మరిస్తున్న కవితావర్షం మాత్రం అనంతాకాశాల్లోంచో, నక్షత్ర లోకాల్లోంచో, సముద్రాల కావలవైపునుంచో వస్తున్నట్టు దీపిస్తుంది. ''సముద్రం నాపేరు'' 'నీరై పారిపోయింది' గొరిల్లా అనేవి ఇటీవల వచ్చిన సాకులు.

''జేబుల్లో కోకిలల్ని వేసుకురాలేదు'' ''వెన్నెట్లో తిరుగుతున్న మేఘనౌక పగిలిపోయింది'' ''ఇది ఆకాశమా నక్షత్రాల ఖజానా'' ''దోసిళ్లతో నక్షత్రాలు ముంచుకుని, ఆత్మకు వెల్తురు చెరువులు కావాలి స్నానం చెయ్యటానికి'' ''అడవుల్లో ఆర్కెస్ట్రా'' ''కవిత్వంలాంటి ఆ తోటల్లో ఒక నెమిలి సిమిలీలా నర్తించాలి'' ''వసంతర్తువు నా కవితకు తర్జుమా''లతో చెప్పిందానికీ, రాసిందానికీ పొత్తులేని కొత్త అవతారమెత్తుతాడు. ఏ బుక్ చూసినా ఈ పద్ధతే రాజ్యం చేస్తుంది. ప్రజలకోసం ఎక్కడ పారింది సిరా? ఎటుపారింది సిరా!

మరోటి

''మరొకడు వాడిన పదంగానీ, భావం గానీ, చస్తే వాడవద్దు'' అన్నది సరైందనే విశ్వాసముంది కాబట్టే ''కవిత్వంలోకి వాడి పారేసిన పదాలు, పదబంధాలు, బింబాలు ప్రతీకలు అలంకారాలు ఇత్యాదులేవీ రాకూడదు'' అని చెప్పే వాక్యంతో మరింత గట్టిపరచుకున్నాడు తన అభిప్రాయాన్ని.

ఈ అభిప్రాయాన్ని కవిత్వంలో ఎంతవరకు పాటించాడో అదీ చూద్దాం. ఇటీవలే వచ్చిన ''సముద్రం నా పేరు''ని స్పృశిద్దాం.

''గడియారపు చేతులు ఇచ్చే ఆజ్ఞలకు లొంగి జీవనపందెంలో పరుగులెత్తే మనుషులు...'' (పు. 4) అనే శేషేంద్ర

పంక్తులు 'సి నారాయణరెడ్డి'గారి "ఇప్పుడు గడియారాల చేతులు నడిపిస్తున్నాయి మనుషుల యంత్రాల్ని" అన్న భావానికీ—

"వెల్తురు చెరువులు కావాలి స్నానం చెయ్యటానికి (పు.11)" అనే శేషేన్ భావం 'జ్వాలాముఖి' రచన "సూర్య స్నానం చెయ్యాలని..." అనే దానికీ —

"రాలిన గింజలు మట్టిలో పూడ్చి పెడితే దానికి అంత్య క్రియలు చేసినట్టు కాదు. దాని ప్రాణం భూమిని చిల్చుకుని ... కొమ్మలు ధరించి పూస్తుంది." (పు. 18) అన్నది శివారెడ్డి రిజరెక్షన్‌లోని "నేను మట్టికింద పాతిపెట్టబడి మొలుస్తున్న చేతుల కాళ్ళ వాన్ని" అనేదానికీ — "రాత్రి అయ్యేసరికి సజీవ వస్తువులు మౌనం వహిస్తాయి. నిర్జీవ వస్తువులు మాట్లాడు తాయి" అన్నది "చీకట్లో సజీవులు నిద్రపోతాయ్. నిర్జీవ రూపాలు మేల్కొంటాయ్" అన్న భావానికీ — "గడియారాన్ని ... భయంతో కొట్టుకుంటుంది దాని గుండె" అన్నది ఏ పత్రికలో వచ్చే 'సీరియల్' లైనుకో — "నా రెక్కలు సవరించుకున్నా ఎగరాలని, నా గొంతు సవరించుకున్నా పాడాలని" అన్నది ఏ సినిమా పాటలోని పంక్తులకో — "నీవు కులాసాగా పోతున్న ఒక పడవ" అనేది మయకోవ్‌స్కీ "పీపుల్ ఆర్ బోట్స్" అన్న భావానికీ — అనుకరణలనీ, ఇలా ఇంకా చూపుతూ పోవొచ్చని పరమ నిశ్శంకగా చెప్పొచ్చు. [ఇంకా కావాలంటే "జపాన్ కవిపై తెలుగోడి ప్రభావం" అనే ఆంధ్రజ్యోతి వీక్లీలో వచ్చిన శ్రీ రమణ వ్యాసం చదువుకోవచ్చు]అసలు "సముద్రం నా పేరు" అనేపేరు ఎక్కడిది? బోదలేర్ మహాకవి 'సముద్రం—మానవుడు' (అను : శేషేన్) అనే కవితకు భావానుకరణ కాదనీ (ఆఫ్‌కోర్స్, తన గొంతులోంచి బోద లేర్ ప్రవహిస్తున్నాడని "రక్తరేఖ" అనే డైరీలో చెప్పుకొన్న ప్పటికినీ) — "చైతన్యం నా పేరు" అన్న నారాయణరెడ్డిగారి కవితా పంక్తికి అభివ్యక్త్యనుకరణ (ఇమిటేషన్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్) కాదనీ శేషేంద్ర అనగలరా? అందాకా ఎందుకు? 'కవిసేన' అనే సో కాల్‌డ్ చారిత్రక సృష్టి 'శివసేన'లోంచి పుట్టలేదా? సాగదీయ డం, దుమారం లేవదీయడం కాదు నా ఉద్దేశ్యం; కొత్త ముసుగు లేసుకుని, చుట్టూ జాలిపడే (జారిపడే) లొసుగుచేసుకుని ఉద్యమం పేరుతో, ప్రజల పేరుతో, మార్క్స్ పేరుతో, కవిత్వం పేరుతో, కీర్తికోసం మొహం వాచిన 'కుక్కలొస్తున్నాయి—జాగ్రత్త' అని చెప్పటానికే ఇంతానూ.

మరోటి

"వమిలి పారేసిన పదాలు, పీల్చి పిప్పి చేసిన సామెతలు" అంటూ "సాహిత్య విద్యాపరంగా ఇవన్నీ నీచస్థాయి ప్రయోగాలు. వీటిని కవిత్వంలో కూర్చోబెట్టటానికి అర్హత లేదు." అంటూ 'ఆదుర్దాగా, రాంములక్కాయ, నేస్తం, చీవాట్లు, బెజ్జం' ఇత్యాది పదాల్ని పేర్కొన్నారు అంతకన్నా పాడిందే పాట ప్రసవంగా, వాడిన పదాలే వారసత్వంగా, చేసిన గమ్మత్తులే చేతులుగా, శేషేంద్ర కవిత సాగుతుంది, ఏ పుస్తకమయినా, ఏ పేజీ అయినా తియ్యండి. ఏ కవిత ఎక్కడ ఆపి, ఎక్కడ నుంచి చదువుకున్నా, ఏ పేజీలోంచి ఏ పేజీలోకి దూకినా, ఏ పుస్తకం మధ్యనుంచి ఏ పుస్తకం మధ్యకి వెళ్లినా ఒకే లాగుంటుంది. [సత్యశ్రీమన్నారాయణకి కృతజ్ఞతలతో.]

పాటలు, వసంతాలు, కోయిలలు, లిల్లీలు, డైసీలు, కలలు, పడవలు, నదులు, కెరటాలు, గొంతు, శబ్దాలు, శతాబ్దాలు, తుఫాను, అంటూ అరిగిన రికార్డుల్ని 'ప్లే' చేస్తున్నతీరు ఎవరిలో విశృంఖలంగా కనిపిస్తుందో ఆత్మపరిశీలన చేసుకుంటే ఎంచక్కా తేట కదుతుంది. "రిప్రొడక్షన్ ఈజ్ నాట్ యాన్ ఆర్ట్, బట్ ఓన్లీ ఎ క్రాఫ్ట్" అన్నది శేషేంద్ర కూడా గుర్తేకదా.

ఏ విమర్శనాత్మక కోణంలోంచి చూసినా, శేషేంద్ర విపరీత కవితా ధోరణి —కవిసేన అనవగాహనాత్మక అయోమయత్వమూ—తన కావ్యాలను తనే 'సుప్త చైతన్య స్ఫూర్తితో రాసిన విశిష్ట కావ్యం' (నీరైపారిపోయింది) అనీ, ప్రప్రథమంగా సోషలిస్టు దృక్పథంతో ప్రేమ ప్రతిపాదన రచన' (నా దేశం—నా ప్రజలు) అనీ ఆత్మ స్తుతి చేసుకొనే పరనిందా తత్వమూ — మనముందు బోనుల్లో దోషుల్లా తలొంచుకొని నిలబడక తప్పదు.

శేషేంద్ర దృష్టిలో కవి శిఖరారోహణ — "వాడ్ని ప్రజలు ముమ్మరంగా చదవటమే (పు.351)" నట. [కవిత్వాన్ని సెక్స్ నవలల స్థాయికి వెళ్లేదాకా వదిలెయ్ మనేనా కవిసేన సందేశం??]

"కవి ఒకవైపు కవిత రాయాలి. రెండో వైపు దానికి ఆడియన్సుని కూడా సృష్టించుకోవాలి. (పు. 55)" అని బయట పడ్డాగా వైజ్ఞానికోద్యమ నిర్మాత ముసుగులో — కవిసేన ముసుగులో — తలదాచుకో ప్రయత్నించే శేషేంద్ర శర్మ గుంటూరు. నిజానికి—ఈ కవి అసంఖ్యాకంగా పుస్తకాలేస్కున్నాడు (వేయగలడు) కాబట్టీ, రీడర్సు తక్కువై అవి ఒడ్డుకొట్టుకొచ్చే చేపల్లా ఫుట్‌పాత్ లెక్కుతున్నాయ్ కాబట్టీ-ఆడియన్స్‌ని నగరాలు పంచుకుంటున్నయ్ కాబట్టీ - ఆ బెంగతో — కేవలం ఆడియన్సుని సృష్టించుకోవాల్సిన చారిత్రక (వ్యక్తిగత) ధ్యేయంతో శేషేంద్ర ఈ అన్వేషణ చేస్తున్నాడని అనుకోవచ్చునా ? అయితే — ఆంధ్ర దేశమా జాగ్రత్త !!

— శ్రీ నందిని సిధారెడ్డి.

తెలుగుదేశంలో వైద్యవిద్యను సూచించే శాసనాలు లేవా!

లేవని 79 జూన్ భారతిలో శ్రీ జి. జవహరలాలుగారు జగదేకమల్లుని (1015-42) సైదాపురం జినశాసనాన్ని ప్రక టిస్తూ ఈ విధంగా రాశారు.

"ఆయుర్వేద వైద్యమునకుగల ఉచ్ఛస్థితిగురించి తెల్పు శాసనాలు మనకు లేవనే చెప్పాలి. అన్ని శాస్త్రాల ప్రగతి గురించి

తెల్పే శాసనాలు మనకు లభ్యమయినవి. వైద్యశాస్త్రం ముఖ్యంగా ఆయుర్వేదము గురించి తెల్పే శిలాశాసనాలు మన రాష్ట్రంలో ఇంత వరకు లభ్యం కాలేదు.... ... ... కాని వైద్యశాస్త్రప్రావీణ్యులను ఏ శిలాశాసనం మనకు అందించలేదు. ఈ శాసనమూలంగా ప్రప్రథమంగా ఆయుర్వేద వైద్యశిఖామణి రెండవజయసింహునిరాజవైద్యుడు అగు అగ్గలయ్య వెలుగులోనికి తేబడినాడు'' (పుట 40). ప్రథమంగా వెలుగులోకి తేబడినవాడు రాజవైద్య అగ్గలయ్యకాదు, వైద్య విద్యకు సంబంధించిన శిలా శాసనాలు లభ్యం కాలేదన్న విషయమూ వాస్తవంకాదు. సాధారణంగా శాసన పరిష్కర్తలు ముందు వెనుకలు చూసుకొని రాస్తూ ఉంటారు. ఒక్కొక్కప్పుడు ఎంత గొప్ప శాసన పరిశోధకుడికైనా కొన్ని అంశాలు చట్టున స్ఫురించకపోవచ్చు. కాని పై విధం రాసినవారు అరుదు.

బులెటిన్ ఆఫ్ ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ మెడిసిన్ 75 అక్టోబరు సంపుటం5–నెం. 4 సంచికలో మన రాష్ట్రంలో లభ్యమైన శాసనాల్లో కనబడిన వైద్య విద్య ప్రశంసను గూర్చి శ్రీ బి. రామారావుగారు మంచి వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో డాక్టరు ఆచంట లక్ష్మీపతి, డాక్టరు డి.వి.సుబ్బారెడ్డి, ఆయుర్వేదాచార్య వేటూరి శంకరశాస్త్రి ఈ విషయంపై చేసిన పరిశ్రమను కొనియాడారు.

1977లో అదే పత్రిక 3,4 నెంబర్లు ఏక సంచికగా వెలువడిన 7వ సంపుటంలో డాక్టరు పి.వి పరబ్రహ్మశాస్త్రిగారు ఈ సైదాపురం శాసనాన్నే పరిష్కరించి అగ్గలయ్య శస్త్ర శాస్త్ర పాండిత్యాన్ని వెల్లడి చేశారు.

శ్రీ జవహరులాలుగారి వ్యాసంలో ఈ రెండు అంశాలు లేక పోవడం ఆశ్చర్యం. అయితే ఒకందుకు వ్యాసకర్తనుఅభినందించాలి. డాక్టరు శాస్త్రిగారి వ్యాసం సముచితమైన పత్రికలో పడినా అది ఇంగ్లీషులో ఉంది. ఆ పత్రికను వైద్యశాస్త్రంలో అభిరుచి ఉన్నవారు, విజ్ఞానాపేక్షగల ఇతరులు మాత్రమే చదువుతారు. 'భారతి'లాంటి ఉత్తమసాహిత్య పత్రికలో తెలుగులో శ్రీ జవహరులాలుగారు ప్రచురించటం వల్ల వ్యాసవ్యాప్తికి తోడ్పడుతుంది. క్రీ.శ. 6వ శతాబ్ది నాటికే తెలుగుదేశంలో విష్ణుకుండిన గోవింద వర్మ శాసనంలో గ్లాన భైషజ్యాఢ్యైన ఒక బౌద్ధ వైద్య సన్యాసికి కొంత దానం చేసినట్లు ఉంది. (ఎపి.ఆం. II. పుట 11, 23). తక్కిన శాసనాలు శ్రీ రామారావుగారు తమ వ్యాసంలో చర్చించడం జరిగింది. మల్లంపలి సోమశేఖరశర్మగారు తమ 'రెడ్డి రాజ్యాల చరిత్ర' గ్రంథంలో 481వ పుటలో పరిహితాచార్యుల వంశవృక్షం ఇచ్చారు. వేలూరి ప్రభాకరశాస్త్రిగారు తమ 'శృంగార శ్రీనాథం' అనుబంధంలో ఇచ్చిన పోలిపల్లి శాసనంవల్ల భూలోక ధన్వంతరిని గూర్చి తెలిసింది. వారి సోదరులు శ్రీ శంకరశాస్త్రిగారు ఎన్నో అమూల్యమైన విషయాలు తమ అముద్రిత వైద్య వాఙ్మయ గ్రంథంలో తెలిపారు. బహుశా వ్యాసకర్త తొందరపడి శాసనాలు లేవని రాసి ఉండొచ్చు.

— శ్రీ సుందరేశ్వరరావు

ఆంధ్రాయూనివర్సిటీ "తెలుగు వ్యుత్పత్తికోశం"

79 జూన్ 'భారతి' సంచికలో డా. లకంసాని చక్రధరరావు గారి సంపాదకత్వంలో ఆంధ్రాయూనివర్సిటీవారు పసందుగా అచ్చు వేసిన తెలుగు వ్యుత్పత్తికోశం సమీక్షా పరామర్శ చదివాము.

పాతమంత్రివర్గం చేసిన పొరబాట్లను కొత్త మంత్రివర్గం సమర్థించినట్లు, సంపాదకుడుగా ఉన్నవ్యక్తి వచ్చిన విమర్శపై ఏదీ సమాధానం రాయకపోతే బాగుండదని రాసినట్లుంది. తెలుగు వ్యుత్పత్తికోశం నిర్మాణంపై అనేక ముఖాలుగా సుమారు 6 పుటల విపుల విషయాత్మకంగా రాసిన విమర్శకి (79 జనవరి 'భారతి' 49–55) జవాబుగా రెండున్నర పుటల విధాయక విమర్శ చదివాక మరో విడత రాయవలసి వచ్చినందుకు విచారంగా ఉంది.

'అసింబోవు' ప్రయోగంలో యమకానికి గాని అర్థానికిగాని భంగం వాటిల్లలేదట. పైగా సాహిత్య అకాడమీ ప్రచురించిన రామాభ్యుదయంలో (2–24) అట్లాగే ఉందని సమర్థన. అర సున్నా పెడితే ఏమవుతుంది? పెట్టకపోతే ఏమర్థమవుతుందో? తెలియకపోతే ఎట్లా? క్రియ అసి + పోవు కాని అసిన్ + పోవు (అసింబోవు) కాదు. రామాభ్యుదయం ప్రయోగం పాత పుస్తకాలలోని సాధుపాఠం గ్రహించి సూ. ని, 'అసివోవు' గ్రహించింది. పిచ్చయ శాస్త్రిగారు దానిని సమర్థించారు. 'అసివోవు' శబ్దపల్లవక్రియ. "శబ్దపల్లవము లన్నియు ఏకపద క్రియలు. అందువల్ల ఆ క్రియల లోని ధాతునామావ్యయములను వేరుచేసి ద్రుతాంతములుగాను ఆయా క్రియలకు కర్మలుగాను అర్థం చెప్పగూడ''దని దీపాలవారి హెచ్చరిక (సా.స 39). కాబట్టి 'అసివోవు' అనేదే సరియైన పాఠం. సాహిత్య అకాడమీ ప్రచురించటం, దానికి ఒక మాజీ తెలుగు పీఠాధిపతులు పీఠికవ్రాయటం పాఠ నిర్ణయానికి ప్రామాణికాలు కావు.

'అచ్చతెలుగు' అంటే స్వచ్ఛమైన తెలుగు అనేది వ్యుత్పత్త్యర్థం ప్రతిపదార్థం వ్రాస్తే ఆక్షేపణీయాంశంకాక మరేమవుతుంది. సమాసాలకు వ్యుత్పత్త్యర్థాలు ఉంటాయా! శబ్దానికి కాక.

తాలువంటేనే దౌడకాదని ఒప్పుకొన్నప్పుడు తాలుమూలం దౌడ ఎట్లా అవుతుంది. అది దౌడ మూలం–అంటే హనుమూలం అవుతుంది. జిహ్వామూలం దంతమూలం, హనుమూలం లాగే తాలుమూలం కూడా ఉండొచ్చు. తాలుమూలం సుశ్రుతంలో ఉన్నట్టు మోనియర్ విలియమ్స్ ఇచ్చాడు. భాషా వ్యవస్థలో ఉన్నట్టు లేదు.

'జిహ్వకి మీదనుండే శిరోభాగం అంతా తాలువు. తాలువుకు కీలు ఉండాలి. అంటే ఇటూ అటూ తిరిగే ఉపాయం. ఇంతకీ 'అంకిలి'కి కీలుకి సంబంధం ఉంటేగా. శ.ర.లో ఇచ్చిన దౌడక్రింది కీళ్లు. అర్థం సరిపడదు. అక్కిళ్లు, నక్కిళ్లతో దీనికి సంబంధం ఉండాలె. వెక్కిళ్లు, ఓకిళ్లలోని ద్వితీయావయం కీలుకాదు. అంకిలి→క్కిలి→అక్కిళ్లగా మారడానికి అవకాశం ఉందేమో చూడాలి.

'అనుగు వెలుగ సాల. ఎఱ్ఱన హరివంశంలో తప్పతక్కిన రెండు ప్రయోగాలు సరిపడవు' అని మొదట్లోనే వ్రాయడం జరిగింది. "మేము గ్రహించిన పాఠాన్ని కాదనటం మాకుభిన్నంగా ఉన్నదాన్ని గ్రహించడం శ్రీ వెంకటరావుగారి వ్యాసంలో సర్వత్ర గోచరిస్తోంది" అన్నారు. పూర్వ పండితుల్లాగ తెలుగు వ్యుత్పత్తి కోశం మహా సంపాదకులు, ప్రయోగాలు మూలగ్రంథాలు చూసి ఎత్తి వ్రాసి, వాటిపై వచ్చిన విమర్శనలు పరిశీలించి పండితులు తయారు చేసిన నిఘంటువుకాదని ఢవిణకొట్టి చెప్పొచ్చు. పూర్వ విమర్శలు చూడలేదని చెప్పటానికి కొన్నిమాత్రమే విమర్శలో చూపడం జరిగింది. ప్రథమ సంపుటంలోనే 'సవాలక్ష' తప్పులు ఏరి పెట్టుకొన్నాం. అరసున్నలు ఉండవలసినచోట లేకపోవడం, అనవసరమైనచోట్ల ఉండటం వల్ల వ్యుత్పత్తిని తెలుసుకోడానికి వీలుండదు. అదే విధంగా శకటరేఫసాధురేఫాలు కూడా. ఇక ఆఁచెయ్యి అసాధువని మాత్రం సా.స.ను చూపటం జరిగింది. ఎఱ్ఱన తిక్కన ప్రయోగాలు చూపెట్టి ఎట్లాగో తప్పుకొన్నారు— పాపం.

మీ వ్యుత్పత్తి ఉత్పత్తి శక్తికి శ్రీరామరక్ష తప్ప మరేమీ సహాయపడవు. 'ఉప్పపిండి' అనే శబ్దంలో ఉప్పకి ఏమాత్రం సంబంధంలేదని అది 'ఉడికిన' అనే అర్థాన్ని తెలుపుతుందని బాగా ఆలోచించి శబ్దరూపాలను తర్కించేవారికి తెలుస్తుంది. ఉప్పపిండి శబ్దం పంకజం వంటిదా! 'ఉప్ప ప్రధానంగా వేసి చేసిన పిండి' అయితే నోట్లోపెట్టుకోలేం. ఎందుకు మొహమాటపడతారు. అది 'ఉడికిన పిండే' అని అందరికీ తెలుసు. ఇదేం అశ్వకర్ణంకాదు రూఢ్యర్థం చెప్పటానికి.

1957లో ప్రారంభించిన పథకంలోని మొదటి సంపుటం 1978లో ఆవిష్కరింపబడింది. అంటే మొదటిసంపుటం వెలువడ డానికి 21 సంవత్సరాలు అయిందంటేతప్పా! మధ్యను పనిమానేస్తే అది విశ్వవిద్యాలయానికి సంబంధించిన సమస్యగాని దేశానికి కాదు కదా! 10 సంవత్సరాల కాలం అధికంగా చెప్పటం భావ్యమే.

ఇంతకి ఉపాధ్యక్షులచే 28–8–1977లో పీఠికవ్రాయించు కొని, ప్రధాన సంపాదకులు పీఠిక 2–2–78 వరకు ఎందుకు ఆప వలసి వచ్చింది? ఆ రహస్యం ఏమిటో? మొదట పీఠికలో 3 సంపు టాలని చెప్పి ఈ నాలుగు నెలల్లో దాన్ని 8 సంపుటాలుగా మార్చా లనే నిర్ణయం తీసుకొంటే దేశానికి ఏం తెలుస్తుంది? ద్వితీయ సంపుటం 31–3–1979 నాటికి పూర్తి అవుతుందని హామీ ఇచ్చారు. ఇప్పటిదాకా అంటే ఇంకా 3 నెలలైనా బయటపడలేదు. సహజమే! అట్లాగే 'ఆశిద్దాం' 'ఆశిద్దాం' అంటూ వ్రాసుకుపోతే 'శ్రీరామరక్షే' అవుతుంది శబ్దస్వరూప నిర్ణయం, ప్రాచీనాంధ్ర తాళపత్రగ్రంథ పాఠరూప నిర్ణయం క్రిందటితరం పండితులతోనే పోయాయి. కనీసం ఏ పుస్తకాలు ఎవరు రాశారో తెలియని విశ్వవిద్యా లయ ప్రచురణ పాఠశాల పిల్లల విజ్ఞానానికికూడా దిగువ స్థాయిలో ఉందని అనుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. సంపాదకులుగా బాధ్యత స్వీకరించినవారు తమకుపూర్వం జరిగిన పనిని సమర్థించడం తప్ప కాదు. వారికి మా సానుభూతిమాత్రం అందజేస్తున్నాం.

శ్రీ నిడుదవోలు వేంకటరావు

ఎల్లమ్మ - ఎల్లయ్య

1979 ఫిబ్రవరి "భారతి" సంచికలో వేదం వేంకట రాయశాస్త్రిగారు "తెలుగువారి వింతపేర్లు" అనే వ్యాసంలో 'ఎల్లమ్మ — ఎల్లయ్య' అనే పేర్లు గ్రామాల పొలిమేరలను బట్టి వచ్చి ఉంటాయన్నారు. ఆ పేర్ల ఔచిత్యాన్ని గురించి మే నెల "భారతి"లో చేరెడ్డి మస్తాన్‌రెడ్డి రు వ్రాస్తూ "దీనికే మరో అర్థం చూడండి! ఎల్ల=అంతటికి, అయ్య, అమ్మ! సమస్తానికి అయ్య, అమ్మ=దేవుడు, దేవత, అనే అర్థం వస్తుంది. తెలుగులో 'దేవుడు' అనే అర్థాన్ని బోధించే పదాల్లో ఇంత మంచిపదంలేదు." అని తమ నిశ్చితాభిప్రాయాన్ని వెల్లడించారు.

తెలుగులో—తెలుగులోనే కాదు—ఏ భాషలోనయినా సరే! కొన్ని పదాలకు ఎన్నో అర్థాలు వస్తూ ఉంటాయి. కాని వాటిలో ఏ అర్థం సమంజసమై ఉంటుందో దానినే గ్రహించాలి. ఎల్లయ్య, ఎల్లమ్మ—అంటే దేవుడు, దేవి అనే అర్థములే తగిన వంటూ మస్తాన్‌రెడ్డిగారంటున్నారు. అర్థం చెప్పడంలో 'ఎల్ల అంటే అంతటికీ అని అర్థం చెప్పారు. "అంతటికి" అనడంకంటె "అందరికి" అని చెప్పడం ఎంతో బాగా ఉంటుంది. ఎల్లశబ్దానికి 'అంతా' అనే అర్థమే కాకుండా 'అందరూ' అనే అర్థమున్నూ ఉన్నది. "ఎల్లన్ శిష్యుల గొంచువత్తునా?, శిష్యుల నెల్లన్" మొదలైన మహాకవుల ప్రయోగాలు ప్రసిద్ధంగా ఉన్నవి.

బాగా ఆలోచించిచూస్తే 'ఎల్లయ్య, ఎల్లమ్మ' పదాలకు వేంకటరాయశాస్త్రిగారు చెప్పిన అర్థాలే సరియైనవి. ఇవి గ్రామ దేవతల పేర్లు గదా! వీరు గ్రామాల పొలిమేర ఉంటారు. ఊరి బయటి ఏ చెరువు గట్టునో, ఏ తోట చివరనో—కాకపోతే మైదా నంలోనో ఈ దేవతల గుడులుంటాయి. సాధారణంగా ఏడాది కొక సారి ఊళ్లోకి తీసుకువచ్చి, ఉత్సవాలు చేసి, తిరిగి గుళ్లలో ప్రవేశ పెడతారు. పయిచోట్ల నుంచి భూత, ప్రేత, పిశాచాలుగాని, ప్రజలను నశింపజేసే మహామారి మొదలైన దేవతలు కాని గ్రామంలో ప్రవేశించకుండా పొలిమేరలో కావలి ఉండే దేవతలు. ఈ దేవతలకు భయపడే యితర ప్రదేశాలనుండి ఏ క్షుద్ర దేవతలూ గ్రామంలో ప్రవేశించరు.

వేంకటరాయశాస్త్రిగారి అభిప్రాయం చాలా యుక్తియుక్తంగా ఉన్నది.

ఈ పదాలకు రెడ్డిగారు చెప్పినట్లు అర్థాంతరం చెప్పడానికిన్నీ అవకాశం ఉంది. కాని సముచితమైన అర్థాన్ని గ్రహించడమే సబబు. ఒకవేళ మరో అర్థాన్ని తీసుకున్నా—అంతటికీ అయ్య (తండ్రి), అమ్మ (తల్లి) అని చెప్పడంకంటె ''అందరికీ'' అయ్య, అమ్మ అనడమే ఉచితమని తోస్తున్నది.

శ్రీ బులుసు వేంకటరమణయ్య

''అపనమ్మకపు నీడల్లో కవి బైరాగి''

మే 1979 'భారతి'లో శ్రీ నిఖిల్‌గారి ''అపనమ్మకపు నీడల్లోకవి బైరాగి'' అనివ్రాసిన వ్యాసంచదివాను. వ్యాసం మొత్తం మీద రెండు విషయాలు స్పష్టమవుతున్నాయి.

1) 'నాక్కొంచెం నమ్మకమివ్వు' అన్న కవితను అనువదించిన సోది. దాని తరువాత బైరాగి పుస్తకాలు వెలుగులోకి తెచ్చిన, వచ్చిన విధం. ఇలాంటివి మరికొన్ని.

2) రెండుపేజీల వ్యాసంలో ''...నమ్మకమివ్వు'' అన్న కవిత ఐదు అధ్యాయాల సత్యనారాయణ వ్రతకథలా వివరించి చెప్పారు కవి శ్రీ నిఖిల్. బైరాగి కవిత్వంలో (తెలుగు) ఈ కవితే గొప్పగా నిలిచిపోయింది. ఈ కవితకు నమ్మకమిస్తే ఆశవ్వైపే పయనం. బైరాగి అపనమ్మకపు నీడల ఇవల్యూషన్ బాగా తెలపక పోవడం ఈ వ్యాసపు ప్రయోజనాన్ని మిగల్చకుండా చేసింది.

శ్రీ నిఖిల్ చేసిన మంచిపని, బైరాగి 'సిద్ధాంతాలను తీవ్రంగా విమర్శించేవా'రని, 'ఈ వ్యవస్థ సమాజానికి—వ్యక్తికిమధ్య కల్పించే వైరుధ్యాన్ని పూరించుకోలేక పోయా'రని, ముక్తిబోధ్ ప్రభావముందని, ఇలా మరి కొన్ని విషయాలు.

మొత్తంమీద రెండు మూడు మంచిమాటలే రెండు పేజీల వ్యాసం కొలకు వ్యాకోచింపబడినాయి కాని అపనమ్మకపు నీడలను సంపూర్ణంగా చిత్రించలేకపోయాయి.

శ్రీ నాళేశ్వరం శంకర్

స్వీయ చరిత్రలు

'మరికొన్ని స్వీయచరిత్రలు' అన్న పేరుతో శ్రీ అక్కిరాజు రమాపతిరావుగారు, జూన్ 79 'భారతి'లో ప్రచురించిన వ్యాసాన్ని చదివేను. అందులో ప్రచురణ కాకుండా వ్రాతప్రతుల్లోనున్న స్వీయ చరిత్రలను కొన్నింటిని వారు పేర్కొని వున్నారు. సుప్రసిద్ధచరిత్ర పరిశోధకులు, సాహిత్య విమర్శకులు, కీర్తిశేషులు డాక్టర్ నేలటూరి వేంకటరమణయ్యగారు తమ స్వీయచరిత్రను కొంతభాగం రచించారు. బాల్యదశ ముగిసేవరకు వారు రచించినదాన్ని చదవగా వినే భాగ్యం నాకుకలిగింది. చివరి క్షణంవరకు చరిత్ర పరిశోధనపట్ల వుత్సాహం చూపిన శ్రీ వేంకటరమణయ్యగారు స్వీయచరిత్ర రచనపట్ల కొంత ఉదాసీన భావాన్ని ప్రకటిస్తుండేవారు. శిష్య ప్రశిష్యుల వొత్తిడివల్ల స్వీయచరిత్ర రచనకు పూనుకొని మందకొడిగా సాగించారు. ఎంత వరకు పూర్తిచేశారో తెలియదు. స్వీయచరిత్రల చరిత్రను పరిశోధించే శ్రీ కోడూరి శ్రీరామమూర్తిగారు, అక్కిరాజు రమాపతి రావుగారు శ్రీ నేలటూరివారి స్వీయచరిత్రను కూడా పరిశీలిస్తారన్న ఆశతో యీ విషయాన్ని తెలుపుతున్నాను.

శ్రీ చప్పగంతుల మల్లికార్జునరావు

మహామనీషి డా. శ్రీపాద

మే 79 'భారతి'లో కీ. శే. శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి వ్యాసం 'నాటక ప్రయోగానికి కళాకారుడెవడు?' చదివినపుడు ఏనాడో భారతి రజతోత్సవ సంచికలో వారే వ్రాసిన 'ఆమెచ్యూరు నాటక ప్రదర్శనము' అన్న వ్యాసం గుర్తుకొచ్చింది. వెచ్చబెట్టి చల్లారిస్తే పదునెక్కే లోహములాగే నాటక ప్రదర్శనాలు చూచి చూచి బరువెక్కారి ప్రేక్షకుల సౌజన్యమంటారు. ఎన్నో అనుభవాలను ఉటంకిస్తారు. ఎదుటవుండి మాట్లాడినట్టుగా రాస్తారు.

ఆధునిక కవిత్వాన్ని బాగా ప్రోత్సహించి ప్రచారం చేశారు. వారి 'అర్ధశతాబ్దపు ఆంధ్ర కవిత్వం' ('భారతి'లో 15 వ్యాసాలు వచ్చాయి) ఆధునిక కవి పఠించి తీరాల్సిన వ్యాసాలు. గ్రంథరూపంలో వచ్చినట్టులేదు. అనేక కళాశాలల్లో విశ్వవిద్యాలయాల్లో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. బాపట్ల కాలేజి ప్రిన్స్‌పాల్‌గా పనిచేసి రిటైరయారు. 'హాయిల్ నర్లేకర్ సమీకరణాలు' వ్యాసం ఆంధ్రపత్రిక వారిచేత తన స్వవిషయంమీద ప్రత్యేక వ్యాసంవ్రాయించారు. జటిలమయిన విషయంకూడా సులభంగా బోధిస్తారు. ఐన్‌స్టీన్ సాపేక్షతావాదం అన్న చిన్న గ్రంథంకూడా అంతే. సాపేక్షతా సిద్ధాంతం ఎం. ఎ. విద్యార్థులకు చెప్పేటిది. దానిని సాయిలా పాయిలా మాటలతో చెప్పి బోధపరచగలగడము చాలా కష్టం. అది నా ప్రథమ ప్రయత్నమాయెను అన్నారు. 65 పూర్తికాకుండానే కొన్ని పుస్తకాలొస్తాయని ఆశ అన్నారు. ఎన్ని వచ్చాయో తెలియదు మరి. ఆంధ్రపత్రికలో వైజ్ఞానిక భారతి రాశారు.

ఇంగ్లండులో లండనూ ఆక్స్‌ఫర్డూ ఏబర్డీను, హాలెండులో ఆమ్‌స్టర్‌డాం, స్విట్జర్లాండులో బాసిల్ బెర్నులూ, జర్మనీలో ప్రెయిబర్గూ, రోమూ నేపిల్సూ చూచారు. ఏవూరు చూచినా అవే షాపులూ, ట్రాములూ బస్సులు. ప్రకృతిలోవుంటే ఏకొంచెపు భేదమో ఉండినది కాని జనుల ఆచార వ్యవహారాలు అవేననిపించాయి. తేడాలు కనిపించగలంతటి కాలము ఉండలేదంటారు. బాపట్ల వాతవరణంలో పట్టలేకపోయారు. 'ఏ పట్ల విడి కైదు పెద్ద గ్రంథాలయంలేదు మంచిషాపూలేదు. ఏ వ్యాసంగం చేతామన్నాఉత్సాహకర పరిస్థితులూ లేవు' అంటారు. అయితే దేశమంతా ఇలాగే వుంది. ముసరిమూగే చీకట్లను తిట్టేవారేగాని, చేతనైన శక్తితో వెలుగు ప్రసరించేవారు తక్కువని వాపోతారు.

జ్ఞాపకం చేయకుండా పూర్తిచేసేవారుగాని, చెప్పకుండా చేసేవారు గాని ఎవరూలేరు. అన్నిపనులూ వారే చేసుకునేవారు. బాపట్ల వదలి రాజమండ్రికి (శ్రీపాదవారిల్లు ఇన్నీసుపేట రాజమండ్రి) వెళ్లారు. ఉద్యోగానంతర విశ్రాంతి. ఏదో చెయ్యాలనీ, చెయ్యగలగాలనీ వేదన వుంది. ప్రతిఫలాపేక్ష పోలేదట. అయితే లభ్యపడుతుందనిలేదు. ఎందుకంటే ఆశ్రయించలేరు. తనేదో చెయ్యాలని ఎదురుచూచేవాళ్లు ఆశపడేవాళ్లూలేరు. తరువాత ఏకైక పుత్రిక హైదరాబాదులో వుండటంవల్ల అక్కడ ఒక యేడాదిపాటు వుండాలని నిశ్చయించుకున్నారు. అర్థంలేని కలతకు తీర్పేమిటి? వేచిచూడటమేనంటారు.

24 యేళ్ళ వయస్సులో చూచేవారట సినిమాలు మళ్ళీ చూడలేదు కృష్ణపాండవీయం ప్రచారపు ప్రదర్శనమిచ్చినపుడు వారి మిత్రులు చదలవాడ పిచ్చయ్యగారు ఆహ్వానించి మాట్లాడమన్నారట. వారి సౌజన్యానికి లొంగి మాట్లాడారట. శ్రీపాదవారు నాస్తికులు కారు. అందరమూ ఏకేశ్వరోపాసకులమే సర్వజగత్తుకీ అధినాథుడైన స్వామికే ఈ రూపములన్నీనూ అన్న స్ఫురణ గుళ్ళలోనికి వెళ్లేవారికి ఉన్నదా అని సందేహం వెలిబుచ్చుతారు. పండిత గోపదేవుతో ఏకీభవిస్తూ అంటారు: ఒక మహమ్మదీయ మహాత్మునితో శిష్యుడన్నాడట 'ఆయనను భగవంతునివైపు మళ్ళించడానికి అనుమతి యివ్వండి' అని. ఆ మహాత్ముడన్నాడటా 'ఆయన్ను భగవంతునివైపు పోనీ. మధ్య నీవైపు తిప్పకోకు' అని. ఒక క్రైస్తవ యువకునితో శ్రీపాద వారన్నారట 'భగవంతుణ్ణి పట్టుకోవాలిగాని క్రీస్తునెందుకయ్యా' అని. బాబాలకు మఠాధిపతులకు తలలే బోడులు తలపులు కాదు. వారిచేత నాశనము చేయబడిన స్త్రీలెందరో! అన్నారు. విజ్ఞానానికి నమ్మకానికీ పొత్తులేదు. భక్తి విశ్వాసమూ నమ్మకమూను. విజ్ఞానము హేతువాదము ఇంద్రియగోచరత్వమూమీద ఆధారపడుతుంది కనక వైజ్ఞానికంగా భక్తి కలగదూ భక్తివల్ల విజ్ఞానమూ రాదు. రెండూవేరు. వైజ్ఞానికుడు నమ్మేది వేరు. బోధపరిచేది వేరూను. భగవంతుణ్ణి వైజ్ఞానికంగా నిరూపించలేరు ఎవరూ. నమ్మకాన్ని వైజ్ఞానికులు తొలగించలేరు. విజ్ఞానము ప్రపంచమును గురించినది నమ్మకము జగత్తునకాధారమైన దానిని గురించినది నికరమైన సత్యాన్ని వెంటబెట్టే వారు ఎందరో కానరారు. స్త్రీలూ సొమ్మూ పప్పు ధప్పళాలూ ఏనుగులూ లొటిపిటలూ శిష్యులూ సంస్థానాలు— వీటికోసము ఒక్కభార్యని విడిచి పోయేవాడు విరాగియా? దగుల్బాజీ! పుట్టపర్తి సత్యశాయి ఉపన్యాసాలు అమోఘంగా వున్నాయన్నారు. వారికి చదివి నేర్చింది కాదనిపించిందట.

హైదరాబాదులో దిన చర్య రాస్తూ అంటారు: 10 దాకా యింట్లో. 10.30 నుండి 5 వరకు ఆఫీసులో. తరువాతయిల్లు. రివ్యూకి పుస్తకాలు పంపుతూ ఆంధ్రపత్రిక వారు కొంత కాలక్షేపానికి సాయపడుతున్నారు. వైజ్ఞానిక గాథాశతి వ్రాస్తూ కొంత కాలం గడుపుతున్నాను. జగద్వ్యాపానికి వెనుక ఏదేనా ఉన్నదా. అని ఆలోచన అప్పుడపుడు హైదరాబాదు ఆకాశంలో ఏరోప్లేను లాగ బుర్రుమని వెళ్ళిపోతోంది. మళ్లీ మామూలే అంతా. ఏ గుట్ట మీదేనా ఎక్కి చుట్టూచూస్తే దూర భూరేఖ వరకూ కనబడే భూమీ, మబ్బుల్లో ఎర్రగా కనబడే సూర్యుడు. నాలో నేనిదివరకు తెరవని తలుపులు తట్టుతున్నాయి. 'రుచి' అన్నది ఆసక్తిరూపాన్నే వుందిగాని 'రుచి'గా అట్నుంచి తెలియడములేదు. ఈ ఆసక్తి అయినా జవాబు దారీ రూపాన్నే వుంది. నా తత్వము తనకు తెలియని విభూతికోసం దిక్కులు చూస్తోంది. జగత్తంతా ఆవరించిన అదృశ్యహస్త స్పర్శ ఉన్నదో లేదో అని చిత్తము అల్లాడుతోంది. బ్రతుకుబాటలో మాత్రము గతుకులు లేవు.

కవిత్వానికి ఉన్న అలంకారాలు తీసేసి బోడి చేయాలని శ్రీపాదవారు ఉద్యమిస్తున్నట్లు ప్రాచీనులు అపోహపడ్డారు గానీ వారి వ్యాసాలను పరిశీలిస్తే అదికాదని బోధపడుతుంది. రవీంద్రుణ్ణి చదవమంటారు. వారి లేఖతో ఈ నా చిన్ని వ్యాసాన్ని ముగిస్తాను. ఈనాడు జనమూ పరిస్థితులూ చాలా సక్షుభితములై వున్నాయి. అల్లరిలేని ప్రశాంతపు జీవన పథాలు ఎవరినీ గాని పిలవవు. ఉన్నచోటనే క్షోభ పెట్టుకోకుండా గడుపుకోవడమే కర్తవ్యము. తమసోమా జ్యోతిర్గమయ. మాద్వారా పరమేశ్వరుడు ఇంకా పిల్లల్ని ఈ లోకంలోనికి తేలేదని విచారమేమీ లేదు. ఈ నాటకంలో ఏ భూమిక ఇచ్చాడో అది అతని ఉద్దేశ ప్రకారం చెయ్యగలిగితే చాలు.

మరువరాని మరువలేని మహా మనీషి శ్రీపాద గోపాల కృష్ణమూర్తి.

[1. ఈ వ్యాస రచనకు సోదరుడు 'ఉమ్మెటి'కి రాసిన లేఖలే ఆధారం. లేఖలలో స్వీయ జీవిత తత్వం స్పష్టంగా గోచరిస్తుంది.

2. ఐన్‌స్టీన్ సాపేక్షతావాదను గ్రంథాన్ని కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ పీఠంవారు అచ్చువేశారు.]

— శివకుమార్

....నమస్తే !

జులై '79 భారతిలో గురజాడపై విపరీత అభిమానంతో పూజ్యులు శ్రీ సర్దేశాయి తిరుమలరావుగారు వ్రాసిన "గురజాడకు అర్థమయిన భారతీయ సంస్కృతి" అనే అచ్చులో ఆరుపేజీల వ్యాసం చదివాను. చివరదాకా — ఎక్కడైనా గురజాడకు అర్థమైన భారతీయ సంస్కృతిని గూర్చి తెలుపుతారేమోనని ఆశతోగాలించాను. వ్చ్! నిరాశే మిగిలింది.

ఏది ఏమైనా పూజ్యులు శ్రీ సర్దేశాయి తిరుమలరావుగారు చాలాచాలా ప్రాచీన అర్వాచీన సంస్కృత ఆంగ్ల ఆంధ్ర గ్రంథాలు చదివారనే విషయం మాత్రం ఆ వ్యాసం చెప్పకనే చెబుతోంది. అందుకు అభినందనలు.

సత్య హరిశ్చంద్ర నాటకం ఇప్పటికీ అనేకచోట్ల అసంఖ్యాక ప్రదర్శనలనందుతోందనే చిన్న విషయం పూజ్యులు శ్రీ సర్దేశాయి

తిరుమలరావుగారికి తెలియకపోవడం నాకు ఆశ్చర్యం గొల్పలేదు. గురజాడమీద ఉండే గాఢాభిమానం వలన వారు అనేక సత్యాలను గాంచ లేక పోతున్నారనే విషయం స్పష్టంగా తెలుస్తూనే ఉన్నది గదా !

పై పెచ్చు నన్ను గూర్చి — "అందుకే కద వీరు కన్యా శుల్కం చదవకుండా విమర్శిస్తారనింది నేను" అనే "పాతమాట"ను మళ్లాపాడి తమ ఇంకునూ, భారతిలో పుటలనూ వ్యర్థం చేశారు. నా మీద ఇంత "గట్టి నమ్మకం" గల వారికి ఇకపై సమాధానం చెప్పడం "చెవిటికి శంఖం ఊదడం" అవుతుంది.

ఇక బూడిదలో పన్నీరు పొయ్యలేను ! నమస్తే !

శ్రీ పులిచెర్ల సాంబశివరావు

లేఖలు

లవుడు - లవశబ్దార్థము

వాల్మీకి మహర్షి కుశలవులని నామకరణం గావించుటలో లవ శబ్దార్థం తెలియక పాఠకులూ-శ్రోతలూ తమకు తోచినట్లు దాని వ్యుత్పత్తిని వూహించుకొంటున్నారు. కుశలను మంత్రించి మార్జించి నందున కుశుడైనా డన్నది ప్రసిద్ధమే. లవశబ్దమునకు లేశమని అర్థమున్నది కనుక లవలనగా కుశఖండములని భావించి వ్యుత్పత్తి చెప్పకొనడం పండిత పామర సామాన్యమయినది. తెలుగు రామా యణ కవులుకూడ దాని అర్థమును గ్రహించో గ్రహించకో మూల ములోని లవశబ్దాన్ని యథాతథంగా వాడుకొన్నారు. తిక్కనమాత్రం తన నిర్వచనోత్తర రామాయణంలో లవకు లవనమన్న రూపాంతరం వాడినాడు. ఆధునికుల్లో వాసుదాసుగారు విద్వార్హమైన వివరణ గావించారు. చూడండి:—"అనవుడు మౌనియేగి జనకాత్మజపుత్రుల గాంచి భూతనాశనమగు మంత్రితమల్ చదివి చయ్యన మంత్రిత మైన దర్భలన్। గొనలను బుత్రునొక్కనిని, గూర్చ మొదళ్ల మరొండు పుత్రుమార్జన మొనరింపఁబంచె మునిసంయమి వృద్ధ సరోజ నేత్రలన్."

ఇది అమూలకమైన-అసమంజసమైన వూహ. చివళ్లు చేతబట్టి మొదళ్లతో మార్జింతురా ? అసలు—మూలం వాల్మీకి రచనగదా. ఆ మహర్షి తన రామాయణం—ఉత్తరకాండ—66 వ సర్గలో "కుశముష్టి ముపాదాయ లవం చైవతు సద్విజః। వాల్మీకిః ప్రదదౌతాభ్యాం రక్షాం భూత వినాశినీమ్. యస్తయోః పూర్వతో జాతస్సకుశై ర్మంత్ర సత్కృతైః। నిర్మార్జనీయస్తు తదా కుశ ఇత్యస్యనామతత్. యశ్చాపరోఽభ వత్తాభ్యాంలవేన స సమాహితః। నిర్మార్జనీయోవృద్ధాభిర్లవ ఇత్యేవ నామతః." అని వ్రాశాడు. లవ శబ్దానికి అర్థమేమో వాల్మీకి రామాయణ వ్యాఖ్యాతలు సైతం వ్రాయలేదని తోచుచున్నవి. వారు వ్రాసియున్నట్లయితే తెలుగు కవులు వివరించియుండేవారు. వారు మల్లినాధుని రఘు వంశ వ్యాఖ్యనైనా చూడలేదనిగాని, చూచినా పాటించలేదనిగాని అనుకోవాలి. రఘువంశం-15వ సర్గ—32వ శ్లోకానికి మల్లినాథ సూరి "కుశైః=దర్భైః, లవైః=గోపుచ్ఛలోమభిః, ఉన్మృష్టౌ గర్భక్లేదౌ యయోస్తౌ ... కుశలవౌ, కుశోన్మృష్టః కుశః, లవోన్మృష్టోలవః" అని వ్యాఖ్య వ్రాసి "లవో లవణ కింజల్క పక్ష్మ గోపుచ్ఛ లోమసు ఇతి వైజయన్తీ" అన్ప్రమాణం కూడా చూపి యున్నాడు. కనుక ఆవు తోక వెండ్రుకలచే దిగదుడువ బడిన వాడు లవుడని సప్రమాణంగా స్పష్టమైయున్నది. వెండ్రు కలతో దిగదుడుచు—దిష్టి తీయు ఆచారము ఇప్పటికిని వున్నదిగదా. మరి, చదువుకొన్నవారు సైతం ఈ యర్థమునేల గ్రహింపరో, గ్రహించినా ఏల పాటించరో తెలియకున్నది. వాల్మీకి శిశువులకు బాలారిష్టాలు కలుగకుండుటకై "భూత వినాశకమైన రక్ష"గా సమంత్రకంగా కావించిన క్రియ అది. కుశలతో—అనగా దర్భలతో—దిగదుడిచినందున కుశుడనియు, లవలతో—అనగా ఆవుతోక వెండ్రు కలతో — దిగదుడిచినందున లవుడనియు నామకరణము జరిగినదని స్పష్టపడుచున్నది. కాన పాఠకులీ యర్థమును గ్రహింతురు గాక !

శ్రీ తుమ్మల వెంకటరత్నము

డాక్టర్ అంబేద్కర్ ?

డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ పేరును ప్రఖ్యాత తెలుగు రచయితలు కూడా తప్పగా వ్రాయటం చాలా శోచనీయ మైన విషయము. "అంబేడ్కర్" అను మాటను "అంబే ద్కర్" అని వ్రాస్తున్నారు వారు. శ్రీ కాకుమాను తారా నాథ్‌గారు 'భారతి' డిసెంబరు 1977 సంచికలో డా. అంబేడ్కర్ గూర్చి ఒక సుదీర్ఘమైన వ్యాసమును వ్రాసియుండిరి. అందులో వారు డా. అంబేడ్కర్ పేరుతో సహా ఆయా వ్యక్తుల పేర్లు, స్థలాల పేర్లు కూడా తప్పగా వ్రాసిరి. శ్రీ తారానాథ్‌గారి యీ వ్యాస సందర్భముగా శ్రీ సర్దేశాయి తిరుమల రావుగారు "చారిత్రక పాత్రల పేర్లు మన యిష్టం వచ్చినట్లు వ్రాయరాదు." అని విమర్శిస్తూనే స్వయంగా 'అంబేద్కర్' అని వ్రాసిరి. (చూ. భారతి, ఏప్రిల్ 1978 కలగూరగంప). అట్లే "ఆంగీరస" గారు భారతి డిసెంబరు 1977 "గ్రంథ విమర్శలు" శీర్షికలో, శ్రీ జె. వీరాస్వామిగారు 'వాణి' [రేడియో పక్ష పత్రిక] 1-5-1979లో 'మహనీయుల మహితోక్తులు' అను శీర్షికలో 'అంబేద్కర్' అనియే వ్రాసిరి.

పై రచయితలు యిలా తప్పగా వ్రాయటం గమనించిన తరువాత యీ లేఖ వ్రాయక ఉండలేక పోయాను. వారు ఆంగ్ల భాషా సులోచనాలు ధరించడమే యీ తప్పకు కారణమని తెలుస్తున్నది.

డా. అంబేడ్కర్‌గారి పూర్వికులు 'అంబావడే' అను గ్రామానికి చెందిన వారట కావున వారి యింటి పేరు మొదట 'అంబావడేకర్' అని ఉండేదట. డా. అంబేడ్కర్ బడిలో చదువు

కునే రోజుల్లో 'అంబేడ్కర్' అను పేరుగల బడిపంతులు ఒకాయన ఉండేవారట. 'అంబావడేకర్' అను మాట సంబోధనా సులభంగా లేదని గుర్తించి అంబావడేకర్‌ను వారు తమ స్వయం పేరుతోనే 'అంబేడ్కర్' అని పిలువసాగిరట. [తమ యింటి పేర్లతో ఒకరి నొకరు సంబోధించుకొనటం మహారాష్ట్రీయుల ఆచారము.] స్కూల్ రిజిష్టర్‌లో కూడా వారు యీ మార్పును నమోదు చేసిరట. ఆనాటి నుండి 'అంబావడేకర్' 'అంబేడ్కర్'గా మారి పోయారట. ఈ విషయాన్ని డా. అంబేడ్కర్ తమ 'బాల్య స్మృతులు'లో నివేదించుకున్నారు.

శ్రీ కావలి రాయులు (మహారాష్ట్ర)

సిధారెడ్డి లేఖ - ఒక పరామర్శ

ఫిబ్రవరి 1979 'భారతి'లో 'సుకుమారమతీ అం. కే మేలుకో' అన్న శీర్షికతో శ్రీ నందిని సిధారెడ్డిగారొక సుదీర్ఘ లేఖ వ్రాశారు. ఆ లేఖలో శ్రీ సిధారెడ్డి సమర్థించుకున్న అంశాలు అందరికీ ఆమోదయోగ్యం కావలసిన అవసరంలేదు.

ప్రజలంటే ఎవరో తెలియాలంటే రంగనాయకమ్మ పత్రికనే చదువవలసిన పనిలేదు. కాళోజీ నా గొడవలు చదివినా, రావి శాస్త్రి రచనలు చదివినా పై రంగనాయకమ్మ పత్రికలోకన్నా ప్రజలగూర్చి ఎక్కువగానే తెలుస్తుంది. శ్రీ రెడ్డిగారు తమ వ్యక్తిగతాభిప్రాయాలనూ, అభిమానాలనూ, ద్వేషాలనూ సమాజానికి రుద్దాలనుకుంటున్నారా?

ప్రజల్లో ప్రవహించకుండా ప్రతీకలంటూ — ఊహాచిత్రాలంటూ ఇజాల గారడీలుచేసే రచయితలే దేశాన్ని నిరాశా నిస్పృహల మధ్య చెడుగుడులాడిస్తున్నారనే వాదం అంకే ప్రారంభించిందేం కాదు కొన్నేళ్ళనుంచీ నడుస్తున్న సాహిత్య వివాదమే యిది. దేశ పటిష్ఠతకూ, పతనానికీ పరోక్షంగా కవులూ రచయితలూ కారకులన్నది వాస్తవం. సాహిత్యం సమాజానికీ దేశానికీ సంబంధంలేకుండా దాని బాగోగులు పట్టించుకోకుండా ఏ దేశంలో ఎక్కడా లేదన్నది మరో వాస్తవం. కవిత్వం మానవ మేధస్సును మేల్కొల్పుతుందని కాలేరెడ్డి అన్న మాటలు ఇక్కడ ఉదాహరించడం అప్రస్తుతంకాదు. "One great service that poetry renders to us is that of awakening the minds attention to the lethargy of custom and to direct it to the loveliness and wonders of the world."జాతిని ఉన్నత లక్ష్యాలవైపు కార్యోన్ముఖంచేయగల బాధ్యత కవిత్వానిది· ఐనప్పుడు కవులు దేశప్రగతికీ—పతనానికీ బాధ్యులెందుకు కాకూడదో!

శ్రీ కుందుర్తి అన్న ఈ మాటలు గమనార్హాలు. 'సాహిత్యం వల్ల సమాజానికి కలిగే ప్రయోజనం రూపాయి, అణా పైసలలో లెక్కకట్టగలిగింది కాదు మనిషి భావనలో ఎవరికీ కనిపించకుండా కలిగే మార్పుకు అది దోహదం చేస్తుంది. ఆశించే విప్లవం వచ్చే నాటికి సమాజంలోని వ్యక్తుల భావాలను, తదనుకూలంగా తీర్చిదిద్ది తయారుగావుంచడమే సాహిత్యం చేయగలిగిన పని (కుందుర్తి పీఠికలు—31—పేజీ). ఇక ప్రతీకలతో ఊహాచిత్రాలతోనిండిన కవితా ప్రయోజనాన్ని గూర్చి కూడా శ్రీ కుందుర్తి "కవి పండితులకే దురవగాహమై క్లిష్టసంకేతగతమై వుండడం —ఆధునిక కవితకు అనర్థం (కుందుర్తి పీఠికలు—28—పేజీ) అన్నారు. మనుషులతో నిండినదే సమాజమనీ ఆ సమాజమే దేశమనీ శ్రీ సిధారెడ్డిగారికి ఎవరూ చెప్పవలసిన పనిలేదు. (ఆయన లేఖలోనే ఈ విషయం ఉంది) దేశప్రగతికి, దేశ పతనానికి ప్రత్యక్షంగా రాజకీయపార్టీలు—పరోక్షంగా కవులూ, రచయితలూ, మేధావులూ కారకులేనని కాలేరెడ్డి, కుందుర్తి మాటలు నిరూపించడంలేదా?

ఇక మిగిలిన విషయాలు ఉపేక్షించవలసినవి.

ఈ సందర్భంగా మీకొక ప్రార్థన.

మరీ దిగజారిన నిందలూ—దూషణలతో నిండిన లేఖలు ఎంత ప్రముఖమైనవైనా ఆ రచయితలకు నిర్మోహమాటంగా ఆరోగ్యకరమైన సంప్రదాయాలు పాటించినప్పుడే ప్రచురించడం సాధ్యపడుతుందని వ్రాయండి.

శ్రీ రెడ్డిగారి లేఖలోని కొన్ని మాటలు—వాక్యాలు.

1) అజ్ఞాన ఖని!

2) ఆ లేఖకుడు తల కిందికేసుకొని లంకెగ మారటంలో ప్రధానంగా కనిపించే పిరికితనం కూడా చదివాను. (సుప్రసిద్ధులెందరు పొడి అక్షరాలతో గుప్తనామాలతో వ్రాయడంలేదా? అది శ్రీ రెడ్డిగారికి భయపడ్డ పిరికితనమా!)

3) నల్గురు కవుల్లో నానటానికేగా నువ్ కలగూరగంప గుత్తా తీసుకుంది. (ఆ 'గంప'లోనేకదా ఈ రెడ్డిగారు ప్రవేశించిందీను.)

సద్విమర్శ ఏళ్ళతరబడి కొనసాగినా అది సాహిత్యానికి ప్రయోజనకరమే. తామే కవితకు అధినాధులమని, తమకే అంతా తెలుసునని భావించే కొందరు అందరినీ అలక్ష్యంగా, వెటకారంగా తీసివేసే ధోరణి ఈమధ్య కన్పిస్తోంది. అందుకు శ్రీ రెడ్డిగారి లేఖ ఉదాహరణ.

శ్రీ లింగంపల్లి రామచంద్ర

ప్రజాకవి ఎవరు? విమర్శకు జవాబు

1979 ఏప్రిల్ నెల 'భారతి'లో కలగూరగంప శీర్షికలో నా 'ప్రజాకవి ఎవరు?'కు జవాబుగా మే నెల భారతిలో శ్రీ పులిచెర్ల సాంబశివరావు జవాబు చదివిం తర్వాత దానికి మళ్ళా జవాబు రాయడం అసలనవసరమనిపించినా, తన పిడివాదం చాలా సక్రమమైందని శ్రీ పులిచెర్లలాంటి మేధావులు అహంభావంతో సాహితీ జగత్తులో వీరవిహారంచేసే ప్రమాదాన్ని శంకించి ఈ జవాబు రాస్తున్నాను.

నా విమర్శలో ప్రజాకవి ఎవరని సవివరంగా చెప్పాను. ఇచ్చట శ్రీ పులిచెర్ల గురజాడను, వేమనను ప్రజాకవులు కాదంటూ, దాసు గార్ని ప్రజాకవిని చేసే ప్రయత్నం చేయడం ఎంత హాస్యాస్పదం! ఈ కోవకు చెందిన పండిత ప్రకాండులే యిటీవలికాలందాకా వేమనను కవిగా గుర్తించడానికే నిరాకరించడం మనకు తెలుసు. ఈ పులిచెర్లవారికి వేమన, గురజాడలపై ఎంతటి అవగాహన వుందో వీరి జవాబులోని 4, 5 పాదాలు విప్పి చెప్తాయి.

నా విమర్శలో దైవం గురించి, ఆస్తిక, నాస్తికతల్ని గూర్చి నే నెక్కడా రాయలేదు. ఆస్తిక, నాస్తిక వాదాలగురించి చర్చించ దలచుకొంటే, శ్రీ పులిచెర్లగారి కందులో ఆసక్తివుంటే మరో వ్యాసంలో ఆ పనిచేయడానికి నా కభ్యంతరంలేదు. కానీ, యిచ్చట వారు సమస్యను వక్రీకరించడానికి, ఏదో నేనేదో ఆస్తికుల్ని దుయ్యబట్టినట్టు, వారందర్నీ అజ్ఞానులన్నట్టు రాయడం నిజంగా క్షమించరానిది.

ఈమధ్య జయప్రకాశ్‌నారాయణగారి వ్యాధి నయం కావాలని అన్ని మతాలకు చెందినవాళ్ళు ప్రార్థన చేశారట. వాళ్ళంతా బుద్ధిలేని వాళ్ళా? అంటూ పులిచెర్ల అడుగుతున్నారు.

వారంతా బుద్ధిహీనులుకారు కానీ, ఆ ప్రార్థనలవల్లే వారికి నయమైందని భావించే పులిచెర్లవంటివారు చాలా బుద్ధిమంతులు. జస్లోక్ ఆస్పత్రిలో జయప్రకాశ్‌గారికి జరిగిన అతి ఖరీదైన వైద్య ప్రక్రియ, ఆధునిక శాస్త్రీయాభివృద్ధి, డాక్టర్ల నిరంతరకృషి మరచి, యిదేదో దైవ ప్రార్థనలవల్ల వారికి నయమైందనుకోవడం ఎంత మూర్ఖత్వం!?

ఇక ఈయన 3వ అంశంలో 'అంటువ్యాధులు ప్రబలినప్పుడు ధైర్యం చెప్పడం తప్పు' అంటూ రాశారు.

పులిచెర్లగారూ! నా విమర్శ మరోసారి చదవండి. అందులో నేనిలా రాశాను. ఇక పల్నాడులో రోగాలెక్కువయ్యాయట. అప్పుడు మందులు మాకులు లేవని, అందువల్ల దాసుగారు అడుగొప్పుల, పప్పిచెర్ల గ్రామాల్లో సంచరించి, ప్రజలకు ధైర్యం చెప్పారట. ఆవరకు ఏదో విధంగా ఆయన్ని సమర్థించవచ్చు. ఆంజనేయోపాసనతో అంటువ్యాధుల్ని తుదముట్టించారనడం పులిచెర్ల గారి అమాయకత్వానికి జాలిచెందాలో, వారి ఈ సమర్థింపుకు కోపం తెచ్చుకోవాలో అర్థం కాదు.

దాసుగారు ఆంజనేయోపాసనను ముందుగా వారికి నిర్ణయించి వుండొచ్చు గాక! ఆంజనేయోపాసనతో అంటువ్యాధుల్ని తుదముట్టించారని మీరనడం పట్లే నా అభ్యంతరం.

ఇక వీరి 4వ అంశానికి జవాబు: పులిచెర్లవారు దాసును ప్రజాకవిగా వర్ణించుతూ, వారు ధనికుల్ని తిట్టుతూ కవిత రాశారని రాయడం చేత, ప్రజాకవి లక్షణాలు రాస్తూ సమాజంలో ధనిక, పేద వ్యత్యాసాల్ని శాస్త్రీయంగా విశ్లేషించాల్సిన ప్రజాకవి బాధ్యతను వివరించాను.

శ్రీ పులిచెర్ల ఆఖరుగా నా బాధకు విరుగుడు అల్లోపతి, ఆయుర్వేదంలోనూ వుందని సూచించారు.

నాకూ ఏ ఆంజనేయోపాసనో నిర్దేశించలేదు. బ్రతికాను.

ఇంకో అనుమానం కూడా నాక్కలుగుతోంది. శ్రీ పులిచెర్లకు గానీ, వారి కుటుంబ సభ్యులకు గానీ కలిగే రుగ్మతలు వారు దైవ ప్రార్థనల చికిత్సతో నయం చేసుకొంటున్నారో, అల్లోపతీ, ఆయుర్వేదాల్ని ఆశ్రయిస్తున్నారో మరి!

నేను వేమనను, గురజాడను పూర్తిగా చదవక పోయినా వచ్చిన ప్రమాదం లేదు కానీ శ్రీ పులిచెర్ల వారు మాత్రం ఆధునిక శాస్త్రవిజ్ఞానాన్ని బాగా అధ్యయనం చేయాల్సిన అవసరం, హేతుబద్ధంగా ఆలోచించ గల్గడం ఆయనకే కాక సమాజానికి కూడా ఎంతో ఆరోగ్యకరం!

వేమన పద్యంలోని వాక్యం అచ్చులో దొర్లిన పొరబాటును ఏదో నేనే తప్పు రాశానని, ఆ తప్పును ఎత్తి చూపుతూ తన విజ్ఞానాన్ని చాటుకో చూస్తున్న శ్రీ పులిచెర్లగారి వాదం చదివిం తర్వాత వారిపైన కోపం కన్నా జాలే ఎక్కువ కలుగుతోంది.

శ్రీ ముదారి వేణు

ఇటీవల 'భారతి'లో జయసింహసూరి కృత "ధర్మోపదేశమాలా–వివరణ" అసంపూర్తి శ్లోకమును శ్రీ ఇ. సాయిబాబాగారు ప్రకటించి, సహృదయులను లుప్త ద్వితీయపాదమును పూరించమనినారు. ఇదిగోపూరణ—

అపాత్రే రమతే నారీ
భాగ్యహీనే విపత్సదా।
నీచమాశ్రయతే లక్ష్మీ
ప్రాజ్ఞః ప్రాయేణ నిర్ధనః॥

శ్రీ ఇ. ప్రద్యుమ్న సూరి

సవరన

1979 జూన్ నెల 'భారతి'లో శ్రీ అక్కిరాజు రమాపతి రావుగారు వ్రాసిన "మరికొన్ని స్వీయచరిత్రలు" అను వ్యాసములో (12 పుటలో) నా చరితను వ్రాయబడినది.

అందులో మా యింటిపేరు "కవుకొండల" అని వ్రాయబడెను. మా ఇంటిపేరు "కవికొండల"గాని "కవుకొండల" కాదని మనవి చేయుచున్నాను

తమ రాంబోవు సంచికలో ఈ "సవరణ" ప్రచురింపం గోరెదను.

శ్రీ క. వేం. సత్యనారాయణమూర్తి

గ్రంథ విమర్శలు

విమర్శిని-3

[విమర్శిని : మూల్యం రు. 10లు. సంపాదకుడు :డా. కేతవరపు రామకోటిశాస్త్రి, హెడ్ డిపార్టుమెంట్ ఆఫ్ తెలుగు, కాకతీయ యూనివర్సిటీ, విద్యానగరపురి, వరంగల్–506009.]

కాకతీయ విశ్వవిద్యాలయ తెలుగు విభాగమువారు 'తెలుగున నవలా సాహిత్య విద్యాభిమానులైన సహృదయులు లోనారసి' చూచుటకై నవలా సాహిత్య విశిష్ట సంచికగా విమర్శిని మూడవ సంపుటమును వెలువరించారు. ఇందులో వారి దృష్టిలోంచి ప్రసిద్ధులైన ఐదుగురు వ్రాసిన ఏడు నవలలపై విమర్శ జరిగింది. విశ్వనాథవారి మూడు నవలలు 'భ్రమరవాసిని' 'ఏకవీర' 'వేయిపడగలు', రా. వి. శాస్త్రిగారి 'అల్పజీవి', ఉన్నవవారి 'మాలపల్లి', బుచ్చిబాబుగారి 'చివరకు మిగిలేది', ఆళ్వారుస్వామిగారి 'ప్రజల మనిషి' విమర్శినిలో స్థానం ఏర్పరుచుకొన్న నవలలు. ఇవికాక కొన్ని గ్రంథవిమర్శలు కూడా ఈ గ్రంథంలో అచ్చుకాబడ్డాయి.

'భ్రమరవాసిని' నవలపై విమర్శ వ్రాసినవారు డా. కేతవరపు రామకోటిశాస్త్రిగారు. నవలలను ఎన్నుకొనుటలో 'అవి ఆయా రచయితల ప్రసిద్ధికి కారణాలయిన నవలలు. ఆ మాటను తిరగవేస్తే ఆ ప్రసద్ధ రచయితల నవలల్లో అవి విశిష్టమైనవి' అని 'తెలుగు నవల గురించి' అనే ఉపోద్ఘాతంలో చెప్పారు. విశ్వనాథవారి నవలా సాహిత్యంలో 'భ్రమరవాసిని' నవలను విశిష్టమైన నవలగా పేర్కొనటం ఏమంత సబబుగాలేదు. ఆ నవలలో ఏ విశిష్టతా లేనపుడు దానికి విశిష్ట లక్షణం ఆపాదించడం న్యాయమైన పని కాదు. తంత్రమంత్ర శాస్త్ర విషయాలు, పూర్వజన్మ సంస్కారాలు, కలలు, ప్రశ్నలు వాటికి సమాధానాలు నవలకు విశిష్టతా లక్షణాన్ని ఆపాదించలేవు. భ్రమరవాసిని దేవతామూర్తి, రణాదిత్యుడు, అమృతప్రభ మానవులు. కాశ్మీర దేశానికి, వీళ్ళ చరిత్రకు సంబంధం ఉండటంవలన ఇది చారిత్రక నవల అయినది. కలలు వాటి విశ్లేషణ ఉండటం వలన మనోవైజ్ఞానిక నవల అయింది. హిందూమత సిద్ధాంతములు, వేదాంతము ఉండటంవలన మత తాత్త్విక నవల అయింది. మానవుల జీవితము, దాని తలూకూ సంఘర్షణము ఉండుటవలన సాంఘికమైనది. ఇది రామకోటిశాస్త్రిగారి విశ్లేషణ.

'దీనంతటికి పరమార్థమేమంటే — మత పరిపాలననుండి మానవ జీవితం క్రమంగా బయటపడి తన స్వతంత్రమైన అస్తిత్వాన్ని తాను గుర్తించుకోగలగడం. అంటే తనకు ముందు రాబోయే జన్మ జీవితం గురించి ఎవరుచెప్పినా పట్టించుకోవలసిన అవసరం లేదని అనుకోవటమే కాకుండా, మనిషి తనకిప్పుడు వచ్చిన ఈ జన్మ జీవితం గురించి ఎవర్నూ చెప్పకపోయినా పట్టించుకోవలసిన అవసరమే ఎంతైనా ఉన్నదని ఎప్పుడు అనుకోవడం మొదలుపెట్టాడో సరిగ్గా ఆ అనుకోటంనుండి ఈ నవలా ప్రక్రియ క్రొత్త సాహిత్య ప్రపంచంలో అవతరించింది, అని విమర్శిని సంపాదకులు వ్రాస్తున్నారు 'మానవ జీవితమే వాస్తవం. మనిషి పరిస్థితులను పరిణమింప జేసుకొనటంలో తలక్రిందులవుతూ పడుతూ లేస్తూ పోవటమే జీవితం. ఆ జీవితాన్ని చిత్రించి మనిషిని ఆశతో ముందడుగు వేసేటట్లు చేయటం లక్ష్యంగా నవల అభివృద్ధి అవుతున్నది' అనేది కూడా సంపాదకుల అభిప్రాయం. ఈ అభిప్రాయాలను మనం అంగీకరించగలిగేటట్లయితే విశ్వనాథవారి 'భ్రమరవాసిని' నవల ఈ సంచికలో పరిశీలనార్హమైన నవలగా పరిగణింపబడటం మనం అంగీకరించం. ఎంచేతంటే ఈ నవలకు సాంఘిక జీవితానికి లేకపోతే మనిషియొక్క బాహ్యాంతర జీవితానికి ఏమాత్రం సంబంధం లేదు. రణాధిత్యుని స్వప్నాలకు శాస్త్రీయమైన అవగాహన కలిగించేటట్లు ఫ్రాయిడ్‌ని, యూంగ్‌ని ఉదహరించారు శాస్త్రిగారు. యధార్థ సంభవాలకు, ఊహాగానాలకుగల భేదం గుర్తించేవారికి ఈ నవలలో కన్పించే స్వప్నాలకు, స్వప్నాలపై శాస్త్రీయమైన అవగాహనకుగల భేదంకూడా తెలుస్తుంది. 'ప్రజలగురించి ప్రజలకోసం వ్రాయబడుతున్న ఆధునిక వాస్తవిక ప్రక్రియ నవల' 'బాగుపడాలనుకోటం మనిషి లక్షణం. బాగుపరచాలనుకోటం రచయిత లక్షణం' అని వ్రాసిన సంపాదకీయాన్ని అంగీకరిస్తే—భ్రమరవాసిని నవలకు ఈ సంచికలోగల స్థానం అర్థం అవుతుంది. విమర్శించేవారు తమ నిర్ణయాలను రచయితకే వదలినప్పుడు వచ్చేది సాహిత్య విమర్శ కాదు, రచయితపై మేరమీరిన అభిమానంతో వచ్చే వ్యాఖ్యమాత్రమే. 'రణాదిత్యునకు ఆ జన్మలోనున్న కథ పెద్దదిగా లేదు. ఉన్నదున్నది. లేనిదిలేదు. దానిమీదనే నవల అల్లబడవలయును. అల్లబడగా భ్రమరవాసిని నవలయైనది. ఇది ఏమి నవల? చారిత్రకమా? కాదా మరి? పౌరాణికమా? దేవత లవతరించుట యున్నప్పుడు కాదనుట యెట్లు! సాంఘికముకాదా? మనుష్యుల సుఖ దుఃఖములతో నిండిన సంసార విషయ విశ్లేషణము పరచుకొని యున్నప్పు డిందుకుకాదు! నవల లిట్లుండునా? నవల లెట్లయిన నుండును. ఇట్లుండవలయుననిగాని ఉండరాదని గానీ అనుటకు మనచేతిలో నేమున్నది? అంతయు రచయిత చేతిలోనున్నది.' ఇది శాస్త్రిగారి అభిప్రాయము. విమర్శ వ్రాయుటలో కూడ విశ్వనాథవారి పద్ధతినే అనుసరించారు శాస్త్రిగారు. న్యాయమైన విమర్శ రచయితను పథ నిర్దేశకుణ్ణి చేస్తుందని, రచయితకున్న స్వాతంత్ర్యమే విమర్శకునికి కూడా ఉంటుందని నా విశ్వాసము. 'ఆధునికార్థంలో సహృదయులంటే ఏమి చెప్పబడుతున్నదని ఆలోచించేవాళ్ళు, ఎలా చెబితే ఇంకా బాగుండేదని అనుభవస్థాయిలో సృజన కుపక్రమించే వాళ్ళు, అని సంపాదకీయంలో చెప్పినట్లుగా విమర్శకుడు ఆలోచించాలి గదా! అలా ఆలోచించే స్వాతంత్ర్యం విమర్శకునకులేనప్పుడు విమర్శవల్ల ప్రయోజనమేముంది? మానవునికి ఏర్పడే సమస్యలన్నింటికి

దైవమే మూల మని, ఆ సమస్యలకు పరిష్కారం కూడా దైవమే చేస్తుందని ఈ నవలను గురించిన విమర్శలో శాస్త్రిగారు చెబుతున్నారు. దానితో అందరూ ఏకీభవిస్తారని నేననుకోను. నా వరకూ నేనంగీకరించను. భ్రమర వాసిని నవల మేరకు అదొక విశిష్ట నవలగానేననుకోవటంలేదు. దానిలో మంత్ర, తంత్ర శాస్త్రాలున్నా, మనో విశ్లేషణ ఉన్నా, మత తాత్త్విక వికీయ చర్చ ఉన్నా అది ఈ లోకానికి, ఈ జీవితానికి సంబంధించిన నవల కాదు. పోగా మత, తాత్త్విక విషయ నిరూపణకు, మంత్ర తంత్ర శాస్త్ర చర్చకు సిద్ధాంత వ్యాసములు వ్రాసుకొనవచ్చు కదా!.

ఏకవీర నవలపై విమర్శ వ్రాసినది **కూడా** డా॥ కేతవరపు రామకోటి శాస్త్రిగారే. ఏకవీర విశ్వనాథ వారి కలం నుండి వెలువడిన నవల లన్నింటిలోనూ విశిష్టమైనది. విశ్వనాథ వారికి రచనా పరంగా 'నిబద్ధత' ఏర్పడనపుడు వ్రాసిన మహోదాత్తమైన రొమాంటిక్ నవల ఏకవీర. ఏకవీర వీరభూపతి, మీనాక్షి కుట్టాన్‌లు-పరస్పరం ప్రేమించుకున్న జంటలు. ఏకవీరకు కుట్టాన్‌తోను, మీనాక్షికి వీరభూపతితోను వివాహమవుతుంది. అనంతర ఘర్షణ నవలగా రూపు కట్టింది. వ్యక్తానికి, అవ్యక్తానికి ఘర్షణే ఏకవీర నవల. వ్యక్తం వ్యవస్థా ధర్మమైతే అవ్యక్తం వ్యక్తి ధర్మం. ఈరెంటిని అధిగమించినది సనాతన ధర్మం. ఆర్.ఎస్. సుదర్శనం గారు సాహిత్యంలో దృక్పథాలలో చెప్పినట్లుగా వ్యవస్థా ధర్మాన్ని సనాతన ధర్మంగా భావించి ఏతత్ ధర్మసంరక్షణకోసమే విశ్వనాథ వారు తరువాతి నవలలన్నీ వ్రాయటం వలన 'ఏకవీర' లాంటి నవల మళ్ళీ వ్రాయలేక పోయారు. ''కవులు మహానటులు వారి అభినయ పరమార్థము అందరికీ అర్థముకాదు. అర్థము కానంతవరకూ మంచిదే. కాని అదివిపరీతము**ము**గా అర్థమగుటలో ప్రమాదమున్నది.'' అంటున్నారు శాస్త్రిగారు. అట్లా విపరీతముగా అర్థం కావటం వలన వచ్చిన విమర్శ 'భ్రమరవాసిని' 'వేయిపడగలు' పైన. 'అందరకును వ్యక్తిత్వము యొక్క ప్రథమ లక్షణ మేమనగా తానుచేసిన దానికి తానే బాధ్యుడనన్న తెలివి' అనీ శాస్త్రిగారే వ్రాస్తున్నారు. సమస్యలను ఏర్పరిచేది, పరిష్కారాన్నిచేసి పెట్టేది భగవంతుడేననీ శాస్త్రిగారే అంటున్నారు. 'సామాజిక వ్యవస్థా ధర్మము భగవంతుడు. ధర్మము నతిక్రమించుటయే పతన హేతువు.' భగవంతుని అస్తిత్వాన్ని ప్రశ్నించటమే పతన హేతువన్న మాట. వ్యవస్థా ధర్మానికి పరిణామము, చలనము ఉండవని దీని అర్థం. భగవంతుడే వ్యవస్థా ధర్మమైనపుడు భగవంతునికి లేని పరిణామము వ్యవస్థాధర్మానికి మాత్రం ఎట్లా ఉంటుంది? శాస్త్రిగారు చెప్పే వ్యవస్థాధర్మానికి, ఆధునిక జీవితానికి పోలిక లేదు. వారూహించిన వ్యవస్థాధర్మక్షీణత్వం మానవ జీవితంలో నైతిక పతనంగా వారు భావిస్తున్నారు. ఈ విధమైన ఆలోచనే విశ్వనాథ వారిచేత పురాణ వైర గ్రంథములు, నేపాల రాజవంశ చరిత్రలు, కాశ్మీరరాజవంశ చరిత్రలు వ్రాయించింది. ధర్మ భీతి యన్నదే సామాజిక స్పృహ' అంటే శాస్త్రిగారి ప్రకారం దైవభీతే సామాజిక స్పృహ అవ్వాలి. వ్యక్తి చైతన్యమనేది సామాజిక చైతన్యంతో మమైక్యంచెందడమే వ్యవస్థాధర్మమైతే మనిషిని మనిషిగా చూడగలిగిన లక్షణంకూడా వ్యవస్థాధర్మానికుండాలి గదా! 'ఉన్నచోటును చూచుకొనక లేని చోటుకు దూకినపుడు పతనము తప్పదు. ఉన్నచోటుకు సంబంధించి ప్రవర్తించుట నియతి లక్షణము. అనియమ ప్రవృత్తి లక్షణము నాగరకము కాదు. అభ్యుదయ మార్గ**ము** కాదు' అని చెబుతున్నారు శాస్త్రిగారు. ఏకవీర పరంగా దీన్ని అన్వయిస్తే—వ్యవస్థాధర్మానికి అతీతంగా ప్రవర్తించింది కనుక తన దేహాన్ని తానే చాలించుకుంది. సాధారణ సూత్రంగా ఆలోచిస్తే—ఉన్నచోటు సమాజంలో అందరికీ సమంగా ఉండదు కనుకనే సాధించడానికి ప్రయత్నం.

వేయిపడగలు నవలపై విమర్శచేసినవారు డా॥ కోవెల సంప్రసన్నాచార్య. వారి విమర్శలో ఒక క్రొత్త సిద్ధాంతము ప్రతిపాదింపబడినది. వేయిపడగలు నవలలో నిబద్ధమైనది కుండలి నియోగమని దానిని ఋజువు చేయుటకు **ఈ** విమర్శ అంతాసాగింది.

నవలలోలేని అర్థాలను, సిద్ధాంతాలను లాగాలంటే పెద్ద కష్టమైన పనికూడా కాదు. విశ్వనాథవారిపైన తీవ్రమైన అభిమానాన్ని కలిగి ఉండటం దోషంకాదు. ఆ అభిమానం హద్దులుమీరి ఆయన రచనలలో ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు భ్రమింపచేసే స్థితికి దిగజారకూడదుగదా! ''సనాతనధర్మము, వ్యవస్థాధర్మము, వ్యక్తిధర్మము ఒకటికావు వేర్వేరు. ఈ విభేదాన్ని స్పష్టంగా లక్షిస్తూ ఆ **మూ**డింటి మధ్యగల సంబంధాన్ని నిరూపించే తాత్త్విక దృష్టిని వస్తువిన్యాసంలో రచయిత పాటించకపోవడంవల్ల నవల కావ్యాత్మ సనాతన ధర్మనిరూపణముకాదు అని తెలుస్తున్నది'' (శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం - సాహిత్యంలో దృక్పథాలు) విశ్వనాథ వారు చేసిన ప్రయత్నం హిందూవ్యవస్థా ధర్మనిరూపణం. అది సక్రమంగా ఈ నవలలో తప్పుదారి పట్టింది. 'హిందూ వ్యవస్థా ధర్మమునకు ప్రతీక వేయిపడగల పాము' (ఆర్. ఎస్. సుదర్శనం గారు) అంతేకాని కుండలినీయోగానికి కాదు. మూర్తీభవించిన అహంభావి ధర్మారావు. నవలంతా ధర్మారావు పాత్ర చిత్రీకరణే. నవల ముగింపులో 'అరుంధతి' 'నేను మిగిలితిని' అంటుంది. 'ఔను నీవు మిగిలితివి ఇది నా జాతిశక్తి' అంటాడు ధర్మారావు. ఇక్కడ నా జాతిశక్తి అంటే కుండలినీ శక్తికాదు. వైవాహిక వ్యవస్థ. తాను నమ్మిన సంప్రదాయములు, విశ్వాసములు క్షీణిస్తున్నాయని ఈదేశంలో ఒక్క వివాహ వ్యవస్థ మాత్రమే మిగిలినదని ధర్మారావు భావం. 'వాఙ్మయమనగానేమి? మతమును, సంఘమును, ఆచారమును మనోహర**ము**గ చెప్పునదియే వాఙ్మయము' అని విశ్వనాథవారన్నారు. ఆ **మూ**డిటి విశ్లేషణ ఈ నవల. దానికి ఆధారం ధర్మారావు. కాని విపరీతంగా అర్థంచేసుకోవటంవల్ల నవల నవల కాకపోగా తంత్రశాస్త్రంగానో, పురాణంగానో మారిపోయే ప్రమాదం ఉంది. ఆ ప్రమాదానికి ప్రబలోదాహరణమే 'వేయిపడగలు నవలపై **ఈ** విమర్శ.

రా. వి. శాస్త్రిగారి నవలపై విమర్శ రాసినవారు డా. మాదిరాజు రంగారావుగారు. ఆయన సుబ్బయ్య పాత్ర విశ్లేషణధ్యేయంగా పెట్టుకుని విమర్శ చేసారు. ఆత్మ న్యూనతాభావ**ము**కు, భయ

భావమునకు గల కారణాలను సోదాహరణంగా వివరిస్తూ సుబ్బయ్య పాత్ర, పాత్రవిశ్లేషణను చక్కగా చూపించారు. అట్లానే బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' నవలలోని మానవతా దృక్పథము అన్న ఒక్క అంశాన్నిమాత్రమే తీసుకుని మంచి విమర్శ రాశారు. నవలను నవలగానే చదివి విశ్లేషించారు రంగారావుగారు మాలపల్లి నవలపై శ్రీమతి కాత్యాయని విద్మహేగారు వ్రాసిన విమర్శ వాస్తవ సత్యాలకు దగ్గరగా ఉంది. 'మాలపల్లి' నవలలోని గాంధేయవాదం, అక్టోబరు విప్లవ ప్రభావం, సామ్యవాదసిద్ధాంత ప్రభావం మొదలైన అంశాలపై ఆ యా పాత్రల నాధారంగా మెచ్చుకోతగిన రీతిలో వివరించారు. ఆధునిక చైతన్య ప్రాతిపదిక నవలగా 'ప్రజల మనిషి'లోని బలాన్ని, బలహీనతని యథార్థ దృక్పథంలోంచి శ్రీ వరవరరావుగారు వివరించారు.

ఇవిగాక 'విజ్ఞానేశ్వరము'ను హరిశివకుమార్‌గారు, 'రెండు బాల వ్యాఖ్య' లను కోవెల సంపత్కుమారాచార్యగారు, 'శ్రీనాధుని సాహిత్య ప్రస్థానము'ను విద్యాసాగరశర్మగారు, 'శ్రీ మత్పుండరీనాధ రామాయణము'ను, 'కవిసేన మేనిఫెస్టో'ను కేతవరపు రామకోటి శాస్త్రిగారు, 'హంసవింశతి'ని జి. వెంకటరత్నంగారు, 'మహాభారతము–తత్త్వ దర్శనము' 'తిక్కన హరిహరనాథతత్త్వము' 'తిక్కయజ్వ హరిహరనాథతత్త్వము'లను వ. చి. రఘునాథాచార్యగారు సమీక్షించిన సమీక్షలు కూడా ఉన్నవి.

కాకతీయ విశ్వవిద్యాలయ తెలుగు శాఖవారు గణనీయమైన కృషి చేస్తున్నారు. ఇందుకు వారిని సాహిత్యాభిలాషులందరూ అభినందించవలసినదే. గొప్పదనంలేని నవలకు ఎంత లాగుడు విమర్శ వ్రాసినా గొప్పదనంరాదు. గొప్పదనం ఉన్న నవలకు విమర్శ వ్రాసినా వ్రాయకపోయినా దాని గొప్పదనంపోదు. రచనలో లేని గొప్పదనాన్ని ఆపాదించబోవడం అభిమాన విశేషమేకాని మరేమీకాదు. ఈ సంచికలో గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర'పై కూడా పరిశీలన జరిగి ఉంటే బాగుండేది. పై నవలాకారులెంత ప్రసిద్ధిపొందినవారో గోపీచంద్‌కూడా అంతకంటె తక్కువ ప్రసిద్ధి చెందినవాడు కాదు· కొన్ని అభిప్రాయాలతో అంగీకరించినా, అంగీకరించకపోయినా ఈ సంచికను సాహిత్యాభిలాషులందరూ చదివి తీరవలసిందే.

శ్రీ టి. ఎల్. కాంతారావు.

శ్రీ శ ఠ కో ప వా క్సు ధ

[శ్రీ చరణ రేణువు సమకూర్చిన 'సుధామాధురి' అను వ్యాఖ్యతో. క్రౌన్ సైజు 26+136 పేజీలు. వెల 8 రూ. ప్రకాశకులు–శ్రీ గోదా గ్రంధమాల, ముసునూరు, కృష్ణాజిల్లా.]

పారమార్థిక చింత బాగా సన్నగిల్లిపోయిన ఈ కాలంలో ప్రధానంగా విశిష్టాద్వైత గ్రంథాలను ఆంధ్రులకు అందిస్తున్న శ్రీ గోదా గ్రంధమాల వారి ముక్తిసాహితి విభాగంలో ముప్ఫయి అయిదవ పుష్పం యిది.

విశిష్టాద్వైత సంప్రదాయంపై అభినివేశం ఉన్నవారందరూ నమ్మాళ్వారు అనుగ్రహించిన తిరువాయ్ మొళిని తప్పక పఠిస్తారు. ఆంధ్రదేశంలో ఉన్నవారికి ద్రావిడ లిపి తెలియనందున ఎన్నో దశాబ్దాలనుంచీ ఈ గ్రంధం తెలుగు లిపిలోనే ముద్రితమై బహుళ ప్రచారాన్ని పొంది ఉన్నది. మొదట్లో ఈ సంప్రదాయ గ్రంథాలను మద్రాసులోని ఆనంద ముద్రాక్షరశాల వారు ముద్రించి ప్రకటించేవారు.

ఈ గ్రంథం ద్రావిడ భాషలోనే ఉన్నందున శ్రీవైష్ణవులు దీనిని కఠస్థం చేసినా, అర్థం చేసుకొనేవారు చాలా స్వల్ప సంఖ్యలోనే ఉండేవారు. ఏ భగవద్విషయ పండితుల వద్దనో దీన్ని కాలక్షేపం చేసేవారికి మాత్రమే ఇందలి పాశురాలు అవగతమవుతూ ఉంటాయి.

శఠకోప మునులు (నమ్మాళ్వారు) పాయించిన ఈ దివ్య ప్రబంధానికి ఇది వరకే ఆచార్య పురుషులు వ్రాసిన వ్యాఖ్యలు మణిప్రవాళ పద్ధతిలో ద్రావిడ సంస్కృతాలలో ఉన్నవి. అయినా అవి ఉభయ భాషలలోనూ విద్వాంసులైన వారికే గాని యితరులకు అర్థంకావు. దీనికి విజయనగర వాస్తవ్యులు, సంస్కృతాంధ్రాంగ్ల ద్రావిడ భాషావేత్తలు, విఖ్యాత విద్వాంసులు శ్రీ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు ''ఆంధ్ర గీర్వాణ శఠకోపసహస్ర'' మనే పేరుతో సంస్కృతాంధ్రాలలో తర్జుమా చేశారు· మద్రాసులో కూడా ఒకరు పద్యానువాదం చేసినట్లు జ్ఞప్తి ఉన్నది. అయినా అవి మూలాభిప్రాయాన్ని తెలియజేస్తే తెలియజేయ వచ్చును గాని కవి హృదయాన్ని యథాతథంగా చిత్రించేవని చెప్పలేము. ఎట్టి సమర్థులు అనువదించినా అనువాదం అనువాదమే! మూలాభిప్రాయావగతికి ప్రతిపదార్థ తాత్పర్యాలే సరియైన మార్గం.

పై విషయాలను గ్రహించే తమ పేరు ప్రకటించడానికి ఇష్టపడక ''శ్రీ చరణ రేణువు'' అనే సంకేత నామంతో ద్రావిడ ప్రబంధాలకు వ్యాఖ్యలురచిస్తున్న శ్రీ కె.టి.ఎల్. నరసింహాచార్యులుగారు శ్రీ శఠకోప మునుల వాక్సుధకు ''సుధామాధురి'' వ్యాఖ్యను రచించి, మూలంతో చేర్చి ప్రకటిస్తున్నారు.

''తిరువాయ్ మొళి'' అంటే భగవత్కటాక్షం వల్ల లభ్యమైన వాగ్ధోరణి. నమ్మాళ్వారు భగవదనుగ్రహంవల్ల దివ్య జ్ఞానాన్ని పొంది, తమకు గల్గిన భగవదనుభవాన్ని వేయి పాశురాలుగా (పద్యాలుగా) రసవంతమైన కవితాధోరణిలో వెల్లడించారు. మూలరూపమైన ఆ వాక్సుధ యొక్క మాధుర్యాన్ని శ్రీ చరణ రేణువుల వ్యాఖ్యానం ఆ వాగమృతం పానం చేసేవారికి అందిస్తున్నది.

తిరువాయ్ మొళి వేయి పాశురాల ప్రబంధం ఈ గ్రంథంలో ప్రథమ శతకానికి–మొదటి నూరింటికి మాత్రమే వ్యాఖ్య ఉన్నది. ఇందులో మొదటి మూలపాశురం, తర్వాత ప్రతిపదార్థటీక, ఆపైని వివరణం ఉన్నవి. విశేషాలున్నచోట అవి ప్రత్యేకంగా చూపబడినవి. గ్రంథానికిముందు సంప్రదాయానుసారం సంస్కృతీ, ద్రావిడ భాషలలో ఆయా మహాభక్తుల తనియన్లు, వాటి టీకా వివరణములు

ఉన్నవి. టీకా వివరణాలు సుస్పష్టంగా, సులభంగా గ్రహించే పద్ధతిలో ఉండి టీకాకారుల సామర్థ్యాన్ని వెల్లడిచేస్తున్నవి. ఇది సంప్రదాయజ్ఞులకూ, సంప్రదాయ జిజ్ఞాసువులకూ ఎంతో ఉపయుక్తమైనది.

తక్కిన తొమ్మిది నూరులూ, తొమ్మిది సంపుటాలుగా వెలువడుతున్నట్లు ప్రకటనవల్ల తెలుస్తున్నది. అవి శీఘ్రకాలంలోనే వెలువడగలవని ఆశిస్తున్నాను.

శ్రీ బులుసు వేంకటరమణయ్య

తాళ్ళపాక కవులు

[రచన — సాహిత్యభూషణ, జాతీయ బహుమతి గ్రహీత శ్రీ పెనుమాదు వెంకటశేషయ్య, పుటలు 204. ప్రతులకు: గ్రంథకర్త, రిటైర్డు ప్రిన్సిపాలు, ఆర్. ఎస్. రోడ్డు, రాజంపేట, కడప జిల్లా (ఆం. ప్ర.) మూల్యం రూ. 10.]

గ్రంథకర్త దీనిని 1976లో అచ్చువేసి ఫిబ్రవరి 1979లో ప్రకటించారు. ''ఈ మూడు సంవత్సరములలో దొరికిన అంశములను పుస్తకము అచ్చు అయినందున చేర్చలేక పోయితినని మరు ముద్రణములలో చేర్పులు కూర్పులతో విస్తృతముచేయు ఉద్దేశము కలదని ఆపై దైవేచ్ఛ'' అని గ్రంథకర్త ముందే సమర్థించుకొన్నారు కేంద్ర అభివృద్ధి బ్యాంకు అధ్యక్షులు శ్రీ బండారు రత్నసభాపతి గారికి దీన్ని అంకితం చేశారు. ''ప్రాంతీయాభిమానము పైకొన, తాళ్ళపాక కవులను తదితరులు తమ ప్రాంతాలకు తరలించకముందే దగాపడక దక్కించుకొను తలంపుతో'' రచయిత వ్రాయదలచినట్లు బాహాటంగా చెప్పుకొన్నారు. ప్రాంతీయాభిమానం సాహిత్యంలో కేవలం వినోదప్రాయమే.

''మా ఊరుకవి, మా జిల్లాకవి'' అని అనుకోవడంలో పొరబాటు లేదు కాని దానివల్ల 'దగాపడ'వలసినంత నష్టం ఏమీరాదు. గ్రంథకర్తలు విద్యాసంస్థకు ప్రిన్సిపాలుగా పనిచేసి విశాలదృక్పథం ప్రచారం చెయ్యటానికిబదులు ఇటువంటి ప్రాంతీయాభిమానంతో రచన సాగించటం దురదృష్టకరం పోతనను ఒంటిమిట్ట నుండి ఓరుగల్లుకు, చంద్రగిరి తాలూకా క్షేత్రయ్యను కృష్ణాజిల్లా దివికి తరలించుకుపోయారనే పాతభావాలు తిరిగి ప్రచారంలోకి తీసుకురావడం విద్యావేత్తలు చేయగూడని పని. ఆ కవులు ఒంటిమిట్ట, చంద్రగిరి వారేనని గట్టిగా చెప్పగలిగిన పరిశోధనలుచేసి అపూర్వం, ఆశ్చర్యకరమైన సిద్ధాంతాలను నెలకొల్పి తిరుగు లేనట్లుగా వ్రాయగ గితే బాగుండేది. అప్పటికీ అది పరిశోధన అవుతుంది కని ప్రాంతీయాభిమానం అనిపించుకోదు తాళ్ళపాక కవులను ఇతర ప్రాంతాలకు తరలించుకొనిపోయే పాపాత్ములు ఎవరూ లేరు.

ఈ గ్రంథంలో చారిత్రకాంశాలు కాక సాహిత్య విమర్శ ప్రధానంగ చేయబడింది. అన్నమాచార్యులు, తిమ్మక్క, పెదతిరుమలాచార్యులు చినతిరుమలాచార్యులు, చిన్నన్న, రేవణూరి వెంకటాచార్యుల సాహితీతత్వాన్ని గూర్చి గ్రంథకర్త వివరించారు.

ఆత్మసంతృప్తికి, ప్రాంతీయాభిమానానికి రచించిన గ్రంథంలో నెరసులేరడం అతి సులభం. శృంగారమంజరి—ద్విపద కావ్యమని (పుట 47, 56), 'జో అచ్యుతానంద' అనే పాటను అన్నమాచార్యులు రచించాడని (పాతకమూరి అన్నలజోల—దానిపేరు), దొరుకుతున్న శకుంతలా పరిణయం అముద్రిత ప్రతి దొరకలేదని (174) ఇటువంటి పొరబాట్లు వ్రాసిన గ్రంథంలో ఇంకా ఎన్నిఉంటాయో ఊహించుకోవచ్చు.

తాళ్ళపాక కవులను గూర్చి చక్కగా చదువుకోడానికి ఈ గ్రంథం పనికొస్తుంది. గ్రంథకర్త దీనిని 'సరళ గ్రాంథికంలో' వ్రాశారు. ఇతర ప్రవృత్తిలో ఉండి సాహిత్యాభిమానంగల గ్రంథకర్త అభినందనీయులు.

శ్రీ నిడుదవోలు వేంకటరావు

సచిరౌత్ రాయ్ కథలు

[అనువాదం : చాగంటి తులసి; వెల : రూ 4—00; ప్రతులకు : అరుణా పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.]

సుప్రసిద్ధ ఒరియా కవి శ్రీ సచ్చిదానందరౌత్‌రాయ్ వ్రాసిన బహుకొద్ది కథలలో తొమ్మిదింటిని అనువదించి పుస్తకరూపంలో తెలుగువారికి అందించారు చాగంటి తులసిగారు. శ్రీశ్రీ మాటల్లో 'స్థలాల, మనుష్యుల పేర్లు మినహా కథలన్నీ అచ్చ తెలుగు జీవితానికి సంబంధించినట్టుగానే ఉన్నాయి. ఇందులో ఆశ్చర్యం ఏముంటుంది గనక ? ఒరిస్సాలోనైనా, తెలుగునాటనైనా మనుష్యులంతా ఒకలాగే ఉంటారు.'

ఈ కథలలో ఎంతో వైవిధ్యం వున్నది. దాదాపు ప్రతి కథలోనూ రచయిత హృదయ సౌకుమార్యం, హాస్యప్రియత్వం, ప్రధాన పాత్రల పట్ల సానుభూతీ అభివ్యక్తమవుతున్నాయి.

కొత్త పెళ్ళికూతురు కాపరానికి వచ్చిన ఓ నెల తర్వాత, ఆమె మొగుడు డబ్బు సంపాదించుకు వస్తానని కలకత్తా వెళ్ళిపోయి, మూడు సంవత్సరాలైనా తిరిగిరాక, అక్కడే మరో స్త్రీతో వుండిపోయాడు. ఇక్కడ ఈ అమ్మాయి 'పాపపు కడుపు' పోగొట్టుకునే ప్రయత్నంలో చచ్చిపోయింది. పోలీసులొస్తే కొంపమునుగుతుందని ఊళ్ళోవాళ్ళంతా శవాన్ని రాత్రికి రాత్రే స్మశానానికి చేరవేశారు. శవాలు కాల్చే జగ్గూకు శవాలతోనే పని. జీవితాలతో వాడికి పని లేదు. ఊళ్ళోమనిషి పోతే, అది వాడికి లాభం. చితికి నిప్పంటిస్తూ, శవానికి చిన్నమెత్తు బంగారం వున్నా తెంపేసుకోవటం వాడి అలవాటు. అలాంటి వాడిగుండె ఆమె జీవితంలోని ఒంటరితనాన్ని తలుచుకుని, బాధతో మూలిగింది. పాలిపోయిన ఆమె మొహంలో, ఇంకా ఎన్నో రోజులు బ్రతకాలన్న బలమైన కోరిక జగ్గూకి కనిపించింది. ఆ శవానికున్న ముక్కుపుడకను వాడు తాకనైనా లేదు. ఆమెను అర్థం చేసుకోగలిగిన మనిషి ఆ ఊరికంతా వాడొక్కడే. ఇదీ 'స్మశాన కుసుమం' అన్న కథ. నలభై అయిదేళ్ళ వయస్సులో భార్యను పోగొట్టుకుని, ఆ తరువాత ఇంద్రియ చాపల్యాన్ని అణచుకోలేక చేసిన ఒక రహస్య కార్యం కొడుకు కంట బడగా, వాడి ముఖం చూడలేక జీవితాంతం మరణ వేదన అనుభవించిన ఒక సనాతన బ్రాహ్మణుడి దయనీయగాథ 'పండితులవారి మృత్యువు.'

స్త్రీమనస్తత్వానికి అద్దంపట్టే కథ 'నేనేంకాను.' కుంజియా కలకత్తా వచ్చి రోడ్డు కూలీగా బతుకు సాగిస్తున్నాడు. పెళ్ళాం దగ్గరికి తిరిగి వెళ్ళలేకపోతాడు. ఒక పడుపు పిల్లతో సంబంధం పెట్టుకుని, ఆమెలో తనభార్యను చూసుకుంటూ వుంటాడు. చివర ఆమె తనమీద దాష్టీకం చెలాయించే ఒక తాగుబోతుతో వెళ్ళిపోతూ కుంజియాతో అంటుంది, 'నీకు నేనేమీ కాను. నేనంటే నీకు యిష్టంలేదు. నాలో కనిపించే నీ పెళ్ళాం అంటే నీకు ఇష్టం.' తనని తానుగా చూడగలవాడే ఆమెకు కావాలి. కలకత్తాలో ఎవత్తెనో తగులుకున్నాడని తెలిసి కుంజియా పెళ్ళాం రెండో మనువాడిన విషయం, ఆ మర్నాడు అతనికి తెలుస్తుంది.

భర్త హోదాకు గర్వపడే భార్యలకు చురక 'ఇన్‌స్పెక్టరుగారి కుక్క' కథ. పోలీస్ ఇన్‌స్పెక్టరుగారి కుక్క చచ్చిపోతే, గ్రామంలోని పెద్ద మనుషులందరూ వచ్చి కుక్కను ఘనంగా పొగిడి, శవాన్ని వైభవంగా ఊరేగించారు. ఇన్‌స్పెక్టరుగారి భార్య గర్వంతో పొంగి పోయింది. 'కుక్కకే యింత ఘనంగా జరుగుతోంది; అదే కుక్కయజమాని గాని అవుతే ...' అన్న ఊహ కలిగింది. ఓ రోజు ఇన్‌స్పెక్టరుగారు చావనే చచ్చారు. అయితే ఎవ్వరూ రాలేదు. ఆవిడకి పట్టరాని కోపం వచ్చింది. 'ఎవరికీ కృతజ్ఞత అన్నది లేదు' అని వాపోయింది.

వీటన్నిట్లో ఎక్కువగా ఆలోచింపజేసే కథ 'సప్తాశ్వాలు'. పత్ని వియోగంతో ఒంటరిగా వున్న పశువుల డాక్టరుగారి జీవితం అనునిత్యం పశు వైద్యంలోనే గడచిపోతున్నది. ఆవుకు స్వయంగా ఇంజెక్షన్ యిచ్చి లోపల వేలితో పొడిచి జెర్సీ ఆంబోతు శుక్ర బీజాన్ని ఎక్కించే పనిని సరిగ్గానే చేయగలడు ఆయన, వికారానికి లోనవుతున్నా! సిద్ధ పురుషుణ్ణంటూ ఒకడు ఆయన్ని కలుసుకుంటాడు. 'నా విద్య చూడండి. సమగ్ర సూర్యమండలాన్ని నేను ప్రత్యక్షం చెయ్యగలను ... కనీసం సూర్యాశ్వాల్ని ఏడింటినీ చూడగలుగుతారు!' అంటూ వేధిస్తారు. సూర్యుడూ సూర్యాశ్వాలూ కనిపించవుగానీ, ఎవరికీ లొంగని ఓ పెంకి మగ గుర్రం, చికిత్స కోసం వచ్చిన ఆడ గుర్రాన్ని దూరంగా తరుముకు వెళ్ళి మైథున క్రియ జరిపి సకిలిస్తూ వెళ్ళిపోయిన వాస్తవ దృశ్యం మాత్రం ఒక జ్ఞాపకంగా మిగిలిపోతుంది డాక్టరుగారికి.

జ్యోతిష్యంలోని నిజానిజాల్ని స్పృశిస్తూ — జోస్యం చెప్పి పొట్టపోసుకునే వాడి జీవితాన్ని చిత్రించే కథ 'చెయ్యి'. పరస్పర విరుద్ధ స్వభావాలతో చిత్ర విచిత్రంగా ప్రవర్తించే ఒక రాజకీయ నాయకుడి హాస్యాస్పద వ్యక్తిత్వ చిత్రణ 'ఏకాంత ప్రతిమ'. అన్యాయం సహించటం యిష్టంలేక, పేపరు కుర్రాడితో ఒక్క నయాపైసా కోసం పేచీ పెట్టుకుని రాజీపడ్డ దేశభక్తుడి వృత్తాంతం 'నయాపైసా' కథ. సాంఘిక దురన్యాయం బడుగు జీవుల ఆశల అందాన్ని ఏ విధంగా కురూపం చేస్తున్నదో చూపుతున్న కథ 'రాకుమారుడు.'

పండితుల వారి మృత్యువు, నయాపైసా, సప్తాశ్వాలు — ఈ మూడు కథల్లో స్పష్టత లోపించింది. పాఠకులకు కొంత కాలంపాటు గుర్తుండేవే అయినా, ఈ సంపుటితో పోల్చుకుంటే తెలుగు కథలు ఒరియా కథల కంటే చాలా ముందున్నాయనిపిస్తుంది. అనువాదం చదువరులను ఇబ్బంది పెట్టని రీతిలో సాగింది. పొరుగు భాషలోని సమకాలీన సాహిత్యాన్ని తెలుగువారికి పరిచయం చేస్తున్న తులసిగారు అభినందనీయురాలు. ఒరియా సామాజిక వ్యవస్థనీ, జానపద సంస్కృతినీ, ఆచార వ్యవహారాలనీ అధ్యయనం చేస్తున్న ఈమె ఒరియా భాషలో సైతం రచనా పాటవం సాధించి తెలుగుకథల్ని ఒరియా వారికి అందించగలిగితే, ఈ సేతువు మరింత గట్టి పడినట్లే!

శ్రీ కలువకొలను సదానంద

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.